# యదార్థ గాథలు

✦ REAL CRIME STORIES ✦



డా॥ వాసిరెడ్డి సీతాదేవి

*Yadartha Gadhalu (Real crime stories)*
*- by Dr. VASIREDDY SITHADEVI*

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : మే, 2005

© డా॥ వాసిరెడ్డి సీతాదేవి

వెల: రూ. 90/-

ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజ్ఞాన భవన్, అబిడ్స్, హైదరాబాద్-500 001.
E-mail: visalaandhraph@yahoo.com
విశాలాంధ్ర బుక్ హౌస్,
(అబిడ్స్, సుల్తాన్‌బజార్) హైదరాబాద్,
విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు,
తిరుపతి, హన్మకొండ, అనంతపురం, కాకినాడ.

హెచ్చరిక: ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగా గానీ, కొంతగానీ కాపీరైట్ హోల్డరు మరియు ప్రచురణకర్తల నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా, కాపీరైట్ చట్టరీత్యా నేరం.

Printed at Saraswathi Offset Printers, Hyd.

# ఇందులో...

| | | పేజీ నెం |
|---|---|---|
| 1. | ఆళవందారు హత్య | ... 1 |
| 2. | మరో హంతకుడు | ... 5 |
| 3. | ప్రణయంలో ప్రళయం | ... 11 |
| 4. | భార్యా రూపవతీ...? | ... 18 |
| 5. | ఒక సావిత్రి కథ | ... 23 |
| 6. | పసిమనసు | ... 27 |
| 7. | మానవత్వం ఇంకా బ్రతికే ఉన్నదా | ... 31 |
| 8. | డా॥ రజియా | ... 36 |
| 9. | అసలు రహస్యం | ... 42 |
| 10. | మరదలినే హత్యచేసిన కామాంధుడు | ... 49 |
| 11. | ఇది ప్రతీకారమా? | ... 53 |
| 12. | మంచికి వంచన | ... 58 |
| 13. | అరణ్య రోదన | ... 61 |
| 14. | చివరకు మిగిలేది! | ... 65 |
| 15. | కక్ష | ... 70 |
| 16. | కన్న కూతుర్ని చంపిన తండ్రి | ... 75 |
| 17. | నరబలి | ... 78 |
| 18. | రగిలేజ్వాల | ... 82 |
| 19. | మృగం | ... 86 |
| 20. | తలుపు తెరువమ్మ! తిరిగొచ్చాను | ... 94 |
| 21. | ఆధునిక | ... 97 |
| 22. | చచ్చి సాధించిన మగువ | ... 102 |
| 23. | ప్రేమా ! పిచ్చా ! | ... 109 |
| 24. | రీత విషాద గాథ | ... 113 |
| 25. | రైల్లో హత్య ! | ... 118 |

26. ఇదికూడా ప్రేమేనంటారా? ... 122
27. రీనాకౌల్ హత్య ! ... 129
28. బ్లడ్ గ్రూప్ -'ఏ' ... 133
29. అసూయ ... 139
30. మరో బలిపశువు ... 144
31. ఒక ప్రాణం ఖరీదు ఏభై రూపాయలా ?! ... 147
32. ఇలాంటి ఆడవాళ్ళూ వున్నారా? ... 151
33. ఆడపిల్లలూ - తోడేళ్లున్నాయ్ జాగ్రత్త ... 154
34. నేను హంతకినే! ... 159
35. ప్రేమిస్తే భయం ఎందుకు? ... 164
36. మీనా కథ ... 167
37. మానవత్వం మేలుకొంది ... 171
38. భారతంలో ఓ సావిత్రి ... 175
39. ఉద్యోగం పేరిట మోసం ... 180
40. ప్రేమపరీక్ష ... 184
41. మనసున్న మనిషి ... 190
42. ప్రాణం తీసిన ప్రేమ! ... 193
43. సెప్టిక్‌ట్యాంకులో శవం! ... 195
44. ప్రేమకు అంతస్తులు అడ్డురావా? ... 198
45. అర్థరాత్రి హత్య ... 202
46. హత్యకు అసలు కారణం! ... 206
47. ఇది కూడా ప్రేమ కథే ... 211
48. పసిపాపను హతమార్చిన ద్వేషం ... 214

---

* పై కథలు "వాస్తవ గాథల" పేరుతో 1980 నుండి 1990 వరకు వనిత, వనితాజ్యోతి మాసపత్రికలోనూ, ఉదయం, ఆంధ్రప్రభ దినపత్రికలలోను, ఆంధ్రజ్యోతి వారపత్రిక మొదలైనవాటిలో ప్రచురించబడ్డాయి.

❀ ❀ ❀



# 1. ఆళవందారు హత్య

అవి నేను మద్రాసులో చదువుకుంటున్న రోజులు. హిందీ ప్రచార సభలో చిన్న ఉద్యోగం కూడా చేస్తూ ఉండేదాన్ని.

ఆళవందారు హత్య ఆ రోజుల్లోనే 1952లో జరిగింది. ఆ హత్య దేశంలోనే పెద్ద సంచలనం కలిగించింది. ఆ కేసు పూర్తి అయేంతవరకూ అంటే నిందితులకు శిక్షపడేంతవరకూ రెగ్యులర్‌గా న్యూస్ వస్తూనే ఉండేది. అందరూ ఎంతో ఉత్కంఠతో చదివేవారు.

ఆమె పేరు దేవకి. కేరళ యువతి. మీడియమ్ హైట్‌తో, తెల్లగా, అందంగా ఉండేది. హిందీ ప్రచారసభకు అప్పుడప్పుడు వస్తూ ఉండేది. ఆమె హిందీ టీచరుగా పనిచేస్తూ ఉండేదనుకుంటాను - ఇప్పుడు బాగా గుర్తులేదు. కలివిడగల మనిషి. కొత్త వ్యక్తులతో నా అంతట నేను పరిచయం చేసుకోవడం నాకు చేతనయ్యేది కాదు. దేవకి హిందీ ప్రచారసభకు వచ్చినప్పుడల్లా నన్ను కలుసుకుంటూ ఉండేది. 22, 23 ఏళ్ల వయసు. స్నేహశీలి.

ఒకసారి పెన్ కోనుక్కోవాలని నేను ఆమెతో అన్నాను. తనకు తెలిసిన షాపు ఉందని, నన్ను చైనా బజారుకు తీసుకెళ్ళింది. నేను ఉండేది జార్జి టౌన్‌లోనే.

ఆ షాపును అంతకుముందు నేను చాలాసార్లు చూశాను. "జమ్ అండ్ కంపెనీ" ముందు వరండాలో అతడి షాపు ఉండేది. చాలా చిన్నషాపు. పెన్నులూ, కళ్లజోడు ఫ్రేములూ మొదలైన వస్తువులెన్నో దొరికేవి ఆ షాపులో.

దేవికి నన్ను ఆ షాపు యజమానికి తన స్నేహితురాలిగా పరిచయం చేసింది. అతడు నన్ను ఏదోలా చూస్తూ, అదోలా నవ్వాడు. అతని చూపులూ, నవ్వూ నాకు చిరాకు కలిగించాయి. నాకు బాగా తెలిసినవాళ్లు కూడా చాలా రోజుల తర్వాత కన్పిస్తే వెంటనే గుర్తుపట్టలేను. కాని ఏభయ్ ఏళ్లు గడిచిపోయినా ఇప్పటికీ ఆయన రూపం నా కళ్ళముందు ఉన్నట్టే ఉంటుంది. ఖరీదైన తెల్లటి ప్యాంటూ, తెల్లటి షర్టు, నెక్‌టై-హుందాగా లేకపోయినా - ఆకర్షణీయంగా ఉన్నాడు. ఇంత టిప్ టాప్‌గా ఉన్నవాడికి బడ్డీకొట్టులాంటి ఈ షాపు ఏమిటి అనిపించింది.

ఆ రోజుల్లో స్వాన్ పెన్ పదకొండు రూపాయలు. నాకు తొమ్మిది రూపాయలకే ఇచ్చాడు. బాగా రాయకపోతే, ఎప్పుడొచ్చినా కొత్త పెన్ ఇస్తానన్నాడు. ఎంతమంచివాడో! చూడగానే చెడ్డవాడుగా అనుకున్నందుకు మనసులోనే పశ్చాత్తాపపడ్డాను.

ఆ తర్వాత నా స్నేహితురాలు ఒకామెను ఆ షాపుకు తీసుకెళ్ళి స్వాన్ పెన్ ఇప్పించాను. ఆమెకు పదకొండు రూపాయలకంటే తక్కువకు ఇవ్వనన్నాడు.

ఎప్పుడైనా ఆ షాపు ముందునుంచి వెళ్తే "బాగున్నారా!" అని అదోలా నవ్వుతూ పలకరించేవాడు. నాకు చిరాకువేసేది.

ఒకరోజు దేవకితో "ఆ ఆళవందారు ఒక వెధవలా ఉన్నాడు. నన్ను వలకరించవద్దని చెప్పు" అన్నాను. ఆమె విని మౌనంగా ఉండిపోయింది. ఆ తర్వాత అతడు నన్ను చూసీ చూడనట్టుగానే ఉండేవాడు.

ఒకరోజు బస్‌లో, నాముందు సీటులో అతడ్నీ దేవకినీ చూశాను. దేవకి భుజం మీదగా చెయ్యి వేసి ఏదో చెప్తున్నాడు. వాళ్లు నన్ను చూడలేదు. ఆ రోజు నుంచి ఆమెతో ముభావంగా ఉండసాగాను. ఆ తర్వాత రెండు మూడు సార్లు బస్సుల్లో వేరే వేరే ఆడపిల్లలతో ఆళవందారును చూశాను.

ఒకరోజు దేవకి, తను పెళ్లి చేసుకోబోతున్నానని నాతో చెప్పింది. అతడి పేరు ప్రభాకర్ అనీ గ్రాద్యుయేట్ అనీ (అతడి అసలు పేరు గుర్తులేదు - ప్రభాకర్ అసలు పేరుకాదు) ప్రభుత్వ ఆఫీసులో సూపర్నెంటుగా పనిచేస్తున్నాడనీ చెప్పింది. పెళ్లయింది. హిందీ ప్రచారసభకు వస్తూనే ఉండేది. అంతకుముందు లేని ఉత్సాహం ఆమెలో కొట్టొచ్చినట్టు కన్పించేది.

ఒక రోజు చాలా దిగులుగా కన్పించింది. "ఏమిటి దేవకీ! ఏమైంది? ఎందుకలా ఉన్నావు" అని అడిగాను. ఒకసారి నిండుకుండ బద్దలైనట్టు బావురుమని ఏడ్చింది. తన భర్త తనకు చెప్పినవన్నీ అబద్దాలేనని చెప్పింది. అతడు సూపర్నెంటుకాదు. లోయర్ డివిజన్ క్లర్కు అట. పైగా గ్రాద్యుయేట్ కూడా కాదట. కేవలం స్కూలు ఫైనల్ మాత్రమే పాసయ్యాడట. జీతం డెబ్బయ్ ఐదు రూపాయలట. పైగా మహా అనుమానం మనిషట. అనుమానంతో రకరకాలుగా ప్రశ్నిస్తూ కాల్చుకు తింటున్నాడట.

అది ఆగస్టు 29, 1952. ఉదయం అన్ని పేపర్లలో, తాటికాయంత అక్షరాల్లో ఒక సంచలన వార్త పడింది. (ఈనాడు ఇలాంటి వార్తలు రోజూ వస్తూనే ఉన్నాయనుకోండి.) ఇండో - సిలోన్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక ట్రంకు పెట్టెలో, తల లేని మనిషి మొండెం ఒకటి రైల్వే పోలీసులు కనుగొన్నారట. కాళ్లూ, చేతులూ వేరు వేరుగా నరికి ఆ పెట్టెలో కుక్కి పెట్టి ఉన్నాయట.

తిరుచునాపల్లి స్టేషన్‌లో వాసన కొడుతున్న ఆ పెట్టెను రైల్వే పోలీసు తెరిచి చూశారు.

అదే రోజు ఆళవందారు భార్య పోలీసులకు తన భర్త రాత్రి ఇంటికి రాలేదని కంప్లెయింట్ ఇచ్చిందట. కనిపించడం లేదనే కంప్లెయింటుకు పోలీసులు పెద్దగా శ్రద్ధతీసుకోలేదు. కాని ట్రంకుపెట్టెలో మొండెం దొరికిందనే న్యూస్ చూడటం, ఆ ఎక్స్‌ప్రెస్ మద్రాసు నుంచి బయలుదేరేది కావడంవల్ల పోలీసు ఇన్‌స్పెక్టరు అయ్యర్ (అతని పేరు పూర్తిగా గుర్తులేదు. పేరు తర్వాత అయ్యర్ అని మాత్రం ఉంది.) ఆళవందారు షాపుకు వెళ్ళి వాకబు చేశాడు. దేవకి ఆ రోజు మధ్యాహ్నం (అతను కనిపించకుడాపోయిన రోజు) షాపుకు వచ్చిందనీ, ఇద్దరూ కలిసి వెళ్ళిపోయారనీ, ఆ తర్వాత అతడు మళ్ళీ రాలేదనీ ఆ చుట్టుపక్కల షాపుల వాళ్ళు చెప్పారు. వెంటనే



ఇన్‌స్పెక్టరు తన సిబ్బందితో ఆమె ఇంటికి వెళ్తే తాళం వేసి ఉంది. ఆ పక్కనే ఉన్న ఆమె తండ్రి ఇంటికి వెళ్ళి వాకబు చేశారు. ఆమె తండ్రి క్రితం రోజు రాత్రి వాళ్ళు బొంబాయి వెళ్ళారనీ, అక్కడ అల్లుడికి ఉద్యోగం వచ్చిందనీ చెప్పాడు. అయ్యర్‌కు అనుమానం వచ్చింది. తలలేని మొండెం ట్రెయిన్‌లో దొరికింది. వీళ్ళేమో అకస్మాత్తుగా ఊరు వదిలి వెళ్ళిపోయారు. అందుకే ఆ ఇంటి తాళం పగలగొట్టి లోపలకు వెళ్ళారు. తలుపులు తెరవగానే ముంజు వాసన కొట్టింది. గోడలమీద అక్కడక్కడ రక్తపు మరకలున్నాయి. రక్తంతో తడిసిన చెయ్యి ముద్ర గోడమీద కనిపించింది. కేసు ఇన్వెస్టిగేషన్ చురుగ్గా నడవసాగింది. ఎంక్వయిరీలో దేవకి ఇంటి దగ్గర్లో ఉండే రిక్షా వాడొకడు. ప్రభాకర్‌మీనన్ ఒక బ్రౌన్ పేపర్లో పనసకాయలా ఉన్న వస్తువుతో తన రిక్షా ఎక్కాడనీ, రాయపురం బీచికి తీసుకెళ్ళాడనీ చెప్పాడు. తనను రోడ్డుమీద ఉండమని ఇసుకలో నడుచుకుంటూ సముద్రం దగ్గరకెళ్ళి కొద్ది సేపటికి తిరిగి వచ్చాడని చెప్పాడు. వెంటనే అయ్యర్ రాయపురం బీచ్‌కి వెళ్ళాడు. అప్పటికే జనం మూగి ఉన్నారు. ఉప్పునీళ్లవల్ల తల పెద్దగా పాడవలేదు. కనుగుడ్లు మాత్రం లేవు. కుడివైపు పన్ను ఒకటి బంగారంది. ఆళవందారు భార్య భర్తతలను గుర్తించింది. తిరుచునావల్లిలో ఉన్న మొండెం తెప్పించారు. చివరకు ఆ తల మొండానికి సంబంధించిందేనని నిర్ధారణ జరిగింది.

ఆరోజుల్లో (కొన్ని ప్రాంతాలలో) ఆకేసు ఎంతో సంచలనాన్ని కలిగించింది. అన్ని పేపర్లూ ప్రముఖంగా రిపోర్టు చెయ్యసాగాయి.

దేవకినీ, ప్రభాకర్ మీనన్‌నూ అరెస్టు చేశారు. కోర్టులో మీనన్ నిజం చెప్పలేదు. ఎందరో సాక్ష్యాలు చెప్పారు. ఇంటి దగ్గిర షాపువాడు తన దగ్గిర పెద్ద కత్తి తీసుకున్నట్టు చెప్పాడు. ఎందుకని అడిగితే మీనన్ కట్టెలు చీల్చాలన్నాడట. ఇంట్లో పని కుర్రాడికి ఆ ఉదయం ఒక పావలా ఇచ్చి రాత్రిదాకా తిరిగి రావద్దని చెప్పాడట. ఇలా ఎన్నో సాక్ష్యాలు.

దేవకీ మీనన్ చెప్పిన సాక్ష్యాన్నే జడ్జి ఆధారంగా తీసుకున్నారు. మీనన్ అన్నీ నిజాలు చెప్పలేదనే నిర్ణయానికి వచ్చారు. దేవకి చెప్పిన కథ.... .... ....

కొంతకాలం క్రితం మీనన్ పాత ఉద్యోగం వదిలేసి ఒక పేపరు ఆఫీసు అడ్వర్‌టైజింగ్ సెక్షన్‌లో చేరాడు. నెలకు వందరూపాయల జీతం. భార్యను ఉద్యోగం, ట్యూషన్స్ చెప్పడం మానెయ్యమన్నాడు. ఆమె భర్తతో రాజీపడి సంతోషంగా ఉన్నది. అయితే ఒకరోజు ఆళవందారు దగ్గర కెళ్ళి అడ్వర్‌టైజ్‌మెంటు తెచ్చుకోమని పంపించింది. అతను తనకు తెలుసుననీ, మంచివాడనీ చెప్పింది. మీనన్ పెన్‌షాపుకు వెళ్ళాడు. ఆళవందారు మాట్లాడిన తీరు అతడికి నచ్చలేదు. "దేవకి బాగుందా?" అని అడగడంలో ఏదో ధ్వని ఉన్నట్టు తోచింది. అసలే అనుమానం మనిషి ఆమెను ప్రశ్నలతో వేధించాడు. తనకు అతడితో ఎలాంటి సంబంధం లేదన్నది. మరో రోజు అతడు తనకు ఎంతమంది ఆడవాళ్ళతో సంబంధం ఉందో చెప్పాడు.

"ఈ రోజుల్లో ఆడపిల్లలకు కూడా ఇలాంటి అనుభవాలూ సాధారణమే. నేను చెడుగా అర్థం చేసుకోను నిజం చెప్పు." అని మరీ మరీ అడిగాడు. కాని ఆమె తనకలాంటి సంబంధాలు ఎవరితోనూ లేవంది.

చివరకు ఒకరోజు విసిగిపోయి ఆళవందారుతో తనకు సంబంధం ఉన్నమాట నిజమేననీ, కాని పెళ్ళాయ్యాక అలాంటి దేమి లేదనీ చెప్పింది. అయినా అతను నమ్మలేదు. ఆళవందారు తన పాత జీవితాన్ని బయట పెడ్తానని బెదిరిస్తున్నాడని చెప్పింది. భయపడి ఒకసారి మాత్రం హోటల్‌కు వెళ్ళానన్నది.

దాంతో అతను పిచ్చివాడే అయ్యాడు. "అతన్ని రేవు తీసుకురా! అతన్ని ఖతం చేస్తాను. లేదా సిగ్గుపడేలా చేస్తాను" అన్నాడు.

ఆమె అందుకు అంగీకరించింది. రెండో రోజు మధ్యాహ్నం తన ఇంటికి ఆహ్వానించింది. ఇద్దరూ బయలుదేరారు.

"నేను కొంచెం ముందుగా వెళ్తాను. నువ్వు కాస్త ఆగి రా" అని చెప్పింది. ఇంటికి వెళ్ళింది. భర్తతో అతను వస్తున్నాడని చెప్పింది. భర్త వంటింట్లో దాక్కున్నాడు. ఆళవందారు తలుపు కొట్టాడు. లోపల అతని కోసం మృత్యువు వేచి ఉందని అతడికి తెలియదు.

హత్య ఎలా చేశారనే వివరాలు అతని కాళ్లూ, చేతులూ నరికి మొండేన్నీ ఒక ట్రంకుపెట్టెలో పెట్టి రిక్షాలో ఎగ్మూరు స్టేషనుకు తీసుకెళ్ళి, థర్డ్ క్లాసు కంపార్ట్‌మెంటులో పెట్టించి తిరిగి వచ్చి, తల బీచిలో పారేసి మరో రిక్షాలో వెళ్లాడు.

ఆ కేసు నడిచినన్ని రోజులూ ప్రజల సానుభూతి మీనన్ దంపతుల మీదే ఉంది.

ప్రభాకర్ మీనన్‌కు ఏడేళ్ళ శిక్ష, భార్యకు మూడేళ్ళ శిక్ష పడ్డాయి. అయితే జైలులో మంచి ప్రవర్తన కారణంగా శిక్షపూర్తి కావడానికి ఆరు నెలలుముందే రిలీజ్ అయింది.

ఒకరోజు అనుకోకుండా టి. నగర్ రాజకుమారి టాకీస్ దగ్గర కనిపించింది. వెంటనే గుర్తు పట్టలేదు. గుర్తుపట్టాక పలకరించాను. జుత్తు ఊడిపోయి మధ్య మధ్య తెల్లగా కనిపిస్తూంది. తెల్లటి శరీరం రాగి రంగులోకి వచ్చింది. చూపులు నిర్లిప్తంగా ఉన్నాయి. ఆమెను చూస్తే ఎంతో జాలివేసింది.

మీనన్ ప్రవర్తన కూడా జైల్లో మంచిగా ఉండటం వల్ల శిక్ష పూర్తి కాకుండానే వచ్చేశాడు. మీనన్ బయటికి వచ్చే నాటికి నేను హైదరాబాద్ వచ్చేశాను.

కనకం అనే మలయాళీ స్త్రీని పదేళ్ళ క్రితం నేను మద్రాసు వెళ్ళినప్పుడు దేవకి గురించి అడిగాను. ఆమె మద్రాసులో లేదనీ, పాల్‌ఘాట్ వెళ్ళిపోయిందని, భార్యా భర్తలు కలిసే ఉంటున్నారనీ, వాళ్లు పాల్‌ఘాట్‌లో ఒక చిన్న టీ స్టాల్ నడుపుతున్నారని చెప్పంది ఇపుడు వాళ్ళు ఫిఫ్టీస్ లో ఉంటారు. దాదాపు ఇద్దరిది ఒకే వయసని దేవకి ఒకసారి నాతో అన్నది.

కొంత మంది ఇలాంటి విషయం తెలియగానే ఆవేశంతో చంపుతారు. కాని ఇలా ప్లాన్డ్‌గా చంపడం ఎంతమంది చెయ్యగలరు?

❀ ❀ ❀



# 2. మరో హంతకుడు

1980 సెప్టెంబరు 20వ తేదీన ఒక ముప్పయ్ సంవత్సరాల వయసు గల యువకుడు కాశీపురం పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు. సాయంత్రం అయిదు గంటలు దాటింది. డ్యూటీలో ఉన్న ఆఫీసరు దగ్గర తన గోడు చెప్పుకున్నాడు.

"సర్. నేను కాళీచరణ రోడ్డులోని దమ్‌దమ్‌లో ఉంటున్నాను. నాపేరు గౌతమ్‌దత్తు" ఆపైన కొంతసేపు గొంతుకు ఏదో అడ్డుపడినట్టు ఆగిపోయాడు.

"చెప్పండి. ఏం జరిగింది?" అడిగాడు పోలీస్ ఆఫీసర్ అజయ్ ఘోష్.

ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ దత్తు చెప్పసాగాడు "నేను డన్‌లప్ ఫౌండ్రీ లిమిటెడ్‌లో అసిస్టెంటు మేనేజర్‌గా పని చేస్తున్నాను. రోజులాగే ఇవ్వాళ టిఫిన్ చేసి ఆఫీసుకు వెళ్ళాను. నా భార్య గేటువరకూ వచ్చి అలవాటు ప్రకారం నన్ను సాగనంపింది. నేను మధ్యాహ్నం కంపెనీ క్యాంటిన్‌లోనే రోజూ భోజనం చేస్తాను. భోజనానికి ఇంటికి వచ్చే అలవాటు లేదు" ఆగి నిట్టూర్పు విడిచాడు.

మళ్లీ ప్రారంభించాడు– "ఇవ్వాళ అయిదు గంటలకు, రోజూ వచ్చినట్టే ఇంటికి వచ్చాను. సాధారణంగా ఇంటితలుపు వేసి వుంటుంది. కాని ఇవ్వాళ తలుపు బార్లా తెరచి వుంది. నేను లోపలకు వెళ్ళాను. నా బెడ్‌రూంలోని గోద్రెజ్ బీరువా రెండు తలుపులూ తెరచి వున్నాయి. సేఫ్‌లో ఉన్న నగలు కన్పించలేదు. నేను నాభార్య మధును వెతుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళాను. అక్కడ దృశ్యం చూసి శిలాప్రతిమలా నిలబడిపోయాను. ఏం చూస్తున్నానో గ్రహించలేని స్థితిలో ఎంతసేపు ఉన్నానో నాకే తెలియదు" దుఃఖం పెల్లుబికింది. రెండు చేతులతో ముఖం కప్పుకొని ఏడవసాగాడు.

"ప్లీజ్ చెప్పండి. ఏం జరిగింది?" ఆఫీసరు నెమ్మదిగా అడిగాడు.

"నాభార్య రక్తపు మడుగులో పడివున్నది. ఆమె కంఠంలో శ్వాస నాళిక కోయబడింది. నేను పెద్దగా కేకలు పెట్టాను. ఇరుగు పొరుగు వచ్చారు. నగలే కాక సేఫ్‌లో వున్న మూడు వేల రూపాయలు కూడా హంతకుడు తీసుకెళ్ళాడు" అంతవరకూ చెప్పి గౌతమ్‌దత్తు ఒక్కసారి నిండుకుండ పగిలినట్టు భోరున ఏడ్వసాగాడు.

పోలీస్ ఆఫీసర్ ఘోష్ అతన్ని ఎంతోసేపు ఓదారిస్తేకాని, అతను మళ్ళీ మాట్లాడే స్థితికి రాలేదు.

కలకత్తాలోని దమ్‌దమ్ ప్రాంతం చాలా కోలాహలంగా ఉంటుంది. అటువంటి రద్దీ ప్రదేశంలో ఉన్న ఇంట్లో పట్టపగలు హత్య జరగడం ఘోష్‌కు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"సేఫ్‌లో ఏమేమి ఉన్నాయ్?"

"వివాహంలో నా భార్యకు ఇరవైతులాల బంగారవు నగలు పుట్టింటివారు పెట్టారు. ఆ తర్వాత నేను నాలుగు తులాల బంగారంతో గాజులు చేయించాను. మొత్తం ఇరవైనాలుగు తులాల బంగారం."

"మీ ఇంట్లో ఇంత బంగారం వున్నదని ఎవరెవరికి తెలుసు?"

"మా బంధువులందరికీ తెలుసు"

అతను ఇచ్చిన రిపోర్టును రాసుకొని ఘోష్ తన సిబ్బందితో దత్తు ఇంటికి బయలుదేరాడు. ఇంటి ముందు జనం గుమికూడి ఉన్నారు. దత్తు ఘోష్‌ను తిన్నగా వంటగదిలోకి తీసుకెళ్ళాడు.

అక్కడ 20 సంవత్సరాల దత్తు భార్య శవం పడివున్నది. ఆమె కంఠం మీద గాయం నుండి ప్రవహించిన రక్తంతో వంట గది గచ్చు తడిసి ఉన్నది. ఆమె చుట్టూ కొన్ని గిన్నెలూ, పళ్ళాలూ చెదిరిపోయి పడివున్నాయి. దాన్ని బట్టి ప్రాణం పోయే ముందు ఆమె బాగా స్ట్రగుల్ అయివుంటుందని గ్రహించాడు ఘోష్.

గ్యాస్ పొయ్యి మీద సగం ఉడికిన పప్పు గిన్నె వున్నది. గ్యాస్ పొయ్యి ఆర్పి ఉన్నది. హంతకుడు ఆమెను చంపిన తరువాత పొయ్యి ఆర్పి ఉంటాడని గ్రహించాడు ఘోష్. పొయ్యి పక్కగా ఒక పళ్లెంలో గోధుమపిండి తడిపి ముద్దగా చేస్తూ చేస్తూ మధ్యలోనే వదిలేసినట్టుగా వున్నది.

ఘోష్ మధు రెండు చేతులూ చూశాడు. చేతులు కడుక్కున్నట్టు పున్నాయి. కాని గోళ్లకు అక్కడక్కడ పిండి అతికి వున్నది. వంటింటి కిటికీలు మూసి వుండడాన్ని గమనించాడు. సాధారణంగా వంట పూర్తి కాకుండ కిటికీలు ముయ్యడం జరగదు. వంట ఇంటిని పూర్తిగా పరిశీలించి దత్తుతో ఘోష్ బెడ్‌రూంలోకి వెళ్ళాడు.

బీరువా తలుపులు తెరిచి వున్నాయి. తాళం చెవులు సేఫ్‌కు తగిలించి వున్నాయి. బీరువా నిండుగా బట్టలున్నాయ్.

"మిస్టర్ దత్! మీ భార్య తాళం చెవులు సాధారణంగా ఎక్కడ పెడుతుందో మీకు తెలుసా?" అని ఘోష్ అడిగాడు.

దత్తు డ్రెస్సింగ్ టేబుల్‌కేసి ఓ క్షణం చూశాడు. అంతలోనే బెడ్‌కేసి చూస్తూ "దిండు క్రింద పెడుతుందా"ని చెప్పాడు.

"మీకు బాగా గుర్తుందా? ఆమె ఇవ్వాళకూడా అక్కడే పెట్టిందా?"

"అవును సర్! నేను ఆఫీసుకి బయలుదేరేటప్పుడు బీరువా తెరచి నాకు ఇరవై రూపాయలు ఇచ్చింది. వెంటనే లాక్ చేసి కీస్ దిండు కింద పెట్టింది."

ఘోష్ బెడ్‌కేసి చూశాడు. దిండ్లు చక్కగా సర్దిపెట్టి వున్నాయ్. హంతకుడు తాళం చెవుల కొరకు బెడ్ వెదికినట్టు అన్పించలేదు. కొత్తవాడైతే కీస్ కోసం వెతుకుతాడు. దిండ్లు అంత పొందికగా వుండవు. పక్క దుప్పటి కూడా కదిలించినట్టు లేదు. కీస్ ఎక్కడ వుంటాయో బాగా తెలిసిన వ్యక్తే హత్య చేసి వుండాలనిపించింది



ఘోష్‌కు. బహుశా బెదిరిస్తే మధు తాళాలు ఎక్కడున్నాయో చెప్పి వుండవచ్చును అనుకున్నాడు.

తాళం చెవులు చేతిలోకి తీసుకున్నాడు. వాటిని పరిశీలనగా చూసి ఆలోచనలో పడ్డాడు. దత్తు ముఖంలోకి తీవ్రంగా చూసి, తాళాలు పోలీసు జవాను చేతికి అందించాడు ఘోష్.

ఘోష్ డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళాడు. అక్కడ సింథాల్ పౌడరు డబ్బా ఉన్నది. ఆ పక్కనే లేత గులాబి రంగులో వున్న గుండ్రటి ప్లాస్టిక్ డబ్బా ఉన్నది. దాని మూత తెరచి చూశాడు. అందులో కొద్దిగా పౌడరూ, లైట్ బ్లూ పఫ్ కన్పించాయి. పఫ్ చేతిలోకి తీసుకున్నాడు ఘోష్.

వెంటనే ఘోష్ కళ్ళు ఏదో క్లూ దొరికినట్టు తళుక్ మన్నాయి.

"మిస్టర్ దత్! హంతకుడు మీ ఇంట్లోని ప్రతి వస్తువు గురించి తెలిసినవాడై ఉండాలి. అతను రాగానే వంటింటి తలుపు వేశాడు. పిండి కలుపుతూ మధ్యలో అతన్ని చూడగానే మీ భార్య చేతులు ఆదరా బాదరాగా కడుక్కున్నది"

దత్తు కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"అంటే మీ ఉద్దేశ్యం.... నా భార్యకు ఎవడో పరాయి మగాడితో..."

"మిస్టర్ దత్ - నేను అలా అనలేదు. మీరు అనవసరంగా చాలా దూరం ఆలోచిస్తున్నారు. ఒకటి మాత్రం నిజం! ఈ హత్య కేవలం నగలకోసం, డబ్బుకోసం చేసింది మాత్రం కాదు. ఏదో రహస్యం ఉన్నది"

అంటూ ఘోష్ బయటికి వచ్చాడు. ఇరుగు పొరుగు వాళ్ళను కొన్ని ప్రశ్నలు వేశాడు. కాని అతనికి వారి మాటల్లో క్లూ దొరకలేదు. నిరాశ చెందాడు.

శవ పరీక్షలో బ్లేడుతో గొంతులోని శ్వాస నాళికను కొయ్యడం వల్ల చనిపోయినట్టు తేలింది. ఆమె 10 నుంచి 12 గంటల మధ్య చనిపోయినట్టు డాక్టర్ తేల్చాడు.

ఘోష్‌కు కేసుకు సంబంధించిన సూత్రం దొరకలేదు. ముందుకు సాగిపోవడానికి సెప్టెంబరు 25న దత్తు పనిచేస్తున్న ఆఫీసుకు వెళ్ళాడు. గౌతమ్ దత్తు పదకొండు గంటలకు తన సెక్రటరీని తీసుకొని బయటికి వెళ్ళినట్టు చెప్పారు. సెక్రటరీ పేరు శుభాసర్‌కార్. ఆమె అవివాహిత. ఆమెకు మూడు నెలల క్రితం దత్తు ఉద్యోగం ఇచ్చాడనీ, ఆఫీసులోనూ, బయటా కూడా ఆమెతోనే ఎక్కువ సమయం గడుపుతాడనీ ఘోష్‌కు ఆఫీసువాళ్ళుకూడా చెప్పారు.

అది విన్న ఘోష్‌కు బుర్ర తిరిగిపోయినట్టు అయింది.

కంపెనీ చౌకీదారును వేరుగా పిలిచి ప్రశ్నలు వేశాడు.

"నువ్వు ఈ కంపెనీలో కావలాదారుగా ఎంతకాలం నుంచి వుంటున్నావ్?"

"దాదాపు పదకొండు ఏళ్లనుంచి"

"అయితే ఇక్కడ పనిచేసే వాళ్లంతా నీకు బాగా తెలిసే వుండాలి"

"తెలుసు సార్!"

"నువ్వు ఎప్పుడూ గేటు దగ్గరే డ్యూటీ చేస్తావా?"

"అవును సర్! పగలంతా నేనే వుంటాను. రాత్రి మాత్రం మరొకడు నన్ను రిలీవ్ చేస్తాడు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు గంటల వరకూ భోజనానికి వెళ్తాను. ఆ సమయంలో గేటు మూసేస్తాను"

"మీ కంపెనీ మేనేజరు గౌతమ్ దత్తు భార్యను ఎవరో హత్య చేశారు. ఆ సంగతి నీకు తెలుసా?"

"తెలుసు సార్! పత్రికలో చదివాను. అందరూ అనుకోవడం కూడా విన్నాను."

"అది జరిగినరోజు నువ్వు డ్యూటీలో వున్నావా?"

ఆ ప్రశ్న వినగానే చౌకీదారు ముఖం వెలవెలా పోయింది.

"నీ ముఖం చూస్తుంటే నీకు ఏదో తెలుసునని నాకు అర్థం అయింది. అబద్ధం చెప్పకు. నిజం చెప్పు? ఏం జరిగింది?" తీవ్రస్వరంతో అడిగాడు ఘోష్.

చౌకీదారుకు చెమటలు పట్టాయి.

"ఉదయం గౌతమ్‌గారు కార్ఖానా లోపలకు వెళ్ళడం చూశాను. దాదాపు తొమ్మిదిన్నరకు మేనేజర్‌గారి సెక్రటరీ ఆయన కారులో బయటకు వెళ్లింది."

"డ్రైవర్ ఉన్నాడా?"

"లేదు. ఆమే కారు నడుపుకుంటూ వెళ్లింది. మళ్ళీ పన్నెండున్నరకు ఆమే కారు నడుపుకుంటూ తిరిగి వచ్చింది."

"మీ మేనేజర్ కార్ఖానాకు వచ్చాక మధ్యలో బయటకు వెళ్లడం చూశావా?"

"చూళ్ళేదు సార్!" అని కొంచెం ఆలోచించి "సార్" అంటూ ఆగాడు.

"ఊఁ చెప్పు!"

సాయంత్రం ఆయన కార్ఖానా నుంచి బయటికి వెళ్లుతున్నప్పుడు చార్లషర్టు వేసుకున్నారు.

"అయితే"

పొద్దుట లోపలకు వెళ్ళేప్పుడు తెల్లటి షర్టు వేసుకొని ఉన్నారు. ఆయన బయటికి వెళ్ళలేదు. సాయంకాలానికి తెల్లషర్టు మార్చి చార్లషర్టు ఎలా ఎందుకు వేసుకున్నారో నాకు అర్థం కాలేదు.

"ఐ సీ" సాలోచనగా అన్నాడు.

ఘోష్‌కు కేసుకు కావల్సిన క్లూ దొరికినట్లు అనిపించింది.

ఉత్సాహంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు.

పెద్ద ఆఫీసర్లతో మాట్లాడి, ఆ సాయంత్రమే దత్తును ఘోష్ అరెస్టు చేశాడు. తను హత్య చెయలేదని దత్తు వాదించాడు.

"మిస్టర్ దత్! బ్లఫ్ చెయ్యకు. నాకు మొదటిరోజే అనుమానం వచ్చింది. మీరు చిన్న చిన్న తప్పులు చేశారు. మీరు శుభాసర్కార్‌ను ప్రేమిస్తున్నారు. ఆమెను వివాహం చేసుకోవాలనుకున్నారు. అందుకు మీ భార్య అడ్డంకి అయింది. ఆమెను



ఎలాగయినా వదిలించుకోవడానికి మీరిద్దరూ ప్లాను వేసుకున్నారు. ఆమెను హత్య చేశారు. 20వ తేదీ ఉదయం మీరు తెల్లషర్టు వేసుకొని కార్ఖానాకు వెళ్ళారు. సాయంత్రం చారలషర్టుతో బయటికి వచ్చారు. అది మీ చౌకీదారు గుర్తించాడు. ఉదయం తొమ్మిదిన్నరకు మీ ఫ్రెండ్ శుభాసర్కార్ కారు నడుపుకుంటూ బయటకు వెళ్ళడం చౌకీదారు చూశాడు. అతను మిమ్మల్ని చూడలేదు. కారు అద్దాలకు కర్టెన్లు ఉన్నయ్. బహుశా మీరు వెనక సీటు కింద కూర్చుని వుంటారు. కారు దూరంగా ఆపి మీరు ఇంటికి వెళ్ళారు. కారు వెళితే, కారు ఇంటిముందు ఆగివుంటే ఎవరైనా చూస్తారని భయం. కాలినడకతో ఎవరూ చూడకుండా ఇంట్లోకి వెళ్ళారు.

ఆ సమయంలో మీభార్య వంటింట్లో వంటచేస్తున్నది. మీరు ఆమెను కౌగిలించుకోబోయి వుంటారు. ఆమె మిమ్మల్ని ఆపి, ఆదరా బాదరా చేతులు కడుక్కొని వుంటుంది. ఈలోపల మీరు వంటింటి కిటికీలు మూసి వుంటారు. లేదా మీభార్యే మూసి ఉండవచ్చును. చేతులు హడావిడిగా కడుక్కోవడం వల్ల ఆమె గోళ్లకు అంటిన పిండి పూర్తిగా వదల్లేదు. ఆమెతో సరసాలు ఆడుతూనే చేతిలో వున్న బ్లేడుతో ఆమె పీక కోశారు. బ్లేడును చేతిలో పట్టుకోవడం - ఆమెకు కనిపించకుండ పట్టుకోవడం తేలిక. మీరు మీ భార్యను హత్యచేశాక గ్యాస్ పొయ్యి ఆర్పేశారు. దోచుకోవడానికి వచ్చినవాడైతే ఆ పని చెయ్యడు. అసలు అతని దృష్టి గ్యాస్ పొయ్యిమీదకు పోదు. పప్పు పొంగి గ్యాస్ ఆరిపోతేతప్ప. ఇంటికి నిప్పు అంటుకుంటుందనే భయంతోనే మీరు ఆ పని చేశారు.

ఈ హత్య డబ్బుకోసం జరిగినట్టు చూపించడానికి మీరు నగలూ, డబ్బూ తీశారు. నేను కీస్ తీసుకున్నప్పుడు నాచేతికి పౌడర్ అంటింది. మీరు మీ కళ్ళముందే ఆ ఉదయం దిండు కింద పెట్టినట్టు అబద్ధం చెప్పారు. పౌడరున్న ప్లాస్టిక్ డబ్బా తెరిచాను. కీస్ అరవడి పౌడర్‌మీద కూడా కన్పించింది.

తర్వాత మీరు షర్టు మార్చుకున్నారు. బహుశా షర్టుమీద రక్తపు మరకలు పడివుంటాయి. ఇక్కడ మీరు పెద్ద పొరపాటు చేశారు. తెల్లషర్టు మార్చి చారలషర్టు వేసుకొన్నారు. ఆ షర్టు, ఆ నగలూ శోభాసర్కార్ ఇంట్లో దొరకవచ్చును. మావాళ్ళు ఈపాటికి ఆ ఇంట్లోవున్న వస్తువుల్ని పట్టేసే వుంటారు. ఇప్పుడు మీరు అబద్ధం చెప్పినా లాభం లేదు.

హత్యచేసి మళ్ళీ కారు వెనక సీటు కింద కూర్చుని కార్ఖానాకు వెళ్ళారు. సాయంత్రం మామూలుగా బయటికి వచ్చారు. కానీ చౌకీదారు మీ షర్టు గమనించాడు. ఇకచాలా? మర్యాదగా మీ అపరాధాన్ని అంగీకరించండి" అన్నాడు ఘోష్.

అదే సమయంలో శోభ ఇంటికి వెళ్ళిన పోలీసులు తిరిగివచ్చారు. నగలు తెచ్చారు. రక్తపు మరకల్తో వున్న షర్టును తెచ్చారు. అది సెప్టెంబరు 20వ తేదీ "ఆనంద బజార్" అనే న్యూస్ పేపర్లలో చుట్టి వున్నది.

ఆ తర్వాత దత్తు ఇంటి సోదాలో "ఆనందబజార్" న్యూస్ పేపర్లు చక్కగా పేర్చి పెట్టి వున్నాయి. అందులో 20వ తేదీ పత్రిక మాత్రం లేదు.

దత్తు నిలువునా కంపించిపోయాగు. తన అపరాధాన్ని అంగీకరించాడు.

గౌతమ్ వివాహం అయి ఆరు నెలలు కూడా పూర్తికాలేదు. మధు తల్లిదండ్రులు బాగా కట్నం ఇచ్చారు. దత్తు ఆ వివాహం చేసుకోనన్నాడు. శోభను చేసుకుంటానన్నాడు. కాని అతని తల్లి దండ్రులు అందుకు అంగీకరించలేదు. తల్లిదండ్రుల పట్టుదలవల్ల గౌతమ్ మధును వివాహం చేసుకున్నాడు. కాని శోభమీద ప్రేమ చంపుకోలేకపోయాడు. ఆమెకు తన ఆఫీసులోనే తన సెక్రటరీగా ఉద్యోగం ఇచ్చాడు.

గౌతమ్ తల్లిదండ్రుల ఏకైక సంతానం. ఎం. ఎస్. సి. ప్రథమ శ్రేణిలో పాసయ్యాడు.

కంపెనీ ఇద్దర్నీ ఉద్యోగంలో నుంచి తీసేసింది.

ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తున్నది. గౌతమ్, శోభ బెయిలు మీద విడుదలయ్యారు.

కోర్టు తీర్పు ఎలా ఉంటుందోనని అందరూ ఎదురుచూస్తున్నారు.

❀ ❀ ❀

# 3. ప్రణయంలో ప్రళయం

1972 మార్చి 16 తేదీ.

పనిమనిషి ఉదయం 8-30 గంటలకు బొంబాయిలోని ఒక పెద్ద భవంతిలో ఒక ఫ్లాట్ తలుపు దబదబ బాదుతోంది. పక్కనే వున్న డోర్ బెల్ నొక్కుతున్నది. ఎంతకీ ఎవరూ తలుపు తియ్యలేదు.

పక్క ఫ్లాట్‌లో నివసించే నయ్యర్ బయటికి వచ్చి, "ఏమిటి" అనడిగాడు. "సీతమ్మగారు తలుపు తెరవడం లేదు" అని సమాధానం చెప్పింది ఆ పనిమనిషి. నయ్యర్ వచ్చి తలుపు దబదబ బాదాడు. కాని ఎవరూ తలుపు తెరవలేదు. వెంటనే అతను తన ఇంట్లోకివెళ్లి, వాళ్ళకి ఫోన్ చేశాడు. గంట మ్రోగుతోంది కాని ఎవరు ఎత్తలేదు. దాంతో ఆయనకు ఏదైనా జరగరానిది జరిగి వుండవచ్చునని అనుమానం వచ్చింది.

నయ్యర్ తన నౌకర్ని పిల్చి ఫ్లాట్స్ వెనుక వైపుకు తీసుకువెళ్లి, డ్రెయిన్ పైపు ఎక్కి నాలుగో నంబరు ఫ్లాట్ లోపల చూడమని చెప్పాడు. నౌకరు పైపు సహాయంతో నాలుగో నెంబరు కిటికీకి ఎదురుగా వెళ్ళి, కిటికీ అద్దంలో నుంచి లోపలికి చూడడానికి ప్రయత్నించాడు. కాని కర్టెన్స్ వుండటం వలన అతనికి ఏమీ కనిపించలేదు. ఆ వల్పటి కిటికీ కర్టెను అప్పుడప్పుడు పై కెగురుతున్నట్లు గమనించాడు. ఫ్యాన్ తిరుగుతున్నట్టు అర్థమయింది. మరొకసారి గాలికి కర్టెన్ పైకి లేచింది. ఆ అవకాశం కోసం జాగ్రత్తగా చూస్తున్న అతనికి లోపల ఒక భయంకర దృశ్యం కనిపించింది. గబగబా కిందికి దిగి వచ్చేశాడు.

అప్పటికే అక్కడ చాలామంది చేరారు. నౌకరు తన యజమాని కేసి చూస్తూ "సాబ్! గదిలో ఒక మగవాడూ, ఒక ఆడదీ..." అంటూ ఆగిపోయాడు. అతను నిలువెల్లా వణికిపోతున్నాడు.

నయ్యర్ అతని భుజం మీద చెయ్యి వేస్తూ "ఊఁ చెప్పు" అన్నాడు ఆదుర్దగా.

"రక్తపు మడుగులో చచ్చి పడున్నారు!" అన్నాడు వణకుతూ.

అది విని అక్కడున్న వాళ్ళందరూ ఒకరి ముఖం ఒకరు చూడసాగారు. ఎవరికీ మాట రావడం లేదు.

నయ్యర్ వెంటనే తన ఫ్లాట్‌లోకి వెళ్ళి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు. ఇన్‌స్పెక్టర్ జయకర్ ఫోన్ తీసుకున్నాడు. నయ్యర్ అతనికి తన పక్క ఫ్లాట్‌లో హత్య జరిగిందనీ, వెంటనే రావలసిందనీ చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ జయకర్, సబ్ ఇన్‌స్పెక్టర్ దేశపాండే, మరో నలుగురు జవాన్లూ ఆ ప్రదేశానికి చేరుకున్నారు. నయ్యర్ అతనికి తెలిసినంతవరకూ విషయాన్ని

వివరించి చెప్పాడు. జయకర్ వెంటనే ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేసి "దత్తప్రసాద్ భవన్"కు రావలసిందిగా చెప్పాడు. జయకర్‌కు తలుపు బద్దలు కొట్టడం ఇష్టంలేదు. ఫైర్ బ్రిగేడ్‌కి సంబంధించిన ఒక వ్యక్తిని డ్రెయిన్ పైపు సహాయంతో ఎక్కి ఏదైనా కిటికీ తెరిచి వుందేమో చూడమన్నాడు.

జయకర్ ఆదేశం ప్రకారం సబ్ ఇన్‌స్పెక్టర్ ఫైర్ బ్రిగేడ్‌ను తీసుకుని ఆ భవనం వెనుక వైపుకు వెళ్ళాడు. నయ్యర్‌ని జయకర్ ఆ ఫ్లాట్ యజమాని పేరు అడిగాడు. ఫ్లాట్ నెంబరు నాలుగులో 'శేఖర్' అనే వ్యక్తి వుంటున్నాడనీ, అతని భార్య పేరు 'సవిత' అనీ చెప్పాడు.

డ్రెయిన్ పైపు సహాయంతో గణపతి ఒక కిటికీ దగ్గరకు చేరుకున్నాడు. చేత్తో నెట్టగానే కిటికీ అద్దాల తలుపులు తెరుచుకున్నాయి. కిటికీలోంచి అతను లోపలికి దిగాడు. నగ్నంగా పడి వున్న రెండు మృత దేహాలను చూసి భయంతో ముందు వాకిలి దగ్గరకు పరిగెత్తాడు. తలుపులు తెరిచాడు. తలుపుల దగ్గర ఆనాటి దిన పత్రికలు "టైమ్స్" "మహారాష్ట్ర టైమ్స్" పడి వున్నాయి. వాటిని పక్కకి పెట్టి జయకర్ లోపలికి ప్రవేశించాడు. జయకర్ వెనకే నయ్యర్ కూడా వెళ్ళాడు. అక్కడి దృశ్యం చూడగానే నయ్యర్ రోమాలు నిక్కబొడిచాయి. "సార్! ఇతను శేఖర్ కాదు!" అన్నాడు వణుకుతున్న కంఠంతో, "ఎవరో చెప్పగలరా?" ప్రశ్నించాడు జయకర్.

"ఇతనెవరో నాకు తెలియదు. నేను ఇతన్ని మొదటిసారి చూస్తున్నాను!" అన్నాడు నయ్యర్.

"ఆ యువతి?" అని ప్రశ్నించాడు జయకర్.

"ఆమె శేఖర్ భార్య. సవిత–"

జయకర్ ఆలోచనలో పడ్డాడు. నొసలు చిట్లించాడు. కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"ఇతను శేఖర్ కాదా? అయితే ఎవరై ఉండాలి? ఇలా నగ్నంగా మంచం పక్కగా పడి ఉన్నాడంటే అతను సవిత ప్రేమికుడై వుండాలి! సవిత భర్త పూనా వెళ్ళాడు. అతని అందమైన భార్య ఒక్కర్తీ ఇంట్లో ఉన్నది... ఆవిడ రాత్రికి తన ప్రియుణ్ణి పిలిపించుకుంది... దాని ఫలితం ఇది" ఆలోచిస్తూ జయకర్ శవాల దగ్గరగా వెళ్ళి చూశాడు. యువకుడి వీపు మీద చాలా లోతైన గాయం కన్పించింది. అలాంటి గాయమే యువతి పొట్టమీద కన్పించింది. హత్యచేసిన వ్యక్తి చాలా పదునైన ఆయుధాన్ని దేన్నో ఉపయోగించి వుంటాడని అర్థం చేసుకున్నాడు. హత్య దాదాపు పది నుంచి పదకొండు గంటల మధ్యలో జరిగి ఉండాలనుకున్నాడు. ప్రేమికులిద్దరూ వివస్త్రులై ఒకరి ఆలింగనంలో మరొకరు వుండగా తన పని పూర్తిచేసి వుంటాడనుకున్నాడు.

జయకర్ కిటికీలన్నింటినీ పరీక్షించాడు. మూడు కిటికీలలో రెండు బోల్టువేసి వున్నాయి. ఒకటి మాత్రం తెరిచి ఉంది. రెండు కిటికీలు మూసిన సవిత మూడోది ఎందుకు తెరిచి పెడుతుంది. భర్తలేనప్పుడు ప్రియుల్ని ఇంటికి పిలుచుకునే స్త్రీ అంత అజాగ్రత్తగా ఉంటుందా? ఉండడానికి వీలులేదు అనుకున్నాడు జయకర్. మంచం



పక్కన వున్న సోఫామీద వాళ్ళిద్దరూ విడిచిన బట్టలు పడి వున్నై. యువకుని పాంటు జేబులు జయకర్ వెతికాడు. ఒక రైల్వే పాసు, కొంత డబ్బు దొరికాయి. పాసు మీద పేరు "ఎస్. ఎస్. నరేశ్" అని వున్నది. అతని వయసు ముప్పయ్ (30) అని వుంది. అతని రైల్వే పాసు "ఘటకోపర్" నుంచి బొంబాయి "వి. టి. స్టేషన్" వరకూ వున్నది. అతని కోటు జేబులో సవిత ఫోటో (పాస్‌పోర్టు సైజుది) దొరికింది. ఫోటోలో సవిత చాలా అందంగా నవ్వుతూ ఉన్నది. చాలాకాలం క్రితం తీసినట్లుంది. మెళ్లో మంగళసూత్రాలు లేవు. పెళ్లికాకముందు తీసిన ఫోటో అని అర్థం చేసుకున్నాడు జయకర్. అంటే వీళ్ళ పరిచయం పెళ్లికి ముందు నుంచే ఉండివుండాలి. వేలిముద్రలు తీసుకున్నాడు వేలి ముద్రల నిపుణుడు. అంతలో బయట నుంచి ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు వినిపించింది జయకర్‌కి. వెంటనే జయకర్ డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు. అక్కడ ఒక యువకుడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. అతను ఆరోగ్యంగానూ చాలా అందంగానూ వున్నాడు. అతను సవిత భర్తే అయివుండాలని జయకర్ ఊహించాడు.

నయ్యర్‌ని "ఎవరితను?" అడిగాడు. "సవిత భర్త" అని చెప్పాడు నయ్యర్. అతను అప్పుడే పూనా నుంచి వచ్చాడనీ, ఇంటిముందు గుంపును చూసి స్థంభించిపోయాడనీ, తన భార్య హత్య చేయబడిందని తెలిసి, నిండుకుండ బ్రద్దలైనట్లు భోరున ఏడుస్తున్నాడనీ, చెప్పాడు నయ్యర్.

జయకర్ కూడా శేఖర్ భుజం తడుతూ ధైర్యం చెప్పాడు. "జరిగిందేదో జరిగింది. బాధపడి లాభంలేదు. హంతకుణ్ణి తప్పకుండా పట్టుకుంటాము. అందుకు మీ సహాయం చాలా అవసరం" అన్నాడు జయకర్.

శేఖర్ తలెత్తి జయకర్ ముఖంలోకి చూశాడు. ఎంత ఆపుకోవాలన్నా దుఃఖం ఆగటంలేదు. రుమాలు తీసుకుని ముఖం తుడుచుకున్నాడు.

"మీరు ధైర్యంగా వుండాలి. సవితతో పాటు చనిపోయిన ఆ యువకుడెవరో చెప్పగలరా?" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

శేఖర్ లేచి నిల్చున్నాడు. నిలబడలేనట్టే మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు. రెండు చేతుల్తో ముఖం కప్పుకుని ఏడవ సాగాడు. ఇన్‌స్పెక్టర్ అతనికి ధైర్యంచెబుతూ అతన్ని లేవదీసి లోపలికి నడిపించుకు పోయాడు. అక్కడి దృశ్యం చూసి, భయవిహ్వలుడై జయకర్ చేతిని గట్టిగా పట్టుకున్నాడు శేఖర్.

"వాడు!... వాడెవడో నాకు తెలియదు!" వెక్కిళ్ళ మధ్య జవాబిచ్చాడు శేఖర్.

ఇన్‌స్పెక్టర్ అతన్ని పట్టుకుని డ్రాయింగ్ రూంలోకి తీసుకొచ్చాడు. శేఖర్‌ను ప్రశ్నించి ముఖ్యమైన విషయాలు తెలుసుకున్నాడు.

శేఖర్ పోర్టుకి సంబంధించిన ఒక పెద్ద కంపెనీలో క్లాస్ వన్ ఆఫీసరుగా పని చేస్తున్నాడు. కంపెనీ పనిమీద తరుచుగా బయటి ఊళ్లకి వెళ్తూ వుంటాడు. తను వుంటున్న ఫ్లాట్ కంపెనీ పేరుమీదే వుంది. టెలిఫోన్ కూడా కంపెనీవారిదే! కొద్ది నెలల క్రితమే ఈ ఫ్లాట్‌లోకి వచ్చాడు. అంతకుముందు తల్లి దగ్గర ఘటకోపర్లో

వుండేవాడు. వారి వివాహం ప్రేమవివాహం. సవిత కూడా ఘటకోవర్లో ఉండేది. పెళ్లయ్యాక కొన్ని రోజులు వాళ్ళిద్దరూ గ్వాలియాటేక్‌లో వున్నారు.

సవిత కూడా పోర్టుకి సంబంధించిన ఒక ఫర్మ్‌లో పనిచేస్తూ ఉండేది. రోజూ ఉదయం ఇద్దరు కలిసే ఆఫీసుకు బయలుదేరేవారు. సాధారణంగా మధ్యాహ్నం ఇద్దరూ కలిసి ఏ హోటల్లోనో లంచ్ చేసేవారు. మొత్తం మీద రోజులు చాలా సంతోషంగా గడిచిపోయినై. ఇద్దరూ ఒకరినొకరు చాలా ప్రేమించుకునేవారు. సవిత మరో పురుషుడితో ఇలాంటి సంబంధం పెట్టుకోగలదని తను కలలోకూడా ఊహించలేదని చెప్పాడు శేఖర్.

శేఖర్ చెప్పినదంతా శాంతంగా విన్నాడు ఇనస్పెక్టర్ జయకర్.

చనిపోయిన యువకుని జేబులో దొరికిన రైల్వే పాస్ ప్రకారం అతనూ ఘటకోవర్‌లోనే ఉంటున్నాడనేది నిర్వివాదాంశం. అందుకే శేఖర్నుద్దేశించి, "గుర్తుచేసుకో! నువ్వు బహుశా చనిపోయిన యువకుణ్ణి చూసే వుంటావు!" అన్నాడు.

"లేదు! నేనతన్ని ఎప్పుడూ చూడలేదు" శేఖర్ తడుముకోకుండా జవాబిచ్చాడు.

పదకొండవ తారీఖు కంపెనీ పనిమీద పూనా వెళ్ళాననీ, యిరవై రోజులుండవలసిన తను పని పూర్తి అయిపోయినందున త్వరగా వచ్చేశానని చెప్పాడు శేఖర్.

లాక్ కీని చూపిస్తూ "రెండో "కీ" ఎవరి దగ్గరుంటుంది?" అని ప్రశ్నించాడు ఇనస్పెక్టర్.

"నా దగ్గర!" "ఇంకెవరి దగ్గరైనా వుంటుందా?" జయకర్ ప్రశ్న.

"లేదు!" సమాధానం.

"ఇవాళ ఏ బండిలో వచ్చారు?"

"దక్కన్ క్వీన్" అన్నాడు.

"ఎన్ని గంటలకు వచ్చింది?"

"పదిన్నరకు! తిన్నగా బండి దిగి ఇక్కడికే వచ్చాను!"

"బండిలో చాలా రద్దీగా వుందా?"

ఓక్షణం ఆలోచించి "రద్దీ మాములుగా ఉంటూనే వుంటుంది. నేను ఫస్ట్‌క్లాసులో వచ్చాను"

"ఫస్క్లాసులో ప్రయాణం చేసినప్పుడల్లా రసీదు తీసుకుంటారు కదూ! ఇవాళ తీసుకున్నారా?"

"పదిహేను రూపాయలకు రసీదెందుకని ఇవాళ తీసుకోలేదు!"

"మీరు పోలీసు స్టేషన్‌కు రావాలి. మీ రిపోర్టు తీసుకుని మిమ్మల్ని పంపించేస్తాను!" అంటూ జయకర్ లేచాడు.

ఇన్‌స్పెక్టర్‌తో శేఖర్ ఎలాంటి తత్తరపాటూ లేకుండానే బయల్దేరాడు. అతన్ని పోలీసు స్టేషన్లో కూర్చోబెట్టి జయకర్ ఇద్దరు సిపాయిల్ని కావలాపెట్టి, "ఇప్పుడే వస్తాను!" అంటూ బయటికి వెళ్ళిపోయాడు.



వి. టి. స్టేషనుకి వెళ్ళి స్టేషను మాస్టరు దగ్గర ఫస్ట్ క్లాస్ ఛార్టు తీసుకున్నాడు. లిస్టులో శేఖర్ పేరులేదు. ముందు రోజు (15 మార్చి) లిస్టు తీసుకున్నాడు. అందులో శేఖర్ పేరున్నది. జయకర్ పెదవుల మీద చిరునవ్వు లీలా మాత్రంగా కదిలింది.

"ఈరోజు దక్కన్ క్వీన్ ఎన్ని గంటలకు వచ్చింది?" అని స్టేషన్ మాస్టరును అడిగాడు.

"పన్నెండు గంటల పదిహేను నిముషాలకు వచ్చింది" అని స్టేషను మాస్టరు సమాధానం ఇచ్చారు.

"నిన్న ఎన్ని గంటలకు వచ్చింది?"

"నిన్న కరెక్ట్ టైమ్‌కే - అంటే పదిన్నరకే వచ్చింది"

జయకర్ ఆలోచనలో పడ్డాడు. "అంటే శేఖర్ నిన్ననే వచ్చాడు. పగలంతా ఎక్కడ ఉన్నాడు...."

హంతకుడు ఇంత తేలిగ్గా దొరుకుతాడని తను ఊహించలేదు. కాని హంతకుడే తన దగ్గరకు వచ్చాడు. ఇన్‌స్పెక్టర్ పోలీసు స్టేషన్‌కు తిరిగివచ్చాడు.

శేఖర్ ప్రశాంతంగా సిగరెట్ తాగుతున్నాడు. జయకర్ మర్యాదగా శేఖర్‌తో నిజం చెప్పించాలని నిశ్చయించుకున్నాడు. శేఖర్ను ఆపాదమస్తకం ఒకసారి తీవ్రంగా చూశాడు.

"శేఖర్! నేనడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాలి! నేను వి. టి. స్టేషనుకి వెళ్లివచ్చాను. నువ్వు చెప్పినట్టు ఇవాళ బండి పదిన్నరకు రాలేదు. పన్నెండూ పది నిముషాలకు వచ్చింది. నువ్వివ్వాళ ప్రయాణం కూడా చెయ్యలేదు. నిన్నటి నుంచీ ఇప్పటి వరకూ నువ్వెక్కడవున్నావు?"

"సార్! సార్! నాకూ ఈ హత్యకు సంబంధం వుందని అనుమానిస్తున్నారా?" వణుకుతూ శేఖర్ అడిగాడు.

"నేనా మాట అనలేదే! నిన్నంతా ఎక్కడ వున్నావని అడుగుతున్నాను?"

"నేను నిర్దోషిని."

"నోరుముయ్! శేఖర్ నీమీద చెయ్యి చేసుకోవడం నాకిష్టంలేదు! తిన్నగా సరియైన సమాధానం చెప్పు!"

శేఖర్ నోటివెంట మాట రావటంలేదు. తెల్లముఖం వేసి చూస్తూ నిలబడ్డాడు.

"నీదంతా దొంగ ఏడుపేనని అప్పుడే అర్థం చేసుకున్నాను. నువ్వు అబద్ధాలు చెప్పి తప్పించుకోలేవు."

"సార్! సార్! నేనీహత్య చెయ్యలేదు!"

జయకర్ చేతిలో వున్న లాఠీని పైకి ఎత్తుతూ. "నీ కుడి పాదం చూపించు!" అంటూ గర్జించాడు.

శేఖర్ వెంటనే చెప్పులోనుంచి కాలు బయటికి తీసి చూపించాడు. పాదంపైన ఎండిపోయిన రక్తం మరకలు కనిపించాయి.

ఆ రక్తం మరకలేమిటి?

శేఖర్ ఒక్కక్షణం బిత్తరపోయాడు. మరుక్షణం "మీరా కర్ర అవతల పెట్టండి! కొంచెం సేపు నన్ను ఏమీ అడక్కండి!" అన్నాడు కృంగిపోతూ.

"అలాగే!" అంటూ జయకర్ లాఠీని టేబుల్ మీద పెట్టి శేఖర్‌ని చూస్తూ కూర్చున్నాడు. ఐదు నిమిషాలు తర్వాత శేఖర్ ముఖంలో ప్రశాంతత కన్పించింది.

"నేనే ఈ హత్యలు చేశానని ఒప్పుకుంటున్నాను" అన్నాడు.

"అయితే వివరంగా చెప్పు! ఇంతక్రూరంగా ఎందుకు ప్రవర్తించావు?"

ఆ చనిపోయిన యువకుడు నాకు తెలుసు.... పేరు నరేశ్. సవితకు పాత స్నేహితుడు... అంటూ తానెందుకు హత్య చేశాడో చెప్పాడు. ఆవివరణ సారాంశం:-

సవిత నడవడి మంచిదికాదు. ఆ సంగతి వివాహానికి ముందే శేఖర్‌కు తెలుసు. అయినా ఆమె సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను వివాహం చేసుకున్నాడు. పెళ్ళి అయ్యాక ఆమె నడవడిలో మార్పు వస్తుందని ఆశించాడు. కాని అతని ఆశ అడియాసే అయింది. శేఖర్ ఆమెకు ఎన్నో విధాల చెప్పి చూశాడు. ప్రతిసారీ తను తప్పుగా ప్రవర్తించలేదనీ, శేఖర్ తనని అనవసరంగా అనుమానిస్తున్నాడనీ సవిత ఆరోపించింది. తాను ఆఫీసు పనిమీద టూరు వెళ్ళినప్పుడు నరేశ్ రాత్రిళ్ళు ఇంటికి వస్తాడని శేఖర్‌కు తెలిసింది. తన భార్యకు చెప్పి చెప్పి విసిగిపోయిన శేఖర్ ప్రత్యక్షంగా పట్టుకుని, వాళ్లను దోషులుగా నిరూపించాలని నిశ్చయించుకున్నాడు. అందుకే అతను 20 మార్చి వరకూ తిరిగి రానని చెప్పి పూనా వెళ్ళాడు. చెప్పిన తేదీకి ముందే మార్చి పదిహేను ఉదయం దక్కన్ క్వీన్‌లో వచ్చి దిగాడు. స్టేషన్ దగ్గర్లో వున్న హోటల్లో ఒక గది తీసుకున్నాడు. చీకటి పడుతుండగా ఒక దుకాణంలో గండ్రగొడ్డలి కొన్నాడు. రాత్రి దాదాపు ఎనిమిది గంటలప్పుడు ఎవరూ చూడకుండా తన దగ్గరున్న డూప్లికేట్ సహాయంతో లాక్‌ని తెరిచి లోపలికి ప్రవేశించాడు. అప్పటికి సవిత ఇంటికి రాలేదు. తను స్టోర్ రూంలో దాక్కున్నాడు.

రాత్రి దాదాపు తొమ్మిది గంటలకు సవిత నరేశ్‌ను వెంటబెట్టుకొని వచ్చింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ భోజనాలు చేశారు. స్టోర్ రూంలో దాక్కున్న శేఖర్ రక్తం కుతకుతలాడసాగింది. తలలో నరాలు చిట్లడానికి సిద్ధంగా ఉన్నట్టు అనిపించింది. భోజనాలు పూర్తిచేసి కొంతసేపు కబుర్లు చెప్పుకున్నారు. ఆ కబుర్లలో శేఖర్ పేరు కూడా వచ్చింది. ఆ తరవాత ఇద్దరూ వెళ్ళి ఒకే మంచం మీద పడుకున్నారు...

"సార్! ఏ మగవాడు ఇటువంటి అవమానాన్ని భరించగలడో చెప్పండి!" అన్నాడు శేఖర్. అతని కంఠంలో దుఃఖం గరగర లాడింది.

"నీ మానసిక స్థితి నేను అర్థం చేసుకోగలను. ఆ తరవాత ఏం జరిగిందోచెప్పు!" అన్నాడు జయకర్.

"ఆ తర్వాత... సార్!" గొంతు ఎండి పోయినట్లు ఓ క్షణం ఆగి "ఇద్దరూ బట్టలు విప్పేశారు. అంతా నా కళ్ళతో చూస్తూ ఉన్నాను." అని తలవంచుకున్నాడు.



దాదావు పిచ్చివాణ్ణే అయ్యాను. నా బట్టలు విప్పి, గొడ్డలి తీసుకుని తిన్నగా ముందుకు వచ్చాను. వాళ్లిద్దరూ ఆలింగనంలో మైమరచిపోయి నన్ను అసలు గమనించలేదు. గండ్రగొడ్డలి పెట్టి నరేశ్ వీపు మీద గట్టిగా కొట్టాను. ఎగిరి మంచం పక్కన పడిపోయాడు. నోటివెంట శబ్దం కూడా రాలేదు. ఏం జరిగిందో తెలుసుకునే లోపలే నా గండ్రగొడ్డలి సవిత పొట్టలోకి దిగిపోయింది. రక్తసిక్తమైన గొడ్డల్ని వంటయింట్లో దాచాను. బాత్‌రూంలోకి వెళ్ళి కాళ్ళూ చేతులు కడుక్కున్నాను. ఆ తరువాత దుస్తులు వేసుకుని బెడ్‌రూంలోని ఒక కిటికీ తెరచి డ్రెయిన్ పైపు సహాయంతో క్రిందికి దిగాను. రోడ్డుమీదకు వచ్చి ఒక టాక్సీలో హోటల్‌కి వెళ్ళిపోయాను" శేఖర్ రెండు చేతుల్తో ముఖం కప్పుకున్నాడు.

అతని కథ విన్న జయకర్ కళ్ళు చెమ్మగిల్లాయి. అయినా అతను చేయగలిగింది ఏమీలేదు.

చాలా కాలం కోర్టులో కేసు నడిచింది. అతనికి అజన్మ కారాగార శిక్ష విధించడం జరిగింది. న్యాయమూర్తి తన నిర్ణయాన్ని వినిపించగానే "నో! నో! నాకు ఉరిశిక్ష వేయండి! జన్మంతా ఆ భయంకర జీవితాన్ని గడవలేను. నాకు ఉరిశిక్ష ప్రసాదించండి!" అంటూ శేఖర్ పిచ్చివాడిలా అరవసాగాడు.

పోలీసులు అతన్ని బయటికి తీసుకెళ్ళిపోయారు. ఇన్‌స్పెక్టర్ జయకర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. జేబురుమాల్తో కళ్ళు తుడుచుకుంటూ కోర్టు బయటికి వెళ్ళిపోయాడు.

❀ ❀ ❀

# 4. భార్యా రూపవతీ...?

అది 1976 సెప్టెంబరు నెల 20. పగలు పదకొండు గంటలకు ఆగ్రా దగ్గరవున్న మధురలోని ఒక ఇంటి నుంచి ఒక యువతి చక్కగా అలంకరించుకొని బయటికి వచ్చింది. ఆమె పేరు శాంతి. 25 సంవత్సరాలు ఉంటాయి. ఆమె అందంగా వుంది. రిక్షాలో మరో అందమైన యువకుడితో వెళ్ళింది. ఆ యువకుడి పేరు దినేశ్‌చంద్ర.

రిక్షా ఒక ఫోటో స్టూడియో ముందు ఆగింది. యువకుడు దిగాడు. నేను ఫోటోగ్రాఫర్‌తో మాట్లాడి వస్తాను అంటూ లోపలకు వెళ్ళాడు. ఆ యువతి రిక్షాలోనే కూర్చుని వున్నది. రోడ్డుమీద వచ్చే పోయే జనం ఆమె సౌందర్యానికి ముగ్ధులై చూస్తూ వెళుతున్నారు. అదే సమయంలో ఒక బక్కపలచని యువకుడు వచ్చి రిక్షా ముందు నిల్చున్నాడు. అతని వయసు ముప్పై సంవత్సరాలకి లోపే. చామనచాయగా అతి సాధారణమైన దుస్తుల్లో వున్నాడు. రిక్షాలో ఉన్న యువతికేసి నిప్పులు కక్కుతూ కొద్ది నిమిషాలు నోట మాట రానివాడిలా చూస్తూ నిలబడిపోయాడు. అతన్ని చూసి శాంతి గాభరాపడింది. ఆ యువకుడు శాంతి చెయ్యి పట్టుకుని రిక్షాలో నుంచి కిందకులాగాడు.

"నాకు తెలుసే కులటా - ఇవ్వాళ ఇక్కడకు వస్తావని..." అని తిడుతూ చెంపచెళ్ళు మనిపించాడు.

దగ్గరలో వున్న దుకాణాల్లోనివాళ్ళూ, రోడ్డున వెళ్లేవాళ్ళూ వాళ్ల చుట్టూచేరి, ఏదో సినిమా షూటింగు చూస్తున్నట్టు ఆ దృశ్యాన్ని కుతూహలంతో చూడసాగారు. ఆ యువకుడి పేరు సురేశ్.

శాంతి చుట్టూచేరినవాళ్లను బేలగా చూసింది. ఎవరూ సహాయం చేయడానికి సిద్ధంగా వున్నట్టు కన్పించలేదు.

"నువ్వు ఎవరు నన్ను కొట్టడానికి?" అంటూ అరిచింది శాంతి.

"ఎవర్నా? నీ మొగుణ్ణి!"

"ఈమె నీ భార్యా?" జనంలో నుంచి ఒక కంఠం ప్రశ్నించింది

"అవును!"

"అబద్ధం! ఇతనెవరో నాకు తెలియదు." అన్నది శాంతి ఏడుస్తూ.

ఆ దారినే వెళ్తున్న ఒక కానిస్టేబుల్ అక్కడికి వచ్చాడు.

"పోలీసు స్టేషనులో తేల్చుకుందాం పదండి" అన్నాడు. జనంలో నుంచి అనేక కంఠాలు "అవును! అవును!" అన్నాయి. సురేశ్ పోలీసు స్టేషన్‌కి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. ఆ యువతి నిరాకరించింది. "నాభర్త స్టూడియోలో వున్నాడు" అన్నది



స్టూడియో కేసి చూస్తూ. కొందరు స్టూడియోలోకి వెళ్ళారు. అక్కడ ఎవరూలేరు. ఒక అందమైన యువకుడు వచ్చాడనీ, తన భార్య రిక్షాలో ఉంది తీసుకువస్తానని అప్పుడే బయటకు వెళ్ళినట్టు చెప్పాడు ఫోటోగ్రాఫర్. దినేశ్ అక్కడ జరుగుతున్న గొడవ చూసి చిన్నగా జారుకున్నాడని వేరుగా చెప్పనక్కర్లేదు.

ఇద్దర్నీ పోలీసు స్టేషనుకు తీసుకువెళ్ళారు. శాంతి సురేశ్ తన భర్త కాదని వాదించింది ఇన్‌స్పెక్టర్‌తో.

"నాపేరు సురేశ్ గోస్వామి. ఈమె నా భార్య. కావాలంటే మీరు అక్కడికి వచ్చి వాకబు చెయ్యండి." అన్నాడు సురేశ్.

శాంతి గాభరా పడింది. "అక్కర్లేదు. ఇతను నా భర్తే." అన్నది ఏడుస్తూ.

ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యపోయాడు.

"ఇంటికి వెళ్ళండి. ఇంటి గొడవలు ఇంట్లోనే ఉండటం మంచిది." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

శాంతి మౌనంగా రిక్షా ఎక్కి భర్తతో ఇంటికి వెళ్ళింది. ఇంటికి వచ్చాక సురేశ్ కసిగా భార్య జుట్టు పట్టుకొని వంగదీసి కొట్టాడు. "మళ్ళీ వాడు ఈ ఇంట్లో అడుగు పెట్టాడా చూడు ఏం చేస్తానో" అంటూ బయటికి వెళ్ళిపోయాడు.

సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి వచ్చాడు సురేశ్. అతను సాధారణంగా పొద్దుపోయి వస్తాడు. దినేశ్ కూర్చుని వున్నాడు. శాంతితో మాట్లాడుతున్నాడు. సురేశ్ రక్తం కుతకుతలాడింది. మళ్ళీ భార్య జుట్టు పట్టుకున్నాడు. దినేశ్ పిల్లిలా జారుకున్నాడు.

"కొట్టు నువ్వు ఎంత కొట్టినా దినేష్ ఈ ఇంటికి వస్తాడు" అన్నది శాంతి మొండిగా.

కొట్టి కొట్టి విసుగెత్తి వదిలేశాడు.

"నువ్వు ఆ నర్సు ముండను వదిలేయ్! నేను దినేశ్‌ను వదిలేస్తాను" అన్నది.

"సిగ్గులేదూ! అక్కలాంటి వ్యక్తితో సంబంధం కడతావా? నీ తిక్క ఇలా కుదరదు. చాలా భరించాను. ఇక నావల్ల కాదు" అంటూ మళ్ళీ బయటికి వెళ్ళాడు విసురుగా.

శాంతి నర్సును తిడుతూనే వున్నది. భర్తను తిడుతూ ఏడుస్తూ పడుకుంది.

సురేశ్ దినేశ్‌ను బెదిరించే పరిస్థితిలో లేదు.

కారణం...

సురేశ్ గోస్వామి తండ్రి అలీగఢ్‌లో రైల్వేలో ఉద్యోగం చేస్తూ చనిపోయాడు. ఇంటి పరిస్థితి బాగాలేదు. తల్లి ముందే పోయింది. సురేశ్ అన్న గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అతని పేరు రమేశ్. తన హైస్కూల్ చదువుతో విద్యకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వచ్చింది. తమ్ముణ్ణి బాగా చదివించాలని అతని కోరిక. అయినా వీలుపడలేదు. పది పూర్తి చేసి ఎలక్ట్రీషియన్‌గా డిప్లొమా పొందాడు సురేశ్.

1971లో రమేశ్ తమ్ముడి పెళ్ళిచేశాడు. అందరూ కలిసే వుండేవారు. కాని తోడికోడళ్ళ మధ్య పడేదికాదు. శాంతి నోటి తొందర మనిషి. సురేశ్‌ను శాంతి పూర్తిగా తన వశం చేసుకుంది. తండ్రి ద్వారా సంక్రమించిన నగలూ, కొద్దిగా ఉన్న స్థిరాస్తి పంచుకొని వేరుపడాలనుకున్నాడు. అందుకు అన్న అంగీకరించలేదు. నగలు ఎలాగయినా దొంగిలించమని బావమరిది సురేశ్‌కు సలహా ఇచ్చాడు. ఆ నగలతో మంచి వ్యాపారం చేద్దామన్నాడు. శాంతి అన్న సలహాను పాటించమని భర్తను వేధించ సాగింది.

భార్య సహాయంతో ఇంట్లో వున్న వెండి బంగారు వస్తువుల్ని అదను చూసి దొంగలించి బావమరిదికి ఇచ్చాడు సురేశ్. రమేశ్ సురేశ్‌ను ఇంటినుంచి గెంటివేశాడు. ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న శాంతి సంతోషంగా భర్తతో బయటికి వచ్చేసింది. ఆ వస్తువులన్నీ శాంతి అన్నగారే అమ్మేసుకున్నాడనీ, ఒక్క నయాపైసా కూడా సురేశ్‌కు దక్కలేదనీ అంటారు.

వేరే కాపురం పెట్టారు. సురేశ్ "విక్రమ్ ఇండస్ట్రీస్"లో అతి కష్టం మీద చిన్న ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఇద్దరు కొడుకులు పుట్టారు. ఇంటి ఖర్చులు పెరిగాయి. సురేశ్ ఓవర్‌వర్కు చెయ్యసాగాడు. తెల్లవారుతూనే వెళ్ళినవాడు రాత్రి పొద్దుపోయి ఇంటికి వచ్చేవాడు. డబ్బు భార్యకే ఇచ్చేవాడు. ఇల్లునడిపే బాధ్యత పూర్తిగా శాంతిదే. దినేశ్ అందమైన యువకుడు. అతనికి ప్రొవిజన్ స్టోరు వున్నది. శాంతి దినేశ్ దుకాణం నుంచే సరుకులు తెచ్చేది. డబ్బు లేకపోతే అప్పు రాయించి తెచ్చేది. పిట్ట చాలా తేలిగ్గా తన వలలో పడుతుందనే విషయాన్ని దినేశ్ త్వరలోనే గ్రహించాడు. ఆమెను చూస్తూ "రండి రండి వదినగారూ! ఏం కావాలి!" అనేవాడు అదోలా నవ్వుతూ. కొట్లో అప్పు పెరిగిపోతున్నది. ఒకనాడు, "రోజురోజుకూ అప్పు పెరిగిపోతున్నది. ఎలా తీర్చాలో ఏమిటో! మీ కొట్టుకు రావాలంటేనే మొహమాటంగా వుంది" అన్నది శాంతి.

"దిగులుపడకు - ఫర్వాలేదులే!"

"మీ మంచితనం వల్ల ఇంట్లో ఏ తరుగూ లేకుండా గడిచిపోతున్నది. కానీ ఇవ్వాల్సిన డబ్బు గురించి ఆలోచిస్తేనే దిగులుగా ఉంటుంది."

"అదేం ఫర్వాలేదు. ఒకరోజు ఇంటికి పిలువు. వడ్డీతో సహా వసూలు చేసుకుంటాను!" అర్ధయుక్తంగా అన్నాడు నవ్వుతూ.

శాంతి తెలివైంది - అతని మనస్తత్వాన్ని ఏనాడో గ్రహించింది. శాంతికి బాగా అలంకరించుకోవాలనీ, మంచి చీరలు కట్టుకోవాలనీ ఉంటుంది. తన అందం అడవికాచిన వెన్నెల అవుతోందని బాధపడని రోజు ఉండేది కాదు.

ఆరోజు నుంచి దినేశ్, సురేశ్ ఇంటికి తరచు రాసాగాడు. ఇరుగుపొరుగు ఆడవాళ్ళు గుసగుసలు ప్రారంభించారు. క్రమంగా ఆ పేటలోని మగవాళ్ళకు కూడా ఈ విషయం తెలిసింది. ఆనోటా ఆనోటా ఆవార్త సురేశ్ చెవుల వరకూ వచ్చింది. భార్యను నిలదీసి అడిగాడు. శాంతి ఎదురు తిరిగింది. దినేశ్‌ను సమర్థించింది. అతనికి బోలెడంత అప్పు ఉన్నట్టు చెప్పింది. మగాడివైతే ఆ అప్పు వెంటనే తీర్చమన్నది.



సురేశ్ ఆ ఇల్లు ఖాళీచేసి దూరంగా మరో పేటలో (ఈషానగర్) ఇల్లు తీసుకున్నాడు. దినేశ్, సురేశ్ లేనప్పుడు శాంతిని కలుసుకోవడానికి వస్తూనే వున్నాడు. సురేశ్ శాంతిని ఎన్నోసార్లు మందలించాడు. "అప్పు తీర్చమని వస్తున్నాడు. ముందు అతని డబ్బు అవతల పారేయ్" అంటూ రగడ చేసేది. సురేశ్‌కు తన అసహాయత మీద చిరాకువేసేది. మౌనంగా వుండిపోయేవాడు. శాంతి దినేశ్‌కూ తనకూ మధ్య ఎలాంటి అక్రమ సంబంధం లేదని దబాయించేది.

ఆరోజు వాళ్లిద్దరూ ఫోటో స్టూడియోకి బయలుదేరారని అతనికి ఎవరో ఫోన్‌చేసి చెప్పారు. భార్యను స్టూడియో ముందు రిక్షాలో పట్టుకున్నాడు. రోజూ రాత్రిళ్ళు ఇద్దరూ పోట్లాడుకునేవారు. ఇరుగు పొరుగు వాళ్ళు పట్టించుకోవడం మానేశారు.

21 సెప్టెంబరు అంటే - ఆ సంఘటన జరిగిన మరునాటి ఉదయం సక్సేనా అనే వ్యక్తి గాభరాగా పోలీసు స్టేషనుకు వెళ్ళాడు. తమ పక్క ఇంట్లో కాపురం వున్న సురేశ్ గోస్వామి భార్యను ఎవరో హత్య చేసి మురుగు కాలువలో పడేశారని రిపోర్టు ఇచ్చాడు. ఇన్‌స్పెక్టర్ కేసు రిజిష్టర్ చేసి, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నాడు. ఇంటి వెనక ఉన్న మురుగుపోయే చిన్న గండీలో శాంతి శవం పడివున్నది. ఇరుగుపొరుగు ద్వారా శాంతికీ దినేశ్‌కి వున్న అక్రమ సంబంధం గురించి తెలుసుకున్నాడు. క్రితంరోజు జరిగిన సంఘటన. కూడా కొందరు విన్పించారు. సురేశ్ గోస్వామి తన ఇద్దరు పిల్లలతో తెల్లవారేసరికి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడని తెలిసింది.

దినేశ్ తనకూ, శాంతికి అక్రమ సంబంధం ఉన్నట్టు వెంటనే అంగీకరించాడు.

శాంతి శరీరం మీద ఏడు పదునైన కత్తిగాట్లు ఉన్నట్టు డాక్టర్ రిపోర్టు ఇచ్చాడు.

ఆమెను భర్త హత్య చేశాడని అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. కాని ఎవరూ కళ్ళతో చూచినట్టు చెప్పలేదు.

సురేశ్ గోస్వామి కోసం పోలీసులు వెదకడం ప్రారంభించారు. అతని బంధువుల ఇళ్ళకు వెళ్ళారు. ఎవరూ అతని ఆచూకీ చెప్పలేదు. ఒక ఇరానీ హోటల్ యజమాని మాత్రం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో పిల్లలిద్దర్నీ సైకిల్ మీద ఎక్కించుకొని సురేశ్ వెళ్ళడం చూశానని చెప్పాడు.

పోలీసు ఆఫీసరు నర్స్ రమాదేవి ఇంటికి వెళ్ళాడు. ఆమె వయసు ఏభై ఏళ్లు వుంటుంది. సురేశ్‌కు ఆమెకూ అక్రమ సంబంధం వుంటుందని ఇన్‌స్పెక్టర్ ఊహించలేకపోయాడు. శాంతి కావాలని కల్పించినట్టు అర్థం చేసుకున్నాడు. రమాదేవి సురేష్ తన వదినగారి తమ్ముడని, అప్పుడప్పుడు తన ఇంటికి వచ్చేవాడని చెప్పింది. శాంతి తనమీద అపవాదులు వేసిందని తెలుసునని చెప్పింది. సురేశ్ కూడా బాధపడి అప్పటి నుంచి తన ఇంటికి రావడం మానేశాడని తెలిపింది.

ఇన్స్పెక్టర్ యాదవ్ విక్రమ్ ఇండస్ట్రీస్‌కు వెళ్లి వాకబు చేశాడు. సురేశ్ ముందురోజు పది గంటల వరకూ పనిచేసి వెళ్లిపోయాడనీ, ఆ తర్వాత మళ్లీ పనిలోకి రాలేదని తెలిసిది.

అకోట్బరు 12 న సురేశ్ అలీగఢ్ మేజిస్ట్రేట్ ముందు హాజరయ్యాడు. అదేరోజు అతన్ని జైలుకు పంపించారు. కోర్టు పర్మిషన్ తీసుకొని ఇన్స్పెక్టర్ యాదవ్ జైలుకు వెళ్ళి సురేశ్‌ను చూశాడు. ఎన్నో ప్రశ్నలు వేశాడు అతను ఒక్క ప్రశ్నకూ సమాధానం చెప్పలేదు.

"నేను చెప్పదలచుకున్న విషయాలు కోర్టులోనే చెబుతాను" అన్నాడు.

కోర్టులో విచారణ ప్రారంభం అయింది.

తీర్పు ఎలా వుంటుందో తెలియదు.

పిల్లలు అనాధ ఆశ్రమంలో వున్నారు.

ఏది ఏమైనా పిల్లల భవిష్యత్తుమీద గొడ్డలిపెట్టు తగిలింది. వివాహిత స్త్రీలు భర్త చాటుగా పరపురుషుడితో అక్రమ సంబంధం పెట్టుకోవడం ఆమె కుటుంబానికే గొడ్డలిపెట్టు. పిల్లల్ని కన్న తర్వాత వారి భవిష్యత్తును తీర్చి దిద్దడం, వారిని బాధ్యతగల పౌరులుగా తయారుచేయడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రేమకంటే బాధ్యత ముఖ్యం అనే విషయాన్ని వివాహిత స్త్రీ పురుషులు విస్మరించకూడదు.

❀ ❀ ❀



# 5. ఒక సావిత్రి కథ

సావిత్రీ ఆమె భర్త బాలకృష్ణ తమ మొదటి పెళ్ళిరోజు పండుగ సంతోషంగా జరుపుకొంటున్నారు. వారి వివాహం 14 జులై 1975న జరిగింది. బాలకృష్ణ తండ్రి దుర్గాచరణ్ మహంతి రైతు. ఆ కుటుంబం అంటే అందరికీ గౌరవం. బాలకృష్ణ మహంతి "బొకారో స్టీల్ ప్లాంట్"లో పనిచేస్తున్నాడు.

కొత్తకాపురం - అంతా ఆనందమే. సమస్యలంటే ఏమిటో వాళ్ళకు తెలియదు. సావిత్రి సౌందర్యం చూస్తుంటే భర్తకు వెర్రెత్తిపోతుంది. సావిత్రికి తండ్రి లేడు. పెద్దనాన్న ఆమె కాపరానికి వచ్చిన ఎనిమిది నెలల్లో రెండుసార్లు వచ్చి చూసి వెళ్ళాడు. సావిత్రి తల్లి పేరు శాంతిలత. తన కూతురు జీవితం సుఖవంతంగా ఉన్నదని విన్న ఆమె ఆనందానికి అంతులేదు.

శాంతిలత భర్త అంటే సావిత్రి తండ్రి కటక్ దగ్గర మేఘా అనే గ్రామంలో జన్మించాడు. చాకుండా టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నప్పుడు అతనికి ఒక అనాధ ముస్లిం బాలికతో పరిచయం అయింది. ఆమె అద్వితీయ సౌందర్యానికి ముగ్ధుడై, ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆమె పేరు మార్చి శాంతిలత అని పెట్టాడు. అతన్ని, అతని కుటుంబాన్ని కులం వెలివేసింది. అతను లక్ష్యపెట్టలేదు.

వారి ప్రేమ ఫలంగా సావిత్రి జన్మించింది. సావిత్రి తల్లిలాగే అందమైనది. కూతుర్ని చూస్తూ "శాంతీ! మనం తప్పు చేశామేమోననిపిస్తుంది. ఒక వేళ మన అమ్మాయిని ఇటు హిందువులూ, అటు ముస్లిములు కూడా పెళ్ళి చేసుకోవటానికి ఇష్టపడకపోతే, మంచి సంబంధం రాకపోతే? ఈ బంగారు బొమ్మను ఏంచేయాలి? ఏ వెధవనో"

శాంతి భర్తనోరు మూసేది అలా అంటున్నప్పుడు... ఆమె కళ్ళలో మెరిసే తడి చూసి అతను మాట మార్చేవాడు. సావిత్రి తొమ్మిదో తరగతి చదువుతూ ఉన్నప్పుడు తండ్రిపోయాడు. శాంతిలత మరోసారి దిక్కులేని పక్షి అయింది. పైగా ఆమె మీద బిడ్డను పెంచాల్సిన బాధ్యత ఒకటి ఉంది. శాంతిలతకు ఆ పరిస్థితిలో కూడా అత్తవారింట్లో స్థానం దొరకలేదు. కాని ఆమె పెద్ద బావగారికి శాంతిలత అంటే జాలి కలిగింది. అతని పేరు కూడా చరన్ మహంతి. అతను కటక్‌లో శాంతిలతనూ, సావిత్రిని తన దగ్గిర పెట్టుకొని వాళ్ళ బరువు బాధ్యతల్ని తన భుజాలమీద వేసుకున్నాడు.

సావిత్రికి తన తల్లి వివాహానికి ముందు ముస్లిం అని తెలుసు. అయినా ఆమెదృష్టిలో అదో ప్రధానమైన విషయంగా ఏనాడూ అన్పించలేదు.

ఒకరోజు అమాయకంగా సావిత్రి తన తల్లి ముస్లిం స్త్రీ అనీ, ఆమెను వివాహం చేసుకోవడంవల్ల తన తండ్రికి కుటుంబంలో స్థానం లేకుండాపోయిందని భర్తతో చెప్పింది. తన తండ్రి గొప్పతనాన్నీ త్యాగాన్నీ పొగుడుతూ చెప్పింది.

ఆ రాత్రి బాలకృష్ణ మహంతి ఆ విషయం గురించి ఏమీ మాట్లడలేదు. విని ఊరుకొన్నాడు.

రెండోరోజు ఉదయం భార్యతో ఎడముఖం పెడముఖంగా ప్రవర్తించాడు. భోజనం చేయకుండా ఆఫీసుకు వెళ్ళిపోయాడు. సావిత్రికి భర్త అలా ప్రవర్తించడానికి కారణం తెలియలేదు. తన వల్ల ఏదో పొరపాటు జరిగి వుంటుందనుకున్నది. ఆరోజు ఆమె కూడా భోజనం చెయ్యలేదు. "నావల్ల తప్పు ఏదైనా జరిగి వుంటే క్షమించండి." అన్నది సావిత్రి దాదాపు ఏడుస్తూ బాగా పొద్దుపోయి ఇంటికి చేరిన భర్తతో.

"తప్పు నీది కాదు. మీ పెదనాన్నది. పెళ్ళికి ముందు మీ అమ్మ జాతి గురించి చెప్పలేదు. పైగా నువ్వు మెట్రిక్ వరకు చదివావని కూడా చెప్పాడు." కోపంగా అన్నాడు బాలకృష్ణ.

"పెళ్ళిలో కొన్ని చిన్న చిన్న అబద్ధాలు అందరూ చెబుతారు" అన్నది సావిత్రి. "అవును చెప్తారు. అందుకే నువ్వు మీఅమ్మ దగ్గరకే వెళ్ళు. నేను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను. నీకంటే అందమైనదాన్ని, ఎక్కువ చదువుకున్నదాన్ని చేసుకోగలను తెలుసా?"

సావిత్రి ఏడ్చింది. భర్త కాళ్ళు పట్టుకొని ఏడ్చింది. కాని బాలకృష్ణ మనసు కరగలేదు. సావిత్రి తల్లి దగ్గరకు వెళ్ళక తప్పలేదు. సావిత్రి పెదనాన్న వరుగువరుగున వచ్చాడు. అల్లుడికి ఎంతగానో చెప్పిచూశాడు. చివరకు నిరాశతో తిరుగుముఖం పట్టాడు.

రెండేళ్ళు గడిచిపోయాయి. అయినా సావిత్రిని భర్త తీసుకువెళ్ళలేదు.

సావిత్రి పెదనాన్న కాళీచరణ్ మహంతి కోర్టులో దావావేశాడు. సావిత్రి జీవన భృతిగా కొంత డబ్బు నెలనెలకూ అతని జీతంలోనుంచి ఇప్పించవలసిందిగా కోర్టును అర్థించాడు.

కోర్టు నుండి భర్తకు ప్రతినెలా అతని జీతం నుంచి 400 రూపాయలు సావిత్రికి ఎందుకు ఇప్పించకూడదో సంజాయిషీ ఇచ్చుకో' మంటూ నోటీసు అందినది. అతను గాభరాగా కటక్ వెళ్ళాడు. లాయర్ను పెట్టుకున్నాడు. అయినా కోర్టు తీర్పు సావిత్రి పక్షంగానే వచ్చింది. అప్పుడు మరో అర్జీ తను సావిత్రితో కాపురం చెయ్యటానికి సిద్ధంగా వున్నాననీ, ఇద్దరిమధ్యా రాజీ కుదర్చమనీ కోర్టువారిముందు సమర్పించుకున్నాడు.

ఇద్దరికి రాజీ కుదిర్చింది న్యాయాలయం. కాని వాళ్ళ మనసులు మాత్రం రాజీపడలేదు. సావిత్రి భర్తతో బొకారో వచ్చింది. బాలకృష్ణ భార్యతో మనసువిప్పి మాట్లాడేవాడుకాదు. అప్పుడప్పుడు ఏదో వంకతో కొట్టేవాడు. సావిత్రి అన్నీ సహించింది.

ఒక రోజు సావిత్రి భర్తతో తను తల్లి కాబోతున్నట్లు జంకుతూ చెప్పింది.



"నిజంగా?" ఎంతో సంతోషంగా అడిగాడు బాలకృష్ణ. అతను ఆ రోజునుంచి సావిత్రిని బాధించడం మానేశాడు. సావిత్రి సంతోషానికి అవధులు లేవు.

14 ఆగష్టు 1979. ఆరోజు శ్రీకృష్ణ జన్మాష్టమి. సావిత్రి ఉపవాసం వున్నది. అర్థరాత్రి శ్రీకృష్ణజన్మ సమయం తర్వాతనే ప్రసాదం తీసుకోవడానికి నిశ్చయించుకున్నది.

"ఇవాళ గుడికి వెడదామా?" సావిత్రి అప్పుడే ఇంటికి వచ్చిన భర్తను అడిగింది.

"అలాగే! ఇంకా చాలా సమయం వుంది. విశ్రాంతి తీసుకో:" అన్నాడు బాలకృష్ణ.

అప్పుడే వాకిలి ముందు స్కూటర్ ఆగింది.

"నాఫ్రెండ్సు వచ్చినట్టున్నారు. మూడు టీ తీసుకురా:" అంటూ బయటికి వచ్చాడు బాలకృష్ణ.

సావిత్రి టీ కప్పులతో డ్రాయింగ్ రూంలోకి వచ్చింది. అగంతుకుల్లో ఒకడు సావిత్రిని కళ్ళతోనే తినేస్తున్నట్టు చూడసాగాడు. సావిత్రికి ఎలాగో అనిపించింది. టీ కప్పులు టీపాయ్ మీద పెట్టేసి లోపలకు వెళ్ళిపోయింది.

మరో గంట తర్వాత భర్త గుడికి తీసుకెళ్ళాడు. సావిత్రి గుళ్ళో పూజ ముగించుకొని బయటకు వచ్చేసరికి ఆమె భర్త అంతకుముందు తమ ఇంటికి పచ్చిన వాళ్ళతో మాట్లాడుతూ కన్పించాడు. సావిత్రిని చూడగానే బాలకృష్ణ ఆమె దగ్గరకు వచ్చాడు. ఆ ఇద్దరూ స్కూటర్ ఎక్కి వెళ్ళిపోయారు.

బాలకృష్ణ ఇంటికి రెండు దారులున్నాయి. మట్టిబాటవైపు నడుస్తున్న బాలకృష్ణతో "ఇటెందుకూ? మంచిరోడ్డు వుండగా? పైగా ఆ దారిలో లైట్లు కూడా వుండవ్" అన్నది సావిత్రి.

"కొద్దిదూరమే చీకటి ఆ తర్వాత లైట్లున్నా... ఇటు వెళ్తే మన ఇంటికి త్వరగా వెళ్ళొచ్చు. నేనుండగా నీకు భయమేమిటోయ్" అన్నాడు బాలకృష్ణ ముందుకు నడుస్తూ.

సావిత్రి భర్తను అనుసరించింది.

చిన్న .కాలువ అడ్డం వచ్చింది. బాలకృష్ణ గబగబా అవతలి ఒడ్డుకు వెళ్ళిపోయాడు. సావిత్రి వంగి చెప్పులు చేత్తో పట్టుకుని లేచింది. ముందుకు అడుగు వేయబోయి ఏదో తగిలినట్టయి పడబోయి తమాయించుకున్నది. గిర్రున వెనక్కి తిరిగింది. స్కూటరు, దాని పక్కనే ఆ ఇద్దరు యువకులు నిల్చుని కన్పించారు. భయంతో భర్తను కేకలు పెట్టిపిల్చింది. బాలకృష్ణ అవతలి ఒడ్డునుంచి కాలవ దాటి గబగబా వచ్చాడు. కాని ఆమెను వాళ్లనుంచి రక్షించడానికి మాత్రం కాదు. ముగ్గురూ కలసి సావిత్రిని హత్యచేశారు.

బాలకృష్ణ ఏడుస్తూ తన ఇంటి పక్కనే ఉన్న స్నేహితుడితో, ఎవరో దుండగులు తన భార్యను స్కూటర్ మీద ఎక్కించుకొని పారిపోయారనీ, తనను

గాయపర్చారని చెప్పాడు. అతని స్నేహితుడు వెంటనే తన కార్లో బాలకృష్ణను ఎక్కించుకొని పోలీసు స్టేషనుకు వెళ్ళాడు. కంప్లెయింట్ రాసిచ్చాడు.

అందరూ ఘటనా స్థలానికి వచ్చారు. అక్కడ ఒక స్త్రీ రక్తపు మడుగులో బోర్లాపడి ఉన్నది. గాజులు పగిలి ఉన్నాయి.

ఇన్స్పెక్టర్ బాలకృష్ణకోసం వెనక్కి తిరిగి చూశాడు. అతను కారును అనుకుని నిల్చుని సిగరెట్ తాగుతున్నాడు. అతని ముఖంలో ఎటువంటి బాధా కన్పించలేదు. ఇన్స్పెక్టర్‌కు ఆశ్చర్యం వేసింది.

"బాలకృష్ణగారూ! ఇలా రండి! ఆమె మీభార్యో కాదో చూడండి" అన్నాడు ఇన్స్పెక్టర్ బాలకృష్ణతో.

బాలకృష్ణ సిగరెట్ కింద పడేశాడు. చెప్పుకాలుతో దాన్ని నలిపి ఆర్పాడు.

ఇన్స్పెక్టర్ టార్చి బాలకృష్ణ మీదకు వేశాడు.

"మిస్టర్ బాలకృష్ణా! ఆ చొక్కామీద రక్తపు మరకలేమిటో చెప్పగలరా?"

బాలకృష్ణ తృళ్ళిపడ్డాడు. అంతలోనే సర్దుకున్నాడు.

"ఆ దుండగుల నుంచి తప్పించుకొని పారిపోతూ పడ్డాను. దెబ్బ తగిలింది" అన్నాడు బాలకృష్ణ.

"ఏదీ ఆ దెబ్బ చూపించండి!" దగ్గరగా వచ్చి అడిగాడు ఇన్స్పెక్టరు.

బాలకృష్ణ గాబరా పడ్డాడు.

తన అపరాధం అంగీకరించాడు. ఐదు వేల రూపాయిలు ఇచ్చి ఆ ఇద్దర్నీ సావిత్రి హత్యకు నియమించినట్టుగా అంగీకరించాడు. తన భార్యను చంపించడానికే, వాళ్ళిద్దర్ని ఆరోజు గుడికి వెళ్ళేముందు ఇంటికి ఆహ్వానించినట్టుగా ఒప్పుకున్నాడు.

కేసు కోర్టులో జరుగుతూ ఉండగానే బాలకృష్ణకు మతిభ్రమణ కలిగింది. పిచ్చి ఆసుపత్రిలో చేర్పించారు. ఇప్పటికీ అతను ఆ ఆసుపత్రిలోనే వున్నాడు.

తను చేసిన పనికి అతనిలో పశ్చాత్తాపం కలిగి వుండాలి. బాధపడి వుండాలి. అందుకే బహుశా అతనికి మతిభ్రమణం కలిగింది.

ఒకనాడు సావిత్రి చనిపోయిన భర్తను యముడితో పోరాడి బ్రతికించుకున్నట్టు మన పురాణాలు చెబుతున్నాయి.

ఈనాటి సావిత్రిని భర్తే కిరాయి గూండాలచేత చంపిస్తున్నాడు.

❀ ❀ ❀



# 6. పసిమనసు

అది బొంబాయి నగరం. ఆ ప్రాంతంలో అన్నీ చిన్న చిన్న గుడిసెలే. వాటిలో చాలా వరకు అన్ని కులాలకు సంబంధించిన కింది మధ్య వర్గపు జనం ఎక్కువగా ఉంటారు.

ఒక గుడిసెలో గులాం రసూల్ అనే టాక్సీ డ్రైవర్ ఉంటున్నాడు. భార్య బిడ్డలతో సుఖంగానే జీవిస్తున్నాడు. భార్యా, పదిహేను సంవత్సరాల ఒక కొడుకూ మాత్రమే ఆ కుటుంబంలోని సభ్యులు. చిన్న సంసారం. రోజూ దాదాపు 60 నుంచి 70 రూపాయలకు తక్కువ కాని ఆదాయం రసూల్‌ది.

భార్యను ప్రేమగా చూసేవాడు. ఆవిడ మంచి బట్టలు కట్టుకొని ఆ గుడిసె నివాసు లందరిలోకీ హోదాగా, గర్వంగా ఉండేది. సినిమాలు బాగా చూసేది. రసూల్ ఆమె ఎంత ఖర్చు పెట్టినా ఏమీ అనేవాడు కాదు. కొడుకు యూసఫ్ చదువుకుంటున్నాడు. రసూల్ రాత్రిపూట ఇంటికి వస్తూ బాగా తాగి వచ్చేవాడు. పుష్టికరమైన తిండి తినేవాడు.

ఒక రాత్రి బాగా తాగివచ్చి పడుకున్న రసూల్‌కు గుండె నొప్పి వచ్చింది. డాక్టర్ని పిలిచే లోపలే కన్ను మూశాడు.

రసూల్ భార్య నసీమా భవిష్యత్తు అంధకారమయం అయింది. ఒక్క టాక్సీ తప్పించి మరేమీ లేదు. ఇరుగు పొరుగు వాళ్ళే ఆమెకు ధైర్యం చెప్పి కష్ట సమయంలో ఆదుకున్నారు. టాక్సీని అద్దెకు ఇచ్చారు. ఆ వచ్చే డబ్బుతో ఇల్లు గడుపుకోవాల్సి వచ్చింది. బాగా ఖర్చుకు అలవాటు పడ్డ నసీమాకు టాక్సీ మీద వచ్చే కిరాయి చాలేదికాదు. ఒక రోజు టాక్సీ అమ్మేసింది.

ఎందరో చెప్పిచూశారు. అయినా వినిపించుకోలేదు. ఆ డబ్బు ఆమె చేతిలో ఎంతో కాలం నిలవలేదు. అలవాట్లను మార్చుకోలేకపోయింది. మంచి తిండి కావాలి, మంచి బట్టలు కావాలి, సినిమా చూడకుండా ఉండలేదు. ఇతరుల ముందు తను గొప్పగా కన్పించాలనే కోరికను కూడా చంపుకోలేకపోయింది. క్రమంగా వంటి మీది నగలు అంగట్లోకి వెళ్ళిపోయాయి. ఇంట్లో ఉన్న పాత్ర సామాను కూడా అమ్ముకోవల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

యూసఫ్ స్కూల్ మానేశాడు. చాలా చురుకైన కుర్రవాడు. ఒక ఆటోమొబైల్ గరాజ్‌లో పనికి చేరాడు. అతనికి వచ్చే జీతంతో ఏదో రకంగా పొట్టలు పోషించుకోవచ్చును. కాని నసీమా అలా చెయ్యలేకపోయింది. యూసఫ్ రాత్రి 7-30కు ఇంటికి వచ్చేవాడు. కాని తల్లి ఇంట్లో ఉండేది కాదు. యూసఫ్‌కు దుఃఖం

వచ్చేది. పగలల్లా కష్టపడి వచ్చిన పసివాడిని లాలించి ఇంత ముద్ద పెట్టే వాళ్ళు ఉండేవాళ్ళు కాదు. ఇంట్లో ఉన్నది ఏదో తిని నిద్రపోయేవాడు. రాత్రి తల్లి రావడం కూడా అతనికి తెలిసేది కాదు. మళ్ళీ ఆమె లేవక ముందే లేచి పనిలోకి వెళ్ళేవాడు.

ఇరుగు పొరుగు వాళ్ళు నసీమా దారి తప్పి నడుస్తోంది అని అర్థం చేసుకున్నారు. ఆమెను చూసి గుసగుసలాడేవారు. నసీమా ఇవన్నీ లక్ష్య పెట్టేదికాదు. మళ్ళీ మంచి బట్టలు కొనసాగింది. చిన్న చిన్న నగలు కొన్నది. ఇంట్లోకి కావాల్సిన సామాగ్రిని చేర్చుకో సాగింది.

ఒక రోజు యూసఫ్‌తో పనిచేసే కుర్రాడు ఒకడు అన్నాడు– "మీ అమ్మ మంచిది కాదట. రాత్రిళ్ళు బయట తిరిగి డబ్బు సంపాదిస్తుందట. అందరూ అనుకుంటున్నారు" అని. యూసఫ్ పసి మనసు లోతుగా గాయపడింది. ముందు ఆ కుర్రవాడిని లాగి కొట్టాడు. ఘర్షణ పెరిగింది. ఇద్దర్నీ విడదీసిన పెద్దవాళ్ళుకూడా యూసఫ్ తల్లిని గురించి ఆ కుర్రవాడు చెప్పింది నిజమేనని ధృవపర్చారు. యూసఫ్ ఇంటికి వచ్చాడు. తల్లిలేదు. వంటచేసి పెట్టి ఉంది. అయినా భోజనం చెయ్యలేదు. రోజూలా నిద్రపోలేదు. తలలో ఏదో చప్పట్లు గుండెల్లో మంట! తల్లి కోసం ఎదురు చూస్తూ పడుకున్నాడు.

అర్థరాత్రి ఇంటి ముందు టాక్సీ ఆగింది. నసీమా లోపలకు వచ్చింది.

"అమ్మీ! రోజూ నువ్వు రాత్రిళ్ళు ఎక్కడి కెళ్తుంటావ్?" పడుకొనే అడిగాడు యూసఫ్.

యూసఫ్ ప్రశ్నకు అమె తృళ్ళి పడింది. చేతిలోని బ్యాగ్ కింద పడింది. ఆమె బాగా తాగిన మైకంలో ఉన్నది. జవాబివ్వకుండా తన మంచం కేసి నడవసాగింది.

"నాకు సమాధానం కావాలి?" యూసఫ్ కంఠం కంచులా మోగింది.

"నేను స్నేహితుల ఇంటికి వెళ్తుంటాను. మీ నాన్న లేకుండా ఇంట్లో ఉండలేక బయట కాలక్షేపంచేసి వస్తుంటాను."

"కాని నువ్వు డబ్బులు సంపాదించడానికి చెడ్డ చెడ్డ పనులు చేస్తున్నావంటున్నారు అందరూనూ?"

"ఉష్! చూడు బాబూ! నువ్వు ఇంకా చిన్నవాడివి. అమ్మతో ఇలాంటి మాటలు అనకూడదు. నిద్రపో!"

"నేను అనడం లేదు. అందరూ అంటున్నారు."

"వాళ్ళు అలాగే అంటారు. ఒకరు బాగుంటే చూడలేరు. కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారు, నువ్వు పట్టించుకోకు. నిద్రపో" అంటూ మంచంమీద పడుకుంటూనే నిద్రలోకి జారిపోయింది.

యూసఫ్‌కు నిద్రరాలేదు. తల్లి మాటల్లో నిజం కన్పించలేదు. రెండు రోజులు యూసఫ్ ఇంటికి వచ్చేసరికి తల్లి ఇంట్లోనే ఉండటాన్ని గమనించాడు. యూసఫ్ ఆనందానికి అంతులేదు. కాని ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదు. నాలుగు రోజులు గడి చాయో లేదో మళ్ళీ ఆమె మామూలుగానే ప్రవర్తించసాగింది.



ఐదో రోజు యూసఫ్ తన మేనమామ దగ్గరకు వెళ్ళాడు. అతను ఒక కార్ఖానాలో పని చేస్తుంటాడు. అతను యూసఫ్ కంటే నాలుగేళ్ళు మాత్రమే పెద్దవాడు. అతని వయస్సు 19 సంవత్సరాలు. మేనల్లుడు "మామయ్య! అమ్మ తన వళ్ళు అమ్ముకొని డబ్బులు సంపాదిస్తున్నదంటున్నారు. రాత్రి బాగా తాగి ఇంటికి వస్తుంది." అంటూ వెక్కి వెక్కి ఏడ్చాడు. రశీద్ కూడా బాధపడ్డాడు. వెంటనే అక్క ఇంటికి వచ్చాడు. "దీదీ! మన వంశంలో ఇలాంటి పనులు ఎవరైనా చేశారా! ఏమిటిది? నాన్నకు తెలిస్తే నిలువుగా నరికేస్తాడు. బావకు ఈ బస్తీలో ఎంత గౌరవం ఉండేది? పైగా యూసఫ్ ఎంత బాధ పడుతున్నడో తెలుసా?" అంటూ మందలించాడు.

నసీమా భోరున ఏడ్చింది. ఇక నుంచి తను సవ్యంగా నడుచుకుంటానని మాట ఇచ్చింది.

రెండో రోజు యూసఫ్ గరాజ్ నుంచి ఇంటికి వచ్చేసరికి తల్లి కన్పించలేదు. అతను నిలువెల్లా దహించుకుపోయాడు. లాభం లేదు. తన తల్లి మారదు. ఆమెకు ఎవరన్నా లక్ష్యం లేదు. ఆలోచిస్తూ తినకుండా పడుకున్నాడు.

దాదాపు రెండు గంటల ప్రాంతంలో ఒక టాక్సీ వచ్చి ఆగింది. నసీమా తడబడుతూ లోపలకు వచ్చింది. మంచం మీదకు వాలుతూనే గురకపెట్ట సాగింది.

యూసఫ్ చిన్నగా లేచాడు. వంటింట్లోకి వెళ్ళి కూరగాయలు కోసే చాకు తీసుకున్నాడు. తల్లి పడుకున్న మంచం దగ్గరకు వచ్చాడు. కసిగా గొంతులోకి చాకు కస్సున దించాడు. తాగిన మత్తులో ఉన్న నసీమా అరవలేదు. కొట్టుకోసాగింది. మళ్ళీ అదేపని చేశాడు. నసీమా చల్లబడిపోయింది. చాకు తీసి తుడిచి దిండు కింద పెట్టాడు.

యూసఫ్ నరాలలోని బిగువు సన్నగిల్లింది. రిలీఫ్‌గా అనిపించింది. మంచంమీద పడుకోగానే నిద్రపోయాడు. రేపు ఏమౌతుందనే భయంలేదు. ఆలోచన అంతకంటే లేదు. మనసులోని అగ్ని ఆరి చల్లబడినట్టు ప్రశాంతంగా నిద్రపోయాడు.

ఉదయం లేచాడు, స్నానం చేశాడు, శుభ్రమైన బట్టలు వేసుకొని తిన్నగా పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు.

"సర్! నేను మా అమ్మను చంపేశాను. నన్ను జైల్లో పెట్టండి" అన్నాడు ప్రశాంతంగా.

పోలీసు ఆఫీసర్ తృళ్ళి పడ్డాడు.

"ఏమిటీ?" అతని మాటలు అర్థం కానట్టు అయోమయంగా ప్రశ్నించాడు.

యూసఫ్ మళ్ళీ అదేమాటను రిపీట్ చేశాడు.

యూసఫ్ కోర్టులో తన అపరాధాన్ని అంగీకరించాడు. "మా అమ్మ చెడ్డది అని అందరూ అంటుంటే నేను వినలేను. ఆమె చచ్చిపోయాకనే నాకు మనశ్శాంతి లభించింది" అని చెప్పాడు.

యూసఫ్‌ను బాలసుధార్ గృహానికి పంపించారు. ఆ తర్వాత డెవిడ్ వసున్ ఇండస్ట్రియల్ స్కూల్ 'మటుంగా'కు పంపించారు. అక్కడ అతను టర్నర్ ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. చాలా చురుగ్గా తన పనిని ఎంతో శ్రద్ధగా నేర్చుకొనే యూసఫ్ అంటే ఆ స్కూల్ అధికారులకు ఎంతో ఇష్టం.

"నా తల్లి లాంటి తల్లి ఏ బిడ్డకూ ఉండకూడదు" అంటూ ఉంటాడు యూసఫ్.

❀ ❀ ❀



# 7. మానవత్వం ఇంకా బ్రతికే ఉన్నదా?

1980 ఆగస్టు 7 వ తేదీన దాదాపు ఉదయం పదకొండు గంటల సమయంలో నలభై అయిదు సంవత్సరాల పురుషుడొకడు 16 సంవత్సరాల అమ్మాయిని వెంట తీసుకుని బన్‌గావ్‌ లోకల్ ట్రయిన్ ఎక్కాడు. అమ్మాయి వయసు స్వీట్ సిక్స్‌టీన్. గులాబీని వెక్కిరించేలాంటి ముఖ సౌందర్యం. దానికితోడు గులాబిరంగు జార్జెట్టు చీరె కట్టుకుని వున్నది. వయస్సుకు తగ్గ అమాయికత్వం కళ్ళల్లో తొణికిసలాడుతున్నది. షియాలా స్టేషనులో ఆ పురుషుడితో దిగింది. ప్లాట్‌ఫారం మీద వున్న జనాన్ని తన పెద్ద పెద్ద కళ్ళతో కుతూహలంగా చూస్తోంది. బహుశా ఆమె అంత మంది జనాన్ని గానీ, అంత పెద్ద స్టేషన్ గానీ చూసి వుండకపోవచ్చు.

కాని ఆమెతో ఉన్న ఆ పురుషుడికి ఆ స్టేషనూ, నగరం చిరపరిచితమైనవే. అతను ముందుకు నడుస్తున్నాడు. ఆ పిల్ల అతన్ని అనుసరిస్తోంది. టాక్సీ స్టాండుకెళ్ళి ఒక టాక్సీ డ్రైవరుతో అతను ఏదో మాట్లాడాడు. ఆ డ్రైవరు ఆ పిల్లను నఖశిఖ పర్యంతం చూసి తన టాక్సీ రాదని చెప్పేశాడు. బహుశా ఆ పురుషుడు చెప్పిన స్థలానికి వెళ్ళడానికి డ్రైవరు సందేహించి వుంటాడు. ఆ పురుషుడు జేబులో నుంచి యేభై రూపాయల నోటు తీసి డ్రైవరుకి ఇవ్వబోయాడు. టాక్సీ డ్రైవరు నోటు అందుకోడానికి కొద్ది క్షణాలు సందేహించాడు. ఆ తరువాత నోటు తీసుకొని, టాక్సీ ఎక్కమన్నాడు. ఆ మునలివాడు అల్లంత దూరంలో వున్న ఆ అమ్మాయి కేసి తిరిగి

"మోనా! రా తల్లి!" అంటూ ఆప్యాయంగా పిలిచాడు.

మోనా సందేహిస్తూ ముందుకొచ్చింది. ఆ పురుషుడు టాక్సీ తలుపుతెరిచాడు.

"పితాజీ! మనం ఎక్కడికెళ్ళుతున్నాం? తేజ్‌పూర్ బండి ఎన్ని గంటల కొస్తుంది?" అంటూ మోనా టాక్సీలో కూర్చుంది.

మోనా ప్రశ్నకు మునలివాడి ముఖంలో రంగులు మారాయి. టాక్సీ ఎక్కి మోనా ప్రక్కన కూర్చుని గట్టిగా డోరువేశాడు.

"ఎందుకు తల్లీ? అంత గాభరా! నేను నీ మామను, కోడల్ని వీలయినంత త్వరగా ఇంటికి చేర్చడం నా కర్తవ్యం" అన్నాడు.

టాక్సీ బయల్దేరింది. మోనా టాక్సీ అద్దంలో నుంచి ఆకాశాన్ని అంటుకున్నట్లున్న కలకత్తా భవనాల్ని కుతూహలంగా చూస్తోంది. మధ్య మధ్య మామగార్ని ఏవేవో ప్రశ్నలడుగుతోంది. మామగారు ఆమె అడిగే సందేహాలకు సమాధానాలిస్తున్నాడు. ట్రాఫిక్ జామ్ అయి, టాక్సీ ఆగిపోయినప్పుడల్లా మోనా మొహంలో సంతోషం కనిపిస్తోంది. ఆ మహాపట్నంలోని బజార్లు, జనసందోహం, వాహనాలు ఆమెను ఆశ్చర్యంలో ముంచేస్తున్నాయి. తనను తాను మర్చిపోయి ఆ పిల్ల ఆ వాతావరణంలో లీనమైపోతోంది.

దాదాపు ఒక అరగంట తర్వాత టాక్సీ ఒక రోడ్డు ప్రక్కన ఆగింది. టాక్సీలో నుంచి మోనా మామగారు హడావిడిగా దిగాడు.

"దిగు మోనా" అన్నాడు మోనాతో.

మోనా టాక్సీలో నుంచి నలువైపులా చూసింది. "మామయ్యా మనం ఎక్కడికొచ్చాం? ఇక్కడ రైల్వే స్టేషన్ ఏదీ కనిపించడం లేదే? వచ్చేటప్పుడు హావ్రా స్టేషన్‌లో రైలెక్కాలని అమ్మ చెప్పింది" అన్నది.

మోనా ప్రశ్నవిన్న ఆమె మామగారి ముఖంలో చిరాకు కనిపించింది.

టాక్సీ డ్రైవరు ముఖంలోకి చూశాడు జంకుగా. కోడలివైపు తిరిగి "దిగమ్మా! మనం ఇక్కడే దిగాలి" అన్నాడు.

మోనా టాక్సీ దిగింది. వాళ్ళు దిగగానే టాక్సీ స్పీడుగా వెళ్ళిపోయింది. మామ వెనకే నడుస్తోంది మోనా.

"ఆc ఎందుకమ్మా అంత భయపడుతున్నావు? ఇక్కడ మన బంధువులున్నారు. వచ్చేటప్పుడు ప్రియవ్రతే (మోనా భర్త) కూడా వాళ్ళింటికి వెళ్ళి రమ్మన్నాడు. మనం వెళ్ళకపోతే వాడికి కోపం వస్తుంది" అన్నాడు మోనా మామగారు.

భర్త పేరు వినగానే మోనా బుగ్గల్లోకి వెచ్చదనం పాకింది. మనస్సులో ఎవరో చక్కిలిగింత పెట్టినట్టు అయింది.

"అలాగే మామయ్యా! వారు చెబితే తప్పకుండా వెళ్ళదాము!" అన్నది.

"సరే! వదమ్మా ఆ బంధువు ప్రియవ్రతకు పినతల్లి వరస అవుతుంది. వాడామెను 'చిన్నమ్మా' అని ఆప్యాయంగా పిలుస్తాడు. నువ్వుకూడా అలాగే పిలవాలి. ఆమె ఏం చెప్పినా నువ్వు మౌనంగా అంగీకరించాలి. అనవసరంగా ప్రశ్నలు వేయకూడదు. ఆమెకి కోపం వచ్చేలా ప్రవర్తించకూడదు. ఆమె ఏదైనా నీభర్తకి చెబితే, నీ భర్తకు కోపం రావచ్చు!" అన్నాడు.

మామగారికేసి ఓరగా చూసింది మోనా. మౌనంగా తల ఊపింది. వివాహం అయి ఎనిమిది నెలలయింది. అత్తవారింటికి మొదటిసారిగా వెళ్తున్నది. ఆమె కళ్ళల్లో కలలు తొణికిసలాడుతున్నై. గుండెల్లో ఏదో గుబులు కూడా ఉంది.

తేజ్‌పూర్ అస్సాం ప్రాంతంలో ఒక చిన్న నగరం. అక్కడే మోనా భర్తకి చెప్పుల దుకాణం వుంది. వ్యాపారం బాగానే వుండేది. మోనా తండ్రి రుద్రనారాయణ్



బర్మా నుంచి వచ్చిన శరణార్థి. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం బారాసాత్‌లోని బర్మా కాలనీలో అతనికి ఇల్లు ఇచ్చారు. ఆమె తండ్రి వచ్చేటప్పుడు కొంత బంగారం తెచ్చుకున్నాడంటారు. అయిదెకరాల పొలం కూడా కొనుక్కున్నాడు. ఆయనకు అజయ్‌బోస్, ఉత్తమ్‌బోస్ అనే కొడుకులిద్దరు. వారిద్దరి తరువాత పుట్టిన ఆడపిల్ల మోనా. అన్నలు ఇద్దరూ తండ్రితోపాటు వ్యవసాయం చేస్తారు. మోనా స్కూల్లో పదవ తరగతి వరకూ చదివింది. 1980 జనవరిలో మోనా వివాహం ప్రియవ్రత గృహాతో జరిగింది. మామగారి పేరు చింతామణి. కట్నం విషయంలో పెళ్లిలోనే దెబ్బలాట పెట్టుకుని వెళ్లిపోయారు. అయిదారు నెలలు రెండు కుటుంబాల మధ్య ఎలాంటి సంబంధాలు లేవు. ఎనిమిది నెలల తర్వాత చింతామణి కోడల్ని తీసుకెళ్లటానికి వచ్చాడు. మోనా తల్లిదండ్రుల సంతోషానికి హద్దుల్లేవు. వెంటనే కూతుర్ని మామగారితో పంపించారు.

చింతామణి సందులు గొందులు తిప్పి, మోనాను ఒక పెద్ద ఇంట్లోకి తీసుకెళ్ళాడు. నాలుగో అంతస్థులోని ఒక ఫ్లాట్ దగ్గరికి వెళ్ళి చింతామణి కాలింగ్ బెల్ నొక్కాడు. ఒక అందమైన అమ్మాయి వచ్చి తలుపు తీసింది.

"ఏం కావాలి?" అనడిగింది వినయ పూర్వకంగా

"చిన్నమ్మలేదా?" అన్నాడు చింతామణి.

"ఉన్నది కాని బాగా అలసిపోయి పడుకున్నది. మీరు రేపు రండి!" అంటూ తలుపు వేసుకోబోయింది ఆ అమ్మాయి.

"చూడమ్మా! ఆమె నన్నివాళ రమ్మన్నది. వెళ్లి చింతామణి వచ్చాడని చెప్పు" ఆ పిల్ల లోపలికి వెళ్ళింది.

రెండు మూడు నిముషాల తరవాత తిరిగివచ్చి మోనా కేసి అదోలా చూసింది.

"లోపలికి రండి!" అంటూ ఒక గదిలోకి తీసుకెళ్లి కూర్చోపెట్టింది.

గది చక్కగా అలంకరించబడి వుంది. ఒక పక్కన దుర్గాదేవి ఫోటో వున్నది. మోనా గదిలోని ఒక్కొక్క వస్తువునీ కళ్ళు పెద్దవి చేసుకొని చూస్తోంది. దాదాపు ఒక పది నిముషాల తరువాత అందమైన మధ్య వయస్సు స్త్రీ గదిలోకి వచ్చింది. ఆవిణ్ణి చూస్తూనే చింతామణి హడావిడిగా లేచి నుంచున్నాడు.

"ఈసారి కొంచెం ఆలస్యం అయింది. మీతో ఏకాంతంగా మాట్లాడాలి!" అన్నాడు.

ఆ స్త్రీ మోనాని పరిశీలనగా చూసింది.

చింతామణితో "రండి" అంటూ మరో గదిలోకి దారితీసింది.

ఆమె వెనకే రెండడుగులు వేసి చింతామణి ఆగి వెనక్కు తిరిగి "ఇప్పుడే వస్తానమ్మా ఇక్కడే కూర్చో" అని వెళ్లిపోయాడు.

మోనా వంటరిగా గదిలో ఉండిపోయింది. అక్కడి వాతావరణం ఆమెకి విచిత్రంగా తోచింది. ఆమె మనస్సులో ఎన్నో సందేహాలు, భయాలు తలెత్తాయి. కాని ప్రశ్నించే ధైర్యం లేకపోయింది. మామగారి కోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

అర్థగంట గడిచింది. మోనాకి ముళ్ళమీద కూర్చునట్లుంది. ఆ స్త్రీ గదిలోకొచ్చింది. ఆమె పక్కన చింతామణి కనిపించలేదు.

"చిన్నమ్మా! మా మామగారూ ఎక్కడికెళ్ళారు? మేం త్వరగా వెళ్ళిపోవాలి, రైలుకి టైమవుతున్నది!" అన్నది వినయంగా.

మోనా నోటినుంచి "మామగారు" అన్న మాట విని 'చిన్నమ్మ' అనబడే ఆ స్త్రీ ఉలిక్కిపడింది. ఓక్షణం అయోమయంగా చూస్తూ ఉండిపోయింది.

"అదేమిటి? చింతామణిని మామగారంటున్నావేమిటి" అనడిగింది ఆశ్చర్యంగా.

"నేను ఆయన కోడల్ని. మొదటిసారిగా అత్తవారింటికి వెళ్తున్నాను. వారికి మీరంటే ఇష్టమటగా. వచ్చేటప్పుడు మిమ్మల్ని చూసి రమ్మని కబురు చేశారు! అందుకే మామయ్య ఇక్కడకు తీసుకొచ్చారు. ఆయన ఎప్పుడొస్తారు?" అంది మోనా తలవంచుకుని.

"నీ పేరు మోనా కదూ!" ఆ స్త్రీ అడిగింది.

"అవునండి! నా పేరు మోనాయే!"

"మరయితె ఆయన కోడల్నని చెబుతావేం? నువ్వు ఎవరినో ప్రేమించి ఇంటి నుంచి కలకత్తాకి పారిపోయి వచ్చావటగా! నువ్వు చాలా బీద కుటుంబంలో నుంచి వచ్చిన పిల్లవట, నీ ప్రియుడేమో నిన్ను మోజుతీరాక బజార్లో వదిలేసి వెళ్ళాడట" అంటూ మోనా మొహంలోకి లోతుగా చూసింది ఆ స్త్రీ.

మోనా నిలువెల్లా కంపించిపోయింది. "మీరేం మాట్లాడుతున్నారో నాకర్థం కావటంలేదు. నేనిక్కడే బారాసాత్‌లోకి బర్మా కాలనీలో ఉంటాను. మా నాన్న పేరు రుద్రనారాయణబోస్. నాకెవడూ ప్రియుడు లేడు. పెళ్ళయి ఎనిమిది నెలలయింది. దురదృష్టవంతురాలిని. ఇంతవరకూ భర్త ముఖం చూడలేదు. ఎనిమిది నెలల తరవాత మా మామగారు నన్ను తీసుకెళ్ళడానికి వచ్చారు."

ఆ స్త్రీ మోనా ముఖంలోకి జాలిగా చూసింది.

"నువ్వు చెప్పేది నిజమయితే నీ అంత దురదృష్టవంతురాలు ఇంకొకరుండరు. మీ మామ చింతామణి నిన్ను నాకు అమ్మేశాడు. నీవు ఇక్కడున్న ప్రదేశం "సోనాగాచీ". ఇక్కడ శరీరం అమ్ముకునే ఆడవాళ్ళుంటారు. నేనదే వ్యాపారంలో ఉన్నాను. నా దగ్గరికి వచ్చే ఆడపిల్ల లందరికీ నేను చిన్నమ్మనే! నువ్వెవరివో ఎలా వచ్చావో నా కనవసరం. నేను బోలెడంత డబ్బుపోసి నిన్ను కొన్నాను. ఇక్కడున్న ఆడపిల్ల లందరిలాగే నీ శరీరాన్ని కూడా అమ్మి నేను డబ్బు చేసుకుంటాను. ఏడ్చి అల్లరిచేసి ప్రయోజనం లేదు. అలా చేస్తే కొరడా దెబ్బలు తప్పవు"

ఆ మాటలు విన్న మోనా తుపాను తాకిడికి తట్టుకోలేని లతలా నిలువునా కంపించిపోయింది! ఒక్కసారిగా చిన్నమ్మ కాళ్లమీద పడింది. రెండు చేతుల్తో కాళ్ళను చుట్టివేస్తూ "చిన్నమ్మా నువ్వు నా తల్లి లాంటిదానివి. నీకు నాలాంటి కూతురుంటే ఈ మురికి కూపంలోకి దింపుతావా? నన్ను రక్షించు. నా జీవితాన్ని నాశనం చేయకు" అంటూ భోరున ఏడవసాగింది.

చిన్నమ్మ కళ్ళలో నీరు తిరిగింది. మోనాను రెండుచేతుల్తో పైకెత్తి గుండెలికి హత్తుకుంది.



"బిడ్డా, నేను గొడ్రాలిని. మాతృత్వం, మమత తెలియనిదాన్ని. ఇంతవరకూ నన్ను నేను నీచమైన స్త్రీగానే భావిస్తున్నాను. అసహాయులైన ఆడపిల్లల శరీరాలను అమ్మి జల్సాగా బ్రతుకుతున్నాను. డబ్బు బాగానే సంపాదించాను. అన్నీ వున్నా మనశ్శాంతే లేదు. ఇవాళ నిన్నుచూస్తే ఈ దేశంలో డబ్బుకోసం తండ్రి కూడా బిడ్డల్ని అమ్మడానికి వెనుకాడడనిపిస్తుంది. భయపడకు. నిన్ను మీనాన్న దగ్గరికి పంపించేస్తాను" అంటూ ఊరడించింది.

చిన్నమ్మ మోనాను టాక్సీలో తండ్రి దగ్గరికి తీసుకొచ్చింది. కథంతా విని, రుద్రనారాయణ కొన్ని నిముషాల స్థాణువులా అయిపోయాడు. తరువాత చిన్నమ్మకి రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు.

"అమ్మా! నువ్వు చేసిన సహాయానికి నేను జన్మంతా కృతజ్ఞుడనై ఉంటాను. నాబిడ్డ జీవితాన్ని, నా కుటుంబ గౌరవాన్ని రక్షించావు."

చిన్నమ్మ పట్టుదలతోనే రుద్రనారాయణ చింతామణి మీద కేసు పెట్టాడు. 1980 ఆగష్టు పన్నెండవ తేదీన చింతామణిని పోలీసులు పట్టుకున్నారు. అతడు తన అపరాధాన్ని అంగీకరించాడు. గత రెండు సంవత్సరాలుగా తన ఆర్థిక పరిస్థితి బాగాలేదనీ, ఆడపిల్లల్ని వేశ్య గృహాలకి అమ్మే వ్యాపారం చేస్తున్నాననీ, కొన్ని నెలలుగా ఎవరూ దొరక్కపోవడం వల్ల తన కోడల్నే అమ్మేశానని పోలీసుల ముందు చెప్పాడు.

మోనాని అమ్మేసిన తరవాత చింతామణి తేజ్‌పూర్ వెళ్ళి తన కొడుకుతో మోనా తన కళ్ళుకప్పి, ఏదో స్టేషన్లో దిగి పారిపోయిందని చెప్పాడు. తన తండ్రి ఇలాంటి పనులు చేస్తున్నట్లు తనకి తెలియదని ప్రియవ్రత్ చెప్పాడు. మోనా అంటే ప్రియవ్రత్‌కి చాలా ఇష్టం. అయినా అతడు పెద్దవాళ్ల వత్తిడివల్ల భార్యను తీసుకెళ్ళలేకపోయాడు.

ఈ సంఘటన తర్వాత ప్రియవ్రత్ పశ్చాత్తాపపడ్డాడు. భార్యను తనతో తీసుకెళ్ళిపోయాడు.

కలకత్తాకు చెందిన అన్ని పేపర్లలో ఈ కేసును గురించి సమాచారం వచ్చింది. బారాసాత్ కోర్టులో ఈ కేసు నడుస్తూనే ఉంది.

చిన్నమ్మ కూడా చింతామణికి వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెప్పింది. చింతామణి తమ్ముడు వకీలు. అతడే అన్న తరవున కోర్టులో వాదిస్తున్నాడు.

చింతామణి కొడుకు ప్రియవ్రత్ భార్యతో సుఖంగా ఉన్నాడు.

❀ ❀ ❀

# 8. డా॥ రజియా!

అది 1980 జనవరి ఒకటవ తారీఖు. సాయంకాలం. లక్నో నుంచి బయలుదేరిన విమానం ఢిల్లీ పాలం ఎయిర్‌పోర్టులో 5.30 గంటలకు దిగింది. అందులో నుంచి ప్రయాణీకులందరూ దిగి లేంజ్‌లో తమతమ సామాను కొరకు ఎదురుచూస్తున్నారు. దాదాపు 35 ఏళ్ల వయసులో వున్న ఒక స్త్రీ మాటిమాటికి తన చేతి గడియారం చూసుకుంటూ ఉంది.

తన బ్రీఫ్‌కేస్ రాగానే అందుకొని గబగబా బయటికి నడిచింది. ఆమె ముఖంలో వ్యాకులత స్పష్టంగా కన్పిస్తోంది.

ఆ స్త్రీ ఎవరు?

ఆమె ఎక్కడికి వెళ్తోంది?

ఎందుకంత గాభరాపడుతుంది?

* * *

ఆమె పేరు రజియా. రజియా ఎం. బి. బి. యస్.

ఆమె అఫ్సర్ హుసేన్ ఐ. ఏ. ఎస్. సతీమణి.

అఫ్సర్ హుసేన్ టూరిజం డైరెక్టరుగా పని చేస్తున్నాడు.

భర్త చెప్పిన ప్రకారం ఆమె రెండవ తేదీన తన ముగ్గురు పిల్లలతో ఢిల్లీకి రావాలి. కాని ఒక రోజు ముందే వంటరిగా వచ్చింది. ఒక్క రోజు ముందు రావడం తన జీవితానికే శాపంగా పరిణమిస్తుందని ఆమె ఊహించలేదు.

* * *

హోటల్ అంబాసిడర్ ముందు టాక్సీ దిగి పోర్టికోలో ప్రవేశించిన రజియా యు టి ఆర్ 4418 నెంబరులో వున్న కారు కన్పించింది. దానిమీద "డైరెక్టర్ యు. పి. టూరిజం." అని బోర్డు కూడా వున్నది. అది చూడగానే డాక్టర్ రజియాకు కనుబొమ్మలు ముడిపడ్డాయి. వస్తున్న కోపాన్ని అణచుకుంటూ బ్రీఫ్‌కేస్ చేతుల్లో పట్టుకుని హోటల్ రిసెప్షన్ కౌంటరు దగ్గరకు వెళ్లి, "రూం నెంబరు 323లో వున్న వాళ్లు గదిలోనే వున్నారా?" అని అడిగింది.

"అవును మేడమ్! ఫోన్లో మాట్లాడతారా?" అనడిగాడు రిసెప్షనిష్టు.

"నో! నో! వాళ్ళు నాకోసం ఎదురు చూస్తూనే వుంటారు!" అని రజియా ముందుకు కదిలింది. లిఫ్టుకి కూడా ఎదురు చూడకుండా గబగబా మెట్లెక్కి 323 గది ముందు నిల్చుంది. తలుపు హేండిల్ తిప్పగానే తలుపు తెరుచుకుంది. లోపల గడియ పెట్టిలేదు. గదిలో ప్రవేశించిన రజియా ఎదురుగా కన్పిస్తున్న దృశ్యాన్ని చూస్తూ



స్థాణువులా ఉండిపోయింది. మంచం మీద ఒక పురుషుడు, ఒక స్త్రీ కన్పించారు. ఆ పురుషుడు అఫ్సర్ హుసేన్. ఆమె అతని ఆఫీసులో రిసెప్షనిష్టు, పాతికేళ్ళ నీనాకౌర్.

రజియాను చూస్తూనే అఫ్సర్ హుసేన్, నీనా గాభరాగా మంచం దిగారు. పక్కనే వున్న నైట్‌గౌన్ అందుకని తగిలించుకుంది నీనా. అఫ్సర్ హుసేన్ రాతి బొమ్మలా నిలబడిపోయాడు.

రజియా పిచ్చిదానిలా అరవసాగింది.

"నీకు సిగ్గులేదూ? ఇంత చదువు చదివావు! ఇంత పెద్ద ఉద్యోగం చేస్తున్నావు. నీలాంటి వాళ్ళు ముక్కు మూసుకుని మూడు నిముషాల్లో చావవచ్చు. సిగ్గూశరం విడిచేసిన వాడివి!" అంటూ నీనా వైపు తిరిగి "నేను నీ మీద మినిష్టర్‌కి కంప్లెయింట్ ఇస్తాను! యూ బిచ్" అంది.

అఫ్సర్ హుసేన్ కొంత తేరుకుని, "నోర్మూయ్! ఇక్కడ సీన్ క్రియేట్ చేశావా చంపేస్తాను!" అంటూ తన బ్రీఫ్‌కేస్ తెరవడానికి వంగాడు.

* * *

అప్పుడు సాయంత్రం ఏడవుతుంది. నైట్‌గౌన్‌లో నీనా గాభరాగా రిసెప్షన్ కౌంటర్లోకి వచ్చి, "నా గెస్ట్ జబ్బుగా వున్నాడు. దయచేసి వెంటనే డాక్టర్ని పిలవండి" అన్నది.

ఆ సమయంలో ఆ హోటల్లో డాక్టర్లెవరూ లేరు. టాక్సీకోసం ఫోన్ చేశారు. హాస్పిటల్‌కి తీసుకువెళ్ళవచ్చనే ఉద్దేశ్యంతో.

అదే సమయంలో రజియా కిందకి వచ్చి ఇంగ్లీషులో "ఏమిటిది? ఒక మనిషినికి జబ్బుగా ఉందంటే ఎవరూ పట్టించుకోరు?" అంటూ పిచ్చిగా అరవసాగింది.

ఆమె కేకలకు అందరూ పరిగెత్తుకొని వచ్చారు. అందరూ రూం నెంబరు 323 గదిలోకి ప్రవేశించారు. గదిలో చుట్టిన దుప్పట్లో ఒక వ్యక్తి పడి వున్నాడు. అక్కడక్కడ రక్తపు మరకలు కన్పిస్తున్నాయి. ఆ రక్తపు మరకలు చూసి అందరూ చిన్నగా జారుకున్నారు.

రజియా అర్థం చేసుకుంది, ఇంక తనకు ఎవ్వరూ సహాయం చేయరని. ఒక సర్వరు సహాయంతో దుప్పట్లో చుట్టివున్న భర్తను మోస్తూ మెల్లిగా కిందకు దిగి వచ్చింది. అప్పటికే టాక్సీ వచ్చింది. భర్తను వెనుక సీట్లో పడుకోబెట్టి రామమనోహర్ లోహియా ఆస్పత్రికి తీసుకువెళ్లింది.

నీనా గదిలోనే వుండిపోయింది. తలుపు గడియ పెట్టుకుంది.

ఆస్పత్రిలో డాక్టర్లు అఫ్సర్ హుసేన్ మరణించినట్టు చెప్పారు. "లేదు లేదు! ఇంకా ప్రాణం ఉంది. ఇంజక్షన్ ఇవ్వండి. కార్డియాక్ మసాజ్ చెయ్యండి" అంది డాక్టర్ రజియా కంగారుగా.

ఆమెమీద గౌరవంతో డాక్టర్లు ఆమె చెప్పినట్లు చేశారు. అయినా లాభం లేకపోయింది. రజియా తన స్నేహితురాలు డాక్టర్ అక్తర్‌కు ఫోన్ చేసింది. అక్తర్

వచ్చి పరీక్షించి తల వంచేసుకుంది. రజియాను ఓదార్చుతూ తనింటికి తీసుకువెడతానన్నది. రజియా తన అడ్రసు, ఢిల్లీలోని డాక్టర్ అక్తర్ అడ్రసు ఇచ్చి స్నేహితురాల్తో బయలుదేరింది. పిచ్చిదాన్లా విలపిస్తున్న ఆమెను ఓదార్చలేక అక్తర్ నిద్ర మందు ఇచ్చింది.

ఎవరు అతన్ని పిస్టల్‌తో కాల్చారో ఎవరికీ తెలియలేదు. కాని పోలీసు ఎంక్వయిరీలో తను తన అన్నకి ఫోన్ చెయ్యడానికి కిందికి వచ్చినప్పుడు గదిలో పిస్టల్ పేలిన శబ్దం వినిపించిందనీ, వెంటనే తను గదిలోకి పరిగెత్తుకు వెళ్ళానని, అప్పటికే అఫ్సర్ హుసేన్ నేల మీద పడి వున్నాడనీ, ఛాతీలో ఎడం పక్కనుంచి రక్తం కారుతుందని చెప్పింది రజియా.

"ఒక డాక్టరుగా వెంటనే నాకర్తవ్యాన్ని నేను నిర్వహించాను! బెడ్‌మీద వున్న దుప్పటిని తీసి శరీరానికి చుట్టి, గాయంలోంచి వస్తున్న రక్తాన్ని ఆపటానికి ప్రయత్నించాను. కార్డియాక్ మసాజ్ ఇచ్చాను. అప్పటికే ఆయన కళ్ళు మూసుకుపోయినై! వెంటనే నీనాతో డాక్టరుని పిలవమన్నాను. తరువాత నేనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళాను" అని చెప్పింది రజియా.

నీనా తలుపు లోపల్నుంచి వేసుకున్న తరువాత మళ్ళీ బయటికి రావడం ఎవరూ చూడలేదు. రూం నెం. 323 ఎన్నో ఫోన్లు వచ్చినా జవాబేమీ లేకపోవడంవల్ల హోటలు వాళ్లకి అనుమానం వచ్చి పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి తలుపులు బద్దలు కొట్టారు. లోపల నైట్‌గౌనులో వున్న నీనా నేలమీద రక్తపు మడుగులో బోర్లా పడి వున్నది. ఆమె మృతి కూడా సందేహాస్పదంగా, చిక్కు ప్రశ్నగానే కనిపించింది. గదిలో సామానంతా చిందర వందరగా వుంది. రెండు దుప్పట్లు నేలమీద పడివున్నాయి. టేబులు మీద ఒక సీసా, ఒక ప్లేట్లో సగం తిన్న మటన్ కట్‌లెట్ ఉన్నాయి. అక్కడే సగానికి వున్న సోడ బాటిల్ వున్నది. పక్కనే స్కాచ్ విస్కీ బాటిల్ వుంది.

మంచం మీదా, సోఫా మీదా కూడా రక్తపు మరకలు. నీనా శవం పక్కనే పిస్టల్ పడివుంది. ఆ పిస్టల్‌లో ఉండవలసిన మూడు బులెట్స్‌లో రెండు లేవు. బల్లమీద ఒక చిన్న కాగితం ముక్క వుంది. ఆ కాగితంలో - 'నేను చెప్పడానికి ఏమీ లేదు - నీనా -' అని రాసి వుంది తారీకు మాత్రం రెండవ తేదీ జనవరి నెల వేసివుంది. ఇక్కడ ఒక విషయం వివరించవలసి వుంది. అఫ్సర్ హుసేన్ జనవరి ఒకటవ తారీకు సాయంత్రం చనిపోయాడు. రజియా అతన్ని తీసుకుని హాస్పిటల్‌కు వెళ్ళిపోయింది. వెంటనే నీనా తలుపులు వేసుకుంది.

రెండో తారీకు వేసి ఉందంటే బహుశా నీనా రాత్రి పన్నెండు గంటల తరువాత ఆ ఉత్తరం రాసి వుండాలి. కాని సాయంకాలం నుంచీ వస్తున్న ఫోన్లకి ఆమె ఎందుకు జవాబు ఇవ్వలేదు? 7 గంటల నుంచీ రాత్రి పన్నెండు గంటల వరకూ ఆమె గదిలో ఏం చేస్తోంది? ఈమధ్య సమయంలో ఆమె బయటికి వెళ్లిందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలిగింది నీనా ఒక్కతే.

* * *



పోలీసులు అఫ్సర్ హుసేన్, నీనాల శవాలను 48 గంటల తరవాత పోస్ట్‌మార్టం కోసం పంపించారు. పోస్ట్‌మార్టం రిపోర్టు ప్రకారం హుసేన్‌కు ఒకటి నుంచి మూడు అడుగుల దూరం నుంచి గుండు తగిలింది. నీనాకి మాత్రం చాలా దగ్గర్నుంచి (క్లోజ్‌రేంజ్‌లో) తగిలింది.

అఫ్సర్ హుసేన్ శవాన్ని అలీఘర్ తీసుకొచ్చారు. నీనా అంత్యక్రియలు మాత్రం తల్లి దండ్రుల సమక్షంలో ఢిల్లీలోని ఎలక్ట్రిక్ క్రిమేటేరియంలో జరిగాయి.

## హుసేన్ - రజియా

రజియా అలీఘడ్ యూనివర్శిటీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ జబర్‌ఖాన్ కుమార్తె. ఉన్నత కుటుంబానికి చెందిన రజియా సహజంగానే సంస్కారవతి. అలీఘడ్ యూనివర్శిటీలో రజియా ఇంటర్ చదువుతున్నప్పుడు హుసేన్ బి. యస్. సి. చదువుతూ వుండేవాడు. వారిద్దరి స్నేహాన్ని గురించి యూనివర్శిటీ మొత్తం తెలుసు. కాని వారి వివాహానికి రెండు కుటుంబాల వాళ్ళూ సుముఖంగా లేరు. రజియా సున్నీ కుటుంబానికే చెందితే, హుసేన్ షియా శాఖకు చెందినవాడు. బీద కుటుంబం నుంచి వచ్చి, స్కాలర్‌షిప్ మీద చదువుతున్నవాడు. అతను బి. యస్. సి. పూర్తిచేసి సైన్యంలో మేజర్‌గా చేరాడు.

రజియా 1968లో ఢిల్లీలో ఎం.బి.బి.ఎస్. పూర్తి చేసింది. మరుసంవత్సరం హుసేన్‌తో ఆమె వివాహం అలాఘడ్‌లో జరిగింది. సైన్యంలో పనిచేస్తూనే అఫ్సర్ ఐ. ఎ. ఎస్. పరీక్ష రాసి ప్రథముడిగా ఎన్నికయ్యాడు. 1967లో ఉత్తర ప్రదేశ్‌లో సబ్ - కలెక్టరుగా చేరాడు. 1979లో టూరిజం డైరెక్టరుగా ఛార్జి తీసుకున్నాడు. రజియా లక్నో ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసరుగా పనిచేస్తున్నది. వారికి ఇద్దరు ఆడపిల్లలు. ఒక మగపిల్లవాడు. పెద్ద పిల్ల వయసు పది సంవత్సరాలు.

హుసేన్‌కు సెక్సు బలహీనత ఉన్నది. అందమైన, చదువుకున్న భార్య వున్నా అతను తన మనసును అదుపులో పెట్టుకోలేకపోయాడు. ఆడపిల్ల అందుబాటులో ఉంటే చాలు - వదిలేవాడు కాదు. పెద్దహోదాలో ఉన్నవాడికి అవకాశాలు చాలా వుంటాయి. పైగా తాగుడు, ధూమపానం అలవాట్లు వున్నాయి.

హుసేన్‌కు నౌకాయానం అంటే ఇష్టం. అందులో నుంచి ప్రావీణ్యతను సంపాదించాడు. 1970లో బ్యాంకాక్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని నౌకాయానం పందెంలో తామ్ర పతకాన్ని పొందాడు. 1978లో శ్రీలంకలో జరిగిన దక్షిణ ఏషియన్ గేమ్స్‌లో వెండి పతకాన్ని పొందాడు.

అతను సుల్తాన్‌పూర్‌లో పనిచేస్తున్నప్పుడు ఒక వేశ్య అతని మీద కేసు పెట్టింది. ఆ కేసును మాఫీ చేసినా, అక్కడ అతనికి చాలా చెడ్డపేరు వచ్చింది.

కాశ్మీర్‌లోనూ ఒకసారి ఇలాంటి గొడవలో చిక్కుకున్నాడు. ఇలాంటి విషయాలు విని విని రజియా విసిగిపోయి ఒకరోజు నిద్రమాత్రలు మింగింది. కాని సుల్తాన్‌పూర్ ఆసుపత్రిలో ఆమెకు చికిత్స జరిగింది. మృత్యువు పిడికిలి నుంచి బయటపడింది.

## నీనా గత చరిత్ర

నీనా చామనచాయ రంగులో ఆకర్షణీయంగానే ఉంటుంది. అయితే రజియా సొగసు, అందం ముందు ఆమె తేలికగా ఓడిపోతుంది. ఆమె టూరిజం డిపార్టుమెంట్‌లో రెసెప్షనిస్టుగా పని చేస్తున్నది. ఆమె వయసు 26 సంవత్సరాలు. నీనాకు అనేకమంది ఆఫీసర్స్‌తో పరిచయం కాసాగింది. పెద్ద పెద్ద అధికారుల్ని సైతం ఆమె కనుసైగల మీద ఆడించేదట.

ఆ విషయం తెలిసిన తండ్రి నీనా వివాహం చేశాడు. నెల తిరగక ముందే నీనా విషయం తెలిసిన ఆమె భర్త ఆమెను వదిలేశాడు. నీనాకు కావల్సిందీ కూడా అదే.

1979లో హుసేన్ ఉత్తరప్రదేశ్ టూరిజం డైరెక్టరుగా వచ్చాడు. నీనాను చూశాడు. తనతో టూర్స్‌కు నీనాను తీసుకెళ్లేవాడు.

1979 డిసెంబరు 29వ తేదీన ఆఫీసు పనిమీద బొంబాయి వెళ్ళవలసి వున్నది. ఆగ్రాలో "లైట్ - అండ్ - సౌండ్" ప్రోగ్రాంను ప్రవేశపెట్టే విషయంలో ప్రముఖ సినీ డైరెక్టర్ శ్యాంబెనెగల్‌ను కలుసుకోవడానికే అతడు బొంబాయి ప్రయాణం పెట్టుకున్నాడు. రజియాతో బొంబాయి నుంచి జనవరి ఒకటి సాయంత్రానికి తాను ఢిల్లీ వెళతానని, పిల్లల్ని తీసుకొని రెండవ తేదీన ఆమె వస్తే 5వ తేదీ వరకూ ఢిల్లీలో గడపవచ్చనీ చెప్పి ప్రయాణం అయ్యాడు. కానీ హుసేన్ డిసెంబరు 29న నీనాతో కలిసి బొంబాయికి సరాసరి కాక ఢిల్లీకి బయలుదేరాడు. ముందుగానే హోటల్ అంబాసిడర్‌లో గది బుక్ చేయించిన నీనా రెండు గంటల ముందుగా వచ్చి హోటల్ గది తాళం తీసుకుంది. ఆమె తన పేరు కుమారి డి. షాహ్‌గా సంతకం చేసింది. తర్వాత నీనా అతిథిగా హుసేన్ హోటల్‌కు వచ్చాడు. అతిథులు రాత్రి 11 గంటల తర్వాత హోటల్లో వుండకూడదు. కాని హుసేన్ లాంటి పెద్ద పదవిలో వున్న వ్యక్తిని హోటల్ నుంచి వెళ్లిపొమ్మని చెప్పలేకపోయారు. ఇద్దరూ జనవరి 1వ తేదీ వరకు అదే హోటల్లో వుండిపోయారు. అతనికి బొంబాయి ప్రయాణం గురించిన ఆలోచన కూడా రాలేదు. జనవరి ఒకటి మధ్యాహ్నం హుసేన్ ఢిల్లీ టూరిజం డిపార్టుమెంటుకు వెళ్ళి ఆఫీసు కారు అడిగి తెచ్చుకున్నాడు. రజియా వచ్చేసరికి పోర్టికోలో కనిపించిన కారు అదే.

ఇంతలో, ఉత్తరప్రదేశ్ టూరిజం శాఖ మినిష్టర్‌కు డైరెక్టర్‌తో పని పడింది. అది డిసెంబరు 30వ తేదీ. ఆఫీసువాళ్ళు బొంబాయి, ఢిల్లీ ఫోన్లు చేశారు. రెండు చోట్లనుంచీ అతను రాలేదని సమాధానం వచ్చింది. ఇంటికి ఫోన్‌చేసి రజియా నుంచి హుసేన్ ఆచూకి తెలుసుకోవడానికి ప్రయత్నించారు. ఆమె బొంబాయి టూర్ వెళ్ళాడని చెప్పింది. అప్పుడు ఆఫీసువాళ్ళు హుసేన్ అక్కడకు వెళ్ళలేదని తమకు తెలిసిందన్నారు.

రజియా బుర్రను అనుమానం పురుగులా తొలచసాగింది. నీనా కూడా 29న తేదీన ఊరికి వెళ్ళిందని తెలిసింది. ఆమె నీనా ఇంటికి వెళ్లింది. రజియా, నీనా తండ్రితో మాట్లాడుతుండగా అతనికి ఢిల్లీ నుంచి ట్రంకాల్ వచ్చింది.



"అరే నీనా నువ్వా? ఢిల్లీ అంబాసిడర్ హోటల్ నుంచి ఎవరో మాట్లాడతారంటే భయపడిపోయానుసుమా!" అంటూ ఏదేదో మాట్లాడి వచ్చాడాయన.

అది రజియా విన్నది. "ఎవరి నుంచి ఫోన్?" అని అడిగింది.

"నీనా చేసింది. ఢిల్లీలో అంబాసిడర్ హోటల్ రూం 323లో వున్నదట." అన్నాడు నీనా తండ్రి.

కొంతసేపు అతనితో పిచ్చాపాటీ మాట్లాడి ఇంటికి వచ్చింది. ఆ తెల్లవారే ఒంటరిగా బయలుదేరి విమానంలో ఢిల్లీ చేరుకుంది.

భర్త చనిపోయాక రజియా మతిభ్రమించినట్టు ప్రవర్తించసాగింది. డాక్టర్ అక్తర్ ఆమెను ఆసుపత్రిలో చేర్పించింది.

పోలీసువారు ఆమెను ఎన్నో ప్రశ్నించాలని వచ్చారు. కాని ఆమె సమాధానాలు చెప్పే మానసిక స్థితిలో లేదు.

ఆమె కొంచెం కుదుట పడ్డాక పోలీసుల ప్రశ్నలను ఎదుర్కోవలసి వచ్చింది. ఆమె ఏడ్వడం తప్ప ఒక్కదానికి సరైన సమాధానం ఇవ్వలేదు.

చివరకు భర్తను హత్య చేసింది ఆమేనని పోలీసులు ఒక నిర్ణయానికి వచ్చారు. ఆమె ప్రస్తుతం జైలులో వున్నది. కోర్టులో కేసు నడుస్తున్నది.

❀ ❀ ❀

# 9. అసలు రహస్యం

ఢిల్లీలోని అపరాధ పరిశోధనశాఖకు చెందిన ఒక అధికారి, ఢిల్లీ రింగు రోడ్డుల్లో వున్న ఒక విశాల భవనంలోకి ప్రవేశించాడు. ఆలోచిస్తూ లోపలకు నడుస్తున్నాడు.

ఆ భవనం యజమాని ఎంత ధనికుడో వేరుగా చెప్పక్కర్లేదు. ఆ భవనం యజమాని తనను అర్జెంటుగా రమ్మని ఎందుకు ఫోన్ చేశాడో అర్థం కాలేదు. ఆ అధికారి శ్రీమల్లిక్‌ను ఎప్పుడూ చూడలేదు.

వరండాలోనే ఒక యువతి ఎదురైంది. ఆమె చాలా అందంగా ఉంది. తెల్లగా పొడవుగా నాజూకుగా ఉంది. బాబ్డ్‌హెయిర్ మెడమీది నుంచి రెండు భుజాలనూ కప్పుతోంది.

ఆమె "నాలుకలు చాచి పైపైకి లేస్తున్న అగ్నిశిఖ"లా ఉంది అనుకున్నాడు ఆ అధికారి

"ఎవరు కావాలి?" కోకిల కూసినట్టుగా ఉంది ఆమె స్వరం.

"శ్రీమల్లిక్‌గారిని చూడాలి."

"ఆయన మిమ్మల్ని రమ్మన్నారా?"

ఆ అధికారి ఓ క్షణం ఆమె ముఖంలోకి చూశాడు. అతని చూపుల్ని ఎదుర్కోలేనట్టుగా ఆమె నేలచూపులు చూసింది.

"లేదు. నేనే వచ్చాను. ఒక బిజినెస్ సంబంధంగా కొన్ని విషయాలు వారితో చర్చించడానికి" అన్నాడు.

"కూర్చోండి వారికి చెప్పివస్తాను. మీపేరు?" ఆమె అడిగింది.

"కృష్ణకుమార్ ఖోసలా!" అని ఆ పక్కనేవున్న కుర్చీలో కూర్చున్నాడు ఆ అధికారి.

ఆ అధికారి ఆమెకు అసలు పేరు చెప్పలేదు. ముందుగానే ఆలోచించుకొని ఆ పేరు చెప్పాడు.

కొద్ది నిముషాల తర్వాత ఆ యువతి బయటికి వచ్చింది. "రండి"! అన్నది. అతను ఆమె వెనుకనే లోనికి ప్రవేశించాడు. కుడివైపుగా వున్న ఓగదిని చూపిస్తూ "వెళ్ళండి" అన్నది.

అతను లోపలకు వెళ్ళాడు.

ఆమె బయటనే వున్నది.

లోపల సోఫామీద ఒక వ్యక్తి కూర్చుని వున్నాడు. అతను గోధుమ రంగులో వున్నాడు. మెడ కన్పించడంలేదు. రెండు భుజాల మధ్య పెద్ద గుమ్మడికాయను



అమర్చినట్లుంది అతని తల. తలమీద జుట్టులేదు. నున్నగా మెరుస్తోంది. ఆయన ముఖం లాగే ఆయన వేసుకున్న దుస్తులు కూడా వదులు వదులుగా వున్నాయ్.

"నమస్తే" ఆ అధికారి చేతులు జోడించాడు.

ఆయన చేతిలో తన ఐడెంటిటీ కార్డును వుంచి దూరంగా వున్న మరో సోఫామీద కూర్చున్నాడు.

మల్లిక్ అతన్ని దగ్గరగా వచ్చి కూర్చోమని సైగతోనే చెప్పాడు. అతను మల్లిక్ సోఫా దగ్గరగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

ఆ వాతావరణంలో ఏదో రహస్యం దాగి వున్నట్టనిపించింది అతనికి. మౌనంగా చుట్టూ చూస్తూ కూర్చున్నాడు.

"నేను త్వరలోనే చనిపోతాననిపిస్తోంది" అంత లావు కంఠంలో నుంచి చిన్నగా మాటలు విన్పించాయి.

అతను ఆ మాటలు అన్న తీరుకు ఆ అధికారి చలించిపోయాడు. మల్లిక్ మీద జాలివేసింది. అయినా తన భావాలను ముఖంలో కన్పించకుండా జాగ్రత్తపడుతూ, "అందరం ఏదో ఒకరోజు పోయేవాళ్లమే!" అన్నాడు అతను.

ఆయన అదోలా నవ్వాడు. ఆ నవ్వులో విషాదం వున్నది. "అదికాదు నన్ను చంపడానికి కుట్ర జరుగుతున్నది" వణికే కంఠంతో అన్నాడు మల్లిక్.

"ఏ విధంగా"

"స్లో పాయిజన్!"

అధికారి నిటారుగా కూర్చున్నాడు. వెంటనే అతని బుర్రలో తను చూసిన ఆ యువతి మెదిలింది.

"ఆమె మీ కూతురా?"

"కూతురు లాంటిదే!"

"అంటే?"

"నా మిత్రుడి కూతురు. నాకు పిల్లలు లేరు. నా భార్య చనిపోయింది. ఈ వయసులో మళ్ళీ పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టంలేదు. కొంతకాలం క్రితం నామిత్రుడు చనిపోయాడు. చదువుకొనే రోజుల్లో అతను నాకెంతో సహాయం చేశాడు. ఆయనకు ఆమె ఒక్కతే కూతురు. భార్య లేదు. ఆస్తిలేదు. తన కూతురి బాధ్యత నేను తీసుకోవాలని అతని చివరి కోరిక. అలాగే తండ్రి పోగానే నేను ఆమెను నా ఇంటికి తీసుకొచ్చాను."

"ఆమె తండ్రికి బొత్తిగా ఆస్తి లేదా?"

"ఒకప్పుడు వుండేది. అతనికి లేని దుర అలవాటు లేదు. రేసుల పిచ్చి కూడా వుండేది. చచ్చేనాటికి అప్పులు మిగిలాయి."

"ఆ విషయం వదిలెయ్యండి. అసలు విషయం..." మళ్ళీ అందుకుని మధ్యలోనే ఆగిపోయాడు శ్రీమల్లిక్.

"అవును మీ జీవన్మరణ సమస్య!"

"కరెక్టే!"

"మీకు ఎవరిమీదనైనా అనుమానం వుందా?"

"ఉంది!"

"ఎవరిమీద? ముందు ఇది చెప్పండి. మీ ఇద్దరు కాక ఈ ఇంట్లో ఇంకెవరైనా వుంటున్నారా?" అధికారి అడిగాడు.

"ఇద్దరు నౌకర్లు వుంటున్నారు"

"ఆ అమ్మాయి పేరు?"

"తృప్తి"

"మీ అనుమానం తృప్తి మీద..." ఆగి ఆ అధికారి మల్లిక్ ముఖంలోకి చూశాడు.

"ముందుగా నేను ఒకటి చెప్పాలి."

"చెప్పండి"

"నాకు ఒక అన్న కొడుకు వున్నాడు. వాడిపేరు సత్యేంద్ర మల్లిక్. అందంగా వుంటాడు. బాగా చదువుకున్నాడు. అతనే నా ఆస్తికి వారసుడు. అప్పుడప్పుడు వచ్చి నాలుగు రోజులువుండి వెళతాడు. నేనంటే ప్రాణం పెడుతున్నట్టు మాట్లాడతాడు. కాని వాడు వచ్చి ఇక్కడ వున్న రోజుల్లోనే నా ఆరోగ్యంలో మార్పు వస్తోంది. వాడువెళ్లగానే మళ్ళీ మాములుగానే వుంటాను."

ఆ మాటలు చెబుతున్నప్పుడు మల్లిక్ కళ్ళు సజలం కావడం అధికారి గమనించాడు. జాలి వేసింది.

"కాని ఒకటి ఆలోచించాలి. అతను ఇక్కడ వున్నప్పుడు మీకు స్లో పాయిజన్ ఎలా ఇవ్వగలడు? అతను మీ భోజనం తయారుచేస్తాడా? మీకు టీ తెచ్చి ఇస్తాడా? ఏమైనా ఫలహారాలు బజారు నుంచి తెచ్చి తినిపిస్తాడా?"

"అలాంటివి ఏమీ చెయ్యడు. కాని నా భోజనంలో ఏదైనా కలవవచ్చుగా?"

"అలా చెయ్యాలంటే అతను మొత్తం ఆహారంలోనే ఏదైనా కలపాలి. మీతో పాటు ఈ ఇంట్లో వున్న మిగతా వారి ఆరోగ్యం కూడా పాడవాలిగా?"

"నాకు గ్యాస్ ట్రబుల్ వున్నది. నా భోజనం వేరుగా స్వయంగా తృప్తి తయారు చేస్తుంది. ఆ భోజనం నాగదిలోనే చేస్తాను."

"అలా చేసినందువల్ల సత్యేంద్రకు లాభం?" ఆస్తిలో సగం వాడి పేరుమీదనే రాశాను. మూడో వంతు తృప్తికి రాశాను. మిగిలింది మరో ఇద్దరు బంధువులకి రాశాను. విల్లురాశాను. నేను చస్తే వాడికి చాలా ఆస్తి వస్తుంది."

అధికారి ఆలోచనలో పడ్డాడు.

"నేను విల్లు మార్చాలనుకుంటున్నాను. ఈసారి సత్యేంద్ర పేరు లేకుండా చెయ్యాలని నా అభిప్రాయం"

"అతను చాలా అందంగా వుంటాడా?"

"ఆ"



"తృప్తి కూడా చాలా అందంగా వుంటుంది. ఇద్దరూ కలసి..."

"కాదు - అతనికి తృప్తి అంటే ఇష్టంలేదు. అసలు నేను వాళ్ళిద్దరికీ పెళ్ళి చేద్దామనుకున్నాను. సత్యేంద్రకు తృప్తి అంటే చిరాకు. గర్విష్ఠి అంటాడు. ఆమెకు ఒక ఇంటి ఇల్లాలు అయ్యే అర్హత లేదంటాడు" అన్నాడు మల్లిక్.

వెనక కిటికీ దగ్గర ఏదో అలికిడి అయింది. ఆ అధికారి వెనక్కి తిరిగి చూశాడు. తృప్తి నిల్చుని వున్నది.

చిన్నగా పక్కకు తప్పుకుంది. అయినా అక్కడే తచ్చాడుతున్నట్టు ఆ అధికారికి అనిపించింది.

"కిటికీ దగ్గర తృప్తి వున్నదా!" మల్లిక్ అడిగాడు.

"అవును!"

"ఈ పిల్లకు ఇదొక చెడ్డ గుణం! నాతో ఎవరైనా మాట్లాడటానికి వస్తే చాలు కిటికీ దగ్గర నిల్చుని చెవులు అప్పగిస్తుంది. మీరు ఆమెకి మీరెవరో చెప్పారా!"

"లేదు మేము అలా చెప్పం! ఆమెకు నేను సి. ఐ. డి. ఆఫీసర్నని తెలియదు. అది సరే! సత్యేంద్ర ఎక్కడ వున్నాడు?"

"వాడు రేపు ఇక్కడికి వస్తున్నాడు. నా బెంగ అదే!"

"నేను ఇక్కడే వుండవచ్చునా? అతన్ని దగ్గరగా కనిపెట్టే అవకాశం కావాలి"

"తప్పకుండా!"

అంతలో తృప్తి లోపలకు వచ్చింది.

"అంకుల్ రాత్రికి ఏం వండమంటారు" అని అడిగింది.

"చూడు తృప్తి ఇతను కొద్ది రోజులు మన ఇంట్లోనే వుంటాడు. వ్యాపార సంబంధంగా వచ్చాడు. ఆ గెస్ట్ రూమ్ ఇవ్వండి" అని మల్లిక్ ఆఫీసరుతో "మీరు హోటల్లో దిగడం బాగాలేదు. ఇక్కడే వుండండి ఈ నాలుగు రోజులు" అన్నాడు.

"అలాగే అంకుల్?" అంటూ తృప్తి వెళ్ళిపోయింది.

ఆ ఆఫీసరు కూడా బయటికి వెళ్ళి రెండు గంటలలో ఒక సూట్‌కేస్‌తో తిరిగి వచ్చాడు.

రెండో రోజు సత్యేంద్ర వచ్చాడు.

ఆ సమయంలో ఆఫీసర్ మల్లిక్ గదిలోనే వున్నాడు. సత్యేంద్ర లోపలకు వచ్చి బాబాయి పాదాలకు వినయంగా నమస్కరించాడు. మల్లిక్ వాళ్లిదర్నీ ఒకరి నొకర్ని పరిచయం చేశాడు. సత్యేంద్ర ఉత్సాహంగా ఆఫీసరుతో చెయ్యి కలిపాడు.

ఆ సాయంత్రం లాన్‌లో ఇద్దరూ కూర్చున్నారు.

సత్యేంద్ర "మీరుండటంవల్ల నాకు చాలా సంతోషంగా వుంది" అన్నాడు.

"ఎందుకూ? నన్ను మీరు ఇంతకు ముందు ఎరుగరు"

"ఇక్కడ ఎవరూ నాతో మాట్లాడటానికి వుండరు. మహా బోర్‌గా వుంటుంది. అంకుల్‌ను చూడకుండా ఉండలేను. అందుకే అప్పుడప్పుడు వస్తుంటాను"

ఇద్దరూ చాలాసేపు లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు.

రెండో రోజు ఉదయం మల్లిక్ సి. ఐ. డి. అధికారితో "రాత్రి తను అనారోగ్యానికి గురి అయ్యానని, కడుపులో ఏదోబాధ కలిగిందని" చెప్పాడు.

సత్యేంద్రతో అధికారి, రెండో రోజు సాయంకాలం కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుతున్నాడు. మాటల్లో అధికారి సత్యేంద్ర కళ్ళలోకి లోతుగా చూస్తూ "రాత్రి మీ అంకుల్‌కి సుస్తీ చేసిందట!" (అధికారిని సక్సేనా అనుకుందాం. ఎందుకంటె అతని పేరు ఈ కేసులో చెప్పడం జరగలేదు) సక్సేనా మాటకు సత్యేంద్ర నవ్వుతూ "ఇదేం కొత్తకాదు! నేను వస్తే చాలు మా అంకుల్ ఆరోగ్యం పాడవుతుంది!" అన్నాడు.

సక్సేనా ఆశ్చర్యంగా సత్యేంద్ర ముఖంలోకి చూస్తూ "మీరేం అంటున్నారో మీకు తెలుసా?" అన్నాడు.

"అం నేను నిజమే చెవుతున్నాను. నేనిక్కడికి వస్తే చాలు అంకుల్ ఆరోగ్యం పాడయిపోతుంది. ఒక్కోసారి రావడం మానేద్దామని అనుకుంటాను. అంకుల్‌కి నేను తప్ప నా అనేవాళ్లు లేరు! అందుకే రాకుండా వుండలేకపోతున్నాను."

"మీరు వచ్చినప్పుడే ఆయన ఆరోగ్యం చెడిపోవడానికి కారణం ఏమిటి అనుకుంటున్నారు." అంటూ సక్సేనా అనుమానంగా అతని ముఖంలోకి చూశాడు.

"అంకుల్‌కి నామీద అనుమానం? అందుకే ఆయన సైకలాజికల్‌గా అలా భావిస్తున్నారు."

"ఏమని?"

"అదే! ఆయన భోజనంలో నేనేదో విషం కలుపుతున్నానని" ఎలాంటి జంకూ గొంకూ లేకుండా చెప్పాడు సత్యేంద్ర.

"అందువల్ల మీకేం లాభం?" అడిగాడు సక్సేనా.

"ఎందుకు లేదు? చాలా లాభం ఉంది! ఆయన చనిపోతే ఆయన ఆస్తిలో సగం నాకే వచ్చేస్తుంది. ఆస్తి కోసమే నేనాయనికి స్లో పాయిజన్ ఇస్తున్నానని ఆయన అనుమానం. కాని నేనడిగిన డబ్బు అంకుల్ ఎప్పుడూ ఇస్తూనే వుంటారు. నాకలాంటి అవసరం ఎప్పుడూ లేదు. ఆయన కొంతకాలం పెద్ద దిక్కుగా ఉండాలనే నా కోరిక."

సక్సేనా ఆలోచనలో పడ్డాడు. మల్లిక్ దగ్గరకి వెళ్ళి ఆరోజు రాత్రి భోజనం రహస్యంగా అతనితో కలిసి చేస్తానని చెప్పాడు. ఆ రహస్యం ఇంట్లో ఎవరికీ తెలియకూడదని కూడా చెప్పాడు. ఆ మల్లిక్ అంగీకరించాడు. తృప్తిని పిలిచి, బాగా ఆకలిగా వుందనీ ఎక్కవ పదార్థాలు చేసి పంపించమని చెప్పేడు. ఆరాత్రి సక్సేనా మల్లిక్ కోసం వంపించబడిన భోజనం తాను కూడా తిన్నాడు. పొద్దుపోయిన తరువాత తన గదికి వెళ్ళిపోయాడు సక్సేనా.

సక్సేనా పడుకున్నాడే కాని తన ఆరోగ్యం పాడయిపోతుందేమో అనవసరమైన రిస్క్ తీసుకున్నానేమోననీ బాధపడసాగాడు. ఆలోచిస్తూ నిద్రలోకి జారిపోయాడు.



రెండో రోజు ఉదయం సక్సేనా కొంచెం ఆలస్యంగా కళ్ళు తెరిచాడు. అతనికి తన ఆరోగ్యంలో ఎలాంటి మార్పు కనిపించలేదు. 'టీ' తాగి స్నానం చేసి మల్లిక్ గదిలోకి వెళ్ళాడు.

మల్లిక్ ముఖం వాడిపోయి వున్నది. సక్సేనాని చూడగానే, "మళ్ళీ రాత్రి నా ఆరోగ్యం చెడిపోయింది. కడుపులో ఏదో మెలిపెట్టినట్టు అయింది. మీకెలా వుంది?" అనడిగాడు మల్లిక్.

"ఆశ్చర్యంగా వుందే? నాకేమీ కాలేదు మరి! మనిద్దరం ఒకే పదార్థం తిన్నాంకదా? నేను వెళ్లిపోయేక మీరేమన్నా టీ గాని పాలుగానీ తాగారా?"

"అబ్బే అదేం లేదండి! నేనేం తీసుకోలేదు"

రెండో రోజు రాత్రి కూడా సక్సేనా మల్లిక్‌తో కలసే భోజనం చేశాడు.

ఆ రాత్రి కూడా సక్సేనా ఎలాంటి అనారోగ్యంతో బాధపడలేదు.

తెల్లవారి మల్లిక్ మాత్రం తను రాత్రంతా కడుపు నొప్పితో బాధపడ్డానని చెప్పాడు. సక్సేనాకు మతిపోయినట్లయింది. సత్యేంద్ర దగ్గరకి వెళ్ళి అతన్ని వెంటనే ఊరికి వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చాడు.

సత్యేంద్ర సక్సేనా మాట ప్రకారం వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయిన రాత్రి సక్సేనా మల్లిక్‌తో కలిసి భోజనం చేశాడు. రెండో రోజు ఉదయం రాత్రి ఎలాంటి బాధ కలగలేదని, హాయిగా నిద్రపోయానని చెప్పాడు మల్లిక్. సక్సేనా నవ్వేశాడు.

మల్లిక్ ఉత్సాహంగా మార్నింగ్ వాక్‌కి బయల్దేరాడు. సక్సేనాని కూడా తనతో రమ్మన్నాడు.

"మీరెళ్ళిరండి. నేను పేపరు చదువుకుంటూ వుంటాను!" అన్నాడు సక్సేనా.

సక్సేనా మల్లిక్ బెడ్‌రూం ఎదురుగా వున్న హాల్లో పేపరు చదువుకుంటూ కూర్చున్నాడు. 15 నిముషాలు గడిచాయి. తృప్తి మల్లిక్ బెడ్‌రూంలోకి వెళ్లింది. తరువాత బాత్‌రూంలోకి వెళ్ళింది. పేపరు పక్కన పెట్టి సక్సేనా ఆమె వెనకే వెళ్ళాడు మెల్లగా.

తృప్తి వెనక్కి తిరిగి చూసింది. సక్సేనాని చూడగానే ఆమె ముఖం వెలవెలా పోయింది. ఆమె చేతుల్లో ఒకే బ్రాండ్‌కి సంబంధించిన రెండు టూత్ పేస్టులున్నాయి. అవి రెండూ సక్సేనా లాక్కున్నాడు.

"తృప్తిగారు! ఇక మీ ఆట కట్టింది" అన్నాడు సక్సేనా.

సక్సేనా ట్యూబుల్ని తీసుకుని తృప్తిని బాత్‌రూంలోనే వుంచి తలుపులు మూసేశాడు. మల్లిక్ బెడ్‌రూంలో కూర్చుని అతని కోసం ఎదురు చూడసాగాడు.

మల్లిక్ వాకింగ్ నుంచి తిరిగివచ్చాడు. "అరే మీరింకా ఇక్కడే వున్నారా! నేనిప్పుడే వస్తాను బాత్‌రూంకి వెళ్లి" అన్నాడు మల్లిక్.

"ఆగండి! ఆ బాత్‌రూం తలుపు తెరవకండి" అన్నాడు సక్సేనా

"అసలు విషయం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు మల్లిక్.

"మీరు తాపీగా కూర్చోండి చెప్తాను?" అన్నాడు సక్సేనా.

మల్లిక్ అయోమయంగా చూశాడు.

"మల్లిక్ సాబ్! మీ అనుమానం కరక్టె.

"మీకు స్లోపాయిజన్ ఇవ్వబడుతోంది. అది మీరూహించినట్టు సత్యేంద్ర ద్వారా జరగటంలేదు. తృప్తి ఈ పని చేస్తోంది. ఎందుకో తెలుసా? మీకు సత్యేంద్ర మీద అనుమానం వచ్చి, సత్యేంద్ర పేరును విల్లులోంచి తీసేస్తారు. ఆ ఆస్తిని కూడా మీరు తృప్తికే ఇస్తారు. ఆ ఆలోచనలతోనే ఆమె ఇలా చేస్తుంది."

"కాని నాకు ఆమె విషం ఎలా ఇస్తోంది?"

ఈ రెండు ట్యూబుల్ని చూడండి. రాత్రి భోజనం తరువాత మీకు పండ్లు తోముకునే అలవాటుంది. సత్యేంద్ర వచ్చినప్పుడంతా స్లోపాయిజన్ వున్న ట్యూబును మీ బాత్‌రూంలో పెట్టి మంచి ట్యూబుని తీసేస్తోంది. ఉదయం మళ్లీ ట్యూబ్ మారుస్తుంది.

సత్యేంద్ర వెళ్లిపోయేక పూర్తిగా విషం కలిసిన ట్యూబును తీసేస్తూ వుంటుంది. అందుకే సత్యేంద్ర వున్నప్పుడు మాత్రమే మీ ఆరోగ్యం దెబ్బతింటుంది." అని వివరించాడు సక్సేనా.

కొద్ది నిముషాల పాటు స్థాణువులా నిలబడిపోయాడు మల్లిక్.

"హే భగవాన్! అనవసరంగా నేను నా అన్న కొడుకుని అనుమానించాను. ఈ పిల్ల – ఈ పిల్లను నేను స్వంత బిడ్డలా చూస్తున్నాను. అయినా ఇది నా ప్రాణం తీయటానికి సిద్ధం అయింది" తనకు తానే చెప్పుకుంటున్నట్టు చిన్నగా అన్నాడు మల్లిక్.

"అసలు రహస్యాన్ని ఛేధించాను. నావని అయిపోయింది. ఇక నేను వెళ్ళొస్తాను. సెలవిప్పించండి!" సక్సేనా మల్లిక్ నుంచి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ఏం జరిగిందీ సి. ఐ. డి. డిపార్ట్‌మెంట్ రికార్డులో లేదు.

❀ ❀ ❀



# 10. మరదలినే హత్యచేసిన కామాంధుడు

ప్రేమకు కళ్ళు వుండవు అంటారు. కాని బుర్ర కూడ వుండదని ఈ వాస్తవ కథ నిరూపిస్తుంది.

ఢిల్లీకి ఆరు మైళ్ళలో వున్న ఒక గ్రామంలో కిరాణా దుకాణం నడుపుతున్నాడు ఇస్మాయిల్. రెండు మూడు నెలలకు ఒకసారి ఢిల్లీ వచ్చి జుమ్మా మసీదు దగ్గిర వున్న ఒక పెద్ద దుకాణం నుంచి సరుకులు కొనుక్కు వెళ్తూ వుంటాడు. ఆ దుకాణదారుడి కొడుకు యాకూబ్ ఇస్మాయిల్ వయసువాడు. ఇద్దరూ స్నేహితులు. సరుకుల కొనడానికి వచ్చిన రోజు రాత్రి ఇస్మాయిల్ ఢిల్లీలోనే వుండిపోయేవాడు.

ఆరోజు సాయంత్రం ఇద్దరూ ఇస్మాయిల్ దిగిన లాడ్జి గదిలో తాగుతూ కూర్చున్నారు. ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పుకున్నారు. ఇంతలో యాకూబ్ ఏదో గుర్తువచ్చి చివ్వున లేచి నిల్చున్నాడు.

"ఇంత త్వరగా ఎక్కడికి?" ఇస్మాయిల్ అడిగాడు.

"మర్చిపోయాను. మా నాన్న మా అత్తయ్యకు ఏదో చెప్పమన్నాడు వెళ్ళాలి"

"నేనూ వస్తాను పద! అటునుంచి సినిమాకు వెళదాం!" అన్నాడు ఇస్మాయిల్.

ఇద్దరూ బయలుదేరారు. యాకూబ్ అత్త మేనల్లుడ్ని సంతోషంగా ఆహ్వానించింది. యాకూబ్ ఇస్మాయిల్‌ని పరిచయం చేశాడు.

"షకీ! రెండు చాయ్ తీసుకురా! యాకూబ్ అన్నయ్య వచ్చాడు" అంటూ కేక వేసింది ఖైరున్నీసా (యాకూబ్ అత్తయ్య)

పది నిముషాల్లో షకీలా ఒక ట్రేలో రెండు టీ కప్పులు తెచ్చింది. యాకూబ్‌కు ఇస్మాయిల్‌కూ ఇచ్చింది.

ఇస్మాయిల్ షకీలా ముఖం మీది నుంచి కళ్ళు మరల్చుకోలేకపోతున్నాడు. అత్తా అల్లుడూ కబుర్లలో వున్నారు. షకీలాకు అతను అలా చూస్తూంటే ఏదోగా అన్పించి త్వరగా లోపలకు వెళ్ళిపోయింది.

బయటికి వచ్చాక "ఆపిల్ల ఎవరు?" అడిగాడు ఇస్మాయిల్.

"ఎవరూ? ఓ షకీలా గురించా? మా అత్తయ్య కూతురు." అన్నాడు యాకూబ్.

"చాలా అందంగా వుంది" అన్నాడు ఇస్మాయిల్. యాకూబ్ మౌనంగా నడుస్తున్నాడు.

"నిక్కా అయిందా?"

"ఇంకా కాలేదు. షకీలా కంటే పెద్ద పిల్ల వున్నది. దానిపేరు మదీనా. అది చాలా నల్లగా వుంటుంది. బొత్తిగా బాగుండదు. దాని పెళ్ళి మా అత్తయ్యకు ఒక పెద్ద సమస్యగా తయారైంది. పెద్ద పిల్లకు చేస్తేగాని చిన్నదానికి చెయ్యడానికి వీలుకాదు కదా?"

ఇస్మాయిల్ నిట్టూర్చాడు. యాకూబ్ అదోలా నవ్వాడు.

ఇస్మాయిల్ యింటికి వచ్చాడు. షకీలాను మరవలేకపోతున్నాడు. రాత్రిళ్లు కళ్లు మూసుకొని షకీలాను తల్చుకుంటూ, కలలు కంటూ గడపసాగాడు.

నెల తిరక్కుండా సరుకుల పంకతో ఢిల్లీ వచ్చాడు. కాని యాకూబ్‌తో "మీ అత్తయ్య ఇంటికి వెళదాం!" అని అడగడానికి మొహమాటం వేసింది.

"షకీలా ఎలా వుంది?" అడక్కుండా వుండలేకపోయాడు.

"బాగానే వుంది" యాకూబ్ ముభావంగా సమాధానం ఇచ్చాడు.

"మదీనాకు సంబంధం కుదిరిందా?"

"ఇంకా లేదు" క్లుప్తంగా వుంది సమాధానం.

ఇస్మాయిల్ తిరిగి వచ్చాడు. దుకాణంలో కూర్చోలేకపోతున్నాడు. పిచ్చిపట్టినట్టు తిరుగుతున్నాడు. ఏమైనా మరోసారి షకీలాను చూడాలని నిర్ణయించుకున్నాడు. వారం తిరక్కుండా ఢిల్లీ వచ్చాడు.

"యాకూబ్ నీకు ఒక విషయం చెప్పాలని వచ్చాను" అన్నాడు ఇస్మాయిల్.

"ఏమిటి!"

"నేను మదీనాను పెళ్లిచేసుకుంటాను."

యాకూబ్ ఇస్మాయిల్ ముఖంలోకి విస్మయంగా, నమ్మలేనట్టు చూశాడు.

"ఏమిటి అలా చూస్తావ్? నిజంగానే నేను మదీనాను చేసుకోవడానికి నిర్ణయించుకున్నాను."

యాకూబ్ సంతోషంతో వుక్కిరిబిక్కిరి అయ్యాడు. స్నేహితుడ్ని కౌగిలించుకున్నాడు.

"పద అత్తయ్యకు ఈ శుభవార్త చెబుదాం" అంటూ ఇస్మాయిల్ని తీసుకొని యాకూబ్ ఖైరున్నిసా ఇంటికి వెళ్లాడు.

ఖైరున్నిసా ఆనందానికి అంతులేదు. ఇస్మాయిల్ మదీనాను చూడాలని కూడా అడగలేదు. వివాహం నిశ్చయం అయింది. పదిహేను రోజుల్లోనే వివాహం జరిగిపోయింది. వివాహంలో ఇస్మాయిల్ మరదలు పిల్లతో సరసాలు ఆడాడు. షకీలా అతనికి కళ్లముందు కన్పించడమే ఒక పెద్ద వరంగా భావించాడు.

మదీనాను అత్తగారింటికి పంపించారు. ఇస్మాయిల్ మదీనాను సరిగా చూసేవాడు కాదు. అయినా ఆమె అతను తనను వివాహం చేసుకోవడమే ఒక అదృష్టంగా భావించసాగింది.



మదీనాను ఇంటికి తీసుకెళ్లాక పది రోజులకే ఇస్మాయిల్ సరుకులు కొనే నెపంతో ఢిల్లీ వచ్చాడు. అత్తగారింట్లోనే దిగాడు.

"బావా! అక్కయ్యను తీసుకురాలేదేం?" అని అడిగింది షకీలా.

"నువ్వు ఇక్కడ వుండగా మీ అక్కయ్యను తీసుకురావడం ఎందుకూ?" అన్నాడు.

షకీలా సిగ్గుతో ముడుచుకుపోయింది.

"ఛీ! పో!" అంటూ లోపలకు తుర్రుమన్నది.

ఇస్మాయిల్ తరచు ఢిల్లీ రాసాగాడు. షకీలా తెలివైన పిల్ల. క్రమంగా బావగారి అంతర్యాన్ని గ్రహించింది. ముభావంగా దూరదూరంగా వుండసాగింది.

షకీలా ఒక రోజు రాత్రి నమాజ చేసుకొని లేచేసరికి ఇస్మాయిల్ వెనక నుంచి పట్టుకున్నాడు. షకీలా బలంకొద్దీ అతన్ని వదిలించుకుంది. "ఛీ! సిగ్గులేదూ? ఈ సారి నన్ను ముట్టుకో చెబుతాను!" అని నిప్పులు కక్కుతూ అన్నది. కాని తల్లికి చెప్పలేదు. 1978 ఫిబ్రవరి పదవ తేదీ రాత్రి ఈ సంఘటన జరిగింది.

ఇస్మాయిల్ రాత్రంతా నిద్రపోలేదు. పదకొండవ తేదీ ఉదయం బయటికి వెళ్లిపోయాడు. పిచ్చిపట్టినవాడిలా ఢిల్లీ బజార్లలో తిరిగాడు. ఆ రాత్రి యింటికి రాలేదు. అత్తగారు అల్లుడికి ఎందుకైనా కోపం వచ్చిందేమోనని భయపడసాగింది. షకీలాకు కూడా భయంగానే వున్నది. తన మీద కోపం కొద్దీ అక్కను ఏదైనా చేస్తాడేమోననే భయం పట్టుకుంది.

పన్నెండవ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు ఇస్మాయిల్ పిచ్చివాడిలా యింట్లోకి దూసుకువచ్చాడు. గబగబా షకీలా గదిలోకి వెళ్లాడు. అతని వాలకం అర్థంకాని అత్తగారు అతని వెనకే వెళ్లింది. స్థాణువులా వాకిట్లోనే ఆగిపోయింది.

ఇస్మాయిల్ కుడిచేతిలో కత్తి వున్నది. ఎడం చేత్తో షకీలాను పట్టుకుని "ఇవ్వాళ నా మాట వినకపోతే..."

"అమ్మా చూడు!" గావుకేక పెట్టింది షకీలా.

ఖైరున్నీసా కూడా కేకలు పెట్టసాగింది.

"దాన్ని వదిలి ముందు బయటికి పోతావా లేదా!" పెద్దగా అరిచింది అత్త.

"ఛీ! వదులు! ఛో! పశువా!" విసురుగా తోసింది షకీలా.

మరుక్షణంలో షకీలా ఆర్తనాదంతో ఇల్లు ప్రతిధ్వనించింది. ఖైరున్నీసా కేకలు పెడుతూ బయటికి పరిగెత్తింది. కాని గడప ముందు స్పృహతప్పి పడిపోయింది.

ఇరుగు పొరుగు వచ్చారు.

పోలీసు వ్యాన్ వచ్చింది.

ఖైరున్నీసాకు స్పృహలేదు.

లోపల గదిలో షకీలా రక్తపు మడుగులో నిర్జీవంగా పడి వున్నది.

ఇస్మాయిల్ కూడా రక్తపు మడుగులోనే వున్నాడు. స్పృహతప్పి వున్నాడు. ఖైరున్నీసానూ, ఇస్మాయిల్ని పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు.

ఖైరున్నిసా త్వరలోనే కోలుకున్నది.

ఇస్మాయిల్ రెండు రోజులు ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో వున్నాడు. రక్తం ఎక్కించారు. క్రమంగా కోలుకున్నాడు.

"నేను షకీలా ప్రేమతో పిచ్చివాడినైపోయాను. ప్రేమ గుడ్డిది అంటారు. కాని దానికి బుద్ధి కూడా వుండదు. ఏదో రకంగా ఆమెను పొందాలనుకున్నాను. అందుకే ఆమె అక్కను వివాహం చేసుకున్నాను. ఆరాత్రి నన్ను ఛీదరించుకుంది. షకీలా నాకు దక్కుతుందనే ఆశ పూర్తిగా పోయింది. పూర్తిగా పిచ్చి పట్టినట్టే అయింది. పదకొండవ తేదీ అంతా ఢిల్లీ బజార్లలో తిరిగాను. ఒకచోట కూర్చోలేదు. ఒకచోట నిలవలేదు. చివరకు షకీలా బ్రతికి వుంటే నాకు శాంతి దొరకదనే నిర్ణయానికి వచ్చాను. బలవంతంగా లొంగదీసుకోవాలనుకున్నాను. అది కూడా సాధ్యం కాకపోతే షకీలా బ్రతికి వుండటానికి వీల్లేదనిపించింది. కత్తి కొన్నాను. షకీలా కత్తిచూసి భయపడింది. కాని నాకు లొంగడానికి అంగీకరించలేదు. తల్లీ కూతుళ్ళు అరవసాగారు. పిచ్చి కోపం వచ్చింది. షకీలాను కసితీరా పొడిచాను. తీరా రక్తపు మడుగులో పడి వున్న నా ప్రియురాల్ని చూసి దుఃఖం ఆపుకోలేకపోయాను. ఆత్మహత్య చేసుకొనే ప్రయత్నంలో కడుపులో అదే కత్తితో పొడుచుకున్నాను. స్పృహతప్పి పడిపోయాను. కాని చావలేదు" అంటూ కోర్టులో తన అపరాధాన్ని అంగీకరించాడు ఇస్మాయిల్.

6-12-1978న సెషన్స్ జడ్జి ఇస్మాయిల్‌కు జన్మ ఖైదును విధించారు.

❀ ❀ ❀



# 11. ఇది ప్రతీకారమా?

అది 1981 నవంబరు 23వ తేదీ. కలకత్తాలోని ఒకానొక హౌసింగ్ కాంప్లెక్సు. కరెంటు లోడ్ లేనందున ఆరోజు రాత్రి 9-30 గంటలకు ఆ ప్రాంతం అంతా అంధకారం చుట్టివేసింది. ఎముకలు కొరికే చలి. కరెంటు పోగానే ఆ కాంప్లెక్సు గేటుకు తాళం వేశాడు గూర్ఖా.

సరిగ్గా పన్నెండున్నరకు కరెంటు వచ్చింది. ఒక్కసారిగా వెలిగిన దీపాల కాంతిలో ఆ కాంప్లెక్సు మెరిసిపోతున్నది. అప్పటికి ఫ్లాట్స్‌లో ఉన్నవాళ్ళు చాలా వరకు నిద్రపోయారు.

పన్నెండున్నరకు ఒక కారు వచ్చి గేటు ముందు ఆగింది. గూర్ఖా లేచి తాళం తీశాడు. కారు కాంప్లెక్సుకు ఓ పక్కగా పార్కు చేసి, కారు తాలూకు వ్యక్తి ఫ్లాట్స్‌లోకి వెళ్ళాడు. అతను నాలుగవ అంతస్థులో ఉండే బెనర్జీ అని గూర్ఖాకు తెలుసును.

బెనర్జీ లిఫ్ట్‌లో తన ఫ్లాట్‌కు వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు. ఎన్ని సార్లు నొక్కినా తలుపు తెరుచుకోలేదు. బెనర్జీకి ఆశ్చర్యం, భయం కలిగాయి. తన భార్య ఎప్పుడూ ఒక్కసారి బెల్ కొడితే చాలు వెంటనే తలుపు తెరుస్తుంది. ఇవ్వాళ ఏమైంది? ఆలోచనలో పడ్డాడు బెనర్జీ.

తలుపుకి ఆటోమేటిక్ లాక్ వుంది. దానికి సంబంధించిన డూప్లికేట్ బెనర్జీ దగ్గరే ఉంటుంది. లాక్ తీసి లోపలికి వెళ్ళాడు. భార్య వున్న అలికిడి లేదు. బెడ్‌రూం తలుపులు నెట్టాడు. ఎదురుగా భయంకర దృశ్యం - బెనర్జీ కొద్ది క్షణాలు శిలాప్రతిమలా నిలబడిపోయాడు. మరుక్షణం కెవ్వున అరిచాడు. గిర్రున తిరిగి బయటకు పరుగు తీశాడు. పక్క ఫ్లాటు తలుపు తట్టాడు. ఆ ఫ్లాటు యజమాని గుప్తా తలుపు తెరిచి అర్ధరాత్రి తన తలుపును తట్టిన బెనర్జీని చూసి ఆశ్చర్యపోయాడు.

బెనర్జీ నిలువెల్లా వణికిపోయాడు.

"ఏమైంది?"

"నా... నా..."

"ఏమైందండి"

"నా.. మిసెస్.... సీలింగ్ ఫాన్‌కు" అంటూ బావురు మన్నాడు.

గుప్తాకు అర్థమయ్యింది. "అదేమిటి? తొమ్మిది, తొమ్మిదిన్నరకు వాకిట్లో నిల్చుని నా భార్యతో మాట్లాడిందే?" అన్నాడు ఆశ్చర్యంగా.

ఏడుస్తున్న బెనర్జీ భుజం తడుతూ "నేను నమ్మలేకుండా ఉన్నాను. పదండి" అంటూ ముందుకు నడిచాడు గుప్తా.

సీలింగ్ ఫాన్‌కు చీరతో ఉరి వేసుకున్న రేఖ శవం గది మధ్య వేలాడుతూ కన్పించింది. ఆ పక్కగా గాడ్రేజ్ చైర్ తల క్రిందులుగా పడి వుంది.

గుప్తా ఇరుగు పొరుగు వాళ్ళను కేకలుపెట్టి పిల్చాడు. పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేశాడు. ఇన్‌స్పెక్టర్ అశోక్ ఇద్దరు కానిస్టేబుల్స్‌తో వచ్చాడు. పాండ్సు పౌడర్ డబ్బా కింద ఓ కాగితం కన్పించింది. ఇన్‌స్పెక్టర్ ఆ ఉత్తరం తీసి చదివాడు. ఆ తర్వాత బెనర్జీకి ఇచ్చి చదవమన్నాడు. అందులో ---

"ప్రియమైన నా స్వామీ!

నా ఆత్మహత్యకు మీరు ఎంత కుంగిపోతారో అంత ఆశ్చర్యపోతారని నాకు తెలుసు. కారణం మీ దృష్టికి నేను ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం కన్పించక పోవడమే. మానవ మనసును తెలుసుకున్నాననుకోవడం పొరపాటు. ఎవరు ఎవర్నీ ఎంత దగ్గిరగా వున్నా పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. మీతో చాలా ఆనందంగా జీవితం గడిపాను. కాని భవిష్యత్తు గురించిన ఆలోచన రాగానే నాలో నేను ఎంత వ్యధకు గురి అయ్యానో మీరు అర్థం చేసుకోలేరు. మీతో నా ఇష్టానికి విరుద్ధంగా నా పెళ్లి జరిగింది. నాకు డాక్టర్ కావాలని పెద్ద కోరిక. ఈ వివాహం వలన ఆ కోరికకు తిలోదకాలు ఇవ్వాల్సి వచ్చింది. ఫస్ట్ క్లాసులో ఫస్ట్‌ని పాసయిన నా జీవితం వంటింటికి బంధించబడింది. ఈ జీవితంతో రాజీ పడలేక వెళ్లిపోతున్నాను. నా ఈ ఆత్మహత్యకు ఎవరూ బాధ్యులు కారు. మీరు ఒక ఆదర్శ భర్త కాగలిగారు. కాని నేను ప్రయత్నించి కూడా నిజాయితీతో మీతో ఆనందాన్ని పంచుకోలేకపోయాను. అందుకే వెళ్లిపోతున్నాను.

మీ అభాగ్యురాలైన భార్య
రేఖ"

అని రాసి వుంది.

బెనర్జీ ఉత్తరం చదివాక నోట మాట రాలేదు. నిర్జీవంగా వుండిపోయాడు. ఇన్‌స్పెక్టర్ అశోక్ ఇరుగు పొరుగు వాళ్ళ స్టేట్‌మెంట్స్ తీసుకున్నాడు. అందరూ ఆ భార్యా భర్తలది అనుకూల దాంపత్యమే అని చెప్పారు. రేఖ అలా చనిపోవడాన్ని తాము నమ్మలేకుండా ఉన్నామన్నారు.

ఆ తర్వాత అశోక్ బెనర్జీని వివరాలు అడిగాడు.

"ఇన్‌స్పెక్టర్ గారూ! రెండు నెలల క్రితమే రేఖతో నా వివాహం జరిగింది. ఆమెకు డాక్టర్ చదవాలని వున్నదని నాతో చెప్పింది. నేను అందుకు ప్రోత్సహించాను. కాని ఆమే స్వయంగా తనకు చదవాలని లేదని, ఈ జీవితమే తనకు పూర్తి సంతృప్తి నిస్తోందనీ చెప్పింది. అలాగే కన్పించేది నాకు. ఆమె ఆత్మహత్య చేసుకున్నదంటే నమ్మాలని అన్పించడం లేదు." అని బెనర్జీ వెక్కి వెక్కి ఏడవసాగాడు.

"మీ అలవాట్ల గురించి చెబుతారా?"

"నాకు వేరే అలవాట్లు ఏమీ లేవు. వారానికి మూడు సార్లు క్లబ్బుకు వెళతాను. ఆ మూడు రోజులు మాత్రం ఇంటికి వచ్చేసరికి పన్నెండున్నర అవుతుంది. ఆ విషయం రేఖకు తెలుసు. ఆమె ఎప్పుడూ ఈ విషయంలో



అయిష్టాన్ని కనబర్చలేదు. ఇవ్వాళ అలాగే వచ్చాను. తీరా వచ్చాక..." ఆపైకి మాట రాలేదు.

ఇన్‌స్పెక్టర్‌కు ఎక్కడా క్లూ దొరకలేదు. గేటులో వుండే గూర్ఖాను పిలిచి వాకబు చేశాడు.

"సాబ్! నేను పన్నెండేళ్ళుగా ఇక్కడ ఉంటున్నాను. ఈ ఫ్లాటులో వుండేవాళ్ళంతా నాకు బాగా తెలుసు. ఈరోజు తొమ్మిదిన్నరకు కరెంటు పోయింది. అందుకే గేటుకు తాళం వేశాను. పది గంటలకు ఓ యువకుడు వచ్చాడు. అతను ఏదో అంతస్తుకు పోవాలన్నాడు. నేను తాళం తీశాను. అతను లోపలకు వెళ్ళాడు. మళ్ళీ తాళం వేసి కూర్చున్నాను. దాదాపు పదకొండు అవుతుండగా ఆ యువకుడు బయటికి వెళ్లిపోయాడు. పన్నెండున్నరకు బెనర్జీ సాబ్ వచ్చాడు."

ఇన్‌స్పెక్టర్ ముఖం వికసించింది.

"ఆ యువకుడ్ని నువ్వు గుర్తు పట్టగలవా? ఎలా వుంటాడు?"

"చాలా అందంగా వున్నాడు. పొడుగ్గా వున్నాడు. మీరు అతన్ని చూపిస్తే గుర్తు పట్టగలను."

"అంతకు ముందు ఎప్పుడూ చూడలేదా?"

"లేదు"

దీనివల్ల ఇన్‌స్పెక్టర్‌కు దొరికినట్లే దొరికి అంతలోకే 'క్లూ' జారిపోయింది.

ఉత్తరాన్ని ఆమె దస్తూరి అవునో కాదో తెలుసుకోవడానికి నిపుణుడి దగ్గరకు పంపించారు.

శవ పరీక్షలో, అది ఆత్మహత్య కాదనీ, గొంతు పిసికి చంపి, ఆ తర్వాత ఫ్యాన్‌కు వేలాడదీయబడిందని తేలింది. హంతకుడు గూర్ఖా వర్ణించిన వ్యక్తేనని కూడా నిర్ధారించడం జరిగింది. హత్య కూడా పదీ - పదకొండు మధ్య జరిగినట్టు రిపోర్టులో రాయబడింది.

కాని ఆ యువకుడు ఎవరో మాత్రం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆచూకీ తెలియలేదు. రేఖ పుట్టింటి వాళ్ళు కూడా రేఖది ఆత్మహత్య చేసుకోనే మనస్తత్వం కాదనీ, తన భర్త అంటే చాలా ఇష్టం అని చెప్పారు.

దస్తూరి పరీక్షలో రేఖ అంతకు ముందు రాసిన ఉత్తరాలు, చనిపోతూ రాసిన ఉత్తరం ఒక్కరు రాసినవి కావని తెలిసింది. అంటే ఆ ఉత్తరం హంతకుడే రాసి పెట్టాడని తేలిపోయింది. అయినా హంతకుడి జాడ తెలియలేదు.

డిసెంబరు 3వ తేదీన ఒక యువకుడు ఇన్‌స్పెక్టర్ అశోక్ దగ్గరకు వచ్చాడు. అతని తల రేగి వుంది. బట్టలు మురిగ్గా చిరిగిపోయివున్నాయి. ముఖం పీక్కుపోయింది. అయినా ఎంతో అందంగా వున్నాడు. అతడి వయసు 25 సంవత్సరాలు.

ఇన్‌స్పెక్టర్ కూర్చోమని చెప్పకముందే కుర్చీ లాక్కుని కూర్చున్న ఆ యువకుడ్ని తీక్షణంగా చూశాడు. "ఎవరు నువ్వు? ఏం కావాలి?"

"నేను రేఖ ఆత్మహత్య గురించి..."

"ఏమిటీ?" ఇన్‌స్పెక్టర్ అశోక్ ఒక్కసారిగా కుర్చీలో ఇంతెత్తున ఎగిరిపడ్డాడు.

"నేనే ఆమెను హత్య చేశాను."

అశోక్ కళ్ళు పెద్దవిగా చేసుకొని ఆశ్చర్యంగా చూశాడు.

ఆ యువకుడు తన ధోరణిలో చెప్పుకుపోసాగాడు... "నా పేరు సురేష్. రేఖా నేను ఒకే కాలేజీలో చదువుకున్నాం. ఒకర్నొకరం ప్రేమించుకున్నాం. రేఖకు డాక్టర్ కావాలని వున్నది. నన్నూ డాక్టర్ చదవమన్నది. నేను బ్రైట్ స్టూడెంట్స్ లిస్టులోనే వున్నాను. నాకు సీటు రావడం పెద్ద కష్టం కాదు. రేఖకు విలాస జీవితం అంటే ఇష్టం. ఆమెకు కార్లు కావాలి. ఉండటానికి పెద్ద బంగళా కావాలి. ఇంటి చుట్టూ పూలతోటకూడా కావాలి. ఇలా ఎన్నో కబుర్లు చెబుతూ, అలా దాంపత్య జీవితాన్ని తల్చుకుంటూ కలల్లో తేలిపోయేది. నేనంటే చాలా మంది ఆడపిల్లలకు ఇష్టం. అదే రేఖ భయం. పెద్దవాళ్ళు ఎటూ మాపెళ్లి చెయ్యరు. రేఖ బ్రాహ్మణ పిల్ల - నేను వెనుకబడిన తరగతికి చెందినవాడ్ని. రేఖ తొందరవల్ల ఒకరోజు గుడిలో పూజారి ముందు ఇద్దరం దండలు మార్చుకున్నాం. ఇది జరిగి సంవత్సరం అయింది. ఆతర్వాత మేము శారీరకంగా కూడా దగ్గర అయ్యాము. ఆమె గర్భ నిరోధక మాత్రలు వాడేది" అగి మంచినీళ్లు అడిగాడు.

గ్లానుడు మంచినీళ్ళు గడగడ తాగి మళ్ళీ ఆరంభించాడు.

"బి. యస్. సి. పరీక్షలు రాసి నేను మా ఊరు వెళ్ళాను. ఇరవైరోజుల్లో తిరిగి వచ్చాను. మా తల్లిదండ్రులకు మాగురించి చెప్పాను. వాళ్ళు కోడల్ని ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నారు. నేను ఆ సంతోష వార్త రేఖకు చెప్పడానికి వచ్చాను. అప్పటికి వారం రోజుల క్రిందట రేఖ పెళ్ళి అయిపోయిందనీ, అదీ ఆమె ఇష్టంతోనే జరిగిందనీ విన్నాను. బెనర్జీకి పెద్ద బిజినెస్ వుంది. కారు వుంది. ఆమెకోరిన విలాస జీవితాన్ని అందివ్వగల స్తోమతు అతనికి వుంది" కొంచెం ఆగి నిట్టూర్చాడు.

కళ్ళు ఎర్రగా ఉన్నాయి. అశోక్ శ్రద్ధగా వింటున్నాడు.

"నాభార్య మరొకరితో కాపురం చెయ్యడాన్ని భరించలేకపోయాను. లోకానికి తెలియకపోవచ్చును. కాని ఆమెకు ఆ విషయం తెలుసు. రాత్రింబవళ్ళు ప్రతీకార జ్వాలలు నన్ను దహించసాగాయి. నాకు మనశ్శాంతి కావాలి. ఆమెను చంపితేగాని నాకు మనశ్శాంతి లభించదు. ఆ టైంలో బెనర్జీ ఉండడని నాకుతెలుసు. కరెంటు కూడా లేదు. ఫ్లాటు దగ్గరకు వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను. వెంటనే తలుపు తెరుచుకుంది. నేను ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా లోపలకు వెళ్లి లోపలనుంచి తలుపు వేశాను.

"నువ్వా?" అంటూ నివ్వెరబోయింది రేఖ.

"అవును! నేనే!"

"ఎందు కొచ్చావ్!"



"ఇందుకు! అంటూ ఆమె గొంతు పట్టుకొని నులిపేశాడు. అప్పుడు ఇంట్లో ఎమర్జన్సీ లైటు మాత్రం వెలుగుతున్నది. ఆమె జీవరహితంగా నా చేతుల్లో నుంచి నేలమీదకు జారిపడింది. అయినా నా కసి తీరలేదు. జీవరహితమైన ఆ శరీరాన్ని అనేక విధాలుగా హింసించాను. చీరతో సీలింగ్‌కు వ్రేలాడ దీశాను. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఉత్తరం కూడా రాసి పెట్టాను."

"మరి ఇప్పుడు స్వయంగా ఎందుకు సరండర్ అయ్యావ్?"

"అశోక్ బాబూ! రేఖను చంపితే నా మనసులో రగులుతున్న జ్వాల చల్లారుతుందనికున్నాను. చంపిన తర్వాత అది మరీ ప్రజ్వరిల్లి నా మనసును దహించి వేస్తున్నది. నాకు బ్రతకాలని లేదు. ఆమెను అసహ్యంచుకుంటున్నాను. అయినా ఆమెలేని ఈ లోకంలో నాకు ఉండాలని లేదు. నేను బ్రతకలేను. నన్ను ఉరి తియ్యండి" పిచ్చిగా మాట్లాడసాగాడు.

సురేష్ తండ్రి బెయిల్ కోసం లాయర్ని పెట్టి ప్రయత్నించాడు.

కాని కోర్టులో సురేష్ "నో! నో! నాకు బెయిల్ వద్దు. నాభార్యను నేనే హత్యచేశాను. నన్ను శిక్షించండి" అంటూ అరవ సాగాడు.

అతనికి బెయిల్ యివ్వడం జరగలేదు.

కేసు కలకత్తా కోర్టులో ప్రారంభం అయింది.

❀ ❀ ❀

# 12. మంచికి వంచెన

సంవత్సరం 1979, జూన్ మాసం. తెల్లవారుఝామున ఐదుగంటల సమయం. డెహరాడూన్‌లోని ఎత్తువల్లాల రోడ్లమీద, అక్కడో మనిషి ఇక్కడో మనిషి చలి దుస్తుల్లో తమ తమ పనులమీద వెళ్తూ కన్పిస్తున్నారు. ఒక మిలటరీ జీవు జన సంచారం తక్కువగా వున్న రోడ్డుమీద వేగంగా పోతున్నది. అది యంగ్ బజారులో వున్న కెప్టెన్ ఎస్. ఎన్. సింగ్ ఇంటి ముందు ఆగింది.

డ్రైవర్ బుద్ధరాం హారన్ కొట్టాడు. అప్పటికి ఐదున్నర అయింది. పదిహేను నిముషాలు గడిచాయి. సింగ్ బయటికి రాలేదు. ఇంటి తలుపు తెరవలేదు. బుద్ధరాంతోపాటు జీవులో అతని స్నేహితుడు మోహన్ సింగ్ కూడా ఉన్నాడు. బుద్ధరాం జీవు దిగి, లాన్‌దాటి, ఇంటి ముందుకు వెళ్ళాడు. ఇంటి తలుపులు ఓరగా తెరచి వున్నాయ్. డ్రైవర్ తలుపు తట్టాలా లేదా అన్న ఆలోచనలో పడ్డాడు. ఇంతలో ఇంట్లోంచి "గూఁ ఊఁ గూఁ" అంటూ వింత శబ్దం వినిపించింది. డ్రైవర్ తన స్నేహితుడ్ని పిల్చాడు. ఇద్దరూ లోపల ప్రవేశించారు. శబ్దం వస్తున్న గదిలోకి వెళ్ళారు. అది బెడ్‌రూం. కిటికీ చువ్వలకు సింగ్ భార్య రాగిణి చేతులు కొబ్బరి తాడుతో కట్టబడి ఉన్నాయి. ఆమె నోటికి గుడ్డకట్టి వున్నది. ఆమె నోటినుంచి మాట రానందువల్ల "గూఁ ఊఁ" అంటూ శబ్దం చేస్తున్నది. డ్రైవరూ అతని స్నేహితూడూ ఆమె చేతులకు కట్టివున్న తాళ్ళు ఊడదీశారు. మూతికి కట్టివున్న వస్త్రాన్ని ఆమె స్వయంగా లాగేసుకున్నది. డ్రైవర్ "అమ్మగారు! ఏమైంది? ఎవరిలా చేశారు?" అని అడిగాడు. కాని రాగిణి సమాధానం చెప్పలేదు. బెడ్ మీద తలవట్టుకొని కూర్చున్నది. డ్రైవర్ సింగ్ బెడ్‌రూం దగ్గరకు వెళ్ళాడు. తలుపులు బార్లగా తెరచి ఉన్నాయి. సింగ్ బెడ్‌మీద అస్తవ్యస్తంగా పడివున్నాడు. బెడ్ రక్తంతో తడిచి ఉన్నది. డ్రైవరూ, అతని స్నేహితుడూ చూడగానే "కెవ్వు"న అరిచారు. ఎంతోసేపు కళ్ళు అప్పగించి చూస్తూ వుండిపోయారు. డ్రైవర్ రాగిణి బెడ్‌రూంలోకి వెళ్లి సింగ్ హత్య గురించి చెప్పాడు. రాగిణి విని ఊరుకున్నది. ఆమె మౌనం డ్రైవర్‌కు అమితమైన ఆశ్చర్యాన్ని కలిగించింది.

డ్రైవర్ వెళ్లి ఇరుగు పొరుగు మిలటరీ ఆఫీసర్లకు కెప్టెన్ సింగ్ హత్య గురించి తెలియజేశాడు. నిముషాల్లో అనేకమంది సింగ్ ఇంటికి వచ్చారు. సింగ్‌ను హత్య చెయ్యడానికి కారణాలు ఎవరికీ అంతుపట్టడంలేదు. సింగ్ చాలా మంచివాడు. అతనికి శత్రువులంటూ లేరు. సింగ్ హత్య గురించి పోలీసు సూపరింటెండెంటుకు తెలియపర్చారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యాదవ్ తన సిబ్బందితో హత్య జరిగిన ఇంటికి చేరాడు.



సింగ్ మెడమీద నాలుగైదు కత్తిపోట్లు వున్నాయ్. బెడ్‌మీద నేలమీద రక్తం గడ్డగట్టిన మరకలున్నయ్. ఫోటోలు తీశారు. శవాన్ని వైద్య పరీక్ష నిమిత్తం పంపించారు. ఆ తర్వాత ఎంక్వయిరీ మొదలు పెట్టారు పోలీసులు.

ఆ రాత్రి ఇంట్లో ఉన్నవాళ్లు సింగ్, సింగ్ భార్య రాగిణి మాత్రమే. అందుకే ముందుగా రాగిణిని ప్రశ్నించాడు.

రాగిణి ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో సింగ్ బాగా తాగి, రాత్రి ప్రొద్దుపోయి ఇంటికి చేరుకున్నాడు. ఆయన నిద్రపోయాక రాగిణి తన బెడ్‌రూంలోకి వచ్చింది. మంచి నిద్రలో వుండగా ముగ్గురు వ్యక్తులు ఆమె గదిలో ప్రవేశించారు. ఆమె చేతులు కట్టారు. అరవకుండా నోటికి గుడ్డ బిగించారు. అందులో ఒకడు రివాల్వరు చూపిస్తూ ఆమె దగ్గరే నిల్చున్నాడు. మిగతా ఇద్దరూ సింగ్ బెడ్‌రూంలోకి వెళ్ళారు. ఆయనను చంపి, ఇంట్లోవున్న నగలు తీసుకుని వెళ్ళారు. వెళ్తూ వెళ్తూ రాగిణితో "మా ప్రతీకారం తీర్చుకున్నాం!" అని అన్నారు అని చెప్పింది రాగిణి.

ఇన్‌స్పెక్టర్ సింగ్ గదిని పరిశీలించాడు. లాయర్ నోటీసు ఒకటి కన్పించింది. అది విడాకుల కోసం క్రితం రోజు సింగ్ కోర్టుకు సమర్పించిన వినతి పత్రం. అందులో తన భార్య తనతో సఖ్యతగా ఉండదనీ, చాలా అసభ్యంగా మాటాడుతుందనీ, చాలా క్రూరంగా ప్రవర్తిస్తుందని, అందువల్ల విడాకులు మంజూరు చెయ్యవలసిందిగా కోర్టువారిని కోరుతున్నట్టుగా రాసి ఉన్నది. అది చదివి ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యపోయాడు. అక్కడ వున్న అతని మిత్రులూ, తోటి ఆఫీసర్లకు కూడా ఈవార్త ఆశ్చర్యాన్ని కలిగించింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నట్టుకూడా ఎవరికీ తెలియదు. పైగా మిత్రుల ముందు తన భార్యను ఎంతో గౌరవించేవాడు. ఆమెను ఎంతో పొగిడేవాడు సింగ్.

జూన్ 11న కెప్టెన్ సింగ్ కుటుంబ సభ్యులు డెహరాడూన్ వచ్చారు. రాగిణి కూడా తన తండ్రిని పిలిపించింది. రాగిణి తండ్రి పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి రిటైర్ అయ్యాడు. సింగ్ అన్నకొడుకు సుభాష్ చంద్రబోస్. బాబాయి దగ్గర డెహరాడూన్‌లో వుండి ఇంటర్ చదువుతున్నాడు. నెల క్రితం వేసవి సెలవలకు తన ఇంటికి అంటే దేవరియా అనే గ్రామం వెళ్ళాడు. బాబాయి హత్య గురించి విని అతను కూడా తండ్రితో పాటు డెహరాడూన్ వచ్చాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ యాదవ్ సుభాస్ స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నాడు.

"మా బాబాయితో పిన్ని ఎప్పుడూ పొట్లాడుతూనే వుండేది. నేను ఇక్కడ వుండి చదవడం కూడా ఆమెకు ఇష్టం వుండేది కాదు. ఒకరోజు మా బాబాయి మీద ఖాళీ బీరుసీసా విసిరికొట్టింది. అదృష్టవశాత్తు అది ఆయనకు తగలలేదు. ఇద్దరూ వేరు వేరు గదుల్లో పడుకునేవారు. మా బాబాయి బయటివాళ్ల దగ్గర చాలా జాగ్రత్తగా వుండేవాడు. అంతేకాదు, ఇంటికి వచ్చిన వాళ్ళముందు మా పిన్నిని ఒకటే పొగిడేవాడు." అంటూ సుభాష్ ఇంకా ఎన్నో విషయాలు చెప్పాడు.

కెప్టెన్‌కు తన భార్యలో మార్పు వస్తుందనే ఆశ వుండేది. వాళ్లిద్దరిదీ ప్రేమ వివాహం అని తెలిసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. ఎస్. ఎన్. సింగ్ పూర్తి

పేరు స్వామినాధ సింగ్. అతను అలహాబాద్ యూనివర్సిటిలో చదువుతున్నప్పుడు రాగిణితో పరిచయం అయింది. రాగిణి కలిగిన కుటుంబానికి చెందిన యువతి. సింగ్ బీద కుటుంబంలోనుంచి వచ్చినవాడు. రాగిణి వివాహానికి తొందర పెట్టినా సింగ్ తొందర పడలేదు. అతనికి మిలటరీ ఉద్యోగం వచ్చాకనే వివాహానికి అంగీకరించాడు. వివాహం జరిగింది. అత్తగారి ఇంటికి వచ్చిన రాగిణికి ఆ ఇంటి పరిస్థితి నిరుత్సాహాన్ని కలిగించింది. ఆ కుటుంబ సభ్యులంటే చిన్నచూపు ఏర్పడింది. అయినా భార్యాభర్తలు బాగానే ఉండేవారు. ఉద్యోగరీత్యా ఫామిలీని తీసుకువెళ్లడానికి వీలులేని చోట పనిచేసే సమయాల్లో, సింగ్ భార్యను తన తల్లిదండ్రుల దగ్గర ఉండవలసిందిగా కోరేవాడు. కాని ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయేది. డెహరాడూన్ వచ్చాక, రాగిణి భర్త దగ్గరకు వచ్చింది. తమ ఏకైక పుత్రికను ఆమె తన తల్లి దగ్గర వదిలెయ్యడం సింగ్‌కు బాధ కలిగించింది. ఆ పిల్లకు మూడు సంవత్సరాలు. సింగుకు పిల్లలంటే ఇష్టం. అతన్ని బాధ పెట్టాలనే ఉద్దేశ్యంతోనే కూతుర్ని తల్లి దగ్గర వుంచింది రాగిణి. ఆమెకు మళ్ళీ గర్భం వచ్చింది. సింగు ఆనందానికి అంతులేదు. సింగ్ క్యాంప్ వెళ్ళినప్పుడు రాగిణి ఒక ప్రైవేట్ డాక్టర్ దగ్గరకు వెళ్లి గర్భస్రావం చేయించుకున్నది. ఈ విషయాలన్నీ విడాకులకు పెట్టుకున్న అర్జీలో రాయడం జరిగింది. అతను లక్షరూపాయల ఇన్‌ష్యూరెన్సుకు భార్యను వారసురాలిగా నామినేట్ చేశాడు. అది తెలుసుకున్న రాగిణి ప్రవర్తన మారలేదు. పైగా భర్తను మరీ చిన్న చూపు చూడసాగింది.

రాగిణికి విలాసాలంటే ఇష్టం. ఆమెకు డబ్బు కావాలి. పెద్ద హోదా కావాలి. భర్త అంటే చిన్న చూపు ఏర్పడింది. అతను చస్తే తనకు లక్ష రూపాయలు వస్తాయనే దురాశ కూడా ఏర్పడింది. మనసు బాగాలేక ఆరాత్రి క్లబ్బులో చిత్తుగా తాగి ఇంటికి వచ్చాడు సింగ్. వళ్ళు తెలియకుండా నిద్రపోతున్న భర్తను రాగిణి పదునైన కత్తితో గొంతుమీద అనేకసార్లు పొడిచింది. రక్తపు మరకలున్న నైట్ గౌను పోలీసులకు దొరికింది. భర్తను చంపి, దుస్తులు మార్చుకుని, తనను తానే కిటికీ చువ్వలకు కట్టేసుకున్నది. ఆమె ఖరీదైన నగలు అంతకు కొద్ది వారాలముందే పుట్టింటికి చేర్చింది. విడాకులు మంజూరైతే ఇన్‌ష్యర్ చేసి లక్ష రూపాయలూ, ఫామిలీ ఫండూ తనకురాదని ఆమెకు తెలుసు. ఆమెను అరెస్ట్ చేశారు. తండ్రి జామీన్ కోసం ప్రయత్నించాడు. కింది కోర్టు తిరస్కరించింది. హైకోర్టు కూడా తిరస్కరించింది. మళ్ళీ బెంచికి అప్పీల్ చేశాడు రాగిణి తండ్రి. హైకోర్టు బెంచి జామీన్ మంజూరు చేసింది. ప్రస్తుతం రాగిణి తండ్రి దగ్గర వున్నది.

❀ ❀ ❀



# 13. అరణ్య రోదన

ఆ అమ్మాయి పేరు ప్రేమవతి. ఆమె ఒక మాంటిస్సోరీ స్కూలుకి ప్రిన్సిపాల్‌గా వుండేది. బి.యిడి. చెయ్యటానికి అల్వర్ కాలేజీలో అడ్మిషన్ లభించింది. కొత్త ప్రదేశానికి ఒంటరిగా వెళ్ళాలంటే ఆమె భయపడింది. పిన్ని కొడుకు ప్రకాశ్ ఆమెకు తోడుగా వెళ్ళడానికి అంగీకరించాడు.

ప్రేమవతి ప్రకాశ్‌తో అల్వర్‌కి బయల్దేరింది. 1978 జూన్ పధ్నాలుగో తేదీన మధుర చేరుకున్నారు. అక్కణ్ణించి భరత్‌పూర్‌కి రైల్లో వచ్చారు. భరత్‌పూర్ నుంచి బస్సులో అల్వర్ వెళ్ళవలసివుంది. ఇద్దరూ బస్‌స్టాండు చేరుకున్నారు. బస్సు బయల్దేరటానికి మరో రెండు గంటలు టైముంది. భరత్‌పూర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసులో "గిరిరాజు" అనే అతను బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అతను ప్రకాశ్‌కి చాలా దగ్గర స్నేహితుడు. ప్రకాశ్ గిరిరాజు కోసం ఆఫీసుకు వెళ్లి వాకబు చేశాడు. అతను కనిపించాడు. ఇద్దరు స్నేహితులూ పరమానందంతో ఒకరినొకరు కౌగిలించుకున్నారు. ప్రకాశ్ ప్రేమవతిని పరిచయం చేస్తూ "ఈమె మా పెద్దమ్మ కూతురు. అల్వర్ బి.యిడి. కాలేజీలో చేర్పించడానికి తీసుకువెళ్తున్నాను!" అని చెప్పాడు.

గిరిరాజు "ఇంత రాత్రిపూట వెళ్లి అల్వర్‌లో ఏం చేస్తారు?" అని ఆరాత్రి వారిని తన అతిథులుగా వుండమని కోరాడు. అందుకు వారు అంగీకరించారు. గిరిరాజు ఒంటరిగా వుంటున్నాడు. సామాను అతని గదిలో పెట్టి, ముగ్గురూ భరత్‌పూర్ వూరు చూడటానికి బయల్దేరారు. వాళ్ళు బజార్లో తిరుగుతున్నప్పుడు, ఇద్దరు కుర్రవాళ్ళు స్కూటరు మీద వాళ్ళని అనుసరించడం ప్రేమవతి గమనించింది. అందమైన ఆడపిల్లలు బయటికి వస్తే ఇలాంటి సంఘటనలు సహజమే గనుక ఆమె ప్రత్యేక ప్రాముఖ్యత ఇవ్వలేదు. వాళ్ళు ఒక హోటల్లో భోజనం చేసి బయటికి వచ్చారు. స్కూటరు ఆపుకుని దూరంగా వున్న కుర్రవాళ్ళను ప్రేమవతి గమనించింది. అయినా ఆ విషయం ప్రకాశ్‌కి చెప్పలేదు.

ముగ్గురూ గిరిరాజు ఇంటిదగ్గరకు వచ్చారు. అతను ఇంటి తలుపు తాళం పూర్తిగా తీశాడో లేదో, స్కూటరు వచ్చి వాకిలి ముందు ఆగింది. ఇద్దరు యువకులూ స్కూటరు దిగారు. లోపలికి వెళ్ళబోతున్న వారిని అటకాయిస్తూ "ఆగండి! ఈ పిట్టను ఎక్కణ్ణుంచి లేపుకొచ్చారు?" అంటూ గర్జించాడు ఒకడు. క్షణకాలం ముగ్గురూ కొయ్యబారి నుంచున్నారు.

"లేపుకు రావడం ఏమిటి? ఈమె నా చెల్లెలు. అయినా మీరెవరు అడగడానికి" అన్నాడు ప్రకాశ్ పూర్తిగా ఆశ్చర్యంనుంచి బయటపడకుండానే.

రెండో యువకుడు మొదటి యువకుణ్ణి చూపిస్తూ, "ఇతను ఎవరనుకున్నావు? ఇనస్పెక్టర్ సాబ్!" అని అన్నాడు. కాని గిరిరాజుకు ప్రకాశ్‌కు అతని మాటల మీద నమ్మకం కలగలేదు. ప్రేమవతి సాయంకాలం నుంచి తమను వెంబడిస్తున్న యువకులు వాళ్ళేనని గుర్తించింది.

"మీరెవరైతే మాకేమిటి? మేము ఏం తప్పు చేశామని భయపడాలి? ఈమె నా సోదరి" అన్నాడు ప్రకాశ్.

మాట పూర్తి కాకుండానే మొదటి యువకుడు ప్రకాశ్‌ని ఈడ్చి చెంప దెబ్బ కొట్టాడు.

"సాలా! పదరా! స్టేషనుకి పద! నీపని చెబుతాను!" అంటూ గిరిరాజును కూడా కొట్టాడు. అనుకోకుండా జరిగిన ఆక్రమణ వలన ముగ్గురూ స్థాణువులా నిలబడిపోయారు. ఒక్క క్షణం గిరిరాజుకు కూడా ప్రకాశ్‌మీద అనుమానం కలిగింది. ప్రకాశ్‌ను ప్రేమవతిని మార్చి మార్చి చూశాడు. ప్రేమవతి ఒక ప్రక్కగా వణుకుతూ నిల్చుంది. ఈ లోపల ఆ ఇద్దరిలో ఒకడు జేబులోంచి రివాల్వరు బయటికి తీశాడు. ప్రేమవతిని స్కూటరుమీద కూర్చోమన్నాడు. ఆమె అందుకు అంగీకరించలేదు. నిల్చున్న చోటు నుంచి కదలలేదు. రెండో యువకుడు రోడ్డుమీద వెళుతున్న రిక్షాను పిల్చాడు. రివాల్వరు చూపిస్తూ, ప్రేమవతిని, ప్రకాశ్‌ని రిక్షాలో కూర్చోమన్నాడు.

"మీ సంగతేదో పోలీసు స్టేషన్లోనే కనుక్కుంటాం పదండి!" అన్నాడు. ప్రేమవతి, ప్రకాశ్ యాంత్రికంగా రిక్షాలో కూర్చున్నారు. అదే రిక్షాలో ఆ రిక్షాపిల్చిన యువకుడు కూడా ఎక్కి కూర్చున్నాడు. వెళ్తూ వెళ్తూ రివాల్వరు చూపించిన యువకుడు "జాగ్రత్తః ఇలాంటి గొడవల్లో తలదూర్చకు!" గిరిరాజుతో అని స్కూటర్ స్టార్ట్ చేశాడు.

రిక్షా స్కూటరు వెనకే పోనీయ్. దర్వాజా వైపుకి వేగంగా వెళ్ళసాగింది. కొంత దూరం పోయి ఒక యింటి ముందు ఆగింది. ముగ్గురూ రిక్షా దిగి లోపలికి వెళ్ళారు. స్కూటరు మీద వచ్చిన యువకుడు రిక్షా కిరాయి ఇచ్చి లోపలికి వెళ్ళాడు. ఆ ఇంట్లో అద్దెకు వుంటున్న అతన్ని బయటకు వెళ్ళమని బెదిరించాడు.

"ఇప్పుడు చెప్పు! ఈ అందాల రామచిలుక ఎవరో! నీ ప్రియురాలేనా?" అన్నాడు ఒకడు. "కాదు! కాదు! ఈ అమ్మాయి మా పెద్దమ్మ కూతురు. నా చెల్లెలు!" లబలబలాడాడు ప్రకాశ్. రెండో యువకుడు వక్కనే వున్న కఱ్ఱ అందుకొని ప్రకాశ్‌ని బాదసాగాడు. అయినా అతను "ఆ పిల్ల నా సోదరి" అని చెప్తూనే వున్నాడు. ఈ లోపల రెండో యువకుడు ప్రేమవతిని బలవంతంగా లోపలి గదిలోకి లాక్కెళ్ళాడు. ప్రకాశ్ "బాత్‌రూంకి వెళ్ళా"లని అన్నాడు తనను కొడుతున్న యువకునితో. వక్కనే వున్న బాత్‌రూమ్‌లోకి వెళ్ళటానికి అనుమతించాడు. అంతలోనే అతనికి ప్రేమవతిని తన స్నేహితుడు లోపలికి లాక్కెళ్ళటం గుర్తొచ్చి, అతను లోపలికి వెళ్ళాడు. అదనుచూసి ప్రకాశ్ తప్పించుకుని పారిపోయాడు.

ప్రేమవతి కేకలు విని, ఇరుగు పొరుగు వాళ్ళు కొందరు ఆ ఇంటి ముందు పోగయ్యారు. అందులో ఎవరికీ లోపలికి వెళ్ళే ధైర్యం లేదు. అంతలో ఆ



యువకులిద్దరూ ప్రేమవతిని బయటకు లాక్కువచ్చి స్కూటరుమీద కూర్చోపెట్టుకుని జనం మధ్యనుంచే వెళ్ళిపోయారు.

ఆ అమ్మాయి "రక్షించండి! రక్షించండి!" అంటూ కేకలు వేసింది. ఎవరికీ ముందుకు వచ్చే సాహసం లేకపోయింది.

కారణం ఆ యువకుల గురించి అక్కడివారందరికి తెలిసి వుండటమే!

స్కూటర్ నెంబరు యు. యస్. ఏ. 2100 రంగు తెలుపు. అది వేగంగా భరత్‌పూర్ దాటి మట్టి రోడ్డు మీద కొంత దూరం పోయింది. ప్రేమవతి ఆ ఇద్దరు యువకుల మధ్య కూర్చుంది. ఒక నిర్జీవ ప్రదేశంలో స్కూటరాపి ప్రేమవతిని కిందికి లాగారు. ఆమె తనమీద జరుగుతున్న దౌర్జన్యాన్ని సాధ్యమైనంతవరకు ప్రతిఘటించింది. గాజులు చిట్లిపోయాయి. శరీరం మీది గాయాల నుంచి అక్కడక్కడా రక్తం వస్తోంది. చివరకు ఆమె ఆ దుర్మార్గులకు లొంగిపోక తప్పలేదు. ఆమె శీలంతోపాటు ఒంటిమీద వున్న నగలు కూడా దోచుకున్నారు.

ప్రకాశ్ అక్కణ్ణించి పారిపోయి పోలీసులకు రిపోర్టు చేశాడు. సినిమాల్లోలాగా అంతా జరిగిపోయాక పోలీసులు ఆ ఇంటికి వచ్చారు. ఇరుగు పొరుగు తాము చూసిన దృశ్యాన్ని వర్ణించి చెప్పారు. ఇన్‌స్పెక్టర్‌కు ఆ ఇంట్లో ఒక బొమ్మ రివాల్వర్ దొరికింది. దాంతోనే ఆ యువకులు ప్రకాశ్‌ని, ప్రేమవతిని భయపెట్టినట్టు అర్థంచేసుకున్నాడు. ఇరుగుపొరుగు ద్వారా ఆ కుఱ్ఱవాళ్ళిద్దరూ చాలా దుర్మార్గులనీ, వాళ్లని చూసి అంతా భయపడతారని పోలీసులు తెలుసుకున్నారు.

"కిరణ్" అనే ఒక నర్సు ఈ యువకులతో సన్నిహితంగా వుంటుందన్న నంగతికూడా తెలిసింది. కిరణ్ దగ్గరికి వెళ్ళారు. అందులో ఒకడి పేరు "ప్రేమ్‌ప్రసాద్" అని, రెండోవాడి పేరు "దినేశ్" అనీ తెలిసింది. వాళ్ళు తన దగ్గరకు రాగానే పోలీసులకు తెలియజెయ్యటానికి కూడా ఒప్పుకుంది. ప్రకాశ్ ప్రేమవతిని గురించి దిగులు పడిపోయాడు. "ఆ దుర్మార్గులామెను ఏంచేశారో? చంపేశారేమో? పెద్దమ్మకు ఏం నమాధానం చెప్పాలి?" అనే ప్రశ్నలతో అతను సతమతమవుతున్నాడు.

రాత్రి దాదాపు రెండు గంటలకు ప్రేమవతి వెతుక్కుంటూ పోలీసు స్టేషన్‌కి చేరింది. తనకు జరిగిన అన్యాయాన్ని గురించి పోలీస్ స్టేషన్‌లో వివరించింది. ఆ ఇద్దరు దుర్మార్గులూ ప్రేమవతిని తీసుకొచ్చి జిల్లా లైబ్రరీ ముందు వదిలేశారు. "పోలీసు రిపోర్టు ఇచ్చినట్లయితే ప్రాణాలు తీస్తాం!" అని భయపెట్టారు.

డాక్టరు బి. కె. శర్మ, డాక్టరు రాజకుమారి ఆమెను పరీక్షించి, ఆమె మీద బలత్కారం జరిగినట్లు ధృవీకరించారు.

ప్రేమవతిని వదిలాక ప్రేమ్, దినేష్ ఒక స్నేహితుడు ఇంటికి వెళ్ళారు. అతని పేరు శ్యాం ప్రసాద్. అతను ఒక కట్టెల అడ్తికి యజమాని. శ్యాం వాళ్ళిద్దరికి "మీకోసం పోలీసులు గాలిస్తున్నారు. వెంటనే ఇక్కడ్నుంచి వెళ్ళిపోండ"ని సలహా ఇచ్చాడు. స్కూటర్ అక్కడే వదిలి ఆ యువకులిద్దరూ మధురకు బయలుదేరారు. వారితో శ్యాం కూడా బయలుదేరాడు. మధుర వెళ్ళాక ప్రేమ్ తను ఢిల్లీ వెళ్తానని చెప్పాడు. అతని పెద్దనాన్న ఢిల్లీలో వున్నాడు. అక్కడ కొంతకాలం గడవడానికి

అనుకూలంగావుంటే వుత్తరంరాస్తాననీ, అప్పుడు దినేశ్‌కూడా రావచ్చునని చెప్పాడు. అందుకు దినేశ్ అంగీకరించాడు. ప్రేమ్ ఢిల్లీకి బయలుదేరాడు.

ఫిబ్రవరి ఇరవైఆరున శ్యాంతో సహా దినేశ్ కూడా ఢిల్లీచేరాడు. అక్కడ కెళ్ళగానే ప్రేమ్ ఢిల్లీనుంచి అల్వార్ వెళ్ళి పోయాడని తెల్సింది. అల్వార్‌లో ప్రేమ్ అత్తగారిల్లుంది. దినేశ్ అక్క కూడా అల్వార్‌లోనే వుంది. వెంటనే దినేశ్ శ్యాంతో కలిసి అల్వార్ చేరుకున్నాడు. వాళ్ళిద్దరూ ఒక స్నేహితుడి ఇంట్లో దిగారు. ముగ్గురూ ముందు తీసుకోవలసిన జాగ్రత్తల్ని గురించి ఆలోచనలు జరిపారు. అప్పటికే ఆ సంఘటన గురించి పత్రికలన్నీ రాశాయి. అందరి నోళ్లలో అదే చర్చ. వెంటనే అల్వార్ నుంచి కూడా పారిపోవడానికి నిర్ణయించుకున్నారు. డబ్బుకావాలి. రాధాకృష్ణ అనే యువకుడ్ని భరత్‌పూర్‌లో వున్న కిరణ్ దగ్గరకు పంపించడానికి నిర్ణయించుకున్నారు.

ప్రేమ్ కిరణ్‌కు చాలా డబ్బు ఇచ్చి వున్నాడు. వెంటనే రాధాకృష్ణ భరత్‌పూర్ వచ్చాడు. కిరణ్ దగ్గరకు వచ్చి డబ్బు అడిగాడు. "అలాగే ఇస్తాను, ఇప్పుడు నా దగ్గిర క్యాష్‌లేదు. నా స్నేహితురాల్ని అడిగి తెస్తాను. అంతవరకూ మీరు విశ్రాంతి తీసుకోండి" అని చెప్పి బయటికి వెళ్లింది. తిన్నగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి రిపోర్టు ఇచ్చింది. రాధాకృష్ణను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రాధాకృష్ణ దెబ్బలు తినకుండానే నిజం చెప్పేశాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో అల్వార్ బయలుదేరాడు. రాధాకృష్ణను కూడా తీసుకెళ్ళారు. రాధాకృష్ణ ఎవరికీ సంబంధంలేని ఒక ఇంటిని చూపించి పోలీసుల్ని మోసగించాడు. ఆ ఇంటిని సోదా చేస్తున్న సమయంలో ప్రేమ్ దినేష్ ఇద్దరూ ప్రేమ్ అత్తగారింట్లో వున్నారు. ఊళ్ళోకి పోలీసులు వచ్చారని తెలియగానే పారిపోయారు. ఢిల్లీ వెళ్తున్న ఒక లారీ ఎక్కారు. ఢిల్లీలో వారికి ఒక మిత్రుడు వున్నాడు. ఆ రాత్రికి అతని ఇంట్లో వుండి అతని దగ్గర మూడొందల రూపాయలు అప్పు తీసుకుని కలకత్తా వెళ్ళారు. వాళ్ళు కలకత్తాలో వున్నట్టు పోలీసులకు ఆచూకి తెలిసింది. ప్రేమ్ బీహార్‌కు బయలుదేరాడు. అదేరోజు ఒక పరిచితుడి ద్వారా అతను పోలీసులకు దొరికిపోయాడు. దినేష్ పారిపోయాడు. కాని మూడు నెలలు తిరక్కుండానే అల్వార్‌లో అతన్ని కూడా అరెస్ట్ చేశారు.

కోర్టులో కేసు చాలా కాలం నడిచింది. ప్రేమవతి కోర్టులో అనేక అవమానకరమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పవలసి వచ్చింది. ఆమెకు బెదిరింపు ఉత్తరాలు వచ్చేవి. అయినా ప్రేమవతి పట్టుదలతో భరత్‌పూర్ కోర్టుకు హాజరవుతూ వచ్చింది.

చివరకు దోషులిద్దరికి పదేసి సంవత్సరాలు జైలు శిక్ష విధించడం జరిగింది. ఇప్పుడు వాళ్ళు జయపూర్ సెంట్రల్ జైలులో వున్నారు. హైకోర్టుకు అపీలు చేసుకున్నారు.

ప్రేమవతి కూడా పట్టుదలతోనే వున్నది.

❀ ❀ ❀



# 14. చివరకు మిగిలేది!

(ఒక స్త్రీకి జరిగిన అన్యాయానికి పగ తీర్చుకున్నాడు ఆమె సోదరుడు. ఆ పగకు గురి అయింది ఎవరు?)

## స్థలం - కలకత్తా నగరం

ఆగస్టు 1980 23, తేదీన ఈ సంఘటన జరిగింది. ఆమె పేరు 'మానసి'. ఆమెకు దాదాపుగా ఇరవై సంవత్సరాల వయసు. బీదకుటుంబంలో పుట్టింది. అదే ఆమె పాలిట శాపంగా పరిణమించింది. ఇంటికిపెద్ద కూతురు. మధ్యతరగతి కుటుంబాల్లో సహజంగా వుండే సాంప్రదాయపు పిచ్చి ఈ కుటుంబానికి వుంది. ఆమె తండ్రి రోగిష్టి. ఏదో దుకాణంలో పనిచేస్తున్నాడు. నలుగురు కూతుళ్ళు ఒక కొడుకు. మానసి ఎలాగో మెట్రిక్ వరకు చదివింది. మానసి తమ్ముడు రాజా చదువు మానేసి రైల్వే స్టేషన్‌లో టీ స్టాలు పెట్టుకున్నాడు. మానసి రెండు మూడు ఇళ్ళల్లో ట్యూషన్ చెప్తుతోంది. తమ్ముడికి అక్క ట్యూషన్స్ చెప్పడం ఇష్టంలేదు. ఆ మాటకొస్తే తల్లికీ, తండ్రికి కూడా ఇష్టంలేదు. అయినా కుటుంబ ఆర్థిక స్థితి వాళ్ళను నోరు తెరవనివ్వలేదు. మానసి ముగ్గురు చెల్లెళ్లూ స్కూల్లో చదువుతున్నారు. తమ్ముణ్ణి చదవమంటే అంగీకరించలేదు. ఏదో పనిచేసి కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపర్చాలని అతని ఉద్దేశ్యం. తను వ్యాపారంలో కాలు నిలదొక్కుకున్న తర్వాత అక్కకు తానే పెళ్లి చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. అతని పేరు అనిల్.

ఒకరోజు అనిల్ టీస్టాల్ కట్టేసి సైకిల్ మీద ఇంటికి బయలుదేరాడు. రాత్రి దాదాపు పదకొండు దాటింది. వెనక నుంచి ఒక వ్యాన్ వచ్చి సైకిల్‌ని కొట్టి స్పీడుగా వెళ్లిపోయింది. అదృష్టవశాత్తు అనిల్ పక్కకు పేవ్‌మెంట్ మీదకు పడిపోయాడు. కాలు విరిగింది. ఆసుపత్రిలో చేర్పించారు. మానసి తను ట్యూషన్ చెబుతున్న ఇంటి యజమాని నిర్మల్‌రాయ్ దగ్గర అడ్వాన్సుగా వందరూపాయలు తీసుకుంది.

ఆరోజు - అదే 1980 ఆగష్టు 23 తేదీ సాయంత్రం 6 గంటలు. మానసి నిర్మల్‌రాయ్ ఇంటి తలుపు తట్టింది. సన్నగా వర్షం పడుతోంది. మానసి తల తడిసిపోయింది. దుస్తులు కూడా అక్కడక్కడ తడిచాయి. కొంగుతో తల, ముఖం తుడుచుకుంటూ వుండగా తలుపులు తెరుచుకున్నాయి.

"అరే! తడిసిపోయినట్టున్నారు. త్వరగా లోపలకు రండి" తలుపు తెరిచిన నిర్మల్‌రాయ్ అన్నాడు.

మానసి లోపలకు వచ్చింది. రాయ్ కూతురు రూప స్టడీ రూంలోకి వెళ్ళింది. అక్కడ రూప లేదు. ఆమె తల్లి జాడ కూడా కన్పించలేదు. ఆమె వెనక్కు తిరిగి బయటకు రాబోయింది. గదిగడపలో నిర్మల్‌రాయ్ నిల్చుని అదోలా నవ్వుకున్నాడు.

"రూప తల్లి ఎక్కడ?"

"వాళ్ల అమ్మమ్మతో అమ్మగారి వూరు వెళ్లింది."

"మరి ముందే నాకు ఎందుకు చెప్పలేదు"

"బయట వర్షంగా వుంది కాసేపు కూర్చుని వెళ్ళవచ్చుగా. అలా కూర్చో" అన్నాడు.

మానసి కిటికీలోనుంచి బయటికి చూసింది. భోరున వర్షం కురుస్తోంది. గాలి కూడా వీస్తున్నది.

"కూర్చో మానసీ!"

ఆ పిలుపుకు చివ్వున తలెత్తి రాయ్ ముఖంలోకి చూసింది.

"కూర్చో! మీ తమ్ముడికెలా వుంది?" అడిగాడు ఆదరణ వుట్టిపడే కంఠంతో.

మానసి కుర్చీలో కూర్చుంది.

నిర్మల్‌రాయ్ రెండో కుర్చీలో కూర్చున్నాడు.

"పర్వాలేదు త్వరలోనే డిస్‌చార్జి చేస్తారనుకుంటాను." మానసి అతని ప్రశ్నకు సమాధానం ఇచ్చింది. అతని ముఖంలోకి చూడకుండా రూప ఎక్సర్‌సైజ్ పుస్తకాలను తిరగవేస్తూ.

"మానసీ!"

మానసి తల ఎత్తింది.

"నీతో ఒక విషయం మాట్లాడాలని ఎన్నో రోజులుగా ప్రయత్నం. ఆ అవకాశం ఇవ్వాళ దొరికింది."

"ఏమిటి?" జంకుగా అడిగింది మానసి.

"నేను పెద్ద వ్యాపారిని. వ్యాపారి తనకు నచ్చిన సరుకుకు ఎంత వెల చెల్లించి అయినా కొనుక్కుంటాడు" అంటూ ఆగి ఆమె ముఖంలోకి చూశాడు.

మానసి ముఖం చిట్లించింది.

"మీ నాన్న రోగిష్టి. నీ తమ్ముడు రైల్వేస్టేషన్‌లో టీ అమ్ముతాడు. నీకు ఇంకా ముగ్గురు చెల్లెళ్ళు వున్నారు. నువ్వే ఇంటికి పెద్ద. నువ్వు అందంగా వుంటావు. నా భార్య వారం రోజుల దాకా రాదు. వాళ్ళ తమ్ముడి పెళ్ళి. ఈవారం రోజులూ నువ్వు నాకు ఇంత కాలం ఉవ్విళ్ళూరుతున్న సుఖాన్ని ఇవ్వు. ఒక రాత్రికి ఎంతకావాలో చెప్పు. నా భార్య వచ్చాక కూడా మనం ఏదైనా హోటల్లో అప్పుడప్పుడు..."

"షటప్!" సివంగిలా అరుస్తూ లేచి నిల్చుంది మానసి.

"ఇప్పుడు నీ అరుపులు ఎవరికి వినిపించవు. మర్యాదగా లొంగిపో. నువ్వు అనుభవిస్తున్న దరిద్రం నుంచి విముక్తి పొందు. నీ కుటుంబాన్నే దారిద్ర్య బాధనుంచి నువ్వు కావాలనుకుంటే...."

"నీచుడా! నోరుముయ్!" అంటూ ముందుకు వెళ్ళబోయిన మానసిని రెండు చేతులతో గట్టిగా పట్టుకున్నాడు. మానసి పెనుగులాడింది. చివరికి అనాదిగా



ఆడదానికి జరుగుతున్న అన్యాయమే జరిగింది. పురుషుడి పశుబలానికి స్త్రీత్వం బలి అయింది.

మానసి ఇంటికి చేరుకుంది. తండ్రికి జరిగిన విషయాన్ని చెప్పింది. తల్లి అల్లరి చెయ్యొద్దని నెత్తీ నోరూ బాదుకుంది. అయినా మానసి వినలేదు. తండ్రిని ఒప్పించి రాత్రి పదకొండు గంటలకు దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో కేసు రిజిష్టరు చేయించింది.

ఆ రాత్రి దాదాపు రెండు గంటలకు పోలీసు ఇన్‌స్పెక్టర్ రాయ్‌ని అరెస్టు చేశారు. మానసిని లేడీ డాక్టరు పరీక్ష చేసి ఆమె రేప్ చేయబడినట్టు రిపోర్టు ఇచ్చింది.

నిర్మల్‌రాయ్ పోలీసుల ముందు తన అపరాధం అంగీకరించలేదు. ఆమె స్వయంగా తన భార్య ఊళ్లోలేదని తెలుసుకొని వచ్చినట్టు, తమ్ముడు ఆస్పత్రిలో వున్నాడనీ వెయ్యి రూపాయలు అడిగినట్లు, తను అంత మొత్తం ఇవ్వలేనన్నట్టు, దాంతో మానసి తనను లొంగదీసుకోవడానికి ప్రయత్నించినట్టు చెప్పాడు. కాని పోలీసులు నమ్మలేదు. చివరకు రాయ్ చేత అపరాధాన్ని అంగీకరింపచేశారు.

పోలీసులకు రాయ్ యిల్లు సోదాలో, రూప గదిలోని వస్తువులు చిందర వందరగా కన్పించాయి. చేతి గాజులు పగిలిన ముక్కలూ కన్పించాయి. టేబుల్ లైట్ కిందపడి పగిలిపోయి వున్నది. ఇవన్నీ ఆమెను బలవంతం చేసినట్టు సాక్ష్యంగా నిలిచాయి. నేలమీద పరిచిన చతరంజ్‌ని కూడా మెడికల్ చెకప్‌కు పంపించారు. రాయ్‌ను డాక్టర్ పరీక్ష చేశాడు.

రెండో రోజు కోర్టులో కేసు రిజిష్టర్ అయ్యింది. రాయ్ జామీను మీద విడుదల చేయబడ్డాడు.

కోర్టులో కేసు నడుస్తున్నది. మానసి తండ్రి మానసిక వ్యధతో చనిపోయాడు. తమ్ముడు ఇంకా ఆసుపత్రిలోనే వున్నాడు.

1981, మార్చి 3వ తేదీన సెషన్స్ జడ్జి తన తీర్పును వినిపించాడు.

రాయ్ కోర్టులో తన తప్పును అంగీకరించలేదు. పోలీసుల దౌర్జన్యం వల్ల వాళ్ల ముందు తను అపరాధిగా ఒప్పుకున్నానని చెప్పాడు.

"సంఘటన జరిగిన వెంటనే ఏ గొడవ చెయ్యకుండా మానసి ఇంటికి వెళ్లిపోవడం, ఆ తర్వాత చాలా పొద్దుపోయాక పోలీసు రిపోర్టు ఇవ్వడం సందేహానికి అవకాశం ఇస్తున్నది. పైగా రాయ్ మానసిని బలాత్కారం చేసిన సాక్ష్యం లేదు" అంటూ కేసు కొట్టేయడం జరిగింది.

ఆ తీర్పు విన్న మానసి తల ఎత్తలేకపోయింది. అదేరోజు ఆస్పత్రి నుండి డిస్‌ఛార్జి చేయించుకొని అనిల్ కోర్టుకు వచ్చాడు. ఆ తీర్పు విన్న అతని గుండెల్లో అగ్ని పర్వతం పొగలు కక్కసాగింది.

"మిస్టర్ రాయ్! ఇల్లు అలకగానే పండగకాదు. నువ్వు ఏం చేశావో నాకు తెలుసు. దానికి ప్రతీకారం నేను చేస్తాను. నీకు శిక్ష నేను విధిస్తాను" అన్నాడు అనిల్, రాయ్ కృదురుగా నిల్చుని.

రాయ్ సమాధానం ఇచ్చే లోపలే అక్కడ్నుంచి వెళ్లిపోయాడు. రాయ్‌కు భయం పట్టుకుంది. ఐదారునెలలు చాలా జాగ్రత్తగా వున్నాడు.

కాని అనిల్ జాడ కన్పించలేదు. దాంతో రాయ్ నిశ్చింతగా వుండసాగాడు. దాదావు అనిల్ హెచ్చరికను మర్చిపోయాడనే చెప్పాలి. రూపను స్కూల్ హాస్టల్ లో చేర్పించాడు.

ఆరోజు రాయ్ భార్యతో 6 గంటల సినిమాకు వెళ్ళి వచ్చాడు. అది సెప్టెంబరు 21వ తేదీ 1981వ సంవత్సరం.

రాయ్ దంపతులు భోజనం చేశారు. అప్పుడే బెడ్ రూంలోకి వెళ్లారు. కాలింగ్ బెల్ మోగింది. రాయ్ తలుపు దగ్గరకు వచ్చి, చిన్న రంధ్రంలో నుంచి చూస్తూ "ఎవరూ?" అన్నాడు.

"టెలిగ్రాం సర్!" ఒక ఇరవై ఏళ్ళ కుర్రవాడు ఒక చేతిలో కాగితాల కట్ట పట్టుకొని రెండో చేతిలో సైకిల్ హాండిల్ పట్టుకుని నిలబడి వున్నాడు.

రాయ్ తలుపు తెరిచాడో లేదో తలుపు పక్కగా వున్న ముగ్గురు వ్యక్తులు అతన్ని లోపలకు నెట్టి లోపలకు ప్రవేశించారు. లోపల నుంచి తలుపు మూశారు. సైకిల్ అతను వెళ్ళిపోయాడు.

ఆ ముగ్గురిలో అనిల్‌ను చూసిన రాయ్ నోట మాట పడిపోయింది. కళ్ళప్పగించి చూడసాగాడు. రాయ్ భార్య అరవబోయింది. గొంతు కీచుమన్నది.

"జాగ్రత్త! అరిచారా చూస్తున్నారుగా మా చేతుల్లోని వస్తువుల్ని?" అన్నాడు అనిల్. అందరి చేతుల్లో గొడ్డళ్ళు వున్నాయ్.

అనిల్ గొడ్డలి ఎత్తి పట్టుకున్నాడు. మిగతా ఇద్దరూ ముందు రాయ్‌ను తాళ్ళతో బంధించారు. నోట్లో గుడ్డలు కుక్కారు. ఆ తర్వాత అతని భార్య కాళ్ళూ చేతులూ కట్టేశారు. నోట్లో గుడ్డలు కుక్కారు.

క్రమంగా ఆమె వంటిమీద వస్త్రాల్ని ఒక్కొక్కటే తీసివేశారు. నిర్మల్‌రాయ్ దుస్తులు కూడా తీసివేశారు.

భర్త కళ్ళముందే భార్యను ఇద్దరు వ్యక్తులు చెరిచారు. అనిల్ మాత్రం కసిగా చూస్తూ నిల్చున్నాడు.

మిస్టర్ రాయ్! ప్రతి మగాడికి భార్యా, తల్లీ, చెల్లెళ్ళూ, కూతుళ్లూ వుంటారనేది నువ్వు నా అక్కను నీ ఘాతుకానికి బలి చేసిన రోజు ఆలోచించి వుండవు. డబ్బు వుంది, ఏం చేసినా చెల్లుతుందనుకొన్నావ్! కోర్టు నీకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పుడు నువ్వు నా అక్కకేసి చూస్తూ అదోలా నవ్వావు. ఆ నవ్వును నేను మర్చిపోలేను. బీదవాళ్లు కూడా ప్రతీకారం తీర్చుకోగలరు. ఎంత భయంకరంగా తీర్చుకోగలరో కూడా స్వయంగా చూస్తున్నావ్! నీమీద కసి తీర్చుకోవడానికి రాత్రింబవళ్ళు చెమటోడ్చి డబ్బు సంపాదించాను. నేనూ వకీల్‌ను పెట్టుకొని నిరపరాధిగా నిరూపించుకోగలను. నీ భార్యను నీ ముందే చెరిచినట్టు చెప్పడానికి కళ్ళతో చూసిన సాక్షులు నీకు లేరు. నేను కేసు గెలుస్తాను" అంటూ కసిగా గొడ్డలికర్రతో బాదాడు.



తెల్లవారి ఇరుగు పొరుగు వాళ్లు భార్యభర్తల్ని ఆసుపత్రిలో చేర్పించారు.

పోలీసులు కేసు రిజిష్టర్ చేశారు. అనిల్ పోలీసులకు ఇంట్లోనే దొరికాడు. అతను అపరాధం చేసినట్టు అంగీకరించాడు. కోర్టులో కేసు నమోదు అయింది. లాయర్ను కూడా పెట్టుకున్నాడు. అనిల్ జామీన్ మీద విడుదల అయ్యాడు.

మిగతా ఇద్దరూ కూడా అరెస్టయి జామీన్ మీద విడుదలయ్యారు.

కోర్టులో కేసు నడుస్తుంది.

"అవును నేను ప్రతీకారం తీర్చుకున్నాను. ఇది కేవలం స్త్రీ శీలానికి సంబంధించిన కేసు కాదు. ధనవంతులకూ బీదవాళ్లకూ మధ్య జరుగుతున్న పోరాటంగా నేను భావిస్తున్నాను" అంటూ వుంటాడు అనిల్ టీ స్టాల్‌లో కూర్చుని తనకు తెలిసిన వాళ్ళతో.

ఒక ఆడదానికి జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా మరో ఆడదాని మీద అత్యాచారమా? ఆలోచించండి - ఇదెక్కడి న్యాయం!

❀ ❀ ❀

# 15. కక్ష

అర్చన బెనర్జీ వయసు పందొమ్మిది సంవత్సరాలు. కలకత్తా నగరం 1982 మే 17వ తేదీకి ఆమెకు వివాహం అయి ఆరు నెలలు కూడా నిండలేదు. చక్కదనంతోపాటు గుణవంతురాలైన కోడలు వచ్చినందుకు ఆమె అత్తమామలు ఎంతో పొంగిపోయారు. వారు తమకు ఆడపిల్లలు లేని కొరత తీరిందని సంతృప్తి పడ్డారు. అర్చన భర్త అనిల్‌కు భార్యంటే ప్రాణం. అలాంటి భార్య లభించినందుకు అతనికి ఎంతో సంతృప్తిగానూ, గర్వంగానూ వుండేది.

ఒకరోజు అర్చన మామగారు భోజనం చేసి వసారాలోని పడక కుర్చీలో మాగన్ను వేశాడు. "అప్పుడే పోస్ట్‌మేన్ ఒక కవరు ఇచ్చి వెళ్ళాడు. నిద్రమొహంతో యదాలాపంగా కవరు విప్పాడు బెనర్జీ. అంతే - అర్చన మామ కవరు విప్పగానే అతని వడిలో మూడు ఫోటోలు పడ్డాయి. వాటిని తీసి ఒక్కొక్కటే చూశాడు. కుర్చీలోనే శవంలా బిగిసిపోయాడు.

"ఏమండి? ఉత్తరం ఎక్కడ్నుంచి?" అతని భార్య లీలా బెనర్జీ అడిగింది.

"మాట్లాడ రేమండీ?"

అభిజిత్ బెనర్జీ భార్యకు ఫోటోలు అందించాడు. ఆ ఫోటోలు చూసి లీలా శిలా ప్రతిమలా నిలబడిపోయింది. బెనర్జీ ఉత్తరం చదివాడు అందులో ఇలా వుంది-

"మాన్యులు శ్రీ అభిజిత్ బెనర్జీ గారికి నమస్కారములు. నేను ఎవర్నో మీకు తెలియదు. కాని మిమ్మల్ని నేను ఎరుగుదును. ఆ ఫోటోలోవున్న యువతి మీ కోడలేనని మీకు తెలుసు. ఇకపోతే ఆమెతో సరసాలాడుతున్న మగవాడు ఎవడో కాదు నేనే. నాపేరు సుకుమార్. మీ కోడలు పెళ్లికి ముందే నన్ను ప్రేమించింది. దాదాపు ఇద్దరం రహస్యంగా, పెద్దలకు తెలియకుండా సంసారం చేశాం. గుళ్లో పెళ్లి కూడా చేసుకున్నాం. ఇందుకు కారణం ఆమె తల్లిదండ్రులే. వారు బ్రాహ్మలు. మేము శూద్రులం. మా పెళ్లికి వారు అంగీకరించలేదు. బలవంతంగా అర్చనను మీ కొడుక్కి ఇచ్చి చేశారు. అర్చన చాలా తెలివైంది. నంగనాచి. తన తెలివితేటల్తో మిమ్మల్నందర్నీ బోల్తా కొట్టించింది. మీ కోడలంత గుణవంతురాలు మీకు తెలిసినంత వరకు ఎవరూ లేరని కదూ మీ అభిప్రాయం? ఎందుకైనా మంచిదని మీకు అసలు విషయం తెలియజేశాను. ఆ తర్వాత మీ ఇష్టం-

మీ
శ్రేయోభిలాషి



ఉత్తరం చదివి తల పట్టుకొని కూర్చుండిపోయాడు అభిజిత బెనర్జి. అతని భార్య లీల తల బాదుకొంటూ ఏడవసాగింది. తన కొడుకు జీవితం నాశనం అయిపోయిందంటూ వాపోయింది.

"అల్లరి చెయ్యకు. నలుగురికీ తెలిస్తే మనకే అప్రదిష్ట" అన్నాడు భర్త.

"దీనికేం పోయేకాలం? రామ! రామ! ఎలాంటి ఫోటో తీయించుకున్నది? అమ్మో అమ్మో! ఎంత వినయం! ఎంత విధేయత! అంతా నాటకం! మనం దాన్ని కన్న కూతురులా చూశాంగదండీ!" తల బాదుకొంటూ ఏడవసాగింది.

"నువ్వు కాసేపు వూరకుండు! అమ్మాయ్ అర్చనా? ఇలారా?"

అర్చన లోపలనుంచి తలమీద ముసుగును సరిచేసుకొంటూ వచ్చి మామగారి ముందు నిల్చుంది.

అభిజిత్ బెనర్జీ కొద్ది నిముషాలు కోడల్ని చూస్తూ వుండిపోయాడు. ఆ తర్వాత ఫోటోలు అందించాడు. వాటిని చూసింది. మళ్లీ చూసింది. కొద్ది నిముషాలు అర్చన మామూలుగానే వుంది. ఆ తర్వాత బుర్ర వేగంగా పనిచెయ్యసాగింది. గుండె వేగం హెచ్చింది.

"ఇదిగో ఈ ఉత్తరం కూడా చదువు" మామగారు అందిస్తున్న ఉత్తరం అందుకోలేదు. ఆ చేతిలో ఉత్తరం కేసి భయంగా చూసింది.

"తీసుకోవే! ఎంత మోసం చేశావే? మా కొంప కూల్చావుగదే!" అత్తగారు శాపనార్థలు ప్రారంభించింది.

అర్చన ఉత్తరం అందుకోలేదు. ఒక్కసారిగా అత్తగారి కాళ్ళ మీద పడిపోయి నిండుకుండ బద్దలైనట్టు భోరున ఏడ్చింది.

"నాకిదేం తెలియదు. ఎవరో మోసం చేశారు. నేను ఎప్పుడూ ఏ మగవాడితోనూ ఫోటోలు తీసుకోలేదు" వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నది అర్చన.

"నోరుముయ్! ఇంతపని చేసి, పైగా ఏడుస్తావా! కళ్లకు కన్పించేదాన్ని కాదంటావా? ఇంక నా ఇంట్లో ఒక్క క్షణం వుండటానికి వీల్లేదు" అంటూ అరిచింది అత్తగారు.

అర్చన గోడకు చేరబడి చైతన్యంలేని బొమ్మను, కీళ్ళు వదులైన బొమ్మను ఎవరో గోడకు ఆనించి కూర్చోబెట్టినట్టు కూర్చుండిపోయింది.

అదే ఊళ్లో వున్న అర్చన తల్లిదండ్రుల్ని వెంటనే రావలసిందిగా కబురు పంపించారు. అంతలో అనిల్ ఆఫీసునుంచి వచ్చాడు. రాగానే అతనికి ఇంటి వాతావరణం వింతగా తోచింది. "ఏమిటమ్మా! అందరూ అలా ఉన్నారేం? ఏం జరిగింది? అంటూ ప్రశ్నించాడు.

"ఇంకా ఏం జరగాలిరా నాయనా? మన పరువు బజారుకెక్కింది. నీ బతుకు బండలైంది."

"ఏమిటమ్మా? అసలు ఏం జరిగిందో చెప్పు నాన్నా!" తండ్రి వైపు తిరిగాడు అనిల్.

తండ్రి అందించిన ఉత్తరం చదివాడు. ఫోటోలు చూశాడు. వంట్లో రక్తం సలసల కాగిపోతున్నది. తలలో నరాలు చిట్లడానికి సిద్ధంగా వున్నాయి. పిడికిళ్ళు

బిగుసుకొంటున్నాయి. గోడకి చేరబడి వున్న భార్యకేసి చూశాడు. అతని కళ్ళు రక్తపు ముద్దల్లా వున్నాయి.

తండ్రిలేచి కొడుకు భుజంమీద చెయ్యి వేశాడు. "బాబూ! బాధపడకు. అంతా నేను చూసుకుంటాను. నీకేం మగాడివి. మంచిపిల్లను తెచ్చి మళ్ళీ పెళ్లి చేస్తాను" అంటూ ఊరడించాడు.

అదే సమయంలో అర్చన తల్లిదండ్రులు వచ్చారు. వారి ముఖాల్లో ఆదుర్దా స్పష్టంగా కన్పిస్తోంది. అర్చన తండ్రి నిరంజన్ చక్రవర్తి, తల్లి పేరు అనిత. తల్లిని చూడగానే అర్చన ఒక్క వరుగులో వచ్చి కౌగిలించుకొని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

"అమ్మా నా జీవితం నాశనం అయిపోయింది. ఇక్కడ అందరికి నాకేరక్టర్ మంచిది కాదనే అనుమానం వచ్చింది. నాకు ముందే దొంగ పెళ్లి అయిందట. ఎవడితోనో కాపురం కూడా చేశానట..." ఆ పైకి మాట పెగల్లేదు. వెక్కి వెక్కి ఏడవసాగింది.

అర్చన తండ్రి విషయం అంతా విన్నాడు. "ఇందులో ఏదో మోసం వుంది. నా కూతురు అలాంటిది కాదు. నాబిడ్డ నిర్దోషి అని రుజువు చేస్తాను. అంతవరకూ ఇక్కడే వుండనివ్వండి. నేను రుజువుచేసుకోలేకపోతే అర్చనను తీసుకెళ్లిపోతాను" అన్నాడు అర్చన తండ్రి వియ్యంకుడి చేతులు పట్టుకొని బ్రతిమలాడుతూ. అందుకు అందరూ అంగీకరించారు.

నిరంజన్ చక్రవర్తి ఇంటికి తిరిగి వచ్చి పెద్ద కొడుకుతో అన్ని విషయాలు చెప్పాడు. అమిత్ చక్రవర్తి ఫోటోను చూశాడు. అతను మంచి వకీలు. ఆ ఫోటోలోని యువతి కట్టుకున్న ప్రింటెడ్ చీర లాంటి చీర అర్చన దగ్గర లేదు. ఆమె ఎప్పుడూ అలాంటి చీర పెళ్లికి ముందు కట్టుకోలేదు. అమిత్ చక్రవర్తికి తన చెల్లెలు నిర్దోషి అనీ, ఎవరో గిట్టనివాళ్ళు మోసం చేశారనీ తెలుసు. ఈ కుట్రను ఎలా పట్టాలా అనే ఆలోచనలో వున్నాడు. ఇంకా వారం రోజులు కాలేదు. నిరంజన్ చక్రవర్తికి "మీ అమ్మాయి మేడ మీద నుంచి పడి చచ్చిపోయింది" అనే వార్త అందింది. లబోదిబోమంటూ అర్చన తల్లిదండ్రులూ అన్నదమ్ములూ వచ్చారు. ఇంటిముందు రక్తపు మడుగులో పడివున్న అర్చనను చూశారు. అప్పటికే పోలీసులు వచ్చారు. మేడమీద బట్ట ఆరేస్తు పడిపోయిందనీ, ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనేనని పోలీసులకు అర్చన మామ చెబుతున్నాడు.

"నో! నో ఇన్‌స్పెక్టర్! అంతా అబద్ధం! ఇది ప్రమాదంవల్ల జరిగింది కాదు. ఆత్మహత్య అంతకంటే కాదు. ఇది హత్య! ఇది హత్య!" పిచ్చివాడిలా అరవసాగాడు అర్చన తండ్రి.

"ఇది హత్య అనే అనుమానం మీకెందుకొచ్చింది?" ఇన్‌స్పెక్టర్ నిశాంత గుహ అడిగాడు.

అర్చన తండ్రి అన్ని విషయాలు విపులీకరించి చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ శవాన్ని పరిశీలనగా చూశాడు. తృళ్ళిపడ్డాడు. అర్చన శవం బోర్లా పడివుంది. ఎత్తునుంచి అలా పడినప్పుడు తల వెనక భాగం మీద దెబ్బ తగిలే



అవకాశం లేదు. కాని అర్చన తల వెనక భాగంలో లోతుగా గాయం వుంది. రక్తం గడ్డకట్టి వుంది. వెంటనే జవానును తీసుకొని ఇల్లు సోదాచేశాడు. వంటింట్లో రక్తంతో తడిసి ఎర్రగా వున్న గొడ్డలి కన్పించింది.

శవాన్ని పరీక్షకు పంపించారు. గొడ్డల్ని స్వాధీనం చేసుకున్నారు. అభిజిత్‌నూ, అతని భార్య లీలనూ అరెస్టు చేశారు. ఆ సంఘటన జరిగినప్పుడు అర్చన భర్త అనిల్ ఇంటి దగ్గర లేడు. అతను కూడా గొడ్డలి చూసి స్థాణువులా అయిపోయాడు.

అభిజిత్, లీల కోడల్ని హత్యచేసినట్టు అంగీకరించారు. అర్చన బట్టలు ఆరెయ్యడానికి డాబామీదకు వెళ్ళింది. పిట్టగోడ దగ్గర నిలబడి ఏదో ఆలోచిస్తున్న అర్చనను ఆమె అత్త వెనకనుంచి తోసేసింది. కింద పడగానే మామగారు గొడ్డలితో బోర్లాపడిన అర్చన తలమీద కొట్టాడు. గొడ్డలి లోపలపెట్టి బయటికి వచ్చాడు. తన కోడలు మేడపైనుంచి పడిపోయిందంటూ కేకలు పెట్టాడు. జనం గుమికూడారు. గొడ్డలిమీద వున్న వేలిముద్రలు అభిజిత్ బెనర్జి వేలిముద్రలేనని వేలిముద్ర నిపుణులు నిర్ధారించారు.

ఇంత అనర్థానికి కారణం అయిన ఆ ఉత్తరం ఎవరు రాశారో తెలుసుకొనే ప్రయత్నం చెయ్యసాగారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ గుహ ఉత్తరం పైన వున్న పోస్టర్ ముద్ర చూశాడు. అందులో రాసినట్టు అది బయట ఊరినుంచి రాలేదు. కలకత్తాలోని తకురియా అనే పేట నుంచి వచ్చింది. అక్కడవున్న ఫోటో స్టూడియోలన్నీ గాలించారు. "గేలార్డ్ స్టూడియో" యజమాని ఆ ఫోటోలు తనే తయారుచేశానని చెప్పాడు. ఆడశరీరానికి వేరే తల అతికించానని (ట్రిక్ ఫోటోగ్రఫీ) చెప్పాడు. అది శర్మిలాఘోష్ అనే యువతి కోరికపై అలా చేశానని చెప్పాడు. ఆమె అడ్రసు తీసుకొని ఇన్‌స్పెక్టర్ శర్మిలాను కలవడానికి వెళ్ళాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ను చూడగానే శర్మిల భయపడింది. ఆ తర్వాత వెక్కివెక్కి ఏడుస్తూ చెప్పింది.

"నేను ఇంత అనర్థం జరుగుతుందనుకోలేదు. ఒక అమాయకురాలి జీవితం బలి తీసుకోబోతున్నాని ఊహించలేకపోయాను. అనిల్ మీద కసి తీర్చుకోవాలనే చేశాను. ప్రతీకార జ్వాల నన్ను దహించివేస్తుంటే, నేను ఏం చేస్తున్నానో కూడా ఆలోచించలేకపోయాను. ఆ ఫోటోలో వున్న యువకుడు నా మేనమామ బొంబాయిలో వుంటాడు."

"మరి• ఆ స్త్రీ?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"నేనే"

"మరి అర్చన ముఖాన్ని ఎందుకు ఎంచుకున్నావ్?"

"చెప్పానుగా? అనిల్ మీద ప్రతీకారం తీర్చుకోవడానికి."

"ఎందుకూ?"

"మాములు కథే! అతన్ని ప్రేమించాను. అతనూ నన్ను ప్రేమించాడు. కాదు, నటించాడు. అతనికి వివాహం నిశ్చయమయింది. నేను నిలదీసి అడిగాను. "నీలాంటి బజారు వాళ్ళు సరదాకు పనికొస్తారు. అంతేకాని భార్యగా పనికిరారు" అని సమాధానం ఇచ్చాడు. నావళ్ళు, మనసు భగ్గుమన్నాయి. అతను నన్నే కాదు,

నాలాగే మరి కొందర్ని కూడా మోసం చేశాడని తెలిసింది. అర్చన మంచి పిల్ల! ఆ పిల్లను చంపింది నేనే ఇన్‌స్పెక్టర్! నాకు ఉరిశిక్ష వెయ్యండి!" అంటూ రెండు చేతులతో ముఖం కప్పుకొని ఏడవసాగింది.

అనిల్, శర్మిలా, అర్చన చావుకు ఒక విధంగా కారకులే అయినా చట్టం దృష్టిలో వారు దోషులుకారు. ఆమెను హత్య చేసింది ఆమె అత్తమామలే. కేసు కోర్టులో నడుస్తోంది. వాళ్ళిద్దరూ ప్రస్తుతం డమ్‌డమ్ సెంట్రల్ జైల్లో వున్నారు. జామీన్ ఇవ్వడానికి కోర్టు అంగీకరించలేదు.

మగవాడికి ఒక నీతి, ఆడదానికి ఒక నీతి చలామణిలో వున్న ఈ సమాజంలో స్త్రీకి ఇంతకంటే న్యాయం జరుగుతుందని ఆశించడం, వాస్తవాన్ని చూడలేకపోవడమే నన్నడంలో అతిశయోక్తిలేదు.

❀ ❀ ❀



# 16. కన్న కూతుర్ని చంపిన తండ్రి

అది కోటా నగరం 1980 జనవరి పదిహేడు. దాదాపు ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషనుకు ఒక ఫోన్ వచ్చింది. "ఫలానా కాలనీలో దేవేశ్ శర్మ అనే వ్యక్తి ఇంట్లో ఆయన కూతురు వందన హత్య చేయబడింది" అని ఫోన్ అందుతూనే సబ్‌ఇనస్పెక్టరు నిజానిజాలు తెలుసుకునేందుకు హుటాహుటిన దేవేశ్ శర్మ ఇంటికి వెళ్ళేడు. అతను టెలిఫోన్స్‌లో సూపర్ వైజరుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఇన్‌స్పెక్టరు దేవేశ్ శర్మ ఇంటికి వచ్చి అతన్ని బయటికి పిల్చి "మీ కూతురు వందన ఇంట్లో ఉన్నదా?" అని ప్రశ్నించేడు. శర్మ కళ్ళెర్రజేస్తూ "నువ్వసలు నా ఇంటికి ఎందుకు వచ్చావ్? నా కూతుర్ని గురించి వాకబు చెయ్యడానికి నీ కెంత ధైర్యం? మీ ఆఫీసరుకు ఫోన్‌చేసి ఇప్పుడే నీ అంతు తేల్చుకుంటాను?" అంటూ కేకలేశాడు.

సబిన్స్పెక్టరుకు చెమటలు పట్టాయి. ఆకాశరామన్న ఫోన్ కాల్ని నమ్మి ఒక గవర్నమెంటు ఆఫీసరు ఇంటికి రావడం పొరపాటని గ్రహించాడు. వెంటనే తిరిగి వెళ్ళిపోయాడు. అతను స్టేషనుకు వెళ్ళిన పది నిముషాలకే ముగ్గురు వ్యక్తులు వచ్చి దేవేశ్ శర్మ తన కూతుర్ని హత్యచేశాడని, రాతపూర్వకంగా రిపోర్టు ఇచ్చారు. ఆమె శవం బెడ్‌రూమ్‌లో పడి వుందని కూడా రాశారు. వెంటనే డెప్యూటీ సూపరెంటెండెంటు ఆఫ్ పోలీసు, తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్ళాడు. తిన్నగా దేవేశ్ శర్మ ఇంటికి వెళ్ళి సర్కిల్ ఇనస్పెక్టరుని బెడ్‌రూంలో చూడమని ఆదేశించాడు. దగ్గరగా ఉన్న బెడ్‌రూం తలుపుల్ని కొద్దిగా తెరచి చూసేడు. ఇనస్పెక్టరు ప్రతాప్‌సింగు. పెద్ద మంచం మీద ఒక ఆడపిల్ల ప్రక్కన దేవేశ్ శర్మ గొంతు వరకూ, రజాయి కప్పుకొని పడుకుని కనిపించాడు. శర్మ ఒక్కసారి మంచం మీద నుంచి దూకి, బెడ్‌రూం తలుపులు తెరచినందుకు ఇనస్పెక్టరు మీద రంకెలు వేయసాగాడు. డెప్యూటి సూపర్నెంటు దేవరాజన్ ఆ కేకలు విని లోపలికి వచ్చాడు. "ఇక్కడ ఒక హత్య జరిగిందని ఒక రిపోర్టు రావడంవల్ల మేంరావలసి వచ్చింది" అని చెప్పాడు. ఇనస్పెక్టరు బాస్‌తో తను చూసిన దృశ్యాన్ని గురించి చెప్పాడు.

"ఆ పిల్ల ఎవరు?" "నా కూతురు!" నీళ్ళు నములుతూ పోలీసు ఆఫీసరుకి సమాధానం ఇచ్చాడు శర్మ. దేవరాజన్ ముందుకు వెళ్ళి ఆ యువతి మీద ఉన్న రజాయిని లాగాడు. ఆ యువతి నిర్జీవంగా పడి ఉంది. "నువ్వేనా వందనని చంపింది." అని పోలీసాఫీసరు అడిగాడు. "లేదు! లేదు! చంపలేదు!"

"నువ్వు చంపకపోతే పోలీసులకి రిపోర్టు ఎందుకివ్వలేదు? నీ కూతురు శవం పక్కన రజాయి కప్పుకొని ఎందుకు పడుకున్నావ్?" శర్మ మౌనంగా తలవంచుకున్నాడు. శర్మ చేతులకు బేడీలు వేసి తీసుకు వెళ్తుంటే రోడ్డు మీద జనం అంతా పిచ్చి తిట్లు తిట్టారు. కొట్టబోయారు. జనాన్ని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు సతమతం కావలసి వచ్చింది. కూతురు మరణంతో పిచ్చిదానిలా ఏడుస్తున్న తల్లి నుంచి ఎలాంటి సమాచారాన్నీ, రాబట్టలేకపోయింది పోలీసు డిపార్ట్‌మెంటు.

పోస్టుమార్టం రిపోర్టు వచ్చింది. కాళ్లూ చేతులకి గట్టిగా తాళ్ళు కట్టిన ఆనవాళ్ళున్నై. ఒంటిమీద దాదాపు అరవై కొరడా దెబ్బల గుర్తులు ఉన్నాయి. పరీక్షలో ఆమెకు పురుష సంపర్కం ఉన్నట్టు తేలింది. ఆమె వయస్సు పదహారు, పదిహేడేళ్లు. దీనిని బట్టి ఈ హత్య వెనుక ప్రేమో, సెక్సో కారణం అయి ఉంటుందన్న నిర్ణయానికి వచ్చారు పోలీసులు.

పోలీసులు ఇరుగు పొరుగు వాళ్ళని ఎంక్వయిరీ చెయ్యగా తెలిసిన విషయం, ఆ ఇంటి పక్కనే ఉన్న జగదీశ్‌శర్మకు వందనంటే చాలా ఇష్టం. చిన్నతనం నుంచి కళ్ళముందు పెరగటం వల్ల కూతుర్లా ప్రేమించాడు. అతనే వివరాలు చెప్పాడు.

వందన ఇంటిపై భాగంలో "చంద్రప్రకాశ్" అనే కామర్సు విద్యార్థి ఉంటున్నాడు. వందనా, అతనూ ప్రేమించుకున్నారు. ఆ విషయం తండ్రికి ఆలస్యంగా తెలిసింది. దేవేశ్‌శర్మ 1979 నవంబరు 12వ తేదీన భవానీమండీకి భార్యతో కలిసి వెళ్ళాడు. ఆ రాత్రికి అక్కడే ఉండిపోయాడు. ఇంట్లో వందన, చెల్లెళ్లు రేణూ, మీనూ ఉండిపోయారు. రేణూ అర్థరాత్రి బాత్‌రూంకి వెళ్ళటానికి లేచింది. అక్కని పిల్చింది. అక్క మంచంమీద కన్పించలేదు. మెట్లెక్కి పైకి వెళ్ళింది. అక్కడ వందన, చంద్రప్రకాశ్ పడుకుని నిద్రపోతున్నారు. రేణూ అక్కని లేపింది. వందన గాభరాగా లేచి వచ్చింది. "అక్కా! అక్కడ ఎందుకు పడుకున్నావు!" అని అమాయకంగా అడిగింది రేణు. "చంద్రప్రకాశ్‌తో చదువుకోడానికి వెళ్ళి నిద్రొస్తే పడుకున్నాను. రేణు, అమ్మతో, నాన్నతో చెప్పకేం" అంటూ చెల్లెల్ని బ్రతిమాలుకుంది.

కాని రెండో రోజు తల్లీ తండ్రీ రాగానే రేణు తను చూసిన విషయం చెప్పేసింది. ఆ రాత్రి కాళ్లూ చేతులూ కట్టేసి, భార్య చేతికి కర్ర ఇచ్చి కూతుర్ని కొట్టమన్నాడు. ఆమె గోలగా ఏడుస్తూ రెండు దెబ్బలు కొట్టి పడిపోయింది. ఆ కర్ర తను తీసుకుని గొడ్డును బాదినట్టు బాదాడు. వందన ఆర్తనాదం విని, ఇరుగు పొరుగు వాళ్ళు వచ్చి ఆమెను రక్షించారు. ఈ సంఘటన జరిగిన తరవాత చంద్రప్రకాశ్ ఇల్లు ఖాళీ చేసి, చాలా దూరంగా పాత బస్తీలో ఇల్లు తీసుకున్నాడు. అయినా వందనా, చంద్రప్రకాశ్ కలుసుకుంటూనే ఉండేవారు. తండ్రి మాత్రం కూతుర్ని వెయ్యి కళ్ళతో కనిపెట్టి చూస్తూనే ఉన్నాడు. ఒకరోజు ఆ అమ్మాయి ధైర్యం చేసి తల్లితో అన్నది. "మమ్మీ నేను ప్రకాశ్‌ని ప్రేమిస్తున్నాను. నేనతన్ని పెళ్లి చేసుకుంటాను. నాన్న నన్ను చంపినా సరే! నా నిర్ణయానికి తిరుగులేదు."

సర్కిల్ ఇనస్పెక్టర్ చంద్రప్రకాశ్‌ను కలుసుకున్నప్పుడు. అతను వందనతో పరిచయం ఉన్నట్లు ఒప్పుకున్నాడు కానీ, ఆమెతో శారీరక సంబంధం ఉన్నట్లు



ఒప్పుకోలేదు. అందుకు పోలీసాఫీసరు "నీకూ వందన హత్యకూ ఏ సంబంధం లేదని తెలుసు! కాని పాపం! ఆ పిల్ల నీ కోసం తన ప్రాణాలను కూడా ఇచ్చింది. నువ్వేమో అంటి ముట్టనట్లు మాట్లాడుతున్నావు." ఆ మాటలు వినగానే చంద్రప్రకాశ్ భోరున ఏడ్చాడు. వాళ్ళిద్దరి మధ్య ఉన్న ప్రేమ సంబంధాన్ని ఒప్పుకున్నాడు.

జనవరి పదిహేడున వందన కాలేజీకి రాలేదని ప్రిన్స్‌పాల్ ద్వారా తండ్రికి తెలిసింది. ఆ రాత్రి తండ్రి వందనను కాళ్ళూ చేతులూ కట్టేసి, దూలానికి తలక్రిందులుగా వేలాడదీసి కొరడాతో కొట్టాడు. ఈ విషయంలో మరికొన్ని వివరాలు కూడా ఇరుగు పొరుగుల నుంచి తెలిశాయి.

దేవేశ్ శర్మ డబ్బు కక్కుర్తి మనిషి. స్వంత ఇల్లుంది. అన్ని వసతులూ ఉన్నాయి. అయినా అనేక మార్గాల్లో డబ్బు సంపాదించాలని ఉంది. చంద్రప్రకాశ్ డబ్బున్న కుర్రాడని తెలిసి, కూతుర్ని మొదట, మొదట అతనే ప్రోత్సహించాడట. వందన చంద్రప్రకాశ్‌ని నిజంగానే ప్రేమిస్తున్నదని తెలిశాక, అతను శర్మను లక్ష్య పెట్టడం మానేశాడు. వయస్సులో ఉన్నప్పుడు భార్యను కూడా డబ్బు సంపాదనకి ఉపయోగించాడనే అపవాదు ఉన్నది.

వందన మరో 3 నెలలకు చనిపోతుందనగా తండ్రి ఆమె పేరుమీద 40 వేల రూపాయలకు ఇన్సూరెన్సు చేశాడు.

నా సర్వీసులో కూతుర్ని చంపిన తండ్రిని మొదటిసారిగా అరెస్టు చేశానన్నారు పోలీసు ఇనస్పెక్టర్.

వందన దహన సంస్కారాలు జరగబోతున్నాయని తెలిసినప్పుడు భోరున ఏడుస్తూ తనని ఒక్కసారి అక్కడికి తీసుకెళ్ళమని పోలీసుల్ని ప్రాధేయపడ్డాడు. శర్మ ఎంతయినా పాపం! మరి తండ్రి హృదయం కదా!

దేవేశ్ శర్మ మీద ప్రస్తుతం కేసు నడుస్తున్నది.

❀ ❀ ❀

# 17. నరబలి

ఈ శతాబ్దంలో కూడా నరబలి ఇచ్చే మూర్ఖులు ఉన్నారు. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఇంకా ఇలాంటి సంఘటనలను వింటూ కూడా ఉంటుంటాం. ఎప్పుడో కాదు 1979, 17 అక్టోబర్‌లో ఇలాంటి అంధ విశ్వాసానికి బలి అయిన ఒక పసివాడి కథను చదవండి.

కనహయ్యాలాల్‌కు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె. ఆయన భార్య పేరు రాధారాణి. వపరియా అనే గ్రామంలో వీరు నివశిస్తున్నారు. పెద్ద కొడుక్కు పదమూడు సంవత్సరాలు, పేరు మనోజ్ కుమార్. చక్కగా ఆరోగ్యంగా ఉండేవాడు. చిన్న కొడుకు పేరు సరోజ్ కుమార్. వాడికి ఎనిమిది ఏళ్ళు. ఆడపిల్లకు ఐదేళ్ళు మనోజ్ ఏడోక్లాసు చదువుతున్నాడు.

ఆ రోజు వారింట్లో ఏదో పూజ జరగవలసి ఉన్నది. పెద్దలు ఆ ప్రయత్నంలో ఉన్నారు. పిల్లలు ఇంటి ముందు గోలీలు ఆడుకుంటున్నారు.

సాయంత్రం 5 గంటలకు మనోజ్ తల్లి దగ్గిరకు వచ్చాడు. "మమ్మీ! నేను హనుమాన్ గుడికి వెళ్ళి వస్తాను." అన్నాడు.

"అలాగే! త్వరగా రా బాబూ!" అన్నది తల్లి రాధారాణి.

గంతులు వేస్తూ పరుగులు తీస్తున్న మనోజ్‌కు కల్లూ, శంకర్ కన్పించారు. ముగ్గురూ కలిసి గుడికి వెళ్ళారు. ఆ గుడి ఊరి బయట ఉన్నది. దర్శనం చేసుకొని ముగ్గురూ పొలాలకు అడ్డంపడి ఊళ్ళోకి నడక సాగించారు.

శంకర్ వెళ్ళిపోయాడు. కల్లూ ఇల్లు మనోజ్ ఇంటి తర్వాత వస్తుంది. మనోజ్ ఆగి "కల్లూ! నువ్వు వెళ్ళిపో! నేను మా పెద్ద వదిన దగ్గిరకు వెళ్తాను." అన్నాడు. మనోజ్ పెద్దనాన్న కొడుకు లక్ష్మీప్రసాద్ భార్యను పెద్ద వదిన అంటాడు. ఆమె అంటే వాడికి ప్రాణం. కొంత దూరం వెళ్ళి మనోజ్ వెనక్కు తిరిగాడు. వదినను చూడటానికి వెళ్ళలేదు. అమ్మ త్వరగా రమ్మన్న విషయం గుర్తుకొచ్చింది. ఇంటివైపు వస్తుండగా, పక్కగా ఎవరో విజిల్ వేశారు. మనోజ్ తిరిగి చూశాడు. ఆ విజిల్ వేసిన వ్యక్తిని చూడగానే మనోజ్ "అరే నువ్వా!" అంటూ ఉత్సాహంగా అతనిదగ్గిరకు వెళ్ళాడు. మనోజ్ కోసం తల్లి దండ్రులు ఎదురు చూడసాగారు. ఎంతకూ రాలేదు. బాగా ప్రొద్దుపోయింది. ఇంట్లో వారికి గాభరా పట్టుకుంది. తండ్రి బంధువుల ఇళ్ళన్నీ తిరిగి చూశాడు. స్నేహితుల ఇళ్ళకు కూడా వెళ్ళాడు, మనోజ్ ఎక్కడా కన్పించలేదు.

కల్లూ లక్ష్మీప్రసాద్ ఇంటికి వెళ్తానన్నాడని లాల్ (మనోజ్ తండ్రి)కి చెప్పాడు. కానీ తీరా అక్కడకు వెళ్ళాక అతను వాళ్ళింటికి కూడా రాలేదని తెలిసింది.



రాత్రంతా తల్లీ దండ్రీ పిల్లవాడి కోసం ఎదురుచూస్తూ జాగారం చేశారు. తెల్లవారి పోలీసు రిపోర్టు ఇచ్చారు. పోలీసులు పెద్దగా శ్రద్ధ తీసుకున్నట్టు అన్పించక లాల్ యస్.పి. దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకున్నాడు.

ఎంక్వైయిరీ మొదలైంది.

79 అక్టోబర్ 21న పొలంలో గడ్డికోసుకుంటున్న ఒక స్త్రీ, పక్క పొలంలోని బావిలోకి ఇద్దరు మగవాళ్ళు తొంగిచూసి గబగబా వెళ్ళిపోవడాన్ని గమనించింది. ఆమె వెంటనే తనతోపాటు గడ్డి కోస్తున్న మరో ఆమెతో ఆ విషయం చెప్పింది. ఇద్దరూ కుతూహలం కొద్దీ, ఆ బావి దగ్గరకు వెళ్ళి తొంగి చూశారు. వాళ్ళకు ఒక పిల్లవాడి శవం తేలుతూ కన్పించింది. భయంతో అరుస్తూ ఊళ్ళోకి పరిగెత్తుకొచ్చారు ఆ స్త్రీలు.

అందరూ బావికేసి పరుగులు తీశారు. పిల్లవాడి శవం బయటకు తీశారు. మనోజ్ శవాన్ని చూసి కళ్ళనీళ్ళు పెట్టనివాళ్ళు లేరు. తల్లి విరుచుకొని పడిపోయింది. తండ్రి దుఃఖం చెప్పనలవికాదు.

ఇనస్పెక్టర్ టండన్ కేసు తీసుకున్నాడు. లక్ష్మీప్రసాద్ భార్యను ప్రశ్నించారు. లాల్ ఆమెకు మనోజ్ అంటే ప్రాణం అనీ, వాళ్ళను అనుమానించ వద్దనీ చెప్పాడు.

మనోజ్ శరీరం మీద కత్తి దెబ్బ ఉన్నట్టు తెలిసింది. ముందు చంపి బావిలో వేసినట్టు తేలింది. శరీరం మీద బట్టలు దూరంగా తుప్పలో దొరికాయి.

రెండు నెలలు గడిచినా హంతకుడి జాడ కానీ హత్యకు కారణాలు కానీ బయటపడలేదు. కేసు మరొకరికి జగ్గు అనే ఇనస్పెక్టర్‌కు అప్పగించడం జరిగింది.

అతను ముందుగా గడ్డి కోస్తూ బావిలోని శవం గురించి తెలుసుకొని చెప్పిన చిన్నాబాయిని కలుసుకున్నాడు.

బావిలోకి తొంగిచూసిన వారి గుర్తులు అడిగాడు. ఒకడు జులపాల జుట్టు వాడనీ, రెండోవాడి ముఖానికి మచ్చలు ఉన్నాయనీ ఆమె చెప్పింది. పోలీసు ఆఫీసరుకు జులపాల జుట్టువాడు కన్పించలేదు. కానీ, ముఖం మచ్చలవాడు కనిపించాడు. అతను లాల్ పెదనాన్న కొడుకు లక్ష్మీప్రసాద్. లక్ష్మీప్రసాదును ప్రశ్నిస్తే, ఆ సమయంలో తను మనోజ్ తండ్రి దగ్గరే ఉన్నట్టు చెప్పాడు. ఆ విషయాన్ని లాల్ కూడా అంగీకరించడంతో ఆఫీసరుకు ఏం చెయ్యాలో పాలుపోలేదు-

చివరకు మనోజ్ తండ్రినే జగ్గు (పోలీసు ఆఫీసరు) ఆ రోజు పొరుగూరి వాళ్ళెవరైనా జులపాలు గల వ్యక్తి ఆ ఊళ్ళో కన్పించారా అని వాకబు చేశాడు. లాల్ దుఃఖంతో తను గమనించలేదన్నాడు. కాని లాల్ తండ్రి మాత్రం ఏదో గుర్తుచేసుకుంటున్నట్టు కొంతసేపు ఆలోచించాడు.

"అవును, లక్ష్మీప్రసాద్ నౌకర్ భూరాసింగ్‌కు అన్న ఒకడు ఉన్నాడు. వాడికి జులపాలు ఉంటాయి. మనోజ్ అంత్యక్రియలు సమయంలో అతను కూడా ఉన్నాడు." అన్నాడు మనోజ్ తాత.

భూరాను పిలిపించి జగ్గు అతని అన్న గురించి అడిగాడు. తన అన్నకు జులపాలు ఉన్నాయనీ, అతను "కుండం" అనే గ్రామంలో ఉంటాడనీ, మనోజ్‌ను బావిలో నుంచి తీసిన రోజున ఈ ఊళ్ళోనే ఉన్నాడనీ చెప్పాడు.

"కుండం" పేరు వినగానే పోలీసు ఆఫీసర్ తృళ్ళిపడ్డాడు. ఆ ఊరు మంత్రాకులకు నిలయం. ఆ ఊరి మనుష్యులంటే ఆ జిల్లావారు భయపడ్తారు. ఆ ఊరు వారికి నరబలిమీద ఎంతో నమ్మకం అని కూడా అందరికీ తెలిసిన విషయమే. ఆ జులపాల వ్యక్తి పేరు గులజారీలాల్.

జగ్గు తన సిబ్బందితో కుండం వెళ్ళాడు. గులజార్ బస్‌స్టాండు దగ్గిర కాఫీ హోటల్ నడుపుతున్నాడు. ఆ రాత్రి పదకొండు గంటలకు హోటల్లోనే అతన్ని పోలీసులు అరెస్టు చేశారు.

పోలీసు లాకప్‌లో ముందు నిజం ఒప్పుకోలేదు. కాని తర్వాత నిజం చెప్పక తప్పలేదు.

## గులజార్ చెప్పిన కథ

అతని స్వగ్రామం ఉదయపురం. అతని తమ్ముడు భూరా లక్ష్మీప్రసాద్ ఇంట్లో నౌకరుగా ఉంటున్నాడు. గులజార్ భార్య కూడా హోటల్ చూసుకుంటూ ఉంటుంది. చాలా తెలివైనది. కాని వారికి సంతానం లేదు.

పూజలు చేశారు. ఎన్నో దేవుళ్ళకు మొక్కులు మొక్కారు. తావీదులు కట్టించుకున్నారు. అయినా సంతానం కలగలేదు.

ఒక సాధువును పట్టుకున్నాడు. "ఒక మంచి పిల్లవాడిని బలి ఇవ్వు. ఎలాంటి పిల్లవాడిని నువ్వు బలి ఇస్తే అలాంటి సంతానమే నీకు కలుగుతుంది" అని ఆ సాధువు చెప్పాడు.

అప్పటి నుంచి "ఉడనస్కూల్" దగ్గిరకు వెళ్ళి వచ్చేపోయే పిల్లల్ని చూడసాగాడు. అతనికి మనోజ్ నచ్చాడు. ఎలాగయినా మనోజ్‌ను ఆకర్షించే ప్రయత్నంలో పడ్డాడు. మధ్యాహ్నం సమయాల్లో స్కూలుకు వెళ్ళి గారడీ చేసి పిల్లల్ని ఆకర్షించేవాడు. మనోజ్‌ను బాగా ఆకర్షించాడు. మనోజ్‌కు గారడీ నేర్పిస్తానని చెప్పాడు. మనోజ్ సంతోషానికి హద్దులు లేవు. గారడీ ద్వారా బోలెడన్ని రూపాయలు పుట్టించవచ్చును అని చెప్పాడు.

18 అక్టోబర్ దేవీ పూజ రోజు. ఆ రోజు ఊరి బయట ఉన్న హనుమాన్ గుడికివస్తే గారడీ నేర్పిస్తానని చెప్పాడు గులజార్ మనోజ్‌తో.

ఆ రాత్రి తల్లితో "అమ్మా! నేను బోలెడన్ని రూపాయలు సంపాదించబోతున్నాను. దీపావళికి అందరికీ కొత్త బట్టలు కొంటాను. బోలెడన్ని టపాసులు కొంటాను. నీకు నగలు కూడా చేయిస్తాను." అంటూ ఉత్సాహంగా కబుర్లు చెప్పాడు. తల్లి నవ్వుకుంటూ విన్నది.

ఆ రోజు గోలీలు ఆడుకుంటూ ఉండగా గులజార్ విషయం గుర్తువచ్చింది. తల్లితో చెప్పి గుడికి బయలుదేరాడు. దారిలో ఇద్దరు స్నేహితులుకూడా కలిశారు.



వాళ్ళు పక్కన ఉన్నందువల్ల గులజార్, మనోజ్‌కు కన్పించకుండా దాక్కున్నాడు. మనోజ్ అతని కోసం ఎదురుచూసి చూసి నిరాశచెంది ఇంటికి బయలుదేరాడు. రాణీ వదినను చూడాలనుకున్నాడు. స్నేహితుల్ని పంపించివేశాడు. కాని తల్లి త్వరగా రమ్మన్న విషయం గుర్తు వచ్చి ఇంటి ముఖం పట్టాడు. చాటుగా అతన్ని అనుసరిస్తున్న గులజార్ ఈల వేశాడు. మనోజ్‌కు గులజార్ కన్పించగానే ఎక్కడలేని ఉత్సాహం కలిగింది. వెంటనే అతనితో బయలుదేరాడు.

మనోజ్‌ను ఊరి బయట పొలాల్లోకి తీసుకెళ్ళాడు. ఒక చెట్టు కింద ఇద్దరూ కూర్చున్నారు. మనోజ్‌ను బట్టలు విప్పమన్నాడు. మనోజ్, సిగ్గుపడ్డాడు. ఆ పని చెయ్యడానికి అంగీకరించలేదు. బట్టలు ఉంటే గారడీ మంత్రం పారదని నచ్చచెప్పాడు. మనోజ్ చివరకు అంగీకరించాడు. బట్టలు విప్పి కళ్ళు మూసుకొని చేతులు జోడించి, గులజార్ చెప్పినట్లు కూర్చున్నాడు. గులజార్ కూడా తన బట్టలు విప్పాడు. ఏవేవో మంత్రాలు ఉచ్చరించాడు. మనోజ్‌ను కూడా పల్లించమన్నాడు. కళ్ళు తెరపకూడదని శాసించాడు.

మంత్రం పూర్తి చేస్తూనే బొడ్లో నుంచి కత్తితీసి మనోజ్ పొట్టలో పొడిచాడు. మనోజ్ ఆర్తనాదం చేసి కిందపడ్డాడు. చేప పిల్లలా తన్నుకున్నాడు. శాశ్వితంగా కళ్ళుమూశాడు.

గులజార్ మనోజ్ పొట్ట నుంచి కొంత మాంసంతీసి ఒక సీసాలో వేశాడు. రక్తంతో సీసా నింపాడు. శరీరాన్ని బావిలోకి విసిరేశాడు. తను బట్టలు వేసుకొని, మనోజ్ బట్టలు తుప్పల చాటున పారేశాడు.

ఆ దారిన వెల్తున్న ట్రక్కులో ఎక్కి కుండం వెళ్ళాడు. ఆ సీసాను తల దగ్గిరగా పెట్టుకొని ఆ రాత్రి భార్యతో గడిపాడు. అలా చేస్తే పిల్లలు పుడతారని నమ్మకం.

తెల్లవారి ఆ రక్తమాంసాలతో భార్య చేత దేవీపూజ చేయించి, తిరిగి మనోజ్‌ను చంపిన ఊరు వచ్చాడు. అన్నకు ఎవరో మనోజ్‌ను చంపి బావిలో పారేశారని చెప్పాడు. మనోజ్‌ను బావిలో నుంచి తీయడానికి సహాయపడ్డాడు గులజార్.

"నువ్వు బావిలోకి తొంగి చూసినప్పుడు నీతో మరెవరైనా ఉన్నారా?" అడిగాడు పోలీసు ఆఫీసరు.

"లేరు, అసలు నేను బావి దగ్గిరకు వెళ్ళందే?" అన్నాడు గులజార్.

చిన్నాబాయికి కూడా పిల్లలు లేరని తెలిసింది. చిన్నాబాయి భర్త కాశీరాంకు కూడా ఇందులో భాగం ఉన్నదనే అనుమానం వచ్చింది. కేసు లక్ష్మీప్రసాద్ మీద పడెయ్యాలనే కుట్రతోనే చిన్నాబాయి మచ్చల ముఖం వ్యక్తి బావిలోకి తొంగి చూసిన ఇద్దరిలో ఒకడుగా చెప్పింది. అసలు బావిలోకి ఎవరూ తొంగి చూడలేదనీ, ఆమె కల్పించిన కట్టుకథేననీ తెలిసింది.

❀ ❀ ❀

# 18. రగిలేజ్వాల

1980వ సంవత్సరం. ఆరోజు సోమవారం.

శ్రీమతి సుమిత్రాదేవి ఎదురు చూసి చూసి విసిగిపోయింది. ఆమె ఎంతో ఆతృతతో ఎవరికోసమో వాకిలి కేసి చూస్తోంది. ఎవరికోసమో కాదు ఆ నిరీక్షణ కూతురు శ్యామలకోసం. ఆ పిల్ల కాలేజీ నుంచి ఇంత ఆలస్యంగా ఏనాడూ ఇంటికి రాలేదు. అందుకే ఆ తల్లి అంత ఆరాటపడుతోంది.

ఆమె, స్టడీరూమ్‌లో కూర్చుని వున్న భర్త దగ్గరకు వెళ్ళింది. ఆయన పేరు రంజన్‌దేవనాథ్.

"బేబీ ఇంకా రాలేదు" అన్నది సుమిత్ర భర్తతో కలవరంగా. "కొంచెం వెళ్ళి చూసి రాకూడదూ?" అన్నది మళ్ళీ.

"ఇప్పుడే పదకొండు అయింది ఏమిటా గాభరా? వస్తుందిలే" అన్నాడు రంజన్‌దేవనాథ్ తల ఎత్తకుండానే.

రంజన్‌దేవనాథ్ ఒక ప్రసిద్ధ బెంగాలీ రచయిత. ఆయన నాటకాలు చాలా రాశారు. కథలు రాశారు. నవలలు రాశారు. దాదాపు 255 పుస్తకాలు ప్రచురించారు. ఆయన వయసు 55 ఏళ్లు. ఆరోజు కూడా ఆయన ఒక నాటకం పూర్తిచేయటంలో మునిగి ఉన్నాడు. ఆరోజే దాన్ని ప్రచురణకు ఇవ్వాల్సి ఉన్నది. అందుకే పట్టించుకోలేదు. భార్యకు ఆయన వాలకం తెలుసు. ఏమీ అనలేక ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఒంటిగంటకు ఆయన నాటకం ముగించి లేచాడు. భార్య దగ్గరకు వచ్చాడు.

"బేబీ వచ్చిందా?" అని అడిగాడు.

"రాలేదు" భార్య కోపంగా సమాధానం ఇచ్చింది.

"వస్తుందిలే అన్నం వడ్డించు" అన్నాడు.

భోజనం చేసి మళ్ళీ తన స్టడీరూంలోకి వెళ్ళాడు. రాసి ముగించిన నాటకం తాలూకు చివరి అంకం ఒకసారి చదువుకొన్నాడు. గోడ గడియారం ఒకగంట కొట్టింది. చివ్వున తలెత్తి చూశాడు. మూడున్నర అయింది. భార్యను కేక వేశాడు. ఆమె వచ్చింది.

"బేబీ వచ్చిందా?"

"రాలేదు?" ఆమె దాదాపు ఏడుస్తూనే అన్నది.

అప్పుడు ఆయనకు తన తప్పు అర్థం అయింది. దిగులు పట్టుకొన్నది. తన పిల్ల లందరిలో శ్యామల చాలా నిదానంగా, సంయమనంగా ఉంటుంది. ఆమె ఇంట్లో చెప్పకుండా ఎక్కడికి వెళ్ళదు. రంజన్ తన రెండో కూతుర్ని పిల్చి కాలేజీకి వెళ్ళి



చూసిరమ్మని పురమాయించాడు. ఆ అమ్మాయి వెళ్ళింది. ఉదయం తొమ్మిది గంటలకే శ్యామల క్లాసు అయిపోయిందని తెలుసుకొన్నది. సెకెండ్ షిఫ్ట్ క్లాసులు కూడా అప్పటికి ముగిశాయి. ఆ విషయమే తండ్రికి ఆయన రెండో కూతురు శారద వచ్చి చెప్పింది.

రంజన్ గాభరాపడిపోయాడు. పెద్ద కొడుక్కి కబురు పంపించాడు. అతడి వయస్సు 30 సంవత్సరాలు. అతని పేరు మలాయి దేవనాథ్. అతనికి పెన్నుల దుకాణం ఉన్నది. చెల్లెలు కన్పించడం లేదని తెలియగానే అతను, తన తమ్ముడ్ని తీసుకొని స్కూటర్ మీద బయలుదేరాడు. రంజన్ తన మిత్రులతో టాక్సీలో బేబీని వెదకడానికి బయలుదేరాడు. సాయంత్రం ఆరుగంటలైంది.

రంజన్‌కు ఆకస్మాత్తుగా తాపస్ గుర్తొచ్చాడు. అతడ్ని శాంత్ అని కూడా అంటారు. వెంటనే తన మిత్రులతో వాళ్ల ఇంటికి వెళ్ళాడు. శాంత్ తల్లి నీహారిక తులసికోట దగ్గిర దీపాలు వెలిగిస్తూ కన్పించింది. ఆమెను? "శాంత్ ఇంట్లో లేడా" అని అడిగాడు.

"లేదు మధ్యాహ్నం రెండున్నరకు ఇంటికొచ్చాడు. చాలా హడావిడిగా ఉన్నాడు. భోజనం కూడా చెయ్యకుండా వెళ్ళిపోయాడు. శ్యామల మా ఇంటికి రాలేదు" ఆగి ఓక్షణం ఆలోచించి "అది సరే. మీరు వాళ్ళిద్దర్నీ వెదుకుతున్నారెందుకు?" అని అడిగింది నీహారిక.

రంజన్ కజిన్ దీపక్‌దేవనాథ్. "శాంత్ వస్తే మా ఇంటికి రమ్మని చెప్పండి" అంటూ బయటికి నడిచాడు. రంజన్ అతని వెనకే దిగులుగా నడిచాడు.

రంజన్ రెండో కూతురు - శ్యామల క్లాసుమేట్ అనిత ఇంటికి వెళ్ళింది.

"శ్యామల ఇంకా ఇంటికి రాలేదా? ఆశ్చర్యంగా వుందే? తొమ్మిదింటికి క్లాసు అయిపోయింది. మాతోపాటు బస్‌స్టాండుకి వచ్చింది." ఏదో ఆలోచిస్తూ అన్నది అనిత.

"బస్‌స్టాండ్‌కు వచ్చిందా? బస్ నీతోపాటు ఎక్కిందా?" అని అడిగింది శ్యామల అక్క.

"లేదు. మేం బస్ కోసం చూస్తున్నాం. అప్పుడే శాంత్ వచ్చాడు. కాఫీ తాగాలని డబ్బు అడిగాడు. తన దగ్గర చిల్లర లేదన్నది శ్యామల. కాని అతను వదల్లేదు. శ్యామల విసుగ్గా ఐదురూపాయల నోటు ఇచ్చింది. అతను వెళ్ళిపోయాడు. పదిహేను నిమిషాల్లో తిరిగొచ్చి శ్యామలతో మాట్లాడాలన్నాడు. ఒంటరిగా మాట్లాడాలన్నాడు. ముందు ఆమె అంగీకరించలేదు. ఆ తర్వాత అతను జిడ్డులా పట్టుకోవడంతో బస్‌స్టాండు నుంచి కొంచెం దూరంగా వెళ్ళింది. ఈలోగా బస్ వచ్చింది. నేను వచ్చేశాను. ఇంతవరకు శ్యామల ఇంటికి రాలేదంటే నాకు భయంవేస్తోంది. ఇవ్వాళ శాంత్ ఒక్క క్లాసుకు కూడా రాలేదు. బస్‌స్టాండులోనే కన్పించాడు. అతని చేతిలో పుస్తకాలులేవు" అన్నది అనిత. ఆ విషయం కూతురు ద్వారా విన్న రంజన్ ఆలోచనలో పడ్డాడు. శాంత్ తల్లి చెప్పిన విషయాలను మననం చేసుకోసాగాడు. శాంత్ ఒకటిన్నరకు ఇంటికి వస్తే మరి బేబీ ఎందుకు రాలేదు.

శాంత్ అదోలా ఉన్నాడనీ. అన్నం తినకుండా వెళ్లిపోయాడనీ అతడి తల్లి చెప్పింది? అతడు ఎక్కడికెళ్లి ఉంటాడు? బేబికి ఏమైంది? ఇద్దరూ కలసి తిరుగుతున్నారా? బేబీ అలా చెయ్యదు. మరి బేబీ ఇంకా ఇంటికెందుకు రాలేదు? ఇక పోలీసు కంప్లైంటు ఇవ్వక తప్పదు.

రంజన్ తన మేనల్లుడు దీవక్‌ను పిల్చి చందన్‌నగర్ పోలీసుస్టేషన్‌లో రిపోర్టు ఇచ్చి రమ్మన్నాడు.

రాత్రి తొమ్మిది గంటలైంది. అందరూ మౌనంగా అలసిపోయినట్టుగా కూర్చొని ఉన్నారు. అదే సమయంలో చందన్‌నగర్ పోలీసుస్టేషన్‌కు సంబంధించిన ఒక కానిస్టేబుల్ వచ్చి తలుపు తట్టాడు.

రంజన్ దేవనాథ్ పరుగులో వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదురుగా నిల్చున్న కానిస్టేబుల్ని చూస్తూ "బేబీ దొరికిందా?" ఉద్వేగంగా అడిగాడు.

"మీరు పోలీసుస్టేషన్‌కు రావాలి. మీ అమ్మాయి అక్కడే ఉంది."

రంజన్ మనసులో అనేక ప్రశ్నలు తలెత్తాయి. అయినా మౌనంగా ఉండిపోయాడు. కొడుకు లిద్దర్నీ, మేనల్లుడ్నీ పోలీసు స్టేషన్‌కు పంపించాడు. అక్కడ వాళ్లకు శాంత్ కన్పించాడు. అతని జుట్టు రేగి ఉంది. ముఖంలో రక్తం గడ్డకట్టుకున్నట్టుగా ఉంది.

పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ వాళ్ళను గవర్నమెంటు కాలేజీకి తీసుకెళ్ళారు. అక్కడ రెండో అంతస్థులో మెట్ల పక్కగా శ్యామల ఉరఫ్ బేబీ శవం పడివుంది. శవం మీద తెల్లటి దుప్పటి కప్పి ఉంది. పోలీసు బందోబస్తే ఉంది. కూతురి మరణవార్త ఫోన్‌లో వినిపించారు రంజన్‌కు. అతను భార్యను తీసుకొని కాలేజీకి వచ్చాడు. ఆ తల్లితండ్రుల దుఃఖం వర్ణనాతీతం. శవాన్ని పోస్టుమార్టమ్ కొరకు పంపించారు.

శాంత్ స్వయంగా పోలీసుస్టేషన్‌కు వెళ్ళి తాను శ్యామలను గొంతు పిసికి చంపినట్టుగా చెప్పాడు. భారతీయ న్యాయశాస్త్రంలోని 302 సెక్షన్‌కింద అతనిమీద కేసు పెట్టి అతడ్ని అరెస్టు చేసారు. ఆరాత్రి ఇన్‌స్పెక్టర్‌తో ఉద్రేకంగా అన్నాడు శాంత్.

"సార్ బేబీ నా స్వంతం. బేబీ మరొకరి సొత్తు కావడం నేను భరించలేను."

"శ్యామల మరెవర్నయినా ప్రేమించిందా" ఇన్‌స్పెక్టర్ ప్రశ్న.

"లేదు. ఆమె ఒక మంచుగడ్డ లాంటిది" అన్నాడు శాంత్.

"అంటే?"

"ఆమెకు ప్రేమంటే తెలియదనుకొంటాను. ఆమె ఎవర్నీ ప్రేమించలేదు ప్రేమ మనిషిని ఎలా దహించి వేస్తుందో ఆమెకు అర్థంకాదు. నేను ఆమెను ప్రేమించాను. నా ప్రేమను ఆమె తిరస్కరించింది. అందుకే ఆమెను చంపేశాను"

అతని కంఠం రుద్ధమైంది.

కళ్లు తుడుచుకున్నాడు.

"ఆమె ఆదర్శమూర్తి. నన్ను ఉన్నత శిఖరాల మీద నిలబెట్టాలని చూసింది



నన్ను డాక్టర్ను చెయ్యాలనుకొన్నది. తన ఖర్చులు తగ్గించుకొని నాకు సహాయం చేసేది."

"నేను ఆమెనుంచి ఆశించినది నిష్కామస్నేహం కాదు. ప్రేమ, పెళ్లి. ఆమె మనసునూ, శరీరాన్నీ కూడా నావిగా చేసుకోడానికి ప్రయత్నించాను.

"ఆరోజు అసలు విషయం తేల్చేసుకోవాలనుకొన్నాను. అర్జంటుగా ఒక విషయం ఏకాంతంగా మాట్లాడాలంటూ ఆమెను కాలేజీకి తీసుకొచ్చాను. రెండో అంతస్తులోకి తీసుకెళ్ళాను. ఆ సమయంలో అక్కడికి ఎవ్వరూ రారని నాకు తెలుసు.

ఆమెతో నా ప్రేమ గురించి చెప్పాను.

ఆమె కిలకిలా నవ్వింది. తనకు నామీద ఉన్నది కేవలం స్నేహభావం మాత్రమేనని చెప్పింది. నీతులు బోధించసాగింది.

కాని నాకు కోపం వచ్చింది. నేను ఆమెను ప్రేమిస్తున్నాననీ నన్ను పెళ్లిచేసుకోవాలనీ అన్నాను.

ఆమె ముఖం గంభీరంగా మారింది. కళ్ళల్లో క్రోధం కనిపించింది.

"నిన్ను నేను ప్రేమించలేదు. ఇకముందు కూడా ప్రేమించను. ప్రేమించలేను. అలాంటి పిచ్చి ఆశలు పెట్టుకోకు" అంటూ వెళ్ళడానికి వెనుకకు తిరిగింది.

కోపంతో నేను పిచ్చివాడ్నే అయ్యాను. వెనుక నుంచి ఆమె గొంతు పట్టుకొన్నాను. కేవలం భయపెట్టడానికే.

కాని ఆమె భయపడలేదు. అరవలేదు. "నువ్వు చంపినాసరే నేను మాత్రం నిన్ను భర్తగా భావించలేను. స్వీకరించలేను. మంచి మిత్రుడిగా మాత్రమే చూడగలను" అన్నది తాపీగా.

"నాలో కోపం కోరలు చాచి బుసలు కొట్టింది. నాచేతులు ఆమె కంఠం చుట్టూ బిగుసుకుపోతున్నాయి. ఆమె పెనుగులాడలేదు. అకస్మాత్తుగా శ్యామల శవంగా మారినట్టు గుర్తించాను. ఒక్కసారిగా వదిలేశాను. ఆమె కింద కుప్పగా కూలిపోయింది. అప్పుడు నాకు బాధ అనిపించలేదు. ఇప్పుడూ అనిపించడంలేదు. శ్యామల నా మనిషి. మరొకరి భార్య కావడానికి వీల్లేదు. ఆమె చనిపోయింది. నా మనిషిగానే చనిపోయింది. ఆమెను చంపి, ఆమె కారణంగానే ఆమెను తల్చుకుంటూ శేషజీవితాన్ని జైల్లో గడుపుతాను. అందుకే స్వయంగా వచ్చి అపరాధం అంగీకరించాను" అన్నాడు శాంత్.

పోలీసులు కోర్టులో కేసు నమోదు చేశారు.

శాంత్ తండ్రి అతడ్ని చూడటానికి జైలుకు వెళ్ళలేదు. కనీసం కొడుకు తరపున వాదించడానికి లాయర్ని కూడా పెట్టలేదు.

❀ ❀ ❀

# 19. మృగం

(నిజాం పరిపాలనలో ఉన్నప్పుడు హైదరాబాదు నగరంలో జరిగిన భయంకర సంఘటన. ఇది 1942లో జరిగింది. "సురాగ్‌రసానీ - తప్తీష్" అనే పుస్తకం నుంచి తీసుకొన్న కథ ఇది. ఈ నేరాలకు సంబంధించిన పుస్తకం వ్రాసిన శ్రీముర్తజీ అలీఖాన్, హైదరాబాద్ స్టేట్ రిటైర్డ్ న్యాయమూర్తి. అంతేకాదు ఆయన ఈ కేసును దర్యాప్తు చేసి అపరాధిని ఉరికంబం ఎక్కించిన ఫజల్‌రసూల్ సుపుత్రుడు.)

సి.ఐ.డి. ఇన్‌స్పెక్టర్‌గా "ఫజుల్ - రసూల్‌ఖాన్" హైదరాబాదు స్టేట్‌లో ఎంతో పేరు ప్రతిష్ఠల్ని సంపాదించుకున్నాడు. ఆయన కేసు తీసుకొన్నాడంటే, అపరాధి ఎంత తెలివైనవాడైనా ఉచ్చులో బిగిసినట్టే భావించేవారు. రసూల్‌ఖాన్ సాహెబ్ అంటే పెద్దపెద్ద పోలీసు ఆఫీసర్లు సైతం ఎంతో గౌరవించేవాళ్ళు. నేరస్తుల్ని శారీరకంగా హింసించకుండానే వాళ్ళనుంచి నిజం కక్కించగల తెలివితేటలు గలవాడు.

ఆ రోజుల్లో హైదరాబాదు పోలీసుస్టేషన్స్‌లో మూడు రకాల రిజిష్టర్లు ఉండేవి. "అలీఫ్" "బే" "జీమ్" అనే పేర్లతో వ్యవహరింపబడేవి ఆ రికార్డులు. మొదటి రిజిష్టర్‌లో దొంగసొమ్ము కొనేవాళ్ళ పేర్లూ, మొహరమ్, హోలీ మొదలైన పర్వదినాలలో కలహాలను రేపే వాళ్ళ పేర్లూ నమోదు చెయ్యబడి ఉండేవి. రెండవ రిజిస్టర్ (బే)లో ఒకసారి దొంగతనం చేసి పట్టుబడిన వారి పేర్లుండేవి. ఆ రిజిస్టర్‌లో పేర్లు ఎక్కిన వ్యక్తులు ప్రతి గురువారం రాత్రి పోలీసుస్టేషన్‌లో రిపోర్టు చేయాలి. గురువారాన్ని ఉర్దూలో జుమ్మేరాత్ అంటారు. జుమ్మేరాత్ బజార్ అని పిలవబడేచోట దొంగ వస్తువులు దొరుకుతాయి ఈనాటికీ. ఆ రోజుల్లో శుక్రవారం పబ్లిక్‌హాలిడే వుండేది. 'జీమ్' రిజిస్టర్‌లో తరచుగా అపరాధాలు చేసే పాతకేడీల పేర్లుంటాయి. వీళ్లు ప్రతిరాత్రీ పోలీసు స్టేషన్‌లో పడుకోవాలి. శుక్రవారం అయితే పగలూ రాత్రి కూడా పోలీసు స్టేషన్‌లోనే వుండాలి.

మహబూబ్ మీర్జా పేరు రిజిస్టర్ జీమ్‌లో వుంది. సి.ఐ.డి. ఆఫీసరు రసూల్‌ఖాన్‌కు ఇటీవల మహబూబ్‌మీర్జా చాలా జోరుగా డబ్బు ఖర్చు పెడుతున్నాడనీ మహా హుషారుగా వుంటున్నాడనీ తెలిసింది. మీర్జాను స్టేషనుకి పిలిపించాడు.

"ఏరా నాయనా! ఏమిటి సంగతి మహా జోరుగా వున్నట్టున్నావు" అన్నాడు ఖాన్.

"అల్లా సాక్షిగా సర్కార్, నేనేం తప్పు చేయలేదు. నవాబు రుక్నుద్దీన్‌వద్ద నోటు వ్రాసి అప్పు తీసుకున్నాను. కావాలంటే ఆయననే అడగండి" అన్నాడు. అంతటితో రసూల్‌ఖాన్ అతడిని వెళ్ళిపొమ్మన్నాడు. మళ్ళీ కొన్నాళ్ళకు మీర్జా నవాబుబిడ్డలా షా...



చెలాయిస్తున్నాడని రసూల్‌కు కబురందింది. పైగా రోజూ స్నేహితులతో కలిసి బార్స్‌కు వెళ్లడం, లెక్క లేకుండా డబ్బు ఖర్చు పెట్టడం కూడా పోలీసువారి దృష్టిలో పడింది.

రసూల్‌ఖాన్ మళ్ళీ మిర్జాను పిలిపించాడు. మళ్ళీ అదే సమాధానం. ప్రామిసరీ నోటు కూడా చూపించాడు. నవాబు సాహెబ్ ఒక కేడీకి ఇంతింత డబ్బు ఎందుకిస్తున్నాడనే సందేహం వచ్చింది. మామూలు వాళ్ళను సంజాయిషీ అడిగినట్టు నవాబు రుక్నుద్దీన్‌ను అడగడం సాధ్యం కాదు. బాగా ఆలోచించి తన విశ్వాస పాత్రుడైన ఒక అసిస్టెంటును పిల్చి, రసూల్‌ఖాన్ విషయం వివరించి చెప్పాడు. "రహీమ్. నువ్వు నవాబ్‌తో స్నేహం చెయ్యాలి. ఎలాగయినా అతని అభిమానాన్ని చూరగొని అతని జీవిత విధానాన్ని పరిశీలించాలి" అని చెప్పాడు.

రుక్నుద్దీన్ ఇల్లు యాకుత్‌పురాలో వుంది. అతనికి ఎప్పుడూ చుట్టూ జనం వుండాలి. సరదాపురుషుడు. రహీమ్ స్వభావరీత్యా ఎవరితోనైనా ఇట్టే స్నేహం చెయ్యగలడు. మంచినేర్పరి. రహీమ్ చొరవకు నవాబ్‌సాహెబ్ ముగ్ధుడయ్యాడు. తన మిత్రమండలిలో ఒకడిగా చేర్చుకున్నాడు.

"నవాబ్ సాహెబ్! మీ జాగీరు చూడాలనివుంది. చూపిస్తారా?" అని అడిగాడు ఒకరోజు రహీమ్.

"బీదర్‌జిల్లా. అహమద్‌పూర్ తాలూకాలో వుంది. నా జాగీరు పేరు సలంగా. ఒకప్పుడు ఆ జాగీరుకు అధికారిణి శుజావత్ బేగం. ఆమెకు నేను సలహాదారుగా వుండేవాడ్ని. కొంతకాలం క్రితం బేగమ్ తన కూతురు ఇమ్‌త్యాజ్‌బేగంతో హైదరాబాదు వచ్చి ఈ మహల్‌కొని ఇక్కడే స్థిరపడింది. నవాబ్ సాహెబ్, ఇంతవరకు ఈ ఇంట్లో ఆడవాళ్ళున్నట్టు కన్పించలేదే నాకు?" అన్నాడు రహీమ్.

రుక్నుద్దీన్ ఓక్షణం ఏం చెప్పాలో తోచనివాడిలా తికమక పడ్డాడు.

వెంటనే తేరుకుని, "అమ్మాకూతుళ్ళు అజ్‌మేర్ వెళ్లారు" అన్నాడు.

"బేగం గారు వితంతువా?"

"కాదు భర్త విడాకులిచ్చాడు"

"ఆమె వయసు ఎంతుంటుంది?"

"మరీ ఎక్కువేంకాదు" అంటూ ఏదో సందేహం వచ్చిన వాడిలా తలెత్తి రహీం ముఖంలోకి చూసి "ఇవన్నీ ఎందుకు అడుగుతున్నావో తెలుసుకోవచ్చా?" అన్నాడు నవాబు.

రహీమ్ కొంటెగా చూస్తూ "నువ్వు అందగాడివి. పూలరంగడివి. ఇంకా ఆ బేగం వయసులో వుండి అందంగా వుంటే"

"ఊ ... ఉంటే" ముసి ముసిగా నవ్వుతూ అడ్డొచ్చి అడిగాడు.

"ఇద్దరూ ఒకే ఇంట్లో - - ఆహా ఒకే గదిలో ---"

రుక్నుద్దీన్ పెద్దగా హాయిగా నవ్వేడు.

వాళ్ళిద్దరి మధ్యా రోజు ఇలాంటి మాటలే నడిచేవి. రహీమ్ అతన్ని ఉత్తేజపరుస్తూ వుండేవాడు. ఒకరోజు మాటల్లో రుక్నుద్దీన్ రహీమ్‌తో "నేనిక్కడ బేగం విరహతాపంలో కాకిలా కాగిపోతున్నాను. అక్కడ ఆవిడగారు ఆజ్‌మేర్ నుంచి జాగీర్‌లోకి వెళ్ళికూర్చుంది" అన్నాడు.

"ఇంతలోకే ఏం కొంప మునిగిపోయిందిలే. మరో నాలుగైదురోజులు ఆగు. ఆ తర్వాత వడ్డీతో సహా --" ఆగి అతని ముఖంలోకి చూశాడు.

"నీకు ఎగతాళిగా ఉంది. నాఅవస్థ నీకు అర్థం కాదు" నవ్వుతూ అన్నాడు "ఎవరైనా నమ్మకస్థుడైన మనిషిని చూడవోయ్. ఈ రోజుల్లో నమ్మకస్తులు దొరకడం లేదు. ఇంటి నౌకర్లు నమ్మకస్తులు కాకపోతే అనేక ఇబ్బందులొస్తాయి" అన్నాడు నవాబ్.

రహీమ్ రెండోరోజే ఒక యువకుడ్ని వెంట బెట్టుకొని వచ్చాడు. అతని పేరు రహమాన్.

కొద్దిరోజుల్లోనే రహమాన్ యజమాని అభిమానాన్ని చూరగొన్నాడు.

మరో రెండువారాలు గడిచాయి. బేగం రాలేదు. నవాబు, బేగం సలంగా నుంచి బెంగుళూరు వెళ్ళిందనీ, ఎప్పుడు వస్తుందో తెలీదనీ అన్నాడు.

ఆ విషయం రహీమ్ ఖాన్‌సాహెబ్‌కు చెప్పాడు. ఆయన ఆలోచనలో పడ్డాడు. ఇందులో ఏదో గోల్‌మాల్ వుందని వూహించాడు. రహమాన్ కూడా సి.ఐ.డి డిపార్టుమెంటుకు సంబంధించిన వ్యక్తే. ఇద్దరూ ఎప్పటికప్పుడు ఖాన్‌కు సమాచారం అందిస్తూనే వున్నారు. అయినా ఖాన్‌కు ప్రత్యేకమైన 'క్లూ' ఏమీ దొరకలేదు.

క్రమంగా తెలిసిన కొన్ని వివరాలు - - - నవాబ్ ఎక్కువగా ఇంటివద్దే వుంటాడు. స్నేహితులను సాధారణంగా ఇంటికి రానివ్వడు. బయటే పార్టీలు ఏర్పాటు చేస్తాడు. కేవలం మహబూబ్ మీర్జామాత్రం అప్పుడప్పుడు వస్తాడు. మహబూబ్ వచ్చినప్పుడు రహమాన్‌ను అక్కడ్నించి ఏదో వంకతో పంపించడానికి ప్రయత్నించేవాడు. రహీమ్ పోలీసుల గురించి, ముఖ్యంగా రసూల్‌ఖాన్ గురించి మాట్లాడితేచాలు జంకిపోయినట్టు కన్పించేవాడు. ఆ యింట్లో ఒక గది మాత్రం ఎప్పుడూ తాళం వేసే వుంటుంది.

సి.ఐ.డి. ఆఫీసర్ రసూల్‌ఖాన్‌కు పై వివరాలు చాలు రంగంలో దిగడానికి.

రహమాన్‌ను పంపించి ఆ గది తాళానికి డూప్లికేటు తాళంచెవి తయారుచేయించి, ఆ గదిలో ఏముందో చూసి చెప్పమని ఆదేశించాడు. రహమాన్ రుక్నుద్దీన్ బయటికి వెళ్లినప్పుడు తాళం సంపాదించి తలుపుతెరిచి చూశాడు. గదిలో ఏమీలేదు. గది గోడలకు కొత్తగా సున్నం కొట్టివుంది. నేల ఎర్రమట్టితో అలికివుంది.

రసూల్‌ఖాన్ ఆదేశంమేరకు రహీమ్ నవాబును గండిపేట పిక్నిక్‌కి తీసుకెళ్ళాడు. వాళ్ళు అటు వెళ్ళగానే ఖాన్ సాహెబ్ అహమ్మద్ అనే అసిస్టెంటును తీసుకొని నవాబు ఇంటికి వచ్చాడు. వాళ్ళ కోసమే ఎదురుచూస్తున్న రహమాన్ గది తాళం తీసి తలుపు తెరిచాడు. ఖాన్ గదంతా కలయజూచాడు. అకస్మాత్తుగా అహమ్మద్ కేసి తిరిగి "మీ ఇంటికి సున్నం కొట్టించి నేల అలుకుతారా?" అని అడిగాడు.



"చేస్తాం సాబ్"

"ముందు నేల అలుకుతారా? గోడలకు సున్నం కొడతారా?"

"సాధారణంగా ముందే సున్నం కొడ్తారు. సున్నపు మరకలు నేలమీద పడతాయి కదా?"

"ఈ గదినేల, ముందు ఎర్ర మట్టితో అలికారు. ఆతర్వాతే సున్నం కొట్టారు. అలా ఎందుకు జరిగి వుంటుందంటావ్?"

అహమ్మద్ వెర్రిముఖం వేశాడు.

రసూల్‌ఖాన్ నేల మీద కూర్చుని వేళ్ళతో మోగించసాగాడు. గదిలో మూడోవంతు భాగం డొల్లగా వుందని అర్థమయింది. బయటికి వచ్చి రహమాన్‌తో తాళం వేయమని చెప్పి అహమ్మద్‌తో వెళ్లిపోయాడు.

రెండోరోజు రహీమ్‌తో చెప్పాడు, "నువ్వూ రహమాన్, అతన్ని పోలీసులెందుకో అనుమానిస్తున్నారని చెప్పండి. బేగంనూ, ఆమె కూతుర్ని కూడా వెదుకుతున్నారని చెప్పండి. అతను భయపడినట్టు కనపడగానే నిజం చెప్పమని అడగండి. పోలీసులకు లంచాలిచ్చి కేసు మాఫీ చేయిస్తామని నమ్మకం కుదిరేలా చెప్పండి."

"అలాగే సాబ్" అన్నాడు రహీమ్.

ఆ రోజంతా రహీమ్ దిగులుగా వున్నట్టు నటించాడు. "ఏమిటోయ్ అలా వున్నావు" అడిగాడు నవాబు. అతను మాట్లాడలేదు.

"ఏదైనా బాధవుంటే చెప్పు!" అన్నాడు నవాబ్.

"నాకేం బాధలేదు, నా దిగులంతా మీ గురించే!"

"నా గురించా?"

"అవును. మిమ్మల్ని సి.ఐ.డి లు వెంబడిస్తున్నారని తెలిసింది."

నవాబు ముఖం వెలావెలా పోయింది.

"సి.ఐ.డీలు నన్ను వెంబడించటం ఏమిటి? నీకు భ్రమ కలిగివుంటుంది!" పేలవంగా నవ్వుతూ అన్నాడు నవాబు.

"నేను చెప్పేది నిజమే. బహుశా పోలీసువారికి జాగీర్‌దారిణి కనిపించడం లేదని అనుమానం వచ్చినట్టుంది. సి.ఐ.డి. ఆఫీసులో నాస్నేహితుడొకడున్నాడు. వాడే నాకు చెప్పాడు. నాదగ్గర దాపరికం ఏమిటి? ఏమైనా వుంటే చెప్పు. తినేవాళ్ళకు తినిపించి చెప్పగలిగినవాళ్ళకు చెప్పి మాఫీ చేయించడానికి ప్రయత్నిద్దాం" అన్నాడు రహీమ్.

"రహీమ్ భాయీ, నన్ను రక్షించేభారం నీదే. నేను బేగంను ఆమె కూతుర్ని చంపి ఒక గదిలో పూడ్చి పెట్టాను" రెండు చేతులూ పట్టుకొని అర్థించాడు.

"బాప్‌రే అంత ఘోరం చేశారా! చేస్తే చేశారుగానీ ఇంకెవరికీ చెప్పకండి. అది పైకి రాకుండా చూసే బాధ్యత నాది." అన్నాడు రహీమ్. నవాబు రిలీఫ్‌తో నిట్టూర్చాడు.

సమయం చూసుకొని రహీమ్ రసూల్‌ఖాన్‌తో ఈ విషయం చెప్పి, వెంటనే అతడ్ని అరెస్టు చెయ్యవలసిందిగా కోరాడు.

ఖాన్ చిరునవ్వు నవ్వాడు. "తొందరపడకు. ఇంకా వివరాలు కావాలి. తగిన సాక్ష్యాధారాలు లభించకపోతే ఇంట్లో ఏ ఎముకల గూడో దొరికినా ప్రయోజనం లేదు. మరి కొందరు వినేలా అతనిచేత జరిగింది చెప్పించు." అన్నాడు.

రహీం, ఆ సాయంత్రమే నవాబు రుక్నుద్దీన్‌ను ఒకబార్‌కు తీసుకువెళ్ళి, ఒక ప్రత్యేకమైన గదిలో కూర్చోబెట్టాడు. ఆ గది ఖాళీగా వుంది. ఇద్దరూ మౌనంగా తాగుతూ కూర్చున్నారు కొంతసేపు.

"ఇప్పుడు చెప్పు. నన్నిక్కడి కెందుకు తీసుకొచ్చావో?" రుక్నుద్దీన్ అడిగాడు.

"నిన్నరాత్రి నేను మీ ఇంటినుంచి వెళ్తూ ఇంటివెనక ఎవరో తచ్చాడటం చూశాను. వాడు సడన్‌గా నన్ను లంకించుకుని, ప్రశ్నలడగ సాగాడు. ఆ ప్రశ్నల్నిబట్టి అతడు సి.ఐ.డి. కి చెందిన మనిషి అనుకున్నాను---" చెప్తూ తలెత్తి ఎదురుగా వున్న స్ప్రింగ్ డోర్ కేసి చూశాడు రహీమ్.

నవాబు కూడా అతను చూసినవైపు తలతిప్పి చూశాడు. ఒక పోలీసు కానిస్టేబుల్ స్ప్రింగ్ డోర్ నెట్టి తల లోపలకు పెట్టి, మళ్ళీ వెంటనే వెనక్కు తీసుకున్నాడు.

"చూశావా పోలీసు వాళ్ళు ప్రింట్‌లేదు వున్నారు. నిన్ను గమనిస్తూనే వున్నారు" అన్నాడు రహీం. రుక్నుద్దీన్‌కు చెమట్లు పోశాయి.

"భయపడకు, నేను చూస్తానన్నానుగా. అసలు సంగతి చెప్పు"

"చెప్పేనుగా! బేగంనూ ఆమె కూతుర్నీ ఆర్నెల్ల క్రితం చంపి ఇంట్లోనే ఒక గదిలో పూడ్చి పెట్టాను. ఇదుగో ఈ డబ్బు ఎలాగైనా పోలీసులకు తినిపించి నన్ను రక్షించు---"

స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని ఖాన్ చేతిలో పిస్తోలుతో ప్రవేశించాడు. అతనితో ఇద్దరు పోలీసులుకూడా వున్నారు. రుక్నుద్దీన్ బిత్తరపోయి నిల్చుండిపోయాడు. అతడ్ని ఖాన్ స్టేషన్‌కు తీసుకెళ్ళాడు. వక్కగదిలో కూర్చున్నవారికి, రుక్నుద్దీన్ కూర్చున్న గదిలోనుంచి మాటలు వినిపిస్తాయి. రుక్నుద్దీన్ రహీమ్‌కు చెప్పిన వాక్యాలను ఒక కాగితం మీద వ్రాసి, కూడా తీసుకొచ్చిన ఇద్దరు పెద్దమనుషులచేత సాక్షిసంతకాలు పెట్టించాడు ఖాన్.

స్టేషన్‌లోని ఒక గదిలో నవాబు కూర్చుని వున్నాడు. రహీమ్, రహమాన్ ఇద్దరూ వినయంగా నిల్చుని వున్నారు. గది ముందు పోలీసు సిబ్బంది వున్నది.

"ఖాన్‌సాబ్ పిలుస్తున్నాడు రా!" అన్నాడు ఓ కానిస్టేబుల్ రహమాన్‌తో.

"నాకేం తెలియదు నన్ను వదిలెయ్యండి" అంటూ ఏడ్పు మొదలుపెట్టాడు రహమాన్. పోలీసులతన్ని బలవంతంగా వక్క గదిలోకి లాక్కెళ్ళారు.

వక్కగది నుంచి రహమాన్ కేకలు విన్పిస్తున్నాయి. హంటర్ "ఛెళ్ ఛెళ్" మనడం విన్పిస్తోంది.



నవాబు వణికిపోతున్నాడు.

మరికొన్ని నిముషాల తర్వాత రహీమ్‌ను గదిలోకి లాక్కెళ్ళారు. ఆ గదిలో ప్రవేశిస్తూనే ఏడుస్తూ రహీమ్ గావుకేకలు పెదుతున్నాడు. ఆ కేకలు వింటున్న నవాబు వెన్నెముకలోనుంచి ఏదో జరజరా పాకుతున్నట్లనిపించి గజగజ వణకసాగాడు.

లోపల గదిలో ఖాన్ వక్కనే వున్న బల్లమీద కొరడాలతో కొడ్తున్నాడు. రహీమ్ గావుకేకలు పెడ్తున్నాడు. దెబ్బతిన్నవాడికంటే వింటున్నవాడికే ఎక్కువ భయంవేస్తుంది. ముఖ్యంగా మరికొద్ది నిముషాలకే ఆ కొరడా తన శరీరం మీద నాట్యం చేయబోతుందని తెలిసినప్పుడు, ఆ వ్యక్తివడే బాధ వర్ణనాతీతం.

రహిమ్ కేకలు ఆగిపోయాయి. రహమాన్, రహిమ్ వక్కగదిలోకి వెళ్ళి కూర్చున్నారు.

నిలువెల్లా వణికిపోతున్న నవాబును ఇద్దరు కానిస్టేబుల్స్ లాక్కెళ్ళి ఖాన్‌సాహెబ్ ముందు నిలబెట్టారు. అతని చేతిలో హంటర్ చూస్తూనే, అమాంతం కాళ్ళమీద పడిపోయాడు.

"సాబ్ నన్ను కొట్టకండి. జరిగిందంతా చెప్తాను" వణుకుతూ అన్నాడు.

"లే... ఆ కుర్చీలో కూర్చో. నిజం చెప్పు. అబద్ధం చెప్పావా...." ఖాన్ హంటర్‌ను ఝుళిపించాడు.

"చెప్తాను సాబ్. నిజమే చెప్తాను" అంటూ లేచి కుర్చీలో కూర్చున్నాడు.

"చెప్పు!"

"సాబ్ నా పేరు రుక్నుద్దీన్. నేను చాలా బీదవాడిని. నలంగా జాగీర్‌దారిణి ఇంట్లో నౌకరుగా వుండేవాడ్ని. మా ఇద్దరి మధ్యా అక్రమ సంబంధం ఏర్పడింది. అది తెలిసి శుజీవత్‌బేగంకు భర్త విడాకులిచ్చాడు. ఆ సమయంలో ఆమె మైనరు కూతురు తన అన్నవద్ద, నలంగా జాగీరుకు చాలా దూరంలో వున్నది. ఇద్దరం హైదరాబాదు వచ్చాం. మా దూరపు బంధువు ఇంటి అవుట్‌హవుస్‌లో కొద్ది రోజులు నేనూ బేగం వున్నాం. కొద్దిరోజుల తర్వాత ఇద్దరం జాగీరుకు వెళ్ళాము. అదేసమయంలో బేగం కూతురు ఇమిత్యాజ్‌బేగం కూడా తల్లి దగ్గరకు వచ్చింది. జాగీరు నుంచి వీళిద్దరి భాగంగా బాగానే ధనం ముట్టింది. ముగ్గురం హైదరాబాదు వచ్చాం. ఒకరోజు బేగం తన కూతురిపేరు మీద ఇల్లు కొనాలన్నది. అప్పుడే ఈ ఇంటిని కొన్నాం. ముగ్గురం కొత్త ఇంట్లోకి వచ్చాం.

కొద్ది రోజుల తర్వాత పుట్టింట్లో వున్న నా భార్యా పిల్లల్ని హైదరాబాదు తీసుకువచ్చాను. బేగం ఇంటికి దగ్గర్లో ఒక అద్దెయింట్లో వాళ్ళను ఉంచాను.

బేగం మేనల్లుడొకడు నిజాం కాలేజిలో చదువుతున్నాడు. ఒకరోజు ఇల్లు కొనుగోలుకు సంబంధించిన కాగితాలు బేగం మేనల్లుడికి చూపించింది. వాడు చూసి "ఇదేమిటత్తా ఈ ఇల్లు రుక్నుద్దీన్ పేరుమీద వుంది" అన్నాడు. అది విని బేగం బిత్తరపోయింది. ఆ రాత్రి నాతో తగాదాపడింది. నన్ను ఇంటినుండి వెళ్ళిపొమ్మంది. అయితే నేను, నాకు ఎలాంటి దురుద్దేశం లేదనీ, ఇమ్త్యాజ్ ఇంకా మైనరు కనుక

చిక్కులు వస్తాయని నా పేరు మీద వ్రాయించాననీ, కావాలంటే ఆపిల్ల పేరుమీద త్వరలో రిజిష్టర్ చేయిస్తానని చెప్పాను. అంతటితో బేగం శాంత పడింది.

జాగీర్‌లో రావాల్సిన మనోవర్తి డబ్బు తెచ్చుకోవడానికి బీదర్ బయలుదేరాం. అదేరోజు ఇమ్‌త్యాజ్‌కు జ్వరం రావడం వల్ల, బేగం ఆ పిల్లను తెలిసిన వాళ్ళింట్లో వుంచింది. మేమిద్దరమే బీదర్ వెళ్ళివచ్చాం.

ఆ రాత్రి ఆమె నాతోపాటు బ్రాందీ తాగింది. కబుర్లు చెబుతూ బాగా తాగించాను. నేను బయటికి వెళ్ళి దొడ్లో నుంచి పెద్దరాయి తెచ్చి కిటికీ రెక్కలకు అడ్డం పెట్టాను. వళ్ళు మర్చిపోయేదాకా తాగించాను. తాగి కింద పడుకుంది. అదనుచూసి రాయి ఎత్తి ఆమె తల మీద బలం కొద్దీ కొట్టాను. గిలగిలా తన్నుకుంటున్న ఆమెపీక కోసేశాను. అంతే! ఇంటికి తాళం వేశాను. రెండో రోజు ఉదయం మావక్కింటి వాళ్ళదగ్గర పారా పలుగూ తీసుకున్నాను, మొక్కలు నాటడానికి మాలివచ్చాడని చెప్పి. గదిలో నేల త్రవ్వి అక్కడే బేగంను పూడ్చేశాను. బేగం ఏమైందని ఆలోచించే వాళ్ళెవ్వరూ ఆమె బంధువుల్లో లేరు. కొడుకూ, దగ్గరి బంధువులూ వెలివేసినట్లు వదిలేశారు. ఇకపోతే ఇమ్‌త్యాజ్ వుంది. ఆ పిల్లను వదిలేస్తే అపాయంలో పడతానని నాకు తెలుసు. అందుకే ఇమ్‌త్యాజ్ వున్న ఇంటికి వెళ్ళాను. జ్వరం పూర్తిగా తగ్గలేదు. అయినా అమ్మ రమ్మంటుందని చెప్పి జట్కా ఎక్కించి తీసుకొచ్చాను. ఆ పిల్లను బండి నుంచి దింపాను. మీద వున్న శాలువాను భుజాలచుట్టూ కప్పాను. బండివాడికి డబ్బులిస్తుంటే ఇమ్‌త్యాజ్ తలుపుకు వేసి వున్న తాళం చూస్తూ "అమ్మెక్కడ?" అని అడిగింది.

తాళం తీసి ఆ పిల్లను భుజాలచుట్టూ చేతులువేసి లోపలకు తీసుకెళ్ళాను. అదే గదిలోకి తీసుకెళ్లాను. జంబుఖాణా వేసి, బేగం శవాన్ని పాతిపెట్టినచోట ఆ పిల్లను పడుకోబెట్టాను.

"మీ అమ్మ బెంగుళూరు వెళ్ళింది. నాతో పోట్లాడి మరొకడితో వెళ్ళిపోయింది" అన్నాను.

ఆపిల్ల గట్టిగా ఏడవసాగింది. నేను దగ్గరకు తీసుకొని బుజ్జగించాను.

"ఏడవకు పాపా! అమ్మ తొందరగా తిరిగివస్తుంది. అంతవరకూ నేను నిన్ను నా బిడ్డలా చూసుకుంటాను" అని ఓదార్చాను. ఆ పిల్ల కొంచెం సేద తీరగానే బ్రాందీ తాగించాను. జ్వరం త్వరగా పోవాలంటే ఇది తాగాలని చెప్పాను. బాగా తాగించాక ఆ పిల్ల కళ్ళు మూతలు పడిపోయాయి. ఆ పక్కనే దాచివుంచిన ఇనుప సువ్వను ఆమె గొంతులో గుచ్చాను. రక్తం ఒక్కసారిగా పైకి చిమ్మింది. కిమ్మనకుండా ప్రాణాలు వదిలింది. ఆపిల్ల వంటి మీదున్న నగలు వలిచాను. తల్లి పక్కనే త్రవ్వి బిడ్డ శవాన్ని కూడా పెట్టాను. నా లాల్చీమీద రక్తం పడింది. అది కాల్చేశాను. వేరేబట్టలు గుంటలోనే శవాలతోపాటు పెట్టేశాను. ఆరాత్రి ఇంటికి తాళంవేసి మాయింటికి వచ్చి పడుకున్నాను.

రెండోరోజు ఎర్రమట్టితో ఇల్లు అలికాను. గోడల మీద రక్తపు మరకలున్నాయ్. సున్నం తెచ్చికొట్టాను. హత్య చేసిన గుర్తు లేమీ లేవని నమ్మకం కలిగాక గుండెలనిండా గాలి పీల్చుకున్నాను.



పెద్ద మొత్తం, ఖరీదైన నగలు, ఇల్లూ చేజిక్కించుకొన్నాను. అంతస్థు పెరిగితే వచ్చే అనుభవాలను కూడా పొందే ప్రయత్నంలో పడ్డాను.

అయితే పోలీసుల్ని చూడగానే నాకు తెలియకుండానే భయంవేసేది. అందుకే ఎప్పుడూ పోలీసులతో ఉండే మహబూబ్ మీర్జాతో స్నేహం చేశాను. అతనికి ఎన్నోసార్లు అడిగినంత డబ్బు కూడా ఇచ్చాను. చివరకు ఇలా మీ చేతుల్లో చిక్కాను" అని ముగించాడు.

రెండోరోజు శవాలను పూడ్చిన గదిలో తవ్వించారు. బేగం ఎముకలు బయటపడ్డాయి. ఇమిత్యాజ్ శరీరం సగం కుళ్లి బయటపడింది.

కోర్టులో అతడే హంతకుడుగా రుజువుచేయడానికి ఎన్నో ఆధారాలు దొరికాయి.

రుక్నుద్దీన్ భార్య స్వయంగా కోర్టులో అతనికి విరుద్ధంగా సాక్ష్యం చెప్పింది. పక్కింటి నుంచి పలుగూ పార తనే తెచ్చి ఇచ్చినట్టు కూడా చెప్పింది.

ఇమిత్యాజ్‌ను బండి నుంచి దింపడం తను చూశానని, ఆరాత్రి తనభర్త చాల ఆలస్యంగా ఇంటికి వచ్చాడని చెప్పింది. భర్త ఎంతసేపటికీ రానందువల్ల తను చూడడానికి వెళ్ళాననీ, దగ్గరగా వేసివున్న తలుపులు నెట్టాననీ అదే సమయంలో ఇమిత్యాజ్ శవాన్ని గుంటలోకి లాగుతున్నాడని చెప్పింది. తనను బయటికి నెట్టి తలుపువేశాడని కూడా చెప్పింది. ఏం చేయాలో తోచని తను ఇంటికి వచ్చి వంట కూడా చేయకుండా భర్తకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాననీ, "నువ్వు చేసిందేమిటి?" అని అడిగితే "నోరు మూసుకొని పడివుండు" అని బెదిరించాడని చెప్పింది.

హైకోర్టులో ముగ్గురు జడ్జీలు ఏకగ్రీవంగా రుక్నుద్దీన్‌కు ఉరిశిక్ష విధించారు.

ఇంత జటిలమైన కేసును పట్టుకొన్న ఇంటెలిజెన్సు ఆఫీసర్ ఫజల్ రసూల్‌ఖాన్ నాగడ్‌కు ప్రభుత్వం ప్రశంసాపత్రంతోపాటు బహుమతి కూడా ఇచ్చింది.

❀ ❀ ❀

# 20. తలుపు తెరువమ్మా! తిరిగొచ్చాను

బొంబాయిలోని గోల్‌పీఠా బజార్లో ఉన్న ఆనందబాయి నడుపుతున్న వేశ్యాగృహాన్ని హైదరాబాదు పోలీసులు బొంబాయి పోలీసుల సహకారంతో చుట్టుముట్టారు. పోలీసుల్ని చూసి ఆ గృహంలో ఉన్న ఆడవాళ్ళంతా గాభరాగా అటు ఇటు అలజడిగా తిరగసాగారు. ఒక ఇరవైనాలుగు సంవత్సరాల యువతి అందరిలా భయంతో పోలీసుల్ని చూడటం లేదు. కానీ వాళ్ళతో ఉన్న మధ్య వయస్కుడైన విళ్ళేను చూస్తున్నది.

విళ్ళే హైదరాబాదు పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు సైగ చేశాడు. ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ ఆమె దగ్గరగా వచ్చి "నీ పేరేమిటి?" అని అడిగాడు.

"వైజయంతి" బెదిరిపోతూ చెప్పింది ఆ యువతి.

ఆ సమయంలో ఆ వేశ్యాగృహంలో ఉన్న చాలా మందిలాగే ఆమె శరీరం మీద కేవలం బాడీ, లంగా మాత్రమే ఉన్నాయి.

"ఏ ఊరు?"

"మియాపూర్."

"మీ నాన్న పేరు?"

"గణేశన్"

"నీ భర్త పేరు?"

ఆమె ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ ముఖంలోకి సూటిగా చూస్తూ "బాలకృష్ణన్" అన్నది.

"వైజయంతీ నాకంతా తెలుసు. నిన్ను అరెస్టు చేస్తున్నాను. లోపలకెళ్ళి బట్టలు వేసుకొనిరా"

వైజయంతి ఏడుస్తూ లోపలకు వెళ్ళింది. అర్ధగంట తర్వాత బట్టలు వేసుకొని, చిన్న పెట్టెతో బయటికి వచ్చింది. అంతమంది వేశ్యలుండగా హైదరాబాదునుంచి వెళ్ళిన పోలీసులు వైజయంతిని ఎందుకు అరెస్టు చేశారనుకొంటున్నారు కదూ?

వైజయంతి హైదరాబాద్ నగరాన్ని అనుకొని ఉన్న చిన్న పల్లెలో పుట్టింది. తండ్రి ఆమె చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి బిడ్డతో తన అన్న ఇంట్లో ఉండి కాయకష్టం చేసుకుంటూ ఉండేది. వైజయంతి అందమైంది. యవ్వనంలో అడుగుపెట్టిన వైజయంతి ఆకర్షణకు ఎందరో యువకులు కళ్ళప్పగించి చూస్తూ లొట్టలు వేసేవారు. ఆమె వివాహం ఆ పక్క గ్రామంలో ఉండే బాలకృష్ణన్ అనే యువకుడితో జరిగింది.



వివాహం అయిన కొత్తలోనే బాలకృష్ణన్ ఒక రోజు ఆమెను హైదరాబాద్ తీసుకెళ్ళాడు. భర్త వెంట ఉత్సాహంగా బయలుదేరిన వైజయంతి భర్త తీసుకెళ్ళిన ప్రదేశం చూసి భయంతో బిగుసుకుపోయింది. అతడు ఆమెను వేశ్యలుండే బజారుకు తీసుకెళ్ళాడు. అక్కడ వాళ్ళందరితో అతను మాట్లాడుతున్న తీరు చూసి ఆమెకు అర్థం అయింది, అతనికి ఆ పరిసరాలు బాగా చిరపరిచితమైనవని.

క్రమంగా భర్త అసలురూపం బయట పడసాగింది. ఎవరెవర్నో ఇంటికి తెచ్చేవాడు. వాళ్ళు ఆమెతో అసహ్యంగా ప్రవర్తించినా అతను పట్టించుకొనేవాడు కాడు. వైజయంతి కోపంతో, జుగుప్సతో ఊగిపోయేది. పెళ్ళయి మూడునెలలన్నా కాలేదు అప్పటికి. ఒకరోజు మధ్యాహ్నం ఒక మధ్య వయస్కురాలు మరో యువతితో బాలకృష్ణన్ ఇంటికి వచ్చింది. ఆమె బాలకృష్ణన్ ఆడపిల్లల్ని వేశ్యాగృహాలకు అమ్ముతుంటాడనీ, ఇలాంటి పెళ్ళిళ్ళు చాల చేసుకున్నాడనీ, ఆమె అతడు చెప్పినట్లు వినడమే మంచిదనీ చెప్పింది. వైజయంతి పెద్దగా అరుస్తూ వాళ్ళిద్దర్నీ ఇంటినుంచి వెళ్ళగొట్టింది. వాళ్ళు వెళ్ళిన కొద్దిసేపటికి బాలకృష్ణన్ బాగా తాగివచ్చి వైజయంతిని తిట్టసాగాడు. ఆమెకు కోపంలో వళ్ళు తెలియలేదు. మూలపెట్టి ఉన్న గొడ్డలి తీసుకుని శక్తికొద్దీ మెడమీద కొట్టింది. తప్ప తాగి ఉన్న బాలకృష్ణన్ కిక్కురుమనకుండా పడిపోయాడు. కసిగా మరో రెండు దెబ్బలు కొట్టింది. ఆ తర్వాత ఇంట్లోనుంచి పారిపోయింది. హైదరాబాద్ చేరుకొని స్టేషన్ బెంచీమీద కూర్చుంది. రాత్రి స్టేషన్‌లోనే ఉండిపోయింది. రెండోరోజు కూడా వైటింగ్‌రూంలోనే ఓ మూల బెంచీమీద ఏం చెయ్యాలో, ఎక్కడికెళ్లాలో తోచక కూర్చుంది.

సాయంత్రం ఒక స్త్రీ ఆమె దగ్గరకు వచ్చి కూర్చుంది. ఆమెతోపాటు ఒక మగవాడు కూడా ఉన్నాడు. "దిగులుపడకు వైజయంతీ? మేము నిన్ను కాపాడతాం" అన్నది. వైజయంతి ఆశ్చర్యంగా వాళ్ళను చూసింది. ఆమె పేరు ఆనందబాయి. ఆమెతో ఉన్న అతని పేరు రాఘవన్. రాఘవన్‌కు బాలకృష్ణ తెలుసు. రాఘవన్ వైజయంతిని గుర్తించి ఆనందబాయికి చెప్పాడు. ఆనందబాయి బొంబాయినుండి ఇద్దరు యువతుల్ని కొనడానికి వచ్చింది. కాని ఆ యువతుల్ని అమ్ముతానని కబురు పంపినవాడు కనిపించకపోవడంతో మళ్ళీ బొంబాయి తిరిగి వెళ్ళడానికి రాఘవన్‌తో స్టేషన్‌కు వచ్చింది. బాలకృష్ణన్ హత్య గురించి వేశ్యాగృహాల్లో వాళ్ళకు తెలిసింది. పోలీసులు అతని భార్యకోసం వేశ్యాగృహాలు గాలిస్తున్నారని రాఘవన్‌కు తెలుసు.

వైజయంతి వాళ్ళు చూపిన ఆదరంమీద నమ్మకం ఏర్పడి వారితో బొంబాయి వెళ్ళింది. చివరకు తను ఎక్కడకు చేరిందో తెలుసుకొని కుళ్ళికుళ్ళి ఏడ్చింది.

చివరకు ఆనందబాయి వేశ్యాగృహంలో తన శరీరాన్ని ఐదేళ్ళు అమ్ముకుంది.

పోలీసులు హైదరాబాద్ తీసుకొచ్చి ఆమె మీద కేసు పెట్టారు. కాని ఐదేళ్ళ తర్వాత ఎలాంటి బలమైన సాక్ష్యాలను కోర్టులో చూపించలేకపోయారు. ఆమె విడుదల అయింది. అప్పటికే తల్లి చనిపోయింది. ఇంటికి వెళ్ళిన ఆమెను ఆమె

మేనమామ ఇంట్లోకి రానివ్వలేదు. ఆ ఊళ్ళో ఎవరూ ఆమెను కన్నెత్తి చూడలేదు. గజ్జికుక్కను చూసినట్టు చూశారు.

వైజయంతి తిరిగి హైదరాబాద్ స్టేషన్ చేరుకుంది. బొంబాయి ట్రయిన్ ఎక్కింది. గోల్‌పీఠాబజారు కెళ్ళి ఆనంద్‌బాయి తలుపు తడుతూ "అమ్మా నేను తిరిగొచ్చాను. తలుపుతియ్" అని వేడుకుంది దీనంగా.

పిళ్ళై ఎవరో చెప్పలేదు కదూ? పిళ్ళై ఆమె ఊరివాడే. ఒకసారి బొంబాయి వెళ్ళి సర్దాగా ఆనందబాయి బ్రోతల్ హౌస్‌కు వెళ్లాడు. అక్కడ ఆమెను చూసి గుర్తించాడు, హైదరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చి వాళ్ళతో వెళ్ళి ఆమెను చూపించాడు.

ఈ పురుష ప్రధానమైన ప్రపంచంలో ఇలాంటి గాధలు ఎన్నెన్నో. మగవాడికి ఒక నీతీ, ఆడదానికి మరో నీతీ చలామణిలో ఉన్న ఈ దేశంలో ఒక వేశ్యాగృహం ఉన్న అభాగ్యురాలికి సమాజంలో ఆదరం దొరకుదు. మళ్ళీ అక్కడకే చేరక తప్పదు.

ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్టుక్రింద శిక్ష పొందిన వాళ్ళను జైళ్ళలోకాక రెస్క్యూ హోమ్స్‌లో పెడుతున్నారు. కానీ శిక్ష పూర్తిఅయ్యాక వారిగురించి 'ఫాలోఅప్ ప్రోగ్రాం' ఏదీ ప్రభుత్వం చేపట్టని కారణంగా మళ్ళీ వీళ్ళందరూ పాత జీవితానికే వెళ్లాల్సి వస్తోంది. అందుకే వైజయంతి తిరిగి వేశ్యాగృహానికి వెళ్ళితలుపు తాట్టింది.

ఈ విషయం గురించి ఆలోచించడం మేధావుల బాధ్యతగా భావిస్తున్నాను.

❀ ❀ ❀



# 21. ఆధునిక

ఇది ఏ నాటి కథో కాదు. ఇటీవల బీహార్‌లో జరిగింది. ఈనాడు మానవుడు గ్రహాంతరమనుగడ సాధ్యాసాధ్యాలను కనుగొనే ప్రయత్నంలో ఉన్నాడు. అయినా మనిషిలోని సంకుచితత్త్వం ఏ మాత్రం తగ్గలేదేమోననిపిస్తుంది. కులం, మతం దాటి మనిషి సంస్కారం ఎదగలేగపోతుంది. ఇలా ఇంకెంత కాలం? ఈ కథ చదివాక మీరూ ఆలోచించండి. మానవుడు ఒకనాడు అజ్ఞానంతో ఏర్పరచుకున్న పరిధులే ఈనాడు అతన్ని ఎదక్కుండా (మనసు ఎదక్కుండా) మరుగుజ్జువాడిగానే ఉంచివేస్తున్నాయి. ఈ నాటికీ మజ్నూలను ఈ సమాజం చంపుతూనే వుంది. ఎప్పుడో జరగలేదు. 1983 సంవత్సరం ఏప్రిల్ 8వ తేదీన జరిగిన సంఘటన యిది.

బీహార్‌లో సమస్తిపూర్ జిల్లాలో మధురాపురం అనే గ్రామం ఉంది.

దాదాపు 30 ఇళ్ళు ముస్లింలవి, కొన్ని హరిజనులవీ ఉన్నాయి. చాలా కొద్దిమంది ఇతర కులాల వాళ్ళున్నారు. ఆ గ్రామంలో బ్రాహ్మణుల కుటుంబాలే ఎక్కువ.

ముస్లిమ్‌లూ, హరిజనులూ కూలినాలి చేసుకొని బతుకుతుంటారు. అలాంటి కుటుంబంలో పుట్టిన బిడ్డే లజిన్నాఖాతూన్. ఆమె తండ్రి శోభాకాంత్ చౌధరి అనే ఒక బ్రాహ్మణుడి ఇంట్లో పాలేరుగా వుండేవాడు. తండ్రి చనిపోయాక ఆమె అన్న ఆ స్థానంలో నౌకరుగా చేరాడు. శోభాకాంత్ చౌధరికి పొలాలున్నాయి. అతని పెద్ద కొడుకు అమరనాధ్ పొలాలమీద అజమాయిషీ చూస్తుండేవాడు. లజిన్నా పొలంలో పని చేస్తుండగా పరిశీలనగా చూశాడు అమరనాధ్. ఆమె తన పాలేరు సలీమ్ చెల్లెలని అతనికి తెలుసు. అంత అందమైన యువతి అలాంటి కాయకష్టం చేస్తుంటే ఆ యువకుడి మనసు బాధపడింది.

ఒకరోజు లజిన్నా అమరనాధ్ ఇంటికి కూలిగింజలకు వచ్చింది.

ఆ సమయంలో యింట్లో తల్లి తప్ప మరెవ్వరూ లేరు.

"ఎన్ని గింజలు?" అడిగాడు అమరనాధ్.

"నాలుగు కిలోలు."

"అంతకు రెట్టింపు యిస్తే?"

"అంటే?"

"ఎనిమిది కిలోలిస్తే"

ఆమె అతడి ముఖంలోకి చూసింది. ఆ పిల్ల గుండె దడదడలాడింది.

"మాకు రావాల్సింది యివ్వండి" తడబాటుగా అన్నది. ధ్యానం తీసుకొని

వెళ్ళిపోయింది. ఆ రాత్రంతా ఆమె ముగ్ధమనోహర రూపమే అమరనాథ్ చౌధరి కళ్ళముందు ఉన్నది. మనసు ఊహా లోకాల్లో విహరించింది.

రెండోరోజు సాయంత్రం అమరనాథ్‌కు పిచ్చెక్కినట్టుగా వుంది. ఒక్కసారి లజిన్నాను చూడలనే కోరికను అణచుకోలేకపోయాడు. వాళ్ళింటికెళ్ళాడు. ఆమె వదిన "సాబ్? తవరా? ఏంటిట్టా వచ్చారు?" అని అడిగింది. అతడు తడబడ్డాడు. "సలీమ్ లేడా?" నీళ్ళు నములుతూ అడిగాడు. "లేదు. అర్జంటా? రాగానే తవరొచ్చెళ్ళారని చెప్తాను. వంపిస్తాను" అన్నది ఆమె. "అలాగే! అలాగే!" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. లజిన్నా దర్శనం కాలేదు.

ఒకరోజు అమర్ పొలం వెళుతుండగా లజిన్నా పొలం వెళుతూ దారిలో కలిసింది. అతడు ముందు, ఆమె వెనక నడుస్తున్నారు. అతడికి ఆగాలని వుంది. ఆమెతో మాట్లాడాలని ఉంది. ఊళ్ళోవాళ్ళు చూస్తారని ఒకవైపు భయం. ఊరు దాటాక అమర్ ఆగాడు. ఆమె దగ్గరకు వచ్చేదాకా ఆగాడు. ఆమె దగ్గరగా రాగానే "ఒకటి అడగనా?" అన్నాడు.

"ఏమిటి?" ఆమె గాభరా పడింది.

"కోవం రాదు కదా?"

"కోవమా? కోవం ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది.

"నువ్వింత అందంగా ఎందుకున్నావ్? ఈ నాలుగు రోజుల్నుంచి అన్నం సహించడం లేదు. నిద్రపోవడం లేదు. ఎప్పుడూ నీ నామస్మరణే నా నాలుకమీద నా కళ్ళల్లో నీ రూపమే."

లజిన్నా తృళ్ళిపడింది. ఈయనకేమైంది! ఏమిటిలా మాట్లాడుతున్నాడు?

"మాట్లాడు లజిన్నా!" ఆమె తృళ్ళిపడి తలెత్తి చూసింది.

"ఏం మాట్లాడను?"

"నేను నీకెలా కన్పిస్తున్నాను?"

"చాల మంచిగా" అనేసి చటుక్కున నాలుక కరచుకుంది. "అయినా యివన్నీ ఎందుకడుగుతున్నారు?" మళ్ళీ తెప్పరించుకుని ఆమె అడిగింది.

"ఎందుకంటావా? నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు లేకుండా నేను బతకలేను. మనిద్దరం పెళ్ళి చేసుకుందాం"

"మీరనేదేమిటి? ఎవరైనా వింటే?" వణికిపోతూ అన్నది.

"వింటే ఏం? మనం తప్పువని చెయ్యడంలేదు. ప్రేమించుకుంటున్నాం. పెళ్ళి చేసుకుంటాం."

"మీరు బామ్మలు..."

"అయితేనేం? ప్రేమకు కులం లేదు, మతం లేదు, అంతస్థులు లేవు."

అతను మాట్లాడుతూ వుంటే ఆమె ముగ్ధురాలై వినసాగింది.

ఆ రోజునుంచి యిద్దరి మనసులు ఏకమైనాయి. చాటు మాటుగా యిద్దరూ కలుసుకుంటున్నారు. ఆ విషయం తెలిసి అమర్ తండ్రి కొడుకును మందలించాడు. మళ్ళీ ఆ పిల్లను కలిసినట్టు తెలిస్తే, యింట్లోనుండి వెళ్ళగొడతానని బెదిరించాడు.



రెండోవైపు సలీమ్ తన చెల్లెల్ని చచ్చేలా బాదాడు. వళ్ళంతా విరగకొట్టినంత వని చేశాడు. అయినా ఆ పిల్ల కిక్కురుమనలేదు.

వారంరోజులు యిద్దరూ కలుసుకోలేదు. కాని యిద్దరూ ఒకరినొకరు తల్చుకుంటూ ఏడుస్తూనే గడిపారు. ఒకరోజు ఒక బీద ముస్లిం కుర్రాడికి పాతికరూపాయలిచ్చి, లజిన్నాకు కబురు వంపించాడు అమర్. ఆ రాత్రి ఊరి పొలిమేరలో కలుసుకోమని కబురు. అలాగే యిద్దరూ కలుసుకున్నారు. యిద్దరూ కలకత్తా పారిపోయారు. కొన్నిరోజులు చౌకబారు లాడ్జిలో గడిపారు. అమర్ దగ్గిర డబ్బు అయిపోయింది. అక్కడ్నుంచి సత్రంలోకి మారారు. అమర్ వని వేటలో వడ్డాడు. ఒక చిన్న టీ దుకాణంలో క్లీనర్‌గా చేరాడు. ఒకరోజు అతనికి తెలిసిన వ్యక్తి కన్పించాడు. అతడు యింటికి తీసుకెళతాను రమ్మన్నాడు. ఏదో వంక పెట్టి తప్పించుకున్నాడు. ఆ సంగతి లజిన్నాతో చెప్పాడు.

"ఇప్పుడెలా?"

"ఢిల్లీ వెళ్దాం. అక్కడ తెలిసిన వాళ్ళెవరూ కన్పించరు."

ఢిల్లీ చేరారు. మళ్ళీ ఆకలి. వని వేటలో వడ్డాడు. ఒక గుడి అరుగులమీద జీవితం గడవసాగారు. అయినా వారికి ఒకరంటే ఒకరి మీదున్న ప్రేమ కొంచెంకూడా తగ్గలేదు. వాళ్ళకు ఆ కష్టాలు కష్టాలుగా కన్పించలేదు. అనార్కలీ, సలీం కంటే, లైలా, మజ్నూ కంటే, శిరీన్-ఫర్‌హాద్ కంటే తాము అదృష్టవంతులమని వారి నమ్మకం. వారిద్దర్నీ ఏ శక్తీ విడదియ్యలేదని వారి నమ్మకం. ఢిల్లీలో ఉద్యోగం దొరకడం చాలా కష్టం అన్పించింది. అక్కడ్నుంచి బొంబాయి బయలుదేరారు. అక్కడి జీవితం అంతకంటే దుర్భరంగా తోచింది. ఇలా ఆరు నెలలు తిరిగారు. చివరికి ఇద్దరిలో తమ ఊరు పోవాలనే కోరిక ప్రబలమైంది.

"మన ఊరు వెళ్దాం" అన్నాడు ఒకరోజు అమర్.

"నాకూ అలాగే అన్పిస్తుంది కాని...."

"మావాళ్ళు రానివ్వరు. మీవాళ్ళూ రానివ్వరు. మనిద్దరం హరిజన కాలనీలో ఉండి కూలి చేసుకొని హాయిగా బతుకుదాం?" అన్నాడు అమర్.

అతని సలహా బాగానే ఉన్నట్లనిపించింది లజిన్నాకు.

చివరకు ఇద్దరూ తమ జిల్లాలో ప్రవేశించారు. కాని వూరు వెళ్ళలేదు. దరసింగ్‌లో ఒక సత్రంలో దిగారు. ఆ సంగతి వూళ్ళో వాళ్ళకు తెలిసింది. అమర్ తండ్రి నిప్పులు తొక్కాడు. లజిన్నా బంధువులు అమర్ ముసల్మాన్‌గా మారితే వారి వివాహానికి తమకేమీ అభ్యంతరం లేదన్నారు.

ఈలోగా ఆ వక్క గ్రామంలోని ఆర్య సమాజం వారికి ఒక మైథిలీ బ్రాహ్మణ కుర్రవాడితో, ముస్లిం బాలిక ప్రేమ వ్యవహారం తెలిసింది. ఆ సమాజం కార్యకర్తలు వారిని కలుసుకొన్నారు. లజిన్నాను హిందువుగా మార్చి పెళ్ళి చేస్తామన్నారు. ఆమె అంగీకరించింది. ఇద్దరికీ ఆర్య సమాజవు పద్ధతిలో వివాహం జరిగింది. లజిన్నా

పేరు వీణగా మార్చారు. వాళ్ళిద్దరికీ కొద్ది ధన సహాయంచేసి వాళ్ళ ఊర్కు పంపించారు ఆర్య సమాజంవారు.

ఇద్దరూ హరిజనవాడ చేరుకొన్నారు. ఆ దగ్గర్లోనే అమర్‌నాధ్ తండ్రికి కొంత స్థలం ఉంది. ఆ స్థలంలో ఒక గుడిసె వేసుకొన్నారు. మొదట హరిజనులు అమరనాధ్‌కు మతిపోయిందనుకొన్నారు. లేకపోతే బ్రాహ్మణ బిడ్డేమిటి? తమ మధ్యలో ఉండటమేమిటని ఆశ్చర్యపోయారు. భయపడ్డారు. అమర్‌నాథ్ హరిజనులతోపాటువెళ్ళి కూలిపని చేసేవాడు. అయినా ఇద్దరూ ఆనందంగానే జీవితం గడపసాగారు.

ఆ రాత్రి ఆ ప్రేమికులకు కాళరాత్రి.

1983 ఏప్రిల్ 8వ తేదీ. తొమ్మిదిన్నర దాటింది. అమర్, వీణా భోజనాలు చేసి పడుకొని కబుర్లు చెప్పుకొంటున్నారు. దూరంనుంచి ఏదో కలకలం వినిపించింది. కలకలం దగ్గరైంది. అమర్‌ను ఎవరో తిడుతున్నారు. అమర్ లుంగీ మాత్రం కట్టుకొని ఉన్నాడు. బయటికి వచ్చాడు. అతని వెనకే వీణ వచ్చింది. ఏం జరుగుతుందో అర్థం చేసుకొనే లోపలే కొందరు అమర్‌ను పట్టుకొని కొడుతూ లాక్కెళ్ళసాగారు. మరో ముఠావాళ్ళు వీణ ఉరఫ్ లజిన్నాను లాక్కెళ్ళారు.

అమర్‌ను బ్రాహ్మణులు లాక్కెళ్ళారు. లజిన్నాను ముస్లిములు లాక్కెళ్ళారు.

ముస్లిముల బస్తీకి లాక్కెళ్ళి లజిన్నాను వాళ్ళ అన్నకు చూపిస్తూ "ఇప్పుడు నువ్వు చేస్తానన్న పని చెయ్యి. ఆలస్యం చెయ్యకు ముగించు" అంటూ అరిచారు.

అంటే ఆమెను చంపమన్నారు. కాని అన్న సలీమ్ ఆమెను చంపడానికి ఇష్టపడలేదు. "నేను దాన్ని చంపి జైలుకు వెళ్ళడం నాకిష్టం లేదు. నా పెళ్ళాం, బిడ్డలేం కావాలి. మీలో ఎవరైనా చంపితే నాకు అభ్యంతరంలేదు" అన్నాడు.

ఎవరికి వాళ్ళే ఆలోచించుకుని ఆమెను వదిలేసి వెళ్ళిపోయారు. లజిన్నా పరుగు లంకించుకుంది.

పక్క ఊరు పోలీసు స్టేషన్‌కు చేరుకుంది. అమర్‌ను వాళ్ళు వాళ్ళు లాక్కెళ్ళారనీ, చంపేస్తారనీ చెప్పింది.

కేసు రిజిష్టరు చేసుకొని, ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ఆ ఊరు వచ్చాడు. అమర్ జాడ ఎవరూ చెప్పడంలేదు.

ఇన్‌స్పెక్టర్ పాండేయ్ ఊరు బయట పొలాలకేసి నడక సాగించాడు. గోధుమ పొలం - అది అమర్‌నాథ్ తండ్రిదే - దగ్గరకు వచ్చాడు. పొలంలో కొంత దూరంలో మొక్కలన్నీ తొక్కేసినట్టుగా కన్పించి ఆ వైపు నడిచాడు. అక్కడ మొక్కలు చిందరవందరగా తొక్కి వేయబడి వున్నాయ్. కింద మట్టి తవ్వి మళ్ళీ పూడ్చినట్టుగా అనుమానం వచ్చింది. తన సిబ్బందికి అక్కడ తవ్వమని చెప్పాడు.

ఎక్కువ లోతు తవ్వకుండానే సగం సగం కాలిన మనిషి అవయవాలూ ఎముకలూ కన్పించాయి. చేతివేలు ఎముకకు అంటుకొని ఇనుప ఉంగరం కన్పించింది. అమర్ హత్య చెయ్యబడ్డాడని అర్థం చేసుకొన్నాడు ఇన్‌స్పెక్టర్.



ఎన్‌క్వైరీ పూర్తిచేసి, అక్కడ దొరికిన ఎముకల్నీ, సగం సగం కాలిన కాళ్ళనూ, చేతుల్నూ తీసుకెళ్ళారు పోలీసులు.

అమర్ తండ్రిని అరెస్టు చేశారు. అమర్ తమ్ముళ్ళిద్దరూ ఇంకా పరారీలోనే ఉన్నారు. పోలీసులు వారికోసం గాలిస్తున్నారు.

లజిన్నా ఉరఫ్ వీణ కళ్ళనీళ్ళు నింపుకొని "అనాదిగా ఇదే జరుగుతూ వస్తున్నది" అని అంటోంది పలకరించిన వాళ్ళతో.

❀ ❀ ❀

# 22. చచ్చి సాధించిన మగువ

ఈ దారుణ సంఘటన 1983లో కలకత్తా నగరంలో జరిగింది. కుమా మోనాసేన్ హైస్కూలు విద్యార్థిని. ఆమె తండ్రి ధనికుడు. ఆయనది కలకత్తాలో బంగాళాదుంపల వ్యాపారం. రెండు ఫ్యాక్టరీలు కూడా వున్నాయి.

ఆ రోజు మోనా స్కూలు కాంపౌండు నుంచి తన స్నేహితురాళ్ళతో బయటి వచ్చింది. బస్‌స్టాండ్ వైపు నడుస్తున్న మోనా "మోనాజీ! ఒక్కమాట!" అని వెన నుంచి విన్పించడంతో ఠక్కున ఆగి వెనక్కు చూసింది. ఆమెతోపాటు ఆమె స్నేహితురాళ్ళిద్దరూ కూడా ఆగిపోయారు.

తనను పిల్చింది ఒక అపరిచితుడు కావడం వల్ల మోనా ఆశ్చర్యార్థకంగా అతనికేసి చూసింది.

"నేను వికాస్ చక్రవర్తి మిత్రుడ్ని. అతను ఈరోజు జ్వరం వల్ల కాలేజీకి వెళ్ళలేదు. మిమ్మల్ని..."

మోనా కళ్ళు వికాస్ పేరు వినగానే మిలమిలలాడాయి. అంతలో ఆదుర్దా "వికాస్‌కు ఏమైంది?" అని అడిగింది.

"ఏమీ కాలేదు. మిమ్మల్ని తీసుకురమ్మన్నాడు."

మోనా స్నేహితురాళ్ళకేసి తిరిగింది. వాళ్ళిద్దరూ మోనాను కొంటెగా చూస్తూ మునిమునిగా నవ్వారు.

మోనా ముఖం సిగ్గుతో కందిపోయింది. శర్మిష్ట నవ్వుతూ "మేం వెళ్తాంలే నువ్వు నీ..." సాగదీస్తూ అన్నది.

చేతన గలగల నవ్వింది.

"పోందే!" చెయ్యెత్తి స్నేహితురాళ్ళను కొట్టబోయింది. వాళ్ళిద్దరూ భయపడినట్టు నటిస్తూ బస్‌స్టాండుకేసి వెళ్ళిపోయారు. రోడ్డుదాటి వెనక్కు చూసి స్నేహితురాళ్ళు మోనాసేన్ ఆ అపరిచిత వ్యక్తితో టాక్సీ ఎక్కడం చూశారు. వాళ్ళకు వికాస్, మోనా ప్రేమ గురించి తెలుసు.

రాత్రి తొమ్మిదైంది. పదయింది. పదకొండు దాటింది. మోనా తల్లి కాలుకాలిన పిల్లిలా ఇంట్లోకీ బయటికీ తిరుగుతోంది. ఆమె తండ్రి దివాకర్‌సేన్ మోనాస్నేహితురాలు శర్మిష్ట ఇంటికి వెళ్ళాడు. స్కూలు వదిలాక మోనా కన్పించలేదని చెప్పింది. చేతన కూడా అలాగే చెప్పింది. అసలు విషయం చెబితే మోనాను తండ్రి కట్టడి చేస్తాడనీ, వికాస్‌ను మళ్ళీ చూడకుండా చేస్తాడనీ వాళ్ళ భయం స్నేహితురాళ్ళు మోనాకు అలా అబద్ధం చెప్పి సహాయం చేశామని భావించారు.

మోనా తల్లి పోలీసు రిపోర్టు ఇవ్వమని గోల పెట్టింది. అందుకు ఆమె భర్త



ఆడపిల్ల కన్పించడంలేదని తొందరపడి రిపోర్టు ఇవ్వడం మంచిది కాదని ఆమెకు నచ్చచెప్పాడు. మోనా వారి ఏకైక సంతానం. అల్లారుముద్దుగా పెరిగిన అందాలరాశి.

రాత్రి పన్నెండు దాటింది. సేన్ దంపతులు తమ బిడ్డకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. అప్పుడే ఫోన్ మోగింది. దివాకర్ సేన్ ఎత్తాడు. అవతల నుంచి కొత్త కంఠం విన్పించింది.

"మీరు మీ అమ్మాయి కోసం ఎదురుచూస్తున్నారు కదూ? ఆ పిల్ల ఇప్పుడు మా దగ్గిర ఉన్నది. మీరు నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. తెలివిగా ప్రవర్తించి మీ పిల్ల ప్రాణాలను కాపాడుకోండి."

"ఎవరు నువ్వు? మోనా ఎక్కడుంది?" ఆత్రంగా అడిగాడు దివాకర్‌సేన్.

అవతలి నుంచి వెకిలినవ్వు విన్పించింది.

సేన్ నుదుటిమీద స్వేదబిందువులు విద్యుత్‌కాంతిలో ముత్యాలలా మెరుస్తున్నాయి. రిసీవర్ పట్టుకున్న అరచెయ్యి చల్లగా ఉంది.

"నేనెవరో మీకు అనవసరం. మీకు మీ అమ్మాయి ప్రాణాలతో దక్కాలనుకొంటే, రెండు లక్షలు తీసుకొని బయలుదేరండి. దక్షిణేశ్వర దేవాలయం దగ్గరకు రండి. ఒంటరిగా కార్లో రండి. పోలీసులకు రిపోర్టు ఇవ్వడానికి ప్రయత్నించినా, మరొకర్ని తీసుకొని బయలుదేరినా నీకు దొరికేది నీ కూతురి శవమే!" అవతలి కంఠంలో హెచ్చరిక ఉన్నది.

సేన్ నిలువెల్లా వణికిపోతున్నాడు. అతని భార్య ప్రాణంలేని శవంలా బిగుసుకుపోయి కూర్చుని ఉంది. ఆమెకు పూర్తి సంభాషణ వినిపించకపోయినా తన కూతురు అపాయంలో ఉన్నదని అర్థం అయింది.

"ఇప్పటికిప్పుడు రెండు లక్షలు ఎక్కడ్నుంచి తేను. నా బిడ్డను ఇంటికి చేర్చండి. రేపు మీకు తప్పక రెండు లక్షలు ఇస్తాను."

"నీకే తెలివి ఉందనుకోకు. నీ ఖజానాలో ఎప్పుడూ ఎన్ని లక్షలు ఉంటాయో నాకు తెలుసు. నీ కూతురు ప్రాణాలు దక్కాలనుకుంటే వెంటనే రెండు లక్షలు తీసుకొని కార్లో బయలుదేరు." ఫోన్ డిస్‌కనెక్ట్ అయింది.

భార్యకు ధైర్యం చెప్పి సేన్ రెండులక్షల క్యాష్ బ్రీఫ్‌కేసులో పెట్టుకొని కారు డ్రైవ్ చేసుకొంటూ నిర్దేశించిన ప్రదేశం చేరాడు. రెండు లక్షలు ఇవ్వడం అతనికి పెద్ద బాధాకరమైన విషయం కాదు. ఆయన బాధంతా తన బిడ్డ ఎలా ఉందోననే!

కారు ఆపి దిగాడు సేన్. అతను దిగీ దిగగానే ముగ్గురు మనుషులు అతన్ని చుట్టుముట్టారు.

"మిస్టర్! డబ్బెక్కడ!" ఒకడు అడిగాడు.

"కారు వెనకసీట్లో బ్రీఫ్‌కేసు ఉంది" అన్నాడు సేన్ ముక్తసరిగా.

వెనుకనున్న బ్రీఫ్‌కేసు తీశాడు. లెక్క చూశాడు. రెండు లక్షలు ఉన్నాయ్.

"సరిగానే ఉంది" మిగతా ఇద్దరిలో డబ్బు లెక్కించినవాడు అన్నాడు.

"మిస్టర్ సేన్ - ఇక మీరు వెళ్ళండి. కారు వదిలేసి నడచి వెళ్ళండి. కీస్

ఇలా ఇవ్వండి. మీ అమ్మాయి రేపు ఉదయానికల్లా మీ ఇంటిముందు ఉంటుంది" అన్నాడు ఒకడు.

సేన్‌కు మరోమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా కార్ కీస్ తీసుకొని ముగ్గురూ చీకట్లో కలిసిపోయారు.

సేన్ కాలినడకన బయలుదేరాడు. మనసునిండా భయం. తన బిడ్డ ఏమయిపోతుందోననే ఆందోళన. నిజంగా వాళ్ళు తన బిడ్డను క్షేమంగా తెల్లవారేసరికి ఇంటికి చేరుస్తారా అనే అనుమానం! తెలతెలవారుతూ ఉండగా కాలినడకన దివాకర్‌సేన్ బడానగర్ పోలీస్ స్టేషన్‌కు చేరాడు. డ్యూటీలో ఉన్న ఇన్‌స్పెక్టర్‌కు తన్ను పరిచయం చేసుకొని తన కుమార్తె అపహరణ నుంచి జరిగిన ఉదంతం అంతా చెప్పాడు. కేసు రిజిష్టర్ అయింది.

ఇన్‌స్పెక్టర్ సలహా ప్రకారం ఇంటికి ఫోన్ చేశాడు. భార్య మోనా ఇంకా ఇంటికి రాలేదని ఏడుస్తూ చెప్పింది. "సరే మీరు ఇంటికి వెళ్ళండి. మీ అమ్మాయి ఇంటికి వస్తే మాత్రం నాకు ఫోన్ చెయ్యండి" అని చెప్పి ఇన్‌స్పెక్టర్ సేన్‌ను ఇంటికి పంపించాడు. అతను ఇద్దరు కానిస్టేబుల్స్‌ను తీసుకొని దివాకర్‌సేన్ కారు ఉన్న స్థలానికి వెళ్ళాడు. కాని అక్కడ అపరాధానికి సంబంధించిన ఎలాంటి ఆచూకీ దొరకలేదు. కారు మాత్రం అక్కడే ఉంది.

ఇన్‌స్పెక్టర్ దాసు మోనా స్నేహితురాళ్ళతో కూడా మాట్లాడాడు. ఈసారి వాళ్ళు నిజం చెప్పారు. అయినా వాళ్ళు చెప్పినదాన్నిబట్టి అపరాధులు ఎవరో తెలుసుకోవడం సాధ్యం కాదనిపించింది దాసుకు. దాసు 7 గంటలకు పోలీసు స్టేషన్‌కు తిరిగి వచ్చాడు. పదినిముషాలలో ఒక ఫోన్ వచ్చింది. యధాలాపంగా రిసీవర్ అందుకొన్న దాసు ఒక్కసారిగా తృళ్ళిపడ్డాడు.

"నేను గోవిందలైన్ దక్షిణేశ్వర్ నుంచి మాట్లాడుతున్నాను. ఇక్కడ ఒక ఆడపిల్ల శవం మురుగుకాలవలో పడి ఉంది." అవతలి కంఠం.

"మీరెవరు?"

"నా పేరు చెప్పి అనవసరంగా పోలీసు కేసుల్లో ఇరుక్కోవడం నాకు ఇష్టం లేదు సర్. నేను నిజం చెబుతున్నాను. మీరే వచ్చి చూడండి." అనేసి మరో ప్రశ్నకు అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేశాడు అవతలి వ్యక్తి.

ఇన్‌స్పెక్టర్ దాసు తన సిబ్బందితో దక్షిణేశ్వర్‌కు వెళ్ళాడు. వాళ్ళు వెళ్ళేసరికి అక్కడ చాలామంది జనం గుమికూడి ఉన్నారు. మురుగు కాలవలో దాదాపు 16-17 సంవత్సరాలున్న ఆడపిల్ల శవం కనిపించింది. పోలీసువాళ్ళు ఆ అమ్మాయి శవాన్ని బయటికి తీసి ఒడ్డున వేశారు. ఆమె చీర చిరిగి ఉన్నది. బ్లౌజ్‌కూడా చిరిగి ఉన్నది. ముఖం మీద గాట్లున్నాయి. దివాకర్‌సేన్ కబురు అంది భార్యతో వచ్చాడు. తల్లిదండ్రులు బిడ్డ శవాన్ని చూస్తూనే భోరున ఏడవసాగారు. తల్లి పూర్తిగా స్పృహతప్పి పడిపోయింది.

శవాన్ని పోస్టుమార్టమ్‌కు ఆసుపత్రికి పంపించారు. తల్లికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఇంట్లో పడుకోబెట్టారు. తండ్రి గుండెలు అవిసిపోయేలా విలపిస్తూ కూతురి



శవంతో ఆసుపత్రికి వెళ్ళాడు. మోనా స్నేహితురాళ్ళు చెప్పిన దాన్ని బట్టి ఇన్‌స్పెక్టర్ మోనా ప్రియుడ్ని అదుపులోకి తీసుకున్నాడు. అతని ఇల్లు సోదా చేశారు. మోనా అతనికి రాసిన ప్రేమలేఖలు స్వాధీనం చేసుకున్నాడు ఇన్‌స్పెక్టర్. స్టేషన్‌కు తీసుకువచ్చి వికాస్‌ను అనేక విధాల ప్రశ్నించారు. వికాస్ తనకు మోనా అపహరణ, ఆ తర్వాత హత్యతో ఎలాంటి సంబంధం లేదని ఖచ్చితంగా చెప్పాడు. ఎన్నిరకాలుగా ప్రశ్నించినా అతని నుంచి అదే సమాధానం వచ్చింది. వికాస్‌ను లాకప్‌లో పెట్టాడు.

రెండోరోజు ఇన్‌స్పెక్టర్‌కు పోస్టుమార్టమ్ చేసిన డాక్టర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. డాక్టర్ దానును వెంటనే రమ్మని చెప్పాడు. దాసు ఆసుపత్రికి వెళ్ళి డాక్టర్‌ను కలుసుకున్నాడు. పింగాణీ కప్పు తెచ్చి అతని ముందు పెట్టింది నర్స్. ఇన్‌స్పెక్టర్ దాసు ప్రశ్నార్థకంగా చూశాడు.

"మిష్టర్ దాస్, అందులో పాలిథిన్ పేపరుతో చుట్టిన నాలుగు చిన్న చిన్న పొట్లాలున్నాయ్ చూడండి. అవి మోనా జీర్ణకోశంలో దొరికాయి. ఆమె చనిపోవడానికి కొద్ది నిమిషాలముందే వాటిని మింగి ఉండాలి. అందువల్లనే ఆ పొట్లాలకు చుట్టిన దారంతో సహా యధాతధంగా ఉన్నాయి. వాటిలో ఏముందో నాకు తెలియదు. మీ ముందే వీటిని విప్పాలనే ఉద్దేశ్యంతో మిమ్మల్ని వెంటనే రమ్మన్నాను" అంటూ డాక్టర్ ఒక పొట్లాన్ని చేతిలోకి తీసుకుని జాగ్రత్తగా దారం విప్పి పాలిథిన్ పేపరు మడతలు విప్పాడు. అందులో చిన్నకాగితం మడత పెట్టి ఉంది. అది చూసి ఇద్దరూ ఆశ్చర్యపోయారు. ఆ కాగితం విప్పారు. అందులో పెన్సిల్‌తో ఏదో రాసి ఉన్నది. ఇన్‌స్పెక్టర్ చదవసాగాడు.

"నంబరు మూడు - నాలుగో వ్యక్తి నాకు తెలిసిన వాడేననిపిస్తోంది. అందుకేనేమో నా ఎదుటికి రాలేదు. మిగతా ముగ్గురూ పశువుల్లా నన్ను రేప్ చేశారు. వాళ్ళు వెళ్ళిపోయాక నేను మంచినీళ్ళు కావాలని అరిచాను. నాలుగో వ్యక్తి తలుపుకొద్దిగా తెరిచి మంచి నీళ్ళ గ్లాసు ఉన్న చేతిని లోపలకు చాచాడు. గ్లాసు అందుకున్నప్పుడు అతని చేతి చూపుడు వేలుకూ, ఉంగరం వేలుకూ బంగారపు ఉంగరాలు ఉన్నాయ్. ఆ ఉంగరాలూ, ఆ చెయ్యి నాకు అంతకుముందు చూసినట్టుగా అనిపించింది.

దాసు ముఖంలోకి ఆశ్చర్యం తన్నుకొచ్చింది.

"మోనా చాలా తెలివైన పిల్ల!" తనకుతానే చెప్పుకుంటున్నట్టుగా అన్నాడు దాసు.

డాక్టర్ మరో పొట్లాం వూడదీసి అందులోని కాగితం దాసుకు అందించాడు.

"నంబరు 2 - వికాస్‌ను నేను ప్రేమిస్తున్నానని తెలిసినవాళ్ళు నన్ను అపహరించారు. వికాస్ పేరు చెబితే నేను ఎక్కడికైనా ఆలోచించకుండా వెళ్తానని తెలిసినవాళ్ళే ఈ పని చేశారు. నన్ను ఒక సామానుల గదిలో బంధించారు. ఆ గదికి కిటికీ కూడా లేదు. చాలా ఎత్తుగా వెంటిలేటర్ మాత్రం ఉన్నది. మధ్య మధ్య బయట నుంచి నీళ్ళల్లో లాంచీ వెళ్తున్నట్టుగా అనిపిస్తున్నది. అంటే ఈ ఇల్లు ఒక నదికి దగ్గరగా ఉండి ఉండాలి" అని రాసి ఉంది.

డాక్టర్ మరో కాగితం అందించాడు. అందులో "నంబరు-4- నాకు ఆర్థర్ కానన్ డైల్ పుస్తకాలంటే ఇష్టం. తెగ చదువుతాను. వాళ్ళు నలుగురూ మాట్లాడుకోవడం విన్నాను. అందులో ఒక గొంతు నాకు చాలా బాగా తెలిసినదిగా అనిపిస్తోంది. వాళ్ళు మా నాన్న దగ్గర డబ్బు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. నేను అల్లరి చేస్తే చంపాలని నిర్ణయించుకున్నారు. అందుకే నామీద దౌర్జన్యం చేస్తున్నప్పుడు నేను అరవలేదు. వాళ్ళు వెళ్ళిపోయారు. మా నాన్న దగ్గర డబ్బు తీసుకొని నన్ను వదిలేస్తారనే నమ్మకం నాకు లేదు. కారణం నాలుగో వ్యక్తి ఎవరో తర్వాత అయినా నేను తెలుసుకోగలననే భయం వాళ్ళకు ఉండవచ్చును. అందుకే నేను నా బయాలజీ బాక్స్ నుంచి పాలిథిన్ పేపరూ, దారమూ తీసుకున్నాను. నోట్స్ రాసుకునే బుక్ నుంచి కాగితాలు చింపి చిన్న చిన్న ముక్కలు మీద రాసి పొట్లం గట్టి మింగుతున్నాను. నన్ను హత్య చేస్తే పోస్టుమార్టమ్ చేస్తారు. అప్పుడు నా పొట్టలో ఈ పొట్లాలు డాక్టర్‌కు దొరుకుతాయి. తర్వాత పోలీసులకు అందుతాయి. నేను ఇచ్చే ఈ కొద్ది సమాచారం ద్వారా పోలీసులు అపరాధుల్ని తప్పక పట్టుకుని దండిస్తారు. దాహం అంటూ నీళ్ళకోసం అరిచాను. చిన్న చిన్న పొట్లాలు నీళ్ళ ద్వారా మందు బిళ్ళల్లా మింగుతున్నాను. నా పేరు మోనా. మా నాన్న పేరు దివాకర్ సేన్. కాశీపురంలో ఉన్న రామతీర్థ సందులో ఉన్నది మా ఇల్లు. ఇంటి నంబరు 114" ఇలా ఉంది.

అది చదువుతుంటే దాసు కంఠంలో జీర పలికింది. వింటున్న డాక్టర్ కళ్ళు చెమ్మగిల్లాయి. నర్స్ నిలబడలేనట్టు కళ్ళు తుడుచుకుంటూ గోడకు చేరబడి నిల్చుంది.

డాక్టర్ చివరి పొట్లం విప్పి కాగితం దాసుకు అదించాడు. అది మొదట రాసిన నోటు.

"నంబరు-1-నన్ను తిప్పితిప్పి ఒక ప్రదేశానికి చేర్చారు. ముగ్గురు ముసుగులు వేసుకుని ఉన్నారు. నాలుగో వ్యక్తి ఆ ఇంట్లోనే ఉన్నాడు. అతనే ఈ అపహరణకు ప్రధానంగా కారకుడని గ్రహించాను. అతను నా ముందుకు రాలేదు. గది బయట నుంచి అతను గొంతు విన్నాను. నీళ్ళు అడిగినప్పటికి, ముసుగుల్లో ఉన్న ముగ్గురూ మా నాన్న తెచ్చే డబ్బుకోసం వెళ్ళారు... వాళ్ళు... ..."

ఇన్‌స్పెక్టర్ ఆలోచనలో పడ్డాడు. నాలుగో వ్యక్తి మోనాకు బాగా తెలిసిన వ్యక్తేనని గ్రహించాడు. పోలీసు _స్టేషన్‌కు వచ్చాడు. మోనా ప్రియుడు వికాస్ చక్రవర్తిని వదిలేసాడు.

ఆ తర్వాత దాసు దివాకర్ సేన్ ఇంటికి వెళ్ళాడు. సేన్ మూర్తీభవించిన విషాదంలా కూర్చుని ఉన్నాడు. అతని చుట్టూ చాలా మంది ఉన్నారు. పరామర్శించడానికి వచ్చినవాళ్ళు. దాసు పోస్టుమార్టమ్‌లో ఆమె జీర్ణాశయంలో దొరికిన పొట్లాల గురించి చెప్పాడు. అక్కడ ఉన్న వాళ్ళంతా విస్తుబోయారు.

"అపరాధుల్ని పట్టుకోవడానికి ఆమె రాసిన సమాచారం చాలా ఉపయోగపడుతుంది. చాలా తెలివైన అమ్మాయి. అయితే ఇన్వెస్టిగేషన్ ప్రారంభిండానికి మరింత క్లూ దొరకాలి"



"మీరు క్లూ కోసం చూస్తూ ఉండండి. ఆ లోపల అపరాధులు తప్పించుకుంటారు. ఇలాంటి దారుణాలు జరగడానికి మీ పోలీసువాళ్ళ అలసతే కారణం" అక్కడ కూర్చున్న ఓ పెద్దమనిషి విసుగ్గా అన్నాడు.

దాసు అతనికేసి చూశాడు. అతను మాట్లాడిన పద్ధతి దాసుకు నచ్చలేదు. అందుకే కోపంగా పరిశీలించి చూశాడు. అంతలో కోపం స్థానాన్ని ఆశ్చర్యం ఆక్రమించుకున్నది. పెదవుల మీద చిరునవ్వు తొణికింది. కారణం ఆ పెద్దమనిషి ఎడమ చేతివేళ్ళకు రెండు బంగారు ఉంగరాలు ఉండటమే!

"ఈయనెవరండీ!" సేన్‌ను ప్రశ్నించాడు దాసు.

"ఈయన మా అమ్మాయికి ప్రైవేటు చెబుతాడు."

"పేరు?"

"ఆకాశ్‌ధర్!"

దాసు ధర్‌కు షేక్‌హేండ్ ఇచ్చాడు. ధర్ చెయ్యి దాసు చేతిలో బిగిసిపోయింది.

"మిష్టర్ ధర్! అపరాధి-ప్రధాన అపరాధి దొరికాడు. ఆ హంతకుడు ఎవరో కాదు. మీరే!" దాసు కంఠం దృఢంగా పలికింది.

"మీకు మతిపోయిందా? ఏమిటి వాగుతున్నారు?" ఒక్కసారిగా చెయ్యిలాక్కుని దాదాపు అరిచాడు ధర్.

దాసు అతనికి సమాధానం ఇవ్వలేదు. అరెస్టు చేశాడు. "అతను హంతకుడా?" సేన్ నమ్మలేనట్టుగా అడిగాడు.

దాసు మోనా రాసిన స్లిప్‌లోని ఉంగరాల గురించి చెప్పాడు. "మీ అమ్మాయి చాలా తెలివైంది సార్! చూడండి ఇతని చేతికి ఆమె వర్ణించిన లాంటి ఉంగరాలే ఉన్నాయి" అన్నాడు దాసు.

అక్కడ ఉన్న పెద్దలందరూ ఆశ్చర్యంగా చూశారు. సేన్ పులిలా అతని మీదకు దూకాడు. అందరూ పట్టుకున్నారు. "నన్ను వదలండి. నా బిడ్డ ప్రాణాలు తీసిన వీడ్ని నా చేతులతో చంపితేగాని నాకు మనఃశాంతి ఉండదు." పిచ్చివాడిలా అరవసాగాడు సేన్.

దాసు వెంటే తలవంచుకుని ధర్ వెళ్ళాడు.

ధర్ ఉద్యోగం లేదని ప్రాధేయపడితే జాలితలచి సేన్ మోనాకు ట్యూషన్ చెప్పమని నెలకు రెండు వందలు ఇస్తున్నాడు. కొన్ని ఆఫీసు లెక్కలు చూస్తున్నందుకు అదనంగా మరో మూడు వందలు ఇస్తున్నాడు.

హంతకుడి మాటల్లో-

"నాకు దివాకర్ బాబు అన్నం పెట్టారు. నా కుటుంబం ఆకలితో మలమల మాడిపోకుండా ఆదుకున్నారు. కాని నాలోని సైతాన్‌కు సంతృప్తిలేదు. డబ్బు సంపాదించాలనే ఆశ జనించింది. మోనా దివాకర్ బాబు ఏకైక సంతానం. ఆ అమ్మాయిని అపహరించి డబ్బు గుంజాలనే ప్రయత్నంలో పడ్డాను. మోనా వికాస్‌ని ప్రేమిస్తుందని తెలుసుకున్నాను. మరో ముగ్గుర్ని నాకు సహాయం చెయ్యడానికి

ఏర్పాటు చేసుకున్నాను. ఆ ముగ్గురూ లక్షరూపాయలు పంచుకుంటారు. నాకు లక్షరూపాయలు వుంటాయి. ఇదీ ఒప్పందం. నాకు మోనాను చంపాలనిగానీ ఆమె శీలాన్ని హరించాలని గానీ లేదు. ఆమెను నా ముగ్గురు మిత్రులూ ఎలా తీసుకొచ్చారో మీకు తెలిసిందే. నన్ను ఆమె గుర్తుపడ్తుందని చాటుగానే ఉంటూ వచ్చాను. డబ్బు దొరికాక, ఎందుకైనా మంచిదని ఆమెను చంపడానికి నిర్ణయించుకున్నాం. ఇక నేను చెప్పాల్సిందేమీలేదు." పోలీసుల ముందు స్టేట్‌మెంటు ఇచ్చాడు ధర్.

మిగతా ముగ్గురూ కూడా అరెస్టు అయ్యారు.

ప్రస్తుతం ఆ నలుగురూ దమ్‌దమ్ సెంట్రల్ జైల్లో ఉన్నారు.

కేసు కోర్టులో నడుస్తున్నది.

❀ ❀ ❀



# 23. ప్రేమా! పిచ్చా!

1982 జులై 9వ తేదీ - అంటే ఆరు నెలల క్రితం జరిగిన వాస్తవ కథ ఇది. ఒకయువతి ఆ రోజు సాయంత్రం బొంబాయిలోని దాదర్‌లో ఉన్న దుర్గా ఇండస్ట్రీస్ గేటు ముందు చాలా సేపుగా నిల్చుని ఉన్నది. ఆమె వయసు దాదాపు 25 సంవత్సరాలు. ఆమె ఆతృతగా ఎవరి కోసమో ఎదురుచూస్తోంది.

దాదాపు 27-28 సంవత్సరాల వయసులో ఉన్న ఒక యువకుడు లోపల నుంచి వచ్చాడు. అతన్ని చూడగానే ఆ యువతి "అశోకన్! నేను నీ కోసం చాలాసేపటి నుంచి ఎదురుచూస్తున్నాను" అన్నది.

అశోకన్ ముఖంలో అలజడి కన్పించింది. "జేనీ! నా మాట విను! నువ్వు లేకుండా నేను బతకలేను. నన్ను మోసం చెయ్యకు!" అర్థిస్తున్నట్టుగా అన్నాడు అశోకన్. అతని కళ్ళలో నీరు తిరిగింది. కంఠస్వరం రుద్ధమైంది.

జేనీ మౌనంగా విన్నది. ఇద్దరూ పక్కపక్కగా నడుస్తున్నారు.

"జేనీ! సారీ! నేను నా మాట నిలబెట్టుకోలేకపోతున్నాను"

"అంటే? ఆ ఫోటోలూ, నా ఉత్తరాలు ఇవ్వవన్నమాట! మరి ఇస్తాను రమ్మని ఎందుకన్నావ్? అశోకన్! నన్ను అర్థం చేసుకో. నా పరిస్థితిని అర్థం చేసుకో. నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించాను. కాని నా అన్నలూ - నా తల్లిదండ్రులూ - మా కులపు వాడితో నా పెళ్ళి నిశ్చయించారు. వాళ్ళకు ఎదురు తిరగలేను!" జేనీ కంఠస్వరం నిర్లిప్తంగా ఉన్నది.

అశోకన్ కాళ్ళకు బంధం పడినట్లు ఆగిపోయాడు. జేనీ కూడా యాంత్రికంగా నిల్చుండిపోయింది.

"జేనీ! 'బతికితే కలిసి బతుకుదాం - చస్తే కలిసి చచ్చిపోదాం!' అని ఎన్నోసార్లు నువ్వే అన్నావు. ఇప్పుడిలా మోసం చేయడం న్యాయమా?" అశోకన్ కంఠంలో దుఃఖం గరగరలాడింది.

"నిజమే! కాని నా పరిస్థితి అలాంటిది. నేను అసహాయురాల్ని. నా ఉత్తరాలూ - ఫోటోలూ - ప్లీజ్ - ఇచ్చెయ్"

"జేనీ! బాగా ఆలోచించుకో! నన్ను కాదని వేరే వ్యక్తిని వివాహం చేసుకొని సుఖంగా కాపురం చెయ్యగలవా?" అన్నాడు దాదాపు ఏడుస్తూనే.

జేనీ గబగబా నడుస్తోంది. నడుస్తూనే ఇద్దరూ వాదించుకోవడం దారినపోయేవాళ్ళు వింటున్నారనే ధ్యాస కూడా వాళ్ళకు లేదు.

"జేనీ నీ నిర్ణయం మారదా?" కఠినంగా అడిగాడు.

"మారదు. నన్ను మర్చిపో అశోకన్!" అన్నది జేనీ దృఢంగా.

అశోకన్ నొసలు ముడిపడ్డాయి. కోపంతో కళ్ళు ఎర్రబడ్డాయి.

"నువ్వు నా దానివి. మరొకరిని చేసుకోవడానికి వీల్లేదు" ఖచ్చితంగా అన్నాడు.

నడుస్తున్న జేనీ ఆగింది.

అశోకన్ బొడ్లోనుంచి కత్తితీసి ఒక్కసారిగా ఆమె వీపుమీద పొడిచాడు. జేనీ అరుస్తూ పడిపోయింది. కసిగా నాలుగైదుసార్లు పొడిచి రక్తసిక్తమైన కత్తితో పారిపోయాడు. అక్కడున్న జనం ఏం జరుగుతుందో అర్థం చేసుకునే లోపలే జేనీ రక్తపుమడుగులో ఉంది. అశోకన్ పారిపోయాడు.

అశోకన్ ఎదురుగా వచ్చిన టాక్సీ ఆపాడు! ఆగిన టాక్సీలో గబుక్కున ఎక్కి డ్రైవర్ పక్కసీట్లో కూర్చున్నాడు. అశోకన్ చేతిలోని కత్తి డ్రైవర్ ముందు చూడలేదు. తీరా తన పక్కన కూర్చున్న తర్వాత చూశాడు.

టాక్సీ కదలలేదు.

"త్వరగా పోనియ్. లేకపోతే చంపేస్తాను" అశోకన్ బెదిరించాడు.

టాక్సీ డ్రైవర్ టాక్సీ స్టార్టుచేశాడు. అశోకన్ ఎవరినో హత్య చేసి వస్తున్నాడని డ్రైవర్‌కు అన్పించింది. ఆలోచించాడు.

"సర్! ఆ కత్తి బయట పారేయండి. లేకపోతే ట్రాఫిక్‌లో వున్న పోలీసువాళ్ళు చూస్తారు" అన్నాడు డ్రైయివర్.

అశోకన్ కత్తి సీటు కింద పడేశాడు. డ్రైవర్ స్పీడుగా వెళ్తూ వెళ్తూ ఒకచోట ఆపి, ఒక్కసారిగా బయటికి దూకాడు. అక్కడే వున్న ఇద్దరు పోలీసు కానిస్టేబుల్స్‌ను కేకలు పెట్టాడు. అశోకన్ పోలీసులకు దొరికిపోయాడు.

రక్తపు మడుగులో ఉన్న జేనీ ఇంకా బ్రతికే వున్నది. పోలీసులు ఆమెను ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె మరణవాంగ్మూలం ఇచ్చే స్థితిలో లేదు. ఆసుపత్రిలో చేర్చిన రెండు గంటల్లో ఆమె చనిపోయింది.

దాదర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆసుపత్రికి వెళ్ళాడు. అదే సమయంలో ఒక యువకుడు ఆసుపత్రికి వచ్చి వెక్కి వెక్కి ఏడవసాగాడు. ఇన్‌స్పెక్టర్ అతని పరిచయం అడిగాడు.

"జేనీ నా చెల్లెలు. నా పేరు మైకేల్. పొద్దుపోయినా జేనీ ఇంటికి రాలేదు. అందరం ఆదుర్దాగా ఉన్నాం. ఎవడో ఒక యువతిని హత్య చేశాడనీ, శవం ఆ ఆసుపత్రిలో ఉందనీ న్యూస్ రేడియోలో విన్నాను. ఎందుకో అనుమానం వచ్చింది. చూడటానికి వచ్చాను. తీరా చూస్తే ఆ యువతి మా జేనీ!" అంటూ ఏడవసాగాడు.



ఇన్‌స్పెక్టర్ మైకేల్‌ను కొన్ని ప్రశ్నలు వేశాడు. ఆ తర్వాత తనతో అతన్ని స్టేషన్‌కు తీసుకొచ్చాడు.

అరెస్టు అయి పోలీసు కస్టడీలో ఉన్న అతన్ని మైకల్, జేనీ స్నేహితుడిగా గుర్తించాడు.

"నువ్వేనా జేనీని చంపింది?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించారు.

"అవును!"

"నీ పేరు?"

"అశోకన్"

"ఎందుకు హత్య చేశావు?"

"సర్! ఆమెను నేను ప్రేమించాను. తనుకూడా ప్రేమించినట్టే నటించింది. ఇప్పుడు మరొకర్ని పెళ్ళి చేసుకోవడానికి సిద్ధం అయింది. అది నేను సహించలేకపోయాను" అశోకన్ తన అపరాధాన్ని అంగీకరించాడు.

అశోకన్ మలబార్‌కు చెందినవాడు. తొమ్మిది ఏళ్ళ క్రితం తండ్రిపోయాడు. తల్లీ, ఒక చెల్లెలూ ఉన్నారు. వాళ్ళ బాధ్యత అతనిమీద పడింది. బొంబాయికి ఉద్యోగం వెదుక్కుంటూ వచ్చాడు.

జేనీ కూడా అశోకన్ పనిచేసే కంపెనీలోనే పనిచేస్తున్నది. వాళ్ళిద్దరి పరిచయం ప్రేమగా మారింది. అశోకన్ శెలవుమీద మలబార్ వెళ్ళినప్పుడు జేనీ ప్రేమలేఖలు రాసేది. ఇద్దరూ ఫోటోలు తీయించుకున్నారు.

కాని ఒకరోజు అకస్మాత్తుగా జేనీ తమ వివాహానికి పెద్దలు అంగీకరించడంలేదని చెప్పింది. ఇద్దరి మతాలు వేరువేరు, తనకు మరొకరితో వివాహం కుదిరిందనీ, తన అన్నల మాటకు తాను ఎదురుచెప్పలేక ఆ వివాహానికి అంగీకరించాననీ చెప్పింది.

అది విన్న అశోకన్‌కు నెత్తిన పిడుగుపడ్డట్టు అయింది. బాధపడ్డాడు. ఏడ్చాడు. అయినా జేనీ పెద్దల్ని ఎదిరించడానికి సిద్ధపడలేదు. పైగా "నిజమైన ప్రేమకు స్వార్థం తెలియదు. త్యాగం చెయ్యడం మాత్రమే తెలుసు. నీది నిజమయిన ప్రేమే అయితే నా మార్గానికి అడ్డురాకు. మనం తీయించుకున్న ఫోటోలు, నేను రాసిన ఉత్తరాలు ఇచ్చెయ్. అవి నీ దగ్గిర ఉంటే నాకు మనశ్శాంతి ఉండదు. శరీరం ఇంకొకరికిచ్చినా, మనసు మాత్రం నీదే!" అంటూ అశోకన్‌ను శాంతపర్చడానికి ప్రయత్నించింది.

అశోకన్‌కు జానీ మీద జాలివేసింది. ఆమె చెప్పినట్టుగా వినడానికే అంగీకరించాడు. ఫోటోలు, ఉత్తరాలూ తిరిగి ఇచ్చేస్తానన్నాడు. రెండో రోజు సాయంత్రం తన ఆఫీసు గేటులో ఉండమన్నాడు. అప్పటికి అశోకన్ వేరే కంపెనీలో చేరాడు.

కానీ ఆ రాత్రంతా అశోకన్ మథనపడ్డాడు. జేనీ లేని బ్రతుకు వ్యర్థం అనుకున్నాడు. మరోసారి చెప్పి చూడాలని, ఆమె మొండిగా ఉంటే హత్య చెయ్యాలనీ నిర్ణయించుకున్నాడు.

"సరే! నా జేనీ మరొకడికి పెళ్ళంగా ఉండటం అనే విషయాన్ని ఊహిస్తేనే భరించలేని ఆవేదన కలిగింది. నిజంగా అలా జరిగితే... జీవితమంతా ఆ బాధను భరించాలనే ఆలోచన వచ్చింది. అందుకే ఆమెను హత్యచేశాను" అన్నాడు అశోకన్.

అతని మీద కేసు కోర్టులో ఇంకా నడుస్తూనే ఉన్నది.

"దెబ్బతిన్న ప్రేమ ప్రతీకారం కోరుతుంది" అనే నానుడికి ఈ కథ ఒక ఉదాహరణ.

❀ ❀ ❀



# 24. రీత విషాద గాథ

రీతాదేవి ఢిల్లీ - సెక్రెటేరియట్‌లో క్లాస్‌వన్ గెజెటెడ్ ఆఫీసరుగా పని చేస్తూ ఉండేది. ఆమె తల్లి దండ్రులు చండీగఢ్‌లో ఉండేవారు. ఆమె ఢిల్లీలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉండేది. ఆమె వయసు 28 సంవత్సరాలు. పెద్ద పెద్ద కళ్ళతో ఆకర్షణీయంగా ఉండేది.

తల్లిదండ్రులకు రీతా పెళ్ళిని గురించి భయం పట్టుకొన్నది. గెజెటెడ్ ఆఫీసరైనా ఈ దేశంలో ఆడపిల్లను తల్లిదండ్రులు తమ గుండెలమీది కుంపటిగానే భావిస్తారు. అందుకే ఆ తండ్రి పేపర్లో "వరుడు కావాలి" అంటూ ప్రకటించాడు. చాలామంది తమ తమ పరిచయాలు పంపించారు. జస్వంతరాయ్ ఖురానా కూడా తనకు సంబంధించిన వివరాలు, తన చెల్లెలు శాంత చేత రాయించాడు.

రీత తల్లిదండ్రులకు జస్వంతరాయ్ ఖురానా సంబంధం బాగుందనిపించింది. అతను సెంట్రల్ ఇంటలిజెన్స్ బ్యూరోలో ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్నాడు. అతను ఢిల్లీలోనే ఉన్నాడు. రీత తండ్రి ఆరోగ్యం బాగాలేదు. తల్లి తన పెద్దకొడుకుని వెంటబెట్టుకొని ఖురానాను చూడటానికి ఢిల్లీ వచ్చింది. రీతకు ఇదంతా నచ్చలేదు. కాని పెద్దవాళ్ళకు ఎదురు చెప్పలేకపోయింది. ఆమె కూడా తల్లితోపాటు జస్వంత్ ఖురానా ఇంటికి వెళ్ళింది.

వాళ్ళను చూసి జస్వంత్, ఎవరో పనిమీద వచ్చి ఉంటారని భావించాడు. తనను తన అన్నగా పరిచయం చేసుకొన్నాడు. అసలు విషయం విని "సారీ! నేనే జస్వంత్‌ను. ఇంటలిజెన్స్ బ్యూరోలో ఆఫీసరుగా ఉన్నాను" అని తనను పరిచయం చేసుకొన్నాడు. ముందు అతను ఎందుకు అబద్ధం చెప్పాడో రీతకు అర్థంకాలేదు. సి. ఐ. డి. మెంటాలిటీ కాబోలు అనుకున్నది.

జస్వంత్ రీతతల్లికి నచ్చాడు. ఆమె సూటిగా అతడ్ని అడిగేసింది- "బాబూ! మరి రీత నీకంటే ఎక్కువ సంపాదిస్తోంది. పెద్ద ఉద్యోగంలో ఉంది. వివాహం తర్వాత నీలో ఆత్మహీనతాభావం (ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు) తలెత్తుతుందేమోనని నాకు భయంగా ఉంది" అన్నది.

అది విని జస్వంత్ తేలిగ్గా నవ్వాడు. "అబ్బే అలాంటిదేమీ ఉండదు. నాకు రెండు నెలల్లో ప్రమోషన్ రాబోతున్నది" అన్నాడు. ఇరువైపులవారికీ ఈ సంబంధం నచ్చింది. జస్వంత్ వెంటనే పెళ్ళి జరగాలన్నాడు.

1982 జులై 11వ తేదీన వారి వివాహం జరిగింది. ఖురానా తల్లిదండ్రులు యమునానగర్‌లో ఉంటారు. అతనికి అయిదుగురు అన్నదమ్ములు, ముగ్గురు చెల్లెళ్ళు ఉన్నారు. అయినా పెళ్ళికి తల్లీ, చిన్న చెల్లెలు శాంత మాత్రం వచ్చారు.

ఆ సాయంత్రం కరోల్‌బాగ్‌లోని "సోబతి హోటల్"లో పార్టీ ఏర్పాటు చేశారు. రీత స్నేహితురాండ్రు రీత చాలా డల్‌గా ఉండటాన్ని గమనించారు.

జులై 14 న హనీమూన్‌కు కాశ్మీర్ బయలుదేరారు. రీత ఊటీ వెళ్దామన్నది కాని అతను అంగీకరించలేదు. పెళ్ళాన్ని బానిసగా చూసే మనస్తత్వం అతనిది. ఆ విషయం రీతకు క్రమంగా బోధపడుతోంది.

భర్త పిసినారితనం కారణంగా కొత్త పెళ్ళికూతురు రీత భుజాన హాండ్‌బ్యాగ్ తగిలించుకొని, చేత్తో సూట్‌కేసు పట్టుకొని భర్త వెంటరాగా స్టేషన్ నుంచి మూడు కిలోమీటర్లు నడవలేక నడిచి ఇన్‌టలిజెన్స్ వారి బంగళా దగ్గరకు వచ్చింది. బంగళా వాచ్‌మెన్ రీత చేతిలోని పెట్టె అందుకున్నాడు. ఆమె చేత ఆ కొండ ప్రదేశంలో సామాను మోయిస్తూ, చేతులు ఊపుకొంటూ ముందు నడచివస్తున్న మగవాడిని ఆశ్చర్యంగా చూశాడు వాచ్‌మెన్. శ్రీనగర్, సొనామార్గ్, గుర్‌మార్గ్ చూసి పహల్‌గాంక్ వచ్చారు. అంత చల్లటి ప్రదేశంలో కూడా రీత ముఖానికి చెమట్లు పట్టడం గమనించి వాచ్‌మన్ ఎదురువెళ్ళి ఆమె చేతిలోని పెట్టె అందుకున్నాడు. భర్త పిసినారితనం చూస్తూంటే రీతకు అసహ్యం వేస్తున్నది. అతనిలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉన్నట్టు కనిపెట్టింది రీత. అందుకే ఎంతో అణుకువగా భర్త ఆధిక్యతకు తలవంచినట్టుగా ప్రవర్తిస్తున్నది. అలా చేసినందువల్ల అతనిలోని ఆ కాంప్లెక్స్ పోతుందని ఆమె ఆశ.

కొత్త దంపతుల మధ్య సఖ్యత లేదని చౌకీదారు గ్రహించాడు. భార్య ఎప్పుడూ దిగులుగా కన్పిస్తే, భర్త చిటపటలాడుతూ కన్పించేవాడు. రెండోరోజు ఉదయం టీ కప్పులతో చౌకీదారు లోపలకు వెళ్ళాడు. జస్వంత్ మంచంమధ్యలో మఠం వేసుకొని కూర్చుని ఉన్నాడూ. రీతపక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని ఉన్నది. చౌకీదారు టీ కప్పు అందిస్తూ రీత చంపల మీదగా కారుతున్న కన్నీటిని తుడుచుకోవడం చూశాడు. అతనికి ఆమె మీద జాలి వేసింది.

"చూడు చౌకీదార్! మేము సాయంత్రం ఖాళీ చేసి వెళ్ళిపోతున్నాం. బయటకెళ్ళి వస్తాం అప్పటికి బిల్లు తయారుగా ఉంచు" అన్నాడు ఖురాన్.

"అలాగే సాబ్!" అని ఖాళీ కప్పులు తీసుకొని బయటికి వెళ్ళిపోయాడు చౌకీదార్. అతను మధ్యాహ్నం నుంచీ ఆ దంపతుల కోసం ఎదురు చూడసాగాడు. వాళ్ళు రాత్రి పదిన్నర తర్వాత వచ్చారు.

"ఇవ్వాళ వెళ్దామనుకున్నాం. కాని అన్ని ప్రదేశాలూ చూడటంలో ఆలస్యం అయింది. రేపు వెళ్తాం" అన్నాడు ఎదురుగా నిల్చున్న చౌకీదారుతో జస్వంత్ ఖురానా.

"అలాగే సాబ్!" అంటూ రీతను చూశాడు. ఆమె ఎంతో దిగులుగా ఉన్నట్టు కన్పించింది. ఆమె చేతిలో ఒక ప్యాకెట్ వున్నది.

ఆ రెండో రోజు ఉదయం చౌకీదారు రెండు టీ తీసుకుని వాళ్ళగదిలోకి వెళ్ళాడు. ఒకటి జస్వంత్‌కు అందించి రీతకోసం గదిలో నలువైపులా చూశాడు. అతని కళ్ళతో ఎవరిని వెతుకుతున్నాడో అర్థం చేసుకున్నట్టు "ఆమె వాకింగుకు వెళ్ళింది" అన్నాడు ఖురానా చౌకీదారుతో.



చౌకీదారుకు ఆశ్చర్యం వేసింది. బయట వర్షం కురుస్తున్నది. ఇలాంటి సమయంలో ఆమె షికారుకెళ్ళడం ఏమిటీ అనుకొన్నాడు. పైగా గడచిన నాలుగు రోజుల్లో ఒక్కసారికూడా ఆమె వంటరిగా బయటికి వెళ్ళలేదు. చౌకీదారు మధ్యాహ్నం గదిలోకి వెళ్ళాడు. జస్వంత్ గదిలో అశాంతిగా తిరుగుతున్నాడు. చౌకీదారును చూసి ఉలిక్కిపడి "ఏమిటి?" అన్నాడు చిరాకుగా.

"భోజనం బాబూ!" అన్నాడు చూపుల్ని గది నలుమూలలా సారిస్తూ.

"వాకింగ్‌కు వెళ్ళిన అమ్మగారు ఇంకా రాలేదు. పోయి చూద్దామంటే వర్షం. అమ్మగారు వచ్చాక ఇద్దరం కలిసే భోంచేస్తాం," అన్నాడు జస్వంత్‌రాయ్ ఖురానా.

చౌకీదారు అతని ముఖంలోకి లోతుగా చూసి బయటకు వెళ్ళిపోయాడు.

వర్షం ఆగిపోయింది. అప్పటికి సాయంకాలం నాలుగు గంటలయింది. ఖురానా బయటకు వచ్చాడు. తిన్నగా పోలీస్ స్టేషనుకు వెళ్ళాడు. పోలీసు ఇనస్పెక్టర్‌తో - "నా పేరు జస్వంత్ ఖురానా. సెంట్రల్ ఇంటలిజెన్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాను. ఇంటలిజెన్స్‌వారి బంగళాలో దిగాను. నాలుగు రోజుల క్రితం నా భార్య రీతతో హనీమూన్‌కు వచ్చాను. ఇవ్వాళ ఉదయం నేను నిద్ర లేచేసరికి నాభార్య గదిలో లేదు. అలా వాకింగ్‌కు వెళ్ళిందేమో అనుకొన్నాను. నిన్న ఉదయం కూడా తను వాకింగ్‌కు వెళ్ళి గంటలో తిరిగొచ్చింది. ఇవ్వాళ ఇంతవరకు రాలేదు. దారి మర్చిపోయిందో లేక ఎవరైనా దుండగులు ఎత్తుకెళ్ళిపోయారో తెలియడంలేదు. ప్లీజ్! మీరు వెంటనే ఆమెను వెదికే ఏర్పాటు చెయ్యండి" అన్నాడు.

"గాభరా పడకండి. మేం వెదికిస్తాం!" అంటూ ఇనస్పెక్టర్ భరోసా ఇచ్చాడు.

జస్వంత్ అక్కడ్నుంచి తిన్నగా ఇంటలిజెన్స్‌బ్యూరోకు వెళ్ళి, రీత తల్లి దండ్రులకూ, తన చిన్న చెల్లెలు శాంతకూ రీత కన్పించడంలేదని టెలిగ్రాములు ఇచ్చాడు. రీత తల్లి గాభరాపడిపోయింది. ఎయిర్ ఇండియా ఢిల్లీలో ఇంజనీరుగా ఉన్న కొడుకు రాజేశ్‌కు ఫోన్ చేసింది, వెంటనే బయలుదేరి చండీగఢ్ వచ్చెయ్యమని. రీత తండ్రి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఏమైంది రీతకు? రెండు రోజుల క్రితం ఉత్తరం శ్రీనగర్ గురించి రాసింది తను బాగున్నట్టు రాసింది. ఇంతలోనే ఏమైంది. ఇద్దరూ ఘర్షణ పడ్డారా? ఐనా రీత స్వభావం అలా అలిగి కన్పించకుండా వెళ్ళేది కాదే? రీత తల్లి పరిపరివిధాల ఆలోచించసాగింది.

టెలిగ్రాం అందుకున్న జస్వంత్ చెల్లెలు శాంతి కూడా గాభరాపడసాగింది.

ఇక్కడి పోలీసులు రీతకోసం గాలిస్తున్నారు. పోలీసులు ఆదుర్దాగా ఉన్నారు. కాని జస్వంత్ మాత్రం తాపీగా గెస్ట్‌హౌస్‌లోనే ఉండిపోయాడు. జులై 27న ఒక వ్యక్తి పోలీసు స్టేషన్‌కు వచ్చి లద్దర్ నదిలో ఒక స్త్రీ శవం నీళ్ళమీద తేలి ఉన్నదని చెప్పాడు. వెంటనే పోలీసు సిబ్బంది బయలుదేరింది. శవాన్ని బయటికి తీశారు. శవం బాగా ఉబ్బిపోయి ఉన్నది. చేతికి ఉన్న కంకణాలు బిగిసిపోయాయి. మంగళ సూత్రాలు ఉన్నాయి. వేరే నగలు కూడా అలాగే ఉన్నాయి.

రీత తమ్ముడు రాజేష్ పహల్ గ్రామం వచ్చాడు. రీత చనిపోయిందనీ, పోస్టుమార్టంకోసం ఆసుపత్రికి తీసుకెళ్ళారనీ తెలిసి ఆసుపత్రికి వెళ్ళాడు.

నీళ్ళల్లో మునిగి చనిపోయినట్టుగా డాక్టర్ రిపోర్టు. కానీ ఆ లద్దర్ నది మనిషి మునిగిపోయేంత లోతు వుండదు. అదీకాక రీతకు ఉదయం లేచి వాకింగుకు వెళ్ళే అలవాటు లేదు. పైగా చాలా ఆలస్యంగా నిద్రలేస్తుంది. ఆ సంగతి హాస్టలువారు కూడా ధృవపరిచారు. తెల్లవారేసరికి నిద్రలేచి, భర్తకు కూడా తెలియకుండా అంత చలిలో వాకింగుకు వెళ్ళిందంటే రాజేష్ నమ్మలేదు.

పోలీసులు అది ఆత్మహత్య కాదనీ, హత్యేనన్న నిర్ణయానికి వచ్చారు. పోస్టుమార్టం రిపోర్టులో ఆమె ఎడమకన్ను కింద భాగం బాగా వాచి ఉన్నది. కుడివైపు కణత మీద వావుతో పాటు రక్తం గడ్డకట్టి ఉన్నది.

కిందటిరోజు రాత్రి భార్యాభర్తలు గెస్టుహౌస్‌లో తమ గదిలోకి వెళ్ళి తలుపు వేసుకోవడం చౌకీదారు చూసినట్టు చెప్పాడు. తెల్లవారి ఆమె కన్పించలేదని చెప్పాడు. పోలీసులకు జస్వంత్ మీద అనుమానం ఉంది. కాని అతను ఇంటలిజెన్స్‌లో పనిచేస్తున్నాడు. త్వరపడి అతన్ని కస్టడీలోకి తీసుకోవడం అంత మంచిది కాదని భావించారు. రాజేష్ అక్క శవాన్ని తీసుకెళ్తానన్నాడు. అందుకు ఖురానా అంగీకరించలేదు. కానీ పోలీసువారు శవాన్ని రీత తమ్ముడికే అప్పగించారు. రాజేశ్ శవాన్ని తీసుకెళ్ళిపోయాడు.

జస్వంత్‌ను పోలీసులు ఎన్‌క్వయిరీ పూర్తి అయేంతవరకు ఆ గ్రామం వదలకూడదని ఆదేశించారు. రీత తల్లి భారత ప్రెసిడెంట్ శ్రీ జైల్‌సింగ్ దగ్గరకు వెళ్ళి తన కూతుర్ని తన అల్లుడే హత్య చేశాడని చెప్పుకున్నది. అతను ఇంటలిజెన్స్‌లో పని చేస్తున్నాడు. కనుక కేసు గోల్‌మాల్ చెయ్యకుండా చూడవలసిందిగా ప్రెసిడెంటును వేడుకొన్నది.

ఆగస్టు 27న కొన్ని ఆధారాలు దొరకడంతో జస్వంత్ ఖురానాను అరెస్టు చేశారు.

“మిస్టర్ ఖురానా! మీరు రీతను ఎందుకు పెళ్ళి చేసుకున్నారు? పెళ్ళయి నెల తిరక్కుండానే ఆమెను ఎందుకు చంపారు?” పోలీసు ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

“రీతను నేను చంపలేదు. ఆమెను ఇష్టంతోనే చేసుకున్నాను. అలాంటప్పుడు నేను నెలతిరక్కుండా నాభార్యను ఎందుకు చంపుతాను?” అన్నాడు తాపీగా.

“ఎందుకా? ఆమె మీకంటే పెద్ద ఉద్యోగంలో ఉంది. ఎక్కువ సంపాదిస్తోంది. మీలో ఇన్‌ఫిరియారిటీకాంప్లెక్సు”

“లేదు. నాలో ఇన్‌ఫీరియారిటీకాంప్లెక్స్ ఉంటే తెలిసీ తెలిసి నాకంటే పెద్ద ఉద్యోగంలో ఉన్న రీతను ఎందుకు చేసుకుంటాను”

“మీకు డబ్బుమీద కాపీనం ఎక్కువ. వట్టి పిసినారివి. ఆమె సంపాదిస్తున్న డబ్బుకోసం చేసుకొన్నావు. ఆమె సరదాగా బతికిన వ్యక్తి. పదిమందితో కలువుగోలుగా ఉంటుంది. నువ్వు నలుగురితో కలవవు. అనుమానాలు ఎక్కువ. పెళ్ళి చూపులకు వచ్చినవాళ్ళ దగ్గిర నిన్ను నీవుగా కాక నీ అన్నగా పరిచయం చేసుకొన్నావు. ఆ అవసరం ఏమొచ్చింది? పిసినారితనంతోనే నీ భార్యను బస్‌స్టాండ్ నుంచి గెస్టుహౌస్ దాకా నడిపించావు. పైగా పెట్టె ఆమె చేత మోయించావు. ఆమె



ఇక్కడ ఏ దుకాణంలోకి వెళ్ళి ఏది కావాలనుకున్నా, నువ్వు ఆమెను తిడుతూ బయటికి తీసుకొచ్చావు. అవునా?”

జస్వంత్ సమాధానం ఇవ్వలేదు.

“చివరిరోజు ఆమె నీ మాటవినలేదు. తన తమ్ముడు రాజేష్‌కు ఒక స్వెట్టరూ, తల్లికి ఒక షాల్ కొన్నది. మూడువందల నలభై రూపాయలు ఖర్చు పెట్టింది. అందుకు నువ్వు ఆమెను సాధించడం మొదలుపెట్టావు. గెస్టుహౌస్‌కు వచ్చేంతవరకూ మార్గంలో తిడుతూనే ఉన్నావ్. చౌకీదారు నీ భార్య చాలా బాధపడుతున్నట్టు గ్రహించాడు. గదిలోకి రాగానే ఇద్దరి మధ్యా మాటలు పెరిగాయి. అంతవరకూ మౌనంగా అన్నీ సహించిన రీత ఎదురు తిరిగింది. దాంతో రెచ్చిపోయిన నువ్వు ఆ చంపా ఈ చంపా వాయించావు....” అంటూ ఇన్‌స్పెక్టర్ ఖురానా ముఖంలోకి చూశాడు.

జస్వంత్ ఖురానా ముఖం వెలాతెలాపోయింది.

“మాట్లాడు” గద్దించాడు ఇనస్పెక్టర్.

“అవును కొట్టాను. చెప్పు తీసుకొని ముఖంమీద పిచ్చికోపంతో కొట్టాను. స్పృహ తప్పి పడిపోయాకకూడా కొట్టాను. ఆ తర్వాత చచ్చిపోయిందేమోనని భయం వేసింది. ముఖంమీద నీళ్ళు చల్లాను. ఎంత సేపటికీ ఆమె స్పృహలోకి రాలేదు. ఆ పరిస్థితిలో డాక్టర్ని పిలవలేను. గదిలో చచ్చిపోతుందేమోననే భయం పట్టుకొన్నది. అర్థరాత్రి ఆమెను భుజాన వేసుకెళ్ళి నదిలో పారేశాను” అని చెప్పాడు.

ప్రస్తుతం అతను జైల్లో వున్నాడు.

అసలే అనారోగ్యంతో బాధపడుతున్న రీత తండ్రిని రీత చావు మరీ కృంగదీసింది. 1982 సెప్టెంబరు 7వ తేదీన రీత తండ్రి ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయాడు.

చదువుకొని పెద్ద ఉద్యోగం చేస్తున్న యువతుల్ని కూడా తల్లిదండ్రులు భారంగా భావిస్తున్నారు. పెళ్ళి చేస్తే గాని తమ నెత్తిన ఉన్న బరువు దిగిపోదు అనుకుంటున్నారు. అది సహజం కావచ్చును. కాని గెజిటెడ్ ఆఫీసరుగా పనిచేస్తున్న ఓ 28 ఏళ్ళయువతి తల్లి దండ్రుల నిర్ణయానికి తలవంచి తనకు ఇష్టం లేకపోయినా పెళ్ళికి అంగీకరించడం ఏమిటి?

మీరే ఆలోచించండి! ఇంతవరకూ స్త్రీ తమ కోసం పురుషులు ఆలోచించి గీసిన గీతల్లో బ్రతకడానికి అలవాటు పడింది. స్వంతంగా ఆలోచించడం లేదు. అందుకే అమ్మాయిలూ స్వంతంగా ఆలోచించడం నేర్చుకోండి.

❀ ❀ ❀

# 25. రైల్లో హత్య!

అది 1983వ సంవత్సరం మార్చి 17వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటా నలభై నిముషాలు అయింది. సిగ్నల్ ఇవ్వకపోవడంవల్ల తమిళ్‌నాడు ఎక్స్‌ప్రెస్ ఆగ్రా స్టేషన్‌కు దూరంలో ఆగిపోయింది.

బండి ఎందుకాగిందో గార్డుకు అర్థంకాలేదు. తలుపు తెరిచి బయటకు చూశాడు. గార్డు పెట్టెకు పక్కనే వుండే పెట్టెలోనుండి ఓ యువకుడు దిగాడు. అతడి వయసు 22, 23 కంటే ఎక్కువ వుండదు. భుజం మీద కాన్వాస్ బ్యాగ్ వుంది. అతడు గబగబా వెళ్ళిపోతున్నాడు. అది చూసిన గార్డుకు ఆశ్చర్యం కలిగింది. అతని ఆశ్చర్యానికి కారణం లేకపోలేదు. తమిళ్‌నాడు ఎక్స్‌ప్రెస్ ఝాన్సీ తర్వాత ఢిల్లీలోనే ఆగుతుంది. ఈ మధ్య స్టేషన్స్‌లో దిగేవారెవరూ ఆ ఎక్స్‌ప్రెస్ ఎక్కరు. యువకుడు ఆగ్రా స్టేషన్‌కు దూరంగా దిగి, గబగబా ఎవరో తరుముతున్నట్టు వెళ్ళిపోవడం గార్డును ఆశ్చర్యంలో ముంచేసింది.

గార్డు పేరు సచిదేవ్ అతడు "ఏయ్ మిస్టర్!" అంటూ వెళ్ళిపోతున్న అతన్ని పిల్చాడు అనేకసార్లు. ఆ యువకుడు ఆగలేదు. పైగా నడకవేగాన్ని పెంచాడు. అది గమనించిన లైన్‌మెన్ "ఏమయ్యోవ్! సాబ్ పిలుస్తున్నాడు" అంటూ కేక పెట్టాడు. అంతలో ఓ పన్నెండేళ్ళ కుర్రవాడు అదే పెట్టెలోనుంచి దూకి పారిపోసాగాడు.

"వాళిద్దర్నీ పట్టుకోండి" అరిచాడు గార్డు. లైన్‌మెన్ ఇద్దర్నీ పట్టుకున్నాడు.

"ఎవరు నువ్వు?"

"పాన్‌బీడా అమ్ముకొనేవాడ్ని సార్."

"మరి ఇక్కడెందుకు దిగావ్?"

"ఆ పెట్టెలో శ.... శవం వుంది సాబ్ ఆడదాని శవం. ము... ముగ్గురు గూండాలు సార్.... చంపేసి పారిపోయారు సార్."

సచిదేవ్ తుళ్ళిపడ్డాడు.

"వీళ్ళను వదలకండి" అని లైన్‌మెన్‌తో చెప్పి, ఇద్దరు టికెట్ కలెక్టర్లను తీసుకుని పెట్టెలోకి వెళ్ళాడు గార్డ్.

పెట్టె మధ్యగా ఒక స్త్రీ శవం పడివుంది. దూరంగా ఆమె రవికా, షిఫాన్ చీరా పడివున్నాయి. ఆమె ముక్కునుంచి రక్తం కారి గడ్డకట్టి వుంది. ఆమె అందమైంది. దాదాపు 25 సంవత్సరాల వయసు వుంటుంది. అది స్త్రీ హత్య. అంతేకాదు తరతరాలగా ఆడదానిమీద మగవాడు చేసే దౌర్జన్యం ఆమె మీదా జరిగింది. హత్యకు ముందు ఆమె శీలాన్ని బలికొన్నట్టు స్పష్టంగానే తెలుస్తోంది శవాన్ని చూస్తుంటే. తరతరాలుగా స్త్రీని బలిచేస్తున్న మారణహోమం ఇది.



ఇది కథ కాదు, వాస్తవం. ఇది పూర్తిగా వింటే సిగ్గుకు కూడా సిగ్గ వేస్తుంది. మానవత్వం తలవంచుకుంటోంది.

పక్క బెర్త్ మీద ఆరు నెలల శిశువు గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

ఆ పక్కనే సూట్‌కేసు తెరిచివుంది. కొన్ని బట్టలూ, కాగితాలూ చిందరవందరగా పడివున్నాయి.

గార్డ్ డ్రైవర్‌కు ఫోన్‌లో బండిని ఆగ్రా స్టేషన్‌లో ఆపవలసిందని చెప్పాడు. బండి ఆగ్రా స్టేషన్‌లో ఆగింది. గార్డ్ రైల్వే పోలీసులకు వాళ్ళిద్దర్నీ అప్పగించి శవం గురించి చెప్పాడు.

పోలీసులు అక్కడ దొరికిన కాగితాల ద్వారా ఆమె పేరు మీనా అని తెలుసుకున్నారు. ఆమె దగ్గర ఝాన్సీనుండి ఢిల్లీకి వెళ్ళే టికెట్ ఉంది. ఝాన్సీలో ఆమెకు పరిచితుడైన ఒక వ్యక్తి అడ్రసు కూడా ఉంది. పోలీసు వెంటనే ఝాన్సీకి వైర్‌లెస్ మెసేజ్ పంపించారు. ఢిల్లీ స్టేషన్‌కు మెసేజ్ పంపించారు. మీనాను రిసీవ్ చేసుకోవడానికి తమిళ్‌నాడు ఎక్స్‌ప్రెస్ టైంకు స్టేషన్‌కు వచ్చినవాళ్ళను ఎనౌన్స్‌మెంటు ద్వారా స్టేషన్‌మాస్టర్ కాన్‌టాక్ట్ చేసి వారికి మీనా హత్య గురించి తెలియజెయ్యవలసిందిగా ఆ పోలీసులు మెసేజ్ పంపించారు.

ఆ కంపార్ట్‌మెంట్ బండినుంచి వేరు చేశారు. ఆ తర్వాత ఎక్స్‌ప్రెస్ ఢిల్లీకి బయలుదేరింది.

వీలైనంత త్వరగా ఢిల్లీనుంచీ, ఝాన్సీనుంచీ ఆమె అత్త మామలూ, అన్నదమ్ములూ, స్నేహితులూ, బంధువులూ ఆగ్రా వచ్చి చేరారు. గార్డు సచిదేవ్ పట్టుకున్న యువకుడి పేరు అఖిలేష్ అతడు ఒక పట్టాన అపరాధం అంగీకరించలేదు. బాలుడు తన పేరు అరవింద్‌దత్తనీ ఢిల్లీలో లాల్‌కిలా దగ్గర ఉంటాననీ, అక్కడే తన తండ్రి బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడనీ చెప్పాడు. ఇంట్లో అలిగి పారిపోయి ఝాన్సీ వెళ్ళాననీ 15 రోజులు ఒక టీ క్యాంటీన్‌లో పనిచేశాననీ ఇంటికి వెళ్ళాలనిపించి బయలుదేరాననీ టికట్ లేనందున బండికి చివర గార్డు పెట్టె దగ్గర ఖాళీగా ఉన్న కంపార్టుమెంట్‌లో ఎక్కాననీ చెప్పాడు.

పోలీసు కొంచెం గట్టితనం చూపించాకగానీ అఖిలేష్ కొంతవరకు అపరాధం అంగీకరించలేదు. తను కంపార్ట్‌మెంటులోకి ఎక్కేసరికి హత్య చేసిన వాళ్ళు పారిపోయారనీ చెప్పాడు. అతడ్ని డాక్టర్ పరీక్షకు పంపగా అతడు ఆమెను బలాత్కరించినట్టు రుజువైంది. ఇక అతడికి నిజం అంగీకరించక తప్పలేదు.

కేసు రైల్వే ఇన్‌స్పెక్టర్ మల్హోత్రా తీసుకున్నాడు. ముగ్గురు గూండాలు దూకి పారిపోయిన ప్రదేశం చూడడానికి ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో బయలుదేరాడు. తనతో అరవింద్‌ను కూడా తీసుకెళ్ళాడు. అరవింద్ ఆ ప్రాంతాన్ని గుర్తించాడు. తిరుగు ప్రయాణంలో మురైనా స్టేషన్‌లో ఆగ్రా వెళ్ళే బండికోరకు నిలబడ్డారు. అప్పుడే పంజాబ్ మెయిల్ ప్లాట్‌ఫారం నెంబరు 2 మీద ఆగింది.

అరవింద్ ఒక్కసారిగా ఇన్‌స్పెక్టర్‌తో "సాబ్ అదుగో వాడ్ని చూడండి. బండి దిగి వస్తున్నాడు. వాడు ముగ్గుర్లో ఒకడు" అన్నాడు.

ప్రయాణీకుల సహాయంతో వాడ్ని పట్టుకొన్నారు. అతడి పేరు ఖోలాగూజర్.

మీనా పూర్తి పేరు మీనాదాదలాని. ఆమె తండ్రి కలకత్తాలో బట్టల వ్యాపారి. ఫిబ్రవరి 82లోనే ఆమె వివాహం జగదీశ్ ప్రకాశ్‌దాదలానితో జరిగింది. భర్త జగదీశ్‌ప్రసాద్ "శివసాగర్" జిల్లాలోని అస్సామ్ టీ తోటల మీద ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు.

జె. కె. దాదలాని ఝాన్సీలో ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటులో ఉద్యోగం చేస్తున్నాడు. జె. కె. దాదలాని మీనా మామగారే. ఎవరో కాదు. మీనా ఆడబిడ్డ ఢిల్లీలో ఉంది. ఆమె మీనాను ఢిల్లీ రమ్మని కోరింది. మామ టికెట్ కొని స్టేషన్‌కు వచ్చి కోడల్ని బండిలో కూర్చోబెట్టాడు. ఖాళీగా ఉండడంవల్ల అందులో ఎక్కించాడు. పైగా ముగ్గురు వ్యక్తులు అందులో వుండడంవల్ల భయం లేదనుకున్నారు. వాళ్ళు నరరూపంలో వున్న మృగాలని పాపం ఆయన ఊహించలేకపోయాడు.

మామూలుగా తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ఒక పెట్టెలోనుంచి మరో పెట్టెకు దారివుండి అన్నీ కలసి ఉన్నట్టే ఉంటాయి. అయితే చివర్లో వున్న ఆ పెట్టె మాత్రం మూడు భాగాలుగా విభజింపబడివుంది. ఒక భాగం బ్రేక్‌వాన్. అందులో గార్డు ఉంటాడు. రెండో భాగంలో లగేజ్ వుంటుంది. మూడవదానిలో ప్రయాణీకులు కూర్చుంటారు.

మీనా ఢిల్లీ వెళ్ళి అక్కడ్నుంచి కలకత్తా పుట్టింటికి వెళ్ళి కొద్ది రోజులుండి, విమానంలో భర్త దగ్గరకు వెళ్ళాలని ప్రోగ్రాం వేసుకుంది. తనకోసం మృత్యువు అంత భయంకర రక్తదాహంతో వేచివుందని పాపం ఆమెకు తెలియదు.

హంతకులు అఖిలేశ్, ఖోలాసింహ్ ద్వారా పోలీసు రిపోర్టులోకి ఎక్కిన హత్యాకాండకు సంబంధించిన వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

అఖిలేశ్ కాన్పూరువాడు. ఝాన్సీలో ఇంటర్ రెండుసార్లు తప్పి చదువు మానేశాడు. ఇల్లు వదిలేశాడు. రైళ్ళలో పాన్‌బీడా, పల్లీలు అమ్మసాగాడు. అంతకుముందు ఎప్పుడూ జైలుకు వెళ్ళలేదు.

ఖోలాసింహ్ పాత కేడీ. రైళ్ళలో టికెట్ లేకుండా తిరుగుతూ, ఒకసారి పల్లీలు అమ్మితే మరోసారి కూల్‌డ్రింక్స్ అమ్ముతాడు. చిన్న పెద్ద దొంగతనాలు చేసి చాలాసార్లు జైలుకెళ్ళాడు. మిగిలిన ఇద్దరు అపరాధులు భూరా, కల్లూలు పై ఇద్దరిలాగే రైళ్ళలో వేరుశనక్కాయలూ, పాన్‌బీడాలు అమ్ముతూ ఉంటారు. అనేకసార్లు జైలు శిక్షలు కూడా అనుభవించారు.

ఝాన్సీలో బండి బయలుదేరింది. అందులో వున్న ముగ్గురు మగవాళ్ళు మీనాను ఏడిపించసాగారు. అసహ్యకరమైన భాషలో మాట్లాడసాగారు. మీనా వినిపించుకోనట్టుగా ఉండిపోయింది. ఆమె ముఖంలో భయం, ఎలా తప్పించుకుందామా అనే ఆతృత కన్పించాయని అరవింద్ చెప్పాడు. అరవింద్ పై బర్త్ మీద పడుకుని వున్నాడు. అతడ్ని ఎవరూ చూడలేదు. అతడికి ఆ ముగ్గురు పశువుల మీదా కోపం వస్తోంది. మీనా మీద జాలి కలుగుతోంది. కాని తను చిన్నవాడు. ఆమెను ఎలా రక్షించగలడు? అనే ఆలోచనలతో సతమతమవుతూ వున్నాడు.



వేసవి కాలంలో రైళ్ళల్లో కూల్‌డ్రింక్స్ అమ్మే ప్రయత్నంలో ఏర్పాట్లు చేసుకోవడానికి ఆ ముగ్గురూ ఝాన్సీనుండి ఢిల్లీకి బయలుదేరారు. దురదృష్టం తరుముకురాగా మీనాను మామగారు అదే పెట్టెలో ఎక్కించారు.

వేరే పెట్టెలో పాన్‌బీడా అమ్ముతున్న అఖిలేశ్ టికెట్ కలెక్టర్‌నుంచి తప్పించుకోడానికి, నడుస్తున్న బండిలో ఈ కంపార్ట్‌మెంట్ చేరుకున్నాడు. చివరలో ఉన్న పెట్టె... పైగా జనంలేరు. అఖిలేశ్ తలుపు కొట్టసాగాడు. వాళ్ళు తలుపు తెరవలేదు.

అదను చూసి అరవింద్ పై నుంచి దూకి తలుపు తెరిచాడు. అఖిలేశ్ లోపలకొచ్చాడు. అరవింద్ ఎవరైనా మంచివాడు వస్తే మీనాను రక్షిస్తాడనే ఆశతో తలుపు తెరిచాడు.

ఆ ముగ్గురూ అఖిలేశ్‌ను గుర్తించారు. నలుగురూ ఒకే బట్టీలో కాగినవాళ్ళు. ఆమెను ఆ నాలుగు పశువులూ అనుభవించి, చివరకు గొంతు నులిమాయి. అరవింద్‌ను అరిస్తే చంపేస్తామని బెదిరించారు. ఆగ్రా ఇంకా దూరం ఉండగా, రైలు మార్గం రిపేర్‌వల్ల బండి వేగం తగ్గించి నడుస్తోంది. ఆమె నగలు తీసుకుని ఆ ముగ్గురూ నడుస్తున్న బండిలోనుంచి దూకి పారిపోయారు. అఖిలేశ్‌కు ఆ అలవాటు లేదు. దూకడానికి భయంవేసి పెట్టెలోనే ఉండిపోయాడు. ఆగ్రా స్టేషన్‌లో సిగ్నల్ చూపకపోవడంతో బండి ఆగింది. అప్పుడు అఖిలేశ్ దిగి వెళుతూ పట్టుబడ్డాడు.

అరవింద్‌ను పోలీసులు తండ్రి దగ్గరకు పంపించివేశారు.

మిగిలిన ఆ ఇద్దరు హంతకులూ ఇంకా పోలీసులకు పట్టుబడలేదు.

వాళ్ళను పట్టుకోవడానికి పోలీసుశాఖ ఇప్పటికీ ఎంతగానో ప్రయత్నిస్తోంది.

❀ ❀ ❀

# 26. ఇదికూడా ప్రేమేనంటారా?

అది కనాట్ ప్లేస్. షాపింగ్ చేసే వారితో హడావిడిగా ఉంది. నందకూడా షాపింగ్ చేసి ఇంటికి బయలుదేరింది. బస్‌స్టాప్‌లో అనుకోకుండా ప్రదీప్ కన్పించాడు. ప్రదీప్ నంద దగ్గరకు వచ్చాడు. ప్రదీప్‌ను చూసి నంద పేలవంగా నవ్వింది. అతను నవ్వలేదు.

"ఎన్నాళ్ళయింది నువ్వు కన్పించి? అసలు నీ ఉద్దేశ్యం ఏమిటి? నన్ను మోసంచెయ్యాలని చూస్తున్నావు గదూ?" ప్రదీప్ కంఠం తీవ్రంగా ఉంది.

"ప్లీజ్ ప్రదీప్, నా పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. నువ్వంటే నాకు ఎంత ఇష్టమో నీకు తెలుసు."

"అయితే నన్నెందుకు తప్పుకు తిరుగుతున్నావ్?"

"డాడీకి చాలా కోపంగా ఉంది. నా వల్ల కుటుంబ గౌరవం మంటగలసి పోతున్నదంటున్నారు. అమ్మ ఏడుస్తూ ఉంటుంది. డాడీ నన్ను దూరంగా ఎక్కడికైనా పంపించేస్తానంటున్నారు. ఇక నిన్ను కలుసుకోవడం జరగదు. నువ్వూ ఆ ప్రయత్నం విరమించుకో. నా మానాన్న నన్ను వదిలెయ్. ప్లీజ్ నన్ను అర్థం చేసుకో" అన్నది నంద. నంద కంఠం దుఃఖంతో గరగరలాడింది. ఆమె పెద్దపెద్ద కళ్ళనుంచి కన్నీటి బిందువులు చంపలమీదకు రాలాయి.

ప్రదీప్ ముఖంలో కోపం, బాధ, నేను ముందంటే నేను ముందని పోటీపడ్తున్నాయి.

"మీ డాడీ నిన్ను ఎక్కడికో పంపిస్తున్నాడా? అందుకు మనిద్దరం కలుసుకోలేమా? మీ డాడీ ఫూల్. ప్రేమించేవాళ్ళను ప్రపంచంలో ఏదీ విడదియ్యలేదని పాపం ఆ ముసలాడికి తెలియదు. నువ్వు ఎక్కడ ఉన్నా నేనూ అక్కడే ఉంటాను. నిన్ను కలుసుకుంటాను."

ప్రదీప్ ఎంతో ఆత్మ విశ్వాసంతో అన్నాడు. ఆ మాటలు నందకు ఆనందం కలిగించలేదు. భయం కలిగించాయి.

"నో ప్రదీప్! ఇకనుంచి నన్ను కలుసుకోవడానికి ప్రయత్నించకు. నా మంచికోరేవాడివైతే నన్ను మర్చిపో."

"మర్చిపోవాలా? ఏం? ఎందుకు?"



"ఇప్పటికే వచ్చిన చెడ్డపేరు చాలు. ఇరుగుపొరుగులో, బంధువుల్లో నాకుటుంబం తలవంచుకోడం నాకిష్టంలేదు."

"అంటే, ఇది నీ నిర్ణయమేనన్నమాట?" ప్రదీప్ నంద ముఖంలోకి తీవ్రంగా చూశాడు.

"అవును ప్రదీప్. ఫూలిష్‌గా ఇంతవరకూ ప్రవర్తించింది చాలు."

"ప్రేమించే ముందు ప్రేమించడం ఫూలిష్‌నెస్ అని ఎందుకనుకోలేదు? నలుగురూ ఏమనుకుంటారోననే భయంగల దానివి నాతో ఎందుకు తిరిగావ్? మనిద్దరం ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోదాం. పెళ్ళి చేసుకుందాం."

"నో! నో! లేచిపోవడమా? డాడీని అలా మోసం చెయ్యలేను. నా కుటుంబాన్ని నవ్వులపాలు చెయ్యలేను" దృఢంగా పలికింది నంద.

"ఓహో అలాగా? అయితే నా నిర్ణయం కూడా విను. నువ్వెక్కడున్నా నేను వస్తాను. నువ్వు ఒక్క ఉత్తరంముక్క రాసివదెయ్."

"రాయకపోతే!"

"నిన్ను ఎలాగయినా వెతికి పట్టుకుంటాను."

"నిన్ను కలవడం నాకు ఇష్టంలేదని చెబితే? నువ్వు వచ్చినా నేను నిన్ను చూడటానికి తిరస్కరిస్తే?"

"నువ్వు తిరస్కరించలేవు. ఆ పని నీవల్ల కాదు. నీ బలహీనమైన నరం నా గుప్పిట్లో ఉంది" కుటిలంగా నవ్వుతూ కసిగా అన్నాడు ప్రదీప్.

నందా నిలువెల్లా కంపించిపోయింది. బస్ ఆగింది. ప్రదీప్‌కి చెప్పకుండా గబగబా వెళ్ళి బస్ ఎక్కేసింది. ప్రదీప్ కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాడు.

నందా, ప్రదీప్ ఇద్దరూ బలజీత్‌నగర్‌లో ఉండేవాళ్ళే. హైస్కూల్లో చదువుతూ ఉండేవాళ్ళు. నందా వెస్టుపటేల్ నగర్ స్కూలు నంబరు మూడులో చదివేది. ప్రదీప్ స్కూలు నంబరు నాలుగులో చదివేవాడు. రెండేళ్ళ క్రితమే ఇద్దరికీ పరిచయం అయింది. ప్రదీప్ పది చదువుతున్నాడు. నందా తొమ్మిదిలో ఉన్నది.

ఒకరోజు స్కూలుకు వెళ్తున్న నందాను ప్రదీప్ అల్లరిచెయ్యడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో అతని పక్కన మరికొందరు స్నేహితులు కూడా ఉన్నారు. నందా వాళ్ళ మాటలు వినీవిననట్టే వెళ్ళిపోయింది. ఆ తర్వాత వారంలో ప్రదీప్ నందాకు ఒంటరిగా కన్పించాడు. అతనితో "మంచి కుటుంబంలో పుట్టి, చదువుకుంటున్న కుర్రవాళ్ళు, ఒంటరిగా ఉన్న ఆడపిల్లను అలా అల్లరి పెట్టడం మంచిది కాదు. ఇలాంటి పనులు చాలా చౌకరకంగా ఉంటాయి" అన్నది.

ప్రదీప్ ముందు బిత్తరపోయాడు. నందా ధైర్యాన్ని లోలోపలే మెచ్చుకున్నాడు. ఆమె అందం అతణ్ని ముందే ఆకర్షించింది. ఆమె మాటలు మరీ ఆకర్షించాయి. క్షమాపణచెప్పి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ప్రదీప్ నందాను ఏడ్పించడం మానేశాడు. బుద్ధిమంతుడిలా ప్రవర్తించసాగాడు.

అప్పుడు నందా వయసు 15 సంవత్సరాలు, ప్రదీప్ వయసు 17 సంవత్సరాలు.

క్రమంగా నందా ఒంటరిగా కన్పిస్తే ప్రదీప్ చనువుగా మాట్లాడేవాడు. నందా కూడా ఎలాంటి జంకూ లేకుండా మాట్లాడేది. వాళ్ళిద్దరి మధ్యా చనువు పెరిగింది. ఆకర్షణ పెరిగింది. దానికి వాళ్ళు ప్రేమ అని నామకరణ చేశారు.

నందా తండ్రి అంబాదత్తశర్మ స్థానిక దినపత్రిక "జనయుగ్" ఆఫీసులో గుమస్తాగా పని చేస్తున్నాడు. అతనికి ముగ్గురు కొడుకులు, నలుగురు కుమార్తెలు. పెద్దకొడుకు గవర్నమెంటులో పని చేస్తున్నాడు. అతను భార్యాబిడ్డలతో వేరుగా ఉన్నాడు. పెద్ద కూతురు సంతోష్‌కు పెళ్ళి అయింది. ఆమె భర్తతో మానక్‌వీధిలో సి.జి.హెచ్. క్వార్టర్సులో ఉంటున్నది. రెండో కొడుకు రమేశ్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. నందా రమేశ్ తర్వాతి సంతానం. తల్లికి ఇంటి చాకిరి. తండ్రికి ఆఫీసు చాకిరి. వాళ్ళకు నందా విషయంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నట్టు తోచలేదు.

ప్రదీప్ మొదటినుంచీ అల్లరి పిల్లవాడని ఇంట్లో వాళ్ళకూ, ఇరుగుపొరుగు వాళ్ళకూ తెలుసు. అతనికి రామకిషన్, సరూప్‌రాయ్ అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. కొన్ని నెలలతేడాతో అందరూ ఒకే వయసువాళ్ళు. ఈ ముగ్గురూ కలసి రోడ్డునవెళ్ళే ప్రతి ఆడపిల్లనూ అల్లరిచేస్తూ ఉండేవారు. రామకిషన్ తన స్కూల్లోనే చదివే ప్రేమావతి అనే అమ్మాయి వెంటపడేవాడు. ఆ పిల్లకు చాలా చిరాకు కలిగిస్తూ ఉండేవాడు.

ప్రదీప్, రామకిషన్ చెప్పే ప్రేమకథలు విని సరూప్‌రాయ్ కూడా సుల్తాన్‌పురిలో ఉండే ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయికూడా అతనంటే ఇష్టపడింది. ఇద్దరూ పెద్దవాళ్ళకు చెప్పకుండా పెళ్ళి చేసుకొని కాపురం కూడా పెట్టేశారు. సరూప్‌రాయ్ తల్లిదండ్రులకు ఒకే కొడుకు. అందువల్ల చేసేదిలేక కొడుకునూ కోడల్నీ ఇంటికి తీసుకెళ్ళారు. ఈ విషయంలో ప్రదీప్, రామకిషన్ తమనుతాము అసమర్థులుగా ఊహించుకోసాగారు.

ప్రదీప్‌తో పారిపోయి పెళ్ళి చేసుకోవడానికి నందా అంగీకరించలేదు. అయినా వాళ్ళిద్దరూ సినిమాలకూ, పార్కులకు తిరిగేవారు. ప్రేమలేఖలు రాసుకొనేవారు. ఫోటోలు వివిధ భంగిమలలో తీయించుకున్నారు.

ఇక రామకిషన్ విషయం. అతని ప్రియురాలు ప్రేమావతి అతనికేసి కన్నెత్తి కూడా చూసేదికాదు. ఎంత ప్రయత్నించీ ఆ పిల్లను లొంగదీసుకోలేకపోయాడు. అతనికి ఆ పిల్ల మీద కసి పెరిగింది.

ప్రదీప్ నందా తిరుగుళ్ళు ఎంతో కాలం దాగలేదు. కాలనీలో అందరూ చెప్పుకోసాగారు. ఆ నోటా ఆనోటా ఆ వార్త తండ్రి చెవుల్లో పడింది. నందాను స్కూలు మానిపించి ఇంట్లో కూర్చోబెట్టారు. చాలాకాలం ప్రదీప్‌ను కలుసుకోలేక పోయింది. నందా చాలాకాలం మౌనంగా ఇంట్లోనే ఉండిపోయింది. తల్లిదండ్రులకు ఆమె మీద నమ్మకం ఏర్పడింది.

మళ్ళీ నందా ఏ స్నేహితురాలింటికో వెళ్ళే మిషతో బయటకు వెళ్ళి ప్రదీప్‌ను కలుసుకొని తన బాధ చెప్పుకునేది. ప్రదీప్ ఎక్కడికైనా పారిపోదామని సలహో



ఇచ్చేవాడు. నందా అందుకు అంగీకరించేదికాదు. ప్రదీప్ బలవంతం ఎక్కువైంది. దాంతో నందాకు అతనంటే భయం. వినుగూ ప్రారంభం అయింది.

మళ్ళీ నందా ప్రదీప్‌ని కలుసుకుంటున్నట్టు తల్లిదండ్రులకు తెలిసింది. తండ్రి నందాను బెదిరించాడు. కూర్చోబెట్టి మెత్తగానూ చెప్పాడు. చివరకు నందా తండ్రి పంపిస్తే ఎక్కడికైనా వెళ్ళడానికి సిద్ధపడింది. ఆమెకు కూడ ప్రదీప్ నుంచి దూరంగా వెళ్ళిపోవాలనిపించింది. అతని తొందరపాటు ఆమెకు నచ్చడంలేదు.

ఇప్పుడు నందాకు 16 సంవత్సరాలు నిండాయి. ప్రదీప్‌కు 18 సంవత్సరాలు నిండాయి. ప్రదీప్ కాలేజీలో ఇంజనీర్ చదువుతున్నాడు. ఆ రోజుల్లోనే ప్రదీప్‌కు నందా కనాట్ ప్లేస్‌లో కన్పించింది.

ఆ తర్వాత రెండు రోజులకే ఆమె తండ్రి నందాను పెద్దకూతురి దగ్గరకు పంపించాడు. పంపిస్తూ ప్రదీప్‌కు ఉత్తరాలు రాయవద్దని బోధించాడు.

నందా తండ్రికి మాట ఇచ్చింది. నందా తండ్రికి ఇచ్చిన మాట ప్రకారమే బయట అడుగు పెట్టలేదు. ప్రదీప్‌కు తన ఉనికిని తెలియపర్చలేదు. క్రమంగా తమ ప్రేమలో ప్రేమ లేదనీ, వయసులోని పొంగు మాత్రమే వున్నదనీ గ్రహించింది నందా.

ప్రదీప్ మాత్రం పిచ్చెక్కినట్టు తిరగసాగాడు. రామకిషన్‌కు తనగోడు చెప్పుకున్నాడు. ఇద్దరూ కలిసి సవన్‌రాయ్ ఇంటికి వెళ్ళారు. నందా అన్న రమేశ్‌ను కలుసుకోవడానికి నిర్ణయించుకొన్నారు. 1983-2-22న తేదీన ముగ్గురూ కాలేజీకి వెళ్తున్న రమేశ్‌ను నిలవేసారు.

"ఏమిటిది? ఏం కావాలి?" రమేశ్ అడిగాడు.

"నందా ఎక్కడుంది?" ప్రదీప్ అడిగాడు.

"ఎందుకు?" రమేశ్.

"కావాలి."

"చెప్పకపోతే?"

"అందువల్ల మీకే నష్టం. ఆమె రాసిన ఉత్తరాలూ, ఫోటోలూ నా దగ్గర వున్నాయ్. అవి బయటపెడ్తే మీ కుటుంబం నవ్వులపాలవుతుంది. నందాకేకాదు మీ ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు కూడా కావు." రామకిషన్ అన్నాడు.

"జరిగిన దానికి నేను విచారిస్తున్నాను. నందాను ఒకసారిచూసి అవన్నీ ఇచ్చేస్తాను" అన్నాడు ప్రదీప్

"నిజంగా నువ్వు పశ్చాత్తాప పడుతుంటే ఆ ఉత్తరాలూ, ఫోటోలూ నాకే ఇచ్చెయ్యొచ్చుగా?" అన్నాడు రమేశ్.

"అలాగే ఇచ్చేస్తాను. మాతోపాటు సవన్‌రాయ్ ఇంటికి నువ్వురావాలి. అన్నీ అక్కడే ఉన్నాయి. నెగిటివ్స్ కూడా ఇచ్చేస్తాను" అన్నాడు ప్రదీప్.

అందుకు రమేశ్ అంగీకరించాడు.

ముగ్గురూ రమేశ్‌ను తీసుకొని ఆటోలో సుల్తాన్‌పురిలోవున్న సవన్‌రాయ్ ఇంటికి వెళ్ళారు. అక్కడ ప్రదీప్ రమేశ్‌కు ఫోటోలూ ఉత్తరాలకట్టా చూపించాడు. ఫోటోలు వివిధ భంగిమల్లో వున్నాయి. అవి చూసి రమేశ్ చాలా బాధపడ్డాడు.

"ఆలస్యం అవుతోంది. అవన్నీ ఇచ్చెయ్యండి వెళ్ళిపోతాను."

ముగ్గురూ గొల్లున నవ్వారు.

"బుజ్జిబాబూ! నీకివ్వాలా? ఎందుకివ్వాలి? నందాతో నేను మాట్లాడాలి. అప్పుడే ఇవన్నీ ఇస్తాను. లేదా ఇవన్నీ పత్రికల్లోనూ, గోడలమీదకూ ఎక్కుతాయి. మరి నీ యిష్టం." అన్నాడు ప్రదీప్.

చివరకు రమేశ్ అంగీరించక తప్పలేదు. మళ్ళీ నలుగురూ పటపటీ (ఆటోలాంటిది-ఢిల్లీలో ఎక్కువగా వుంటాయి. అందులో ఆటోలో కంటే ఎక్కువమంది కూర్చోడానికి అవకాశం వుంటుంది) లో మానకభవన్ వరకూ వచ్చారు. ఆ తర్వాత లైబ్రరీ సందులోకి నడిచారు. అక్కడ చీకటిగా వుంది. జన సంచారంకూడాలేదు. ముగ్గురూ అక్కడే నిలబడి నందాను పిల్చుకొని రమ్మని రమేశ్‌ను పంపించారు.

నందా ఒక పట్టాన ఒప్పుకోలేదు. ప్రదీప్ మంచి ఉద్దేశ్యంతో పిల్చి వుండడని ఆ పిల్లకు అన్పించింది. రమేశ్ కుటుంబ గౌరవం గురించి చిన్న లెక్చర్ ఇచ్చాడు. నందా తయారై రమేశ్‌తో బయటికి వెళ్ళింది. వాళ్ళ అక్కయ్య సంతోష్‌కు అనుమానం వచ్చింది.

నిముషాలు గడిచేకొద్దీ ఆమెకు భయం ఎక్కువైంది.

అప్పుడే లోపలకు వచ్చిన తన బాబాయితో జరిగిన విషయం చెప్పింది. ఆయన పేరు రాధాకృష్ణ. ఆయన వెంటనే వీధిలోకి వచ్చి నందానూ, రమేశ్‌నూ వెదకడానికి బయలుదేరాడు.

"నువ్వు కొంచెం అలా వెళ్ళు. నేను నందాతో వంటరిగా మాట్లాడాలి." అన్నాడు రమేశ్‌తో ప్రదీప్.

రమేశ్ కొంతదూరంగా వెళ్ళి నిలబడ్డాడు.

ప్రదీప్ నందాను గొంది చివరకు తీసుకెళ్ళాడు.

"ఏం నిర్ణయించుకున్నావ్?" తీవ్రంగా వుంది ప్రదీప్ కంఠం.

"ప్రదీప్ నా అసహాయతను అర్థం చేసుకో" ప్రాధేయ పడింది నందా.

"అదేనా నీ నిర్ణయం?"

"నేను చేసిన తప్పేమిటి? ఎందుకు నా వెంట పడ్తావ్? ప్లీజ్ నన్ను వదిలేయ్?"

"నువ్వు చేసిన తప్పు నన్ను మోసం చెయ్యడమే. ప్రేమించినట్టు నటించి నన్ను ఫూల్‌ను చేశావ్. వెంటనే నాతో బయలుదేరు. ఇప్పుడే - ఇలాగే"

ఆ ధోరణికి నందా నిలువెల్లా కంపించిపోయింది.

"అలా పారిపోయేవని నేను చస్తే చెయ్యనని ఎన్నోసార్లు చెప్పాను. నువ్వు రమేశ్‌తో నా ఉత్తరాలు, మనం తీయించుకున్న ఫోటోలూ ఇస్తానన్నావటగా? ప్లీజ్ త్వరగా ఇచ్చెయి ప్రదీప్. ఆలస్యం అయితే మా అక్కకు అనుమానం వస్తుంది."

ప్రదీప్ సినిమాలోని విలన్‌లా నవ్వాడు.

"రమేశ్ ఫూల్. నేను చెప్పిన మాటలు నమ్మి నిన్ను పిల్చుకొచ్చాడు. పద వెళ్దాం."



"నో! నేను రాను."

ప్రదీప్ ఆమె చేతిని పట్టుకొని "పద" అన్నాడు. మిగతా ఇద్దరూ కూడా వచ్చి ఆమెను పట్టుకొని మానిక్ భవనంవైపు లాక్కెళ్ళసాగారు. ఆమె గింజుకొంటూ అరవసాగింది.

బాబాయి రాధాకృష్ణను రమేశ్ దూరం నుంచి చూశాడు. రమేశ్ "బాబాయ్ ఇటు! త్వరగా. వాళ్ళు నందాను లాక్కెళుతున్నారు" అంటూ అరిచాడు.

పరిస్థితిని గ్రహించిన ప్రదీప్ బొడ్లో నుంచి కత్తిలాగి నందా పొట్టలో పొడిచాడు. నందా కెవ్వున అరిచి కిందపడిపోయింది. దూరంనుంచి రమేశ్ రాధాకృష్ణ రావడంచూసిన ప్రదీప్ వంగి నందా పొట్ట నుంచి చాకులాగి పరిగెత్తుతూ దూరంగా విసిరేశాడు. రమేశ్ రాధాకృష్ణ రక్తపు మడుగులో కొట్టుకుంటున్న నందాను చూస్తూ శిలా ప్రతిమల్లా అయ్యారు. వాళ్ళ కంఠంలో నుంచి ఎంత అరవాలని ప్రయత్నించినా శబ్దం వెలువడలేదు.

కొంతసేపటికి తేరుకొని రాధాకృష్ణ టాక్సీ పిలిచాడు. ఇద్దరూ నందాను టాక్సీలో వేసుకొని జయప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. ఆసుపత్రికి చేరకముందే ఆమె చనిపోయింది. ఆసుపత్రికి సంబంధించిన పోలీసుస్టేషన్‌లో నందా హత్యకేసు నమోదు అయ్యింది. శవాన్ని పోస్టుమార్టమ్‌కు పంపించారు. హత్య జరిగిన ప్రదేశానికి కొంచెం దూరంలో దొరికిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.

నందాను హత్యచేసి ప్రదీప్ తన స్నేహితులతో పటేల్‌నగర్ వెళ్ళాడు. ప్రదీప్ వెస్టు పటేల్ నగర్ దగ్గిర ఆటో దిగేశాడు. నవన్‌రాయ్, రామకిషన్ నీ బ్లాక్‌కు దగ్గిర ఆటో దిగారు.

తిన్నగా ప్రేమావతి ఇంటికి వెళ్ళారు.

ప్రేమావతి తల్లి కళావతిని రామనిషన్ కేకవేశాడు. ఆమె బయటికి వచ్చింది. ఆ సమయంలో ప్రేమావతి కూడా ఇంట్లోనే వుంది. కళావతి వాళ్ళిద్దర్నీ చూసి ముఖం చిట్లించుకుంది.

"క్షమించండి. నావల్ల మీ కుటుంబానికి చాలా మనస్తాపం కలిగింది. ఇకనుంచి ఎలాంటిబాధా వుండదు. ఒకసారి మీ అమ్మాయితో మాట్లాడించండి. ఈరోజుతో నాకు ప్రేమావతితో ఎలాంటి అనుబంధం వుండదు. మీకు నా బాధ లేకుండా చెయ్యడానికే వచ్చాను."

కళావతి ఒక పట్టాన అంగీకరించలేదు. చివరకు కూతుర్ని పిల్చింది. ప్రేమావతి బయటకు రాగానే కళావతిని లోపలకు వెళ్ళమన్నాడు "కొద్ది నిముషాలు మాత్రమే నేను ఇక్కడ వుంటాను. మీ అమ్మాయితో ఒక్కమాట చెప్పి శాశ్వతంగా వెళ్ళిపోతాను" అన్నాడు. కళావతి లోపలకు వెళ్ళింది.

"ప్రేమా నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవుగదూ?" అడిగాడు రామకిషన్.

"మొదటినుంచీ అదేమాట చెప్తున్నాను. నిన్ను ప్రేమించానని నేను అనలేదు. నీతో తిరగలేదు. నా వెంట పడవద్దని లక్షసార్లు చెప్పాను."

"ఇదే చివరిసారి. ఇక నిన్ను విసిగించను. అయితే నీ గుర్తుగా నాకు ఏదైనా ఇవ్వాలి!"

"ఏమివ్వాలి."

"నీ గాజులు" ఆ చేతులకున్న బంగారు గాజుల్ని చూస్తూ అన్నాడు.

"ఇవి మా అమ్మవి."

"అందతా నాకు తెలియదు. ఇచ్చి తీరాలి" అంటూ ఒక చేతిగాజులు రామకిషన్ రెండోచేతి గాజులు నవన్‌రాయ్ లాగేశారు. ప్రేమావతి అరవసాగింది. రామ్‌కిషన్ చాకుతో ఆమె మెడమీదా, పొట్టలో పొడిచాడు. కళావతి లోపల్నుంచి పరిగెత్తుకొచ్చేలోగా ఇద్దరూ పారిపోయారు.

రక్తపు మడుగులో తన్నుకొంటున్న కూతుర్ని చూసి విరుచుకు పడిపోయింది కళావతి. అప్పటికే ఇరుగు పొరుగువాళ్ళు పరిగెత్తుకొచ్చారు. ప్రేమావతిని రామమనోహర్ లోహియా ఆసుపత్రికి తీసుకెళ్ళారు. మూడురోజులు మృత్యువుతో పోరాడి చివరకు బ్రతికింది ప్రేమావతి. పోలీసులు కేసు నమోదు చేశారు. రామ్‌కిషన్ ఇల్లు ప్రేమావతి ఇంటికి దగ్గిరలోనే వుంది.

పోలీసులు ముగ్గురు అపరాధుల్నీ 10 రోజుల్లో పట్టేశారు. రిమాండ్‌మీద జైలుకు పంపించబడ్డారు.

ప్రేమావతి తప్పులేకపోయినా జనం రామ్‌కిషన్ ప్రేమావతి మధ్య ఏదో గ్రంథం జరిగే వుంటుందని భావించారు. ఇరుగు పొరుగులు చిలవలు పలవలు కల్పించి వారి ప్రేమకథ గురించి మాట్లాడుకోసాగారు. ఆమె తండ్రి సుఖరాం అవమానం భరించలేక 25 ఫిబ్రవరి 83 తెల్లవారు ఝామున పటేల్ నగర్ దగ్గిర్లోవున్న రైలు పట్టాలమీద తలపెట్టాడు. తల శరీరం నుంచి వేరయింది.

మార్చి 5వ తేదీనుంచి 25 వరకు ప్రదీప్‌కు ఇంటర్ పబ్లిక్ వున్నందువల్ల జామీన్ మీద విడుదల చేశారు. పరీక్షలు పోస్టుపోన్ కావడంవల్ల జామీన్ అవధిని ఏప్రిల్ 5 వరకు పెంచారు.

ప్రస్తుతం పూర్తిగా ఇరవై కూడా నిండని ముగ్గురు అపరాధులూ తిహార్ జైల్లో వున్నారు.

❀ ❀ ❀



# 27. రీనాకౌల్ హత్య!

కలకత్తా నగరం. అది 1982వ సంవత్సరం. జూలై 7వ తేదీ రాత్రి 11-30 గంటల సమయం. చితాపూర్ పోలీసుస్టేషన్‌కు సంబంధించిన సార్జెంట్ బెనర్జీ మూసివున్న ఒక దుకాణం గడపల మీద కూర్చుని బీడీ తాగుతున్నాడు. పొద్దుటినుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని తిట్టుకొంటున్నాడు. బజార్లలో మోకాళ్ళ లోతు నీళ్ళు నిలిచాయి.

నీళ్ళలో ఏదో శబ్దం చేస్తూ ముందుకు పోతున్నట్టు తోచి బెనర్జీ ముందుకు వంగి చూశాడు. దూరంగా నీళ్ళను చీల్చుకుంటూ తిన్నగా వెళ్ళిపోతున్న కారు కన్పించింది. అది కన్పించినంతవరకు చూసి, తల దుకాణపు తలుపులకు ఆనించి వెనక్కు వాలి కళ్ళు మూసుకున్నాడు.

తెలతెలవారుతుండగా వర్షం తగ్గింది. బెనర్జీ లేచి గస్తీ తిరగసాగాడు. కానన్ లైను దాటిపోతూ చటుక్కున ఆగి చూశాడు. అది ఒక యువతి శవం. ఆమె జుట్టు నీటి మీద తేలుతున్నది. బెనర్జీ ఆ శవాన్ని ఎత్తి పక్కగా వున్న ఒక దుకాణం ముందు పేవ్‌మెంటు మీద పెట్టాడు. ఆ యువతి ముఖం గుర్తు తెలియకుండా చితకగొట్టబడి వున్నది. శరీరం మీద బట్టలు లేవు. చిన్నగా ఒక్కొక్కరే జనం శవం దగ్గర చేరసాగారు. బెనర్జీ దగ్గర్లోని ఒక ఇంటినుంచి చితాపూర్ పోలీసుస్టేషన్‌కు ఫోన్‌చేసి శవం దొరికిన విషయం చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ అజయ్ వెంటనే బయలుదేరివచ్చాడు. శవం వంటి మీద బట్ట కప్పించాడు. ఇరుగు పొరుగువాళ్ళను వాకబు చేశారు. ఆ యువతి ఆ పేటకు సంబంధించిన వ్యక్తి కాదని తెలిసింది. శవాన్ని ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకు పంపించి కలకత్తాలోని అన్ని పోలీసుస్టేషన్సుకూ ఈ వార్త తెలియజేశాడు ఇన్‌స్పెక్టర్ అజయ్.

పోస్టుమార్టం రిపోర్టులో – ఆమె విషప్రయోగంవల్ల అంటే పెరుగులో 'మెర్క్యురిక్' క్లోరాయిడ్‌ను కలిపి తినడంవల్ల ఆమె చనిపోయిందనీ, ఆమె చనిపోయాకే ఆమె ముఖం మీద రాయిలాంటి బరువైన వస్తువుతో కొట్టడం జరిగిందనీ ఇవ్వబడింది. ఆమె వయసు 17 లేక 18 సంవత్సరాలు అయివుంటుందని కూడా రిపోర్టులో చెప్పడం జరిగింది.

రెండు రోజులైనా ఎవరూ శవం వెతుక్కుంటూ రాలేదు. పైగా కలకత్తాలోని ఏ పోలీసుస్టేషన్‌లోనూ ఎవరూ ఆడపిల్ల తప్పిపోయిదని రిపోర్టు ఇవ్వలేదు. శవం ఫోటోలు తీసి ఆ తర్వాత శవాన్ని అంతిమ సంస్కారంకొరకు పంపించారు పోలీసువారు. కేసులో ముందుకు పోవాలంటే ఇన్‌స్పెక్టర్‌కు కొస దొరకలేదు. 17

జూలై కాశీపూర్ పోలీసు స్టేషన్‌నుంచి ఇన్‌స్పెక్టర్ అజయ్‌కు ఫోన్ వచ్చింది. 17 సంవత్సరాల యువతి కన్పించడం లేదని ఆ యువతి తండ్రి రిపోర్టు ఇచ్చాడని వార్త అందింది. వెంటనే అజయ్ కాశీపూర్ స్టేషన్‌కు వెళ్ళాడు. ఆ యువతి పేరు రీనాకౌల్ అనీ ఆమె తండ్రి పేరు బి. డి. కౌల్ అని తెలుసుకున్నాడు. అడ్రసు తీసుకొని బయలుదేరాడు.

సాయంకాలం ఏడున్నర అయింది. అజయ్ వెళ్ళేసరికి బి. డి. కౌల్ ఇంటి దగ్గరే వున్నాడు. కొడుకు దిలీప్ కౌల్‌తో మాట్లాడుతూ కూర్చునివున్నాడు. దిలీప్ కౌల్ వయసు 21 సంవత్సరాలు. 7వ తేదీనుండి తన కూతురు కన్పించడం లేదనీ, అందుకే పోలీసుస్టేషన్‌లో రిపోర్టు ఇచ్చాననీ ఆమె తండ్రి చెప్పాడు. 7 నుంచి పిల్ల కన్పించకపోతే 13 వరకూ రిపోర్టు ఎందుకివ్వలేదని ఇన్‌స్పెక్టర్ అడిగితే, "ఆడపిల్ల-అందరి నోళ్ళలో పడతాం అనే భయం. అందువల్లనే ఆలస్యం అయింది" అన్నాడు తండ్రి. రీనా ఇండియన్ స్టైన్‌లెస్ స్టీల్ లిమిటెడ్ కంపెనీలో ప్రొప్రయిటర్ నిరంజన్‌కు ప్రైవేట్ సెక్రెటరీగా ఉద్యోగం చేసేదని తండ్రి చెబితే ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

ప్రైవేట్ సెక్రెటరీయా? 17 ఏళ్ళ పిల్లకి ప్రైవేట్ సెక్రెటరీగా అంత పెద్ద కంపెనీలో ఉద్యోగం దొరకడం ఆశ్చర్యమే?

"మీ అమ్మాయి ఏం చదివింది?" ఆశ్చర్యంలో తలమునకలౌతూ ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

ఆ ప్రశ్నకు రీనా తండ్రి గతుక్కుమన్నట్టు కన్పించాడు. కొడుకు ముఖంలోకి చూశాడు.

"ఎనిమిదివరకు చదివింది. ముందుగా ప్యాకింగ్ అసిస్టెంటుగా మాత్రమే ఆ కంపెనీలో చేరింది." నీళ్ళు నములుతూ సమాధానం ఇచ్చాడు.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! మీ పోలీసుల దగ్గర అబద్ధం ఆడి ప్రయోజనం లేదని నాకు తెలుసు. నా చెల్లెలు ఆ కంపెనీలో చేరి, త్వరలోనే యజమాని అభిమానాన్ని పొందింది. నాకు 500 రూపాయల ఉద్యోగం అదే కంపెనీలో ఇప్పించింది. వాళ్ళిద్దరి మధ్యా వున్న సంబంధం..." అన్న దీవక్ చెప్పసాగాడు.

"దీవక్ నీకు సిగ్గులేదూ - చెల్లెలి గురించి అలా మాట్లాడటానికి?" తండ్రి మందలించాడు.

"చెప్పనివ్వండి" ఇన్‌స్పెక్టర్ అజయ్ అన్నాడు.

"మా అమ్మాయి ఉద్యోగం చేసేది. అంతే! ఆమె వ్యక్తిగత జీవితం గురించి నేను ఎప్పుడూ పట్టించుకోలేదు" తండ్రి అన్నాడు.

"దానికి ఈ గతి పడుతుందని నాకు ఏనాడో తెలుసు" అన్నాడు కొడుకు దీవక్.

అజయ్ రీనా శవాన్ని తీసిన ఫోటోలు చూపించాడు. తండ్రీ, అన్నా శవాన్ని గుర్తించారు.



రెండో రోజు అజయ్ రీనా పని చేసిన కంపెనీకి వెళ్ళి ప్రొప్రయిటర్‌ను కలుసుకుని రీనా ఫోటోలు చూపించి విషయం చెప్పాడు.

"రీనా ఇలా దారుణ హత్యకు గురికావడం, నాకు చాలా బాధగా వుంది ఇన్‌స్పెక్టర్. నేను నాలుగున మద్రాసు వెళ్ళి రాత్రే తిరిగి వచ్చాను. ఆఫీసుకు వచ్చాక ఆమె 8వ తేదీనుంచి రావడంలేదని తెలిసింది. నాకు రీనా అంటే ఇష్టం. మా ఇద్దరి మధ్యా అక్రమ సంబంధం వున్నది. ఆ సంగతి నా భార్యకు కూడా తెలుసు. రీనా ఒక రకంగా చెప్పాలంటే ఉంపుడుగత్తెగా వుందని చెప్పాలి. ఈ హత్యతో నాకు ఎలాంటి సంబంధం లేదు" తొణక్కుండా అంత స్పష్టంగా నిరంజన్‌దత్తు చెప్పడం ఇన్‌స్పెక్టర్ అజయ్‌కు ఆశ్చర్యం కలిగించింది.

"ఆమెకు ఎవరైనా శత్రువులున్నారా?" ఇన్‌స్పెక్టర్.

"ఉన్నట్టు నాకు తెలియదు. ఆమెకు పెద్దగా స్నేహితులు లేరు. సాయంకాలం ఆఫీసు తర్వాత సాధారణంగా నా డ్రైవర్ కారులో ఆమెను ఇంటిదగ్గర దింపుతాడు. కారు లేని రోజు ఆమె తన స్నేహితురాలు వీణతో కలిసి బస్‌లో వెళ్తుందని విన్నాను. కుమారి వీణా కూడా నా కంపెనీలోనే పనిచేస్తున్నది. ఆమెతో మీరు మాట్లాడవచ్చును" అన్నాడు నిరంజన్.

నిరంజన్ వీణను పిలిపించాడు. అజయ్ ప్రశ్నలకు ఆమె ఇచ్చిన సమాధానం. "7 సాయంత్రం ఇద్దరం బస్‌స్టాండు కేసి నడుస్తున్నాం. అకస్మాత్తుగా ఒక తెల్లటి ఫియట్ వచ్చి మా ముందు ఆగింది. కారు ఒక స్త్రీ నడుపుతోంది. ఆమెను చూసి రీనా కొంచెం ఖంగు తిన్నది. ఆ తర్వాత ఆ స్త్రీ దగ్గరకు వెళ్ళింది. ఆమె రీనాతో నవ్వుతూ మాట్లాడింది. "నీతో పని వుంది. కారు ఎక్కు" అన్నది ఆమె. ముందు సందేహించినా ఆ తర్వాత రీనా వెళ్ళి కార్లో కూర్చుంది. నేను బస్‌స్టాండుకు వెళ్ళిపోయాను" అన్నది వీణ.

"కారు నంబరు చెప్పగలరా?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"లేదు. నేను నోట్ చేసుకోలేదు. కార్లో వున్న ఆమె తెల్లగా బొద్దుగా ఉంది. పళ్ళు తాంబూలం ఎక్కువగా తినడంవల్లనో ఏమో గారపట్టినట్టుగా ఉన్నాయి. కారు వెనక గ్లాసు మీద బ్రూస్లీ స్టిక్కర్ వుంది."

నిరంజన్‌దత్తు తుళ్ళిపడ్డాడు. "అదేమిటి? అది నా కారు. ఆమె వర్ణించినదాన్నిబట్టి ఆ కారు నడుపుతున్న స్త్రీ నా భార్య. ఆమె ఇంత దారుణం చెయ్యదు చెయ్యలేదు. ఇన్‌స్పెక్టర్ మా ఇంటికి వెళ్దాం పదండి. ఆమెను మీరే ప్రశ్నించండి. నేను వాస్తవాన్ని ఎదుర్కోడానికి సిద్ధంగా వున్నాను" అన్నాడు నిరంజన్.

అతని వ్యక్తిత్వానికి ముగ్ధుడైనట్టుగా చూశాడు ఇన్‌స్పెక్టర్.

ఇద్దరూ ఇంటికి బయలుదేరారు. నిరంజన్ భార్య పేరు లిపి. ఆమె రీనా హత్య గురించి విని ఆశ్చర్యపోయింది.

"ఆ అమ్మాయంటే నాకు ద్వేషంలేదు. ఆమె కోసం నా భర్త నాకు డైవర్సు ఇవ్వడానికి కూడా సిద్ధపడ్డాడు. కాని ఆ పిల్ల అందుకు అంగీకరించలేదు. మంచి మనసు. ఆ రోజు నేను స్నేహితురాలింటినుంచి వస్తున్నాను. నా భర్త ఊళ్ళో లేరు.

నేనే కారు ఎక్కించుకున్నాను. భోజనం పెట్టాను. తొమ్మిది గంటలకు రీనా తన యింటికి బయలుదేరింది. నేను గేటు వరకు వచ్చాను. ఆమె అక్కడ ఆగివున్న ఒక టాక్సీ ఎక్కి ముందు సీట్లో కూర్చుంది మా చౌకీదారు కూడా చూశాడు. ఆ తర్వాత నాకు తెలియదు" అన్నది లిపి.

ఇన్‌స్పెక్టర్ అజయ్ అక్కడ్నుంచి రీనా తండ్రి ఇంటికి వెళ్ళాడు. అతడ్ని చూసి కౌల్ తృళ్ళిపడ్డాడు. మళ్ళీ సర్దుకుని "మా అమ్మాయిని హత్య చేసినవాడి ఆచూకీ దొరికిందా?" అని అడిగాడు.

"దాదాపు. ఆ టాక్సీ ఎవరిది? ఎవరు డ్రైవర్?" వాకిట్లో ఆగివున్న టాక్సీని చూస్తూ అడిగాడు అజయ్.

"అద్దె టాక్సీ. దాన్ని నేనే నడుపుతాను" దీపక్ ముందుకొచ్చి సమాధానం చెప్పాడు.

"7వ తేదీన నడిపావా? రాత్రి ఎన్నిగంటల వరకు నడిపావ్?"

"నడిపాను. వర్షం ఎక్కువగా వుండడంవల్ల పన్నెండున్నరకు ఓనర్‌కు తిప్పి ఇవ్వాల్సిన దాన్ని ఇవ్వలేకపోయాను. తెల్లవారి 41/2 కు ఇచ్చాను. అయినా టాక్సీ గురించి ఇన్ని ప్రశ్నలు నన్నెందుకు వేస్తున్నట్టు? నా చెల్లిని చంపింది నేనేనని అనుమానమా?" తీవ్రంగా వుంది దీపక్ కంఠం.

"కావచ్చు" అనేసి ఇన్‌స్పెక్టర్ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. టాక్సీ ఓనర్‌తో కూడ మాట్లాడాడు. మూడో రోజు దీపక్‌ను స్టేషన్‌కు పిలిపించాడు.

చివరకు దీపక్ తను ఈ హత్య చేసినట్టు అంగీకరించాడు.

"నా చెల్లెలు తల ఎత్తుకోలేని పనిచేసింది. కంపెనీలో తోటి ఉద్యోగులు, స్నేహితులు, ఇరుగు పొరుగువాళ్ళు అనే మాటల్ని భరించలేకపోయాను. డబ్బు బాగా ఇస్తుంది కనక మా నాన్న అమ్మ కూడా అది ఒంటరిగా ఇల్లు అద్దెకు తీసుకుని వుండాల్సిన అవసరం ఏమిటని అడగలేకపోయారు. అందుకే నా చెల్లెల్ని నేనే చంపాను" అంటూ తన అపరాధాన్ని అంగీకరించాడు రీనా అన్న దీపక్.

ఇంటి దగ్గర దింపుతానని టాక్సీలో ఎక్కించుకున్నాడు. ఆ సాయంత్రం కారులో రీనాను లిపి తీసుకెళ్ళడం చూశాడు దీపక్. ఎప్పట్నుంచో అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. అందుకే ఇంటి ముందు కాపు వేశాడు. దింపుతానని టాక్సీ ఎక్కమన్నాడు. మధ్యలో మిఠాయి దుకాణం ముందు ఆపి (వేసవికాలం కావడంవల్ల) ఒక గ్లాసు లస్సీ తనకూ, మరో గ్లాసు రీనాకూ తీసుకొచ్చి టాక్సీలో కూర్చున్నాడు. రీనాకు అందించిన గ్లాసులో ముందే తన దగ్గర వున్న విషం కలిపాడు. ఆమె కొంత దూరం పోయాక గిలగిల తన్నుకోసాగింది. అప్పటికే వర్షం ప్రారంభం అయింది. నీడలో ఆపి ఆమె గొంతు పిసికాడు. ఆ తర్వాత బట్టలు లాగేశాడు. టాక్సీ దిగి రాయి ఒకటి తెచ్చి ముఖం ఛితకగొట్టాడు.

ఇదీ ఒక అన్న ద్వారా చెల్లెలికి లభించిన ఆదరణ! అదే అన్న గుణం మంచిది కాదని ఒక చెల్లెలు చంపుతుందా? మగవాడికి శీలం అక్కర్లేదు.

❀ ❀ ❀



# 28. బ్లడ్‌గ్రూప్-'ఏ'

వికాస్‌దత్తు వయసు పన్నెండేళ్ళు. ఆ రోజు పన్నెండున్నరకు స్కూలు నుంచి వచ్చేసరికి తలుపుకు పెద్ద తాళం వేసి ఉంది. వికాస్‌కు ఆకలేస్తోంది. తను వస్తాడని తెలిసీ తల్లి ఆ సమయంలో బయటికి వెళ్ళినందుకు ఆ పిల్లవాడికి ఏడుపొచ్చింది. గడప మీద కూర్చున్నాడు తల్లికోసం ఎదురుచూస్తూ.

ఇలా ఎప్పుడూ జరగలేదు. వికాస్ స్కూలు నుంచి వచ్చేసరికి తల్లి ఎదురయేది. అన్నం తినిపించేది.

గంట గడిచిపోయింది.

వికాస్ తల్లి ఇంకా రాలేదు.

ఆకలితో కడుపు దహించుకుపోతున్నది.

పక్కింటి అతుల్‌భౌమిక్ కొడుకు అరుణ్ వికాస్ వయసువాడే. ఇద్దరూ కలిసి ఆడుకొంటూ ఉంటారు. వికాస్ అరుణ్ ఇంటికి వెళ్ళాడు. అరుణ్ తల్లి రేణుకను "ఆంటీ మా మమ్మీ వచ్చిందా?" అని అడిగాడు.

"ఏం? మీ అమ్మ ఇంట్లో లేదా?" రేణు ఆశ్చర్యంగా అడిగింది.

"మా మమ్మీలేదు. ఇంటికి తాళం వేసి ఉంది" దాదాపు ఏడుస్తూనే అన్నాడు.

"వస్తుందిలే. పద అన్నం తిందువు." ఊరడించి అన్నం పెట్టింది రేణుక.

అన్నం తిని వాళ్ళింట్లోనే తల్లి కోసం చూస్తూ ఉండిపోయాడు వికాస్.

సాయంత్రం మూడు గంటలు దాటినా వికాస్ తల్లి రాలేదు.

రేణుకకు అనుమానం కలిగింది.

సాధారణంగా వికాస్ తల్లి లలితాదత్తు పగటిపూట బయటకు వెళ్ళదు. అందులో కొడుకు స్కూలు నుంచి వచ్చే సమయానికి అసలు వెళ్ళదు.

మరో గంట గడిచింది.

రేణుక మనసులో ఎన్నో సందేహాలు చోటు చేసుకొన్నాయి. ఆమె భర్త ఏ ఆరున్నరకో గాని ఇంటికిరాడు. ఆమెకు ఏం చెయ్యాలో తోచలేదు. వికాస్ ముఖం చూస్తుంటే జాలి వేసింది. ఆమె పక్కింటి నందీ ఇంటికి వెళ్ళింది. ఆ రోజు ఆయన ఇంట్లోనే ఉన్నాడు. ఆయన డాక్టర్. క్లినిక్‌కు ఆరింటికిగాని వెళ్ళడు.

రేణు డాక్టర్ నందీకి విషయం చెప్పింది. మిసెస్ నందీ లలితను పది గంటలకు వరండాలో చూశానని చెప్పింది.

లలిత కన్పించడం లేదన్న సంగతి ఆ నోటా ఆ నోటా కాలనీలో పాకిపోయింది. తలొక్క రకంగా అనసాగారు. వికాస్ ఏడుపు మొదలుపెట్టాడు. రేణుక ఆ బాలుడ్ని బుజ్జగించింది.

నందీ దగ్గరలోని పోలీసుస్టేషన్‌కు ఫోను చేశాడు. ఇన్‌స్పెక్టర్ దమ్‌దమ్ వచ్చాడు. ఈ సంఘటన 7-2-82న జరిగింది.

ఇన్‌స్పెక్టర్ ఇంటి కిటికీలన్నీ కూడా మూసి ఉండటాన్ని గమనించాడు. ఊరికి వెళ్ళేటప్పుడు మాత్రమే ఇంత జాగ్రత్త తీసుకుంటారు. గంటా, రెండు గంటల కోసం బయటికి వెళ్ళేవాళ్ళు ఇంత పకడ్‌బందీగా అన్ని కిటికీలూ లోపల నుంచి ముయ్యరు.

కొంతమందిని సాక్షులుగా పెట్టుకొని ఇన్‌స్పెక్టర్ తాళం పగలగొట్టించి, సాక్షులతోపాటు లోపలకు వెళ్ళాడు. డ్రాయింగ్ రూము అందంగా అలంకరించబడి ఉంది. వస్తువులన్నీ యథాస్థానంలో ఉన్నాయి. బెడ్‌రూంలోకి ప్రవేశించిన ఇన్‌స్పెక్టరూ, మిగతావారూ కొయ్య బొమ్మలే అయిపోయారు కొద్ది నిముషాలు.

వాళ్ళ వెనకే వచ్చిన వికాస్ తల్లిని మంచంమీద చూసి "మమ్మీ! మమ్మీ" అంటూ పరుగు తీశాడు. కానీ ఇన్‌స్పెక్టర్ బాలుడ్ని మధ్యలో పట్టుకొన్నాడు. ఏడుస్తున్న పిల్లవాడ్ని రేణుక వాళ్ళింటికి తీసుకెళ్ళింది.

ఇన్‌స్పెక్టర్ దగ్గరగా వెళ్ళి పరిశీలనగా చూశాడు. లలిత చనిపోయి ఉంది. ఆమె వంటిమీద బ్లౌజూ, లంగా మాత్రమే ఉన్నాయి. బ్లౌజు హుక్స్ ఊడిఉన్నాయి. గొంతుపిసికి చంపినట్టుగా తెలిసిపోతున్నది. ఆ చంపిన వాడెవడో మగవాడే అయి ఉంటాడని ఊహించారు. పైగా ఇంట్లో వస్తువులు ఎక్కడివక్కడే ఉన్నాయి. బెడ్ రూంలో ప్రతిఘటించిన సూచనలేమీ కన్పించలేదు. ఆమెకు బాగా పరిచితుడే ఈ హత్య చేసి ఉంటాడని ఇన్‌స్పెక్టర్‌కు నమ్మకం కలిగింది.

డైనింగ్ టేబుల్ మీద ఒక ప్లేటులో అన్నం, కూరలు పెట్టి ఉన్నాయి. అన్నం తింటూ తింటూ ఎవరో రావడంతో ఆమె చెయ్యి కడుక్కొని అన్నం పళ్ళెం మీద మరో పళ్ళెం కప్పి అతనికోసం బయటికి వచ్చిందనే విషయం కూడా నిర్ధారణ అయింది.

ఇన్‌స్పెక్టర్ ముందుగా వికాస్‌ను కొన్ని ప్రశ్నలు వేశాడు. తను స్కూలుకు వెళ్ళేప్పుడు తల్లి మామూలుగా రోజూ లాగే ఉందని చెప్పాడు. తండ్రి ప్రమోద్‌దత్తు జనవరి 28న బొంబాయి వెళ్ళినట్టు చెప్పాడు. తిరిగి ఎప్పుడు వస్తాడో తనకు తెలియదన్నాడు.

ప్రమోద్‌దత్తుకు కలకత్తాలో గౌరీ హాట్‌లో, పెద్ద బట్టల దుకాణం ఉంది. అందులో కాషియర్‌గా పనిచేస్తున్న అరవింద్ గుహను వెంటనే రమ్మని పోలీసులు ఫోన్ చేశారు.

ఇరుగు పొరుగు వాళ్ళ ద్వారా లలితాగుప్త రోజూ సాయంకాలం చక్కగా అలంకరించుకొని టాక్సీలో బయటికి వెళ్ళి బాగా పొద్దుపోయాక ఇంటికి వస్తుందనీ, పగలు మాత్రం ఎక్కడికీ వెళ్ళదనీ తెలిసింది ఇనస్పెక్టర్‌కు.

పనిమనిషినీ, వంటవాడినీ పిలిపించారు. వాళ్ళు ఉదయం పదింటికే వెళ్ళిపోయామని చెప్పారు. వాళ్ళు రోజూ అలాగే వెళ్ళిపోతామని కూడా చెప్పారు. తను వెళ్ళేసరికి ఆమె పుస్తకం చదువుకొంటూ డ్రాయింగ్ రూంలో కూర్చుని



ఉన్నదనీ, ఎవరూ రాలేదనీ, ఎవరైనా వస్తారని ఆమె తనతో అనలేదనీ వంటవాడు చెప్పాడు. పనిమనిషి తొమ్మిదింటికే వెళ్ళిపోయానని చెప్పింది.

క్యాషియర్ అరవింద్ తన యజమాని జనవరి 28న బొంబాయి వెళ్ళాడనీ, తల్లిదండ్రుల్ని చూట్టానికి ఢిల్లీ వెళ్ళి వస్తానన్నాడనీ చెప్పాడు.

ఎక్కడున్నా వెంటనే కాంటాక్టు చేసి ప్రమోద్ దత్తును వెంటనే కలకత్తా రమ్మని చెప్పవలసిందిగా క్యాషియర్‌కు పురమాయించాడు. తండ్రి వచ్చేంతవరకు వికాస్‌ను తన ఇంట్లో పెట్టుకోమని కూడా చెప్పాడు.

శవాన్ని పోస్టుమార్టమ్‌కు పంపించి, ఇంటికి సీలు వేయించి ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో వెళ్ళిపోయాడు.

రాత్రి పదకొండు గంటలకు క్యాషియర్ అరవింద్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేశాడు.

"సర్! డిమాండ్ కాల్ ద్వారా ప్రమోద్‌దత్తును కాంటాక్టు చేశాను" అన్నాడు.

"ఎక్కడున్నాడు?"

"ఈ పాటికి ప్రోగ్రాం ప్రకారం ఢిల్లీ వెళ్ళాల్సింది. కాని మొన్న లిఫ్ట్‌లో దెబ్బతగిలి ముఖంమీద గాయాలు తగిలాయట. అందువల్ల బొంబాయిలోనే ఉన్నారు. ఉదయం ఫ్లైట్‌లో వస్తున్నారు" అన్నాడు అరవింద్.

శవం పోస్టుమార్టం తర్వాత రెండోరోజు పోలీసులకు అప్పగించారు. శవాన్ని ఐస్‌లో పెట్టి భర్తకోసం ఎదురుచూడసాగారు.

ప్రమోద్ ఆ సాయంత్రం ఏడు గంటలకు పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. విమానం దిగి తిన్నగా అక్కడికే వస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్‌తో అన్నాడు.

"మీ ముఖంమీద గాయాలు ఇంకా మానినట్టులేదు. పట్టీ ఇంకా తియ్యనేలేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

దత్ ఒక్కసారిగా రెండు చేతులతో ముఖం కప్పుకొని ఏడవసాగాడు.

"సర్! ఈ గాయాలు చాలా చిన్నవి. నా హృదయానికి జీవితమంతా మర్చిపోలేని గాయం తగిలింది. హంతకుడ్ని పట్టుకోవడానికి నా సహకారం పూర్తిగా ఉంటుంది. హంతకుడికి శిక్ష విధించే దాకా నామనసుకు శాంతి ఉండదు" అన్నాడు ప్రమోద్‌దత్తు.

"మిస్టర్ దత్. నన్ను క్షమించండి. కొన్ని మిమ్మల్ని బాధించే ప్రశ్నలు వెయ్యకతప్పదు?"

"అడగండి."

"మీ భార్య రోజూ సాయంత్రం బయటికి వెళ్తుందట. బార్స్‌లో, క్లబ్బుల్లో ధనికులైన అనేమంది పురుషులతో మీ మిసెస్ కలిసి మెలిసి తిరుగుతూ ఉంటుందట. ఆమెకు డ్రింకింగ్ అలవాటు కూడ వుందట. మీకూ ఆమెకు సన్నిహితులైన వారిలో ఎవరిమీదనైనా అనుమానం ఉందా?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

దత్తు తృళ్ళిపడ్డాడు.

"నా భార్యకు క్లబ్బులకు వెళ్ళే అలవాటుంది. అంతేగాని పర పురుషులతో

సంబంధంగానీ, తాగుడు అలవాటుగానీలేవు" తీవ్రంగా అన్నాడు దత్తు.

ఇన్‌స్పెక్టర్ సేన్ నవ్వాడు.

"మిస్టర్‌దత్, మీ మిసెస్ గురించి నేను చెప్పింది అక్షరాలా నిజం. మీకు తాగే అలవాటుగానీ, మరే వీక్‌నెస్ గానీ లేవని కూడా నాకు తెలిసింది. ఈ హత్య చేసినవాడు మీ ఇంటి పరిస్థితులను బాగా ఎరిగున్నవాడే అయి ఉంటాడనడంలో సందేహంలేదు. అతనికి పనివాళ్ళు ఎప్పుడు వెళ్తారో తెలుసు. మీ కొడుకు స్కూలునుంచి ఎప్పుడువస్తాడో కూడా తెలుసు. అతన్ని చూడగానే మీ మిసెస్ తింటున్న అన్నం వదిలేసి అతనితోపాటు బెడ్‌రూంలోకి వెళ్ళింది. ఆమె వంటిమీద పూర్తిగా బట్టలు లేవు. బలవంతం చేసిన సూచనలుకూడా లేవు. అంటే ఆమెకూ అతనికీ సెక్సు సంబంధం కూడా ఉన్నదనడంలో సందేహంలేదు. మీరు దాచినా లాభం లేదు. మీ ఇంటికి అంత చనువుగా రాగల పురుషుడు ఎవరో ఆలోచించి చెప్పండి. మీ భార్యగురించి వ్యాపారంలో తలమునకలౌతున్న మీకు అన్ని విషయాలూ తెలియకపోవచ్చును. తెలిసినంత వరకు చెప్పండి"

"నాకు తెలియదు ఇన్‌స్పెక్టర్. ఆమె ఎవరితో అంత సన్నిహితంగా ఉండేదో ఊహించలేకుండా ఉన్నాను. ఆమె తాగుతుందని ఇప్పుడు మీరు చెబితేనే విన్నాను. చాలా బాధ కలుగుతోంది. ఆమె చనిపోయిన దుఃఖం కంటే ఇప్పుడు మీరిస్తున్న సమాచారం నన్నెక్కువ బాధ పెడుతున్నది" ఏడుస్తూనే అన్నాడు దత్తు.

ఇన్‌స్పెక్టర్ ఆ రోజు ఇక అతన్ని బాధపెట్టినందువల్ల లాభంలేదని భావించాడు. లలిత శవాన్ని అతనికి అప్పగించాడు.

15న పోస్టుమార్టమ్ రిపోర్టు అందింది. హత్య పదకొండూ పదకొండున్నరకు జరిగినట్టుగా చెప్పబడింది. ఆమె గోళ్ళలో చర్మంతోపాటు రక్తం ఇరుక్కుని ఉన్నదనీ, ఆ రక్తం ఏ గ్రూప్‌కు చెందినదనీ చెప్పబడింది. హంతకుడు ఆమెను నమ్మించి ఒకే బెడ్‌మీద ఉండగా గొంతు పిసికి చంపడానికి ప్రయత్నించాడనీ, ఆమె పెనుగులాడుతూ గోళ్ళతో అతని ముఖంపీకి ఉంటుందని కూడా రిపోర్టులో ఉన్నది. ఆ పరిస్థితిలో ఆమెకు పైగా అందుబాటులో ఉండేది ముఖమే కనుక బహుశా ఆమె అతని ముఖాన్నే రక్కి ఉండాలని రిపోర్టు చెప్పింది.

రిపోర్టు చదివి ఇన్‌స్పెక్టర్ జీప్ ఎక్కాడు. కలకత్తాలోని గౌరీ హోటల్‌లో ఉన్న బాంబేడయింగ్ దుకాణం ముందు జీపు ఆగింది. ప్రమోదదత్తు, అతని కాషియర్ అరవింద్‌తో ఏదో మాట్లాడుతున్నాడు.

"రండి! హంతకుడు దొరికాడా?" దత్తుసేన్‌ను అడిగాడు.

"దొరికాడు."

"ఎక్కడ? ఎవరు?"

"ఇక్కడే? నువ్వే?"

"ఏమిటి మీరంటున్నది?" చివ్వున లేచి నిలబడి అన్నాడు దత్తు.

అరవింద్ నిలువెల్లా కంపించిపోతున్నాడు.



"మీరే మీ భార్యను హత్య చేశారు. మీ క్యాషియర్ తప్పుడు సాక్ష్యం చెప్పాడు. మమ్మల్ని మోసం చేశాడు. ఆరోజు బొంబాయికి డిమాండ్‌కాల్ చెయ్యలేదు. ఆ సమయంలో దాదాపు 35 గంటలు కలకత్తా బొంబాయి లైన్లు పనిచెయ్యలేదు. లైటనింగ్ కాల్స్‌కూడా వెళ్ళలేదు. ఆరోజు మేంకూడా మిమ్మల్ని కాంటాక్టు చెయ్యడానికి ప్రయత్నించాం. మీ ఇద్దర్ని అరెస్టు చేస్తున్నాం."

"ఇన్‌స్పెక్టర్ ఇది అన్యాయం. నేను నా భార్యను హత్య చేశానా?"

"అవును చేశావు. రెండోరోజు నేను స్వయంగా తాజ్ బొంబాయికి ఫోన్ చేశాను మీకోసం. ప్రమోదదత్తు అనే అతను ఆ హోటల్లో 28 జనవరి నుంచి బస చేసినట్టూ, ఆ రోజే ఆరుగంటలకు గది ఖాళీ చేసినట్లు చెప్పారు. ఆతర్వాత గంటకే మీరు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. మహాశయా! ఏ పుష్పకవిమానంలో గంటలో మీరు కలకత్తా రావడమే కాకుండా స్టేషనుక్కూడా వచ్చారు. మీ ముఖంమీద గాయాలు మీరు గొంతు పిసకడానికి ప్రయత్నిస్తుండగా మీ భార్య ప్రతిఘటనలో చేసిన గాయాలే. మీ బ్లడ్ గ్రూప్ "ఏ" అయి ఉండాలి"

దత్తు సమాధానం ఇవ్వలేదు.

తలదించుకున్నాడు.

పోలీసులు ఇద్దరి చేతులకూ బేడీలు తగిలించారు.

ఆ తర్వాత ప్రమోద్‌దత్తు పోలీసులకు ఇచ్చిన రిపోర్టు చూడండి–

"నేను అతిసామాన్యకుటుంబంలోనుంచి వచ్చాను. పేరాశ లేదు నాకు. చిన్నగా వ్యాపారం ప్రారంభించి క్రమంగా అభివృద్ధి చేసుకున్నాను. ఒక్క బట్టల దుకాణమే కాదు – మరికొన్ని వ్యాపారాలలో షేర్లు కూడా కొన్నాను. నాకు తాగుడు అలవాటులేదు. ఉమెన్ వీక్‌నెస్ లేదు. సింపుల్‌గా ఒడుదుడుకులు లేని జీవితం నాకు ఇష్టం. అయితే నా భార్య ప్రవృత్తి ఇందుకు భిన్నమైనది. ఆమెకు అందరిలో గొప్పగా కన్పించాలనీ, క్లబ్బులకు తిరగాలనీ ఉండేది. నేను ఏం చెప్పినా ఆమెకు లక్ష్యం లేదు. రాజీపడటం నేర్చుకున్నాను. కాని ఆమెకు పర పురుషులతో సంబంధం ఉందనీ తాగే అలవాటుకూడా ఉందనీ ఇటీవలే తెలిసింది. ఆమెకు నయంగా, భయంగా చెప్పి చూశాను

దాదాపు ఒక సంవత్సరం అవుతుంది. ఆమెకు అన్వర్ మహమ్మద్ అనే అతనితో అక్రమ సంబంధం ఉందని తెలిసింది. ఆ తర్వాతనే ఆమెకు అతడి ఒక్కడితోనే కాదు చాలామంది పురుషులతో అక్రమ సంబంధం ఉందని తెలిసింది. మా అమ్మ, నాన్ననూ పిలిపించాను. కాని వాళ్ళను నా భార్య తేలిగ్గా చూడసాగింది. వాళ్ళకు కోపం వచ్చి వెళ్ళిపోయారు. కుటుంబంలోని అశాంతినీ, బయటవాళ్ళముందు అవమానాన్ని సహించలేకపోయాను.

చివరకు నాలో సహనం చచ్చిపోయింది. దాదాపు పిచ్చివాడ్నే అయ్యాను. మా క్యాషియర్ అరవిందు సహాయంతో ఒక ప్లాన్ అల్లాను. మా ప్లాన్ ప్రకారం మా దుకాణంలోని సేల్స్‌మాన్‌ను బొంబాయి పంపించాను. నా పేరుతో తాజ్‌లో ఉండమన్నాను. 8 ఫిబ్రవరి సాయంత్రం హోటల్ ఖాళీ చేయమన్నాను. అయితే మా

ప్లాన్ గురించి అతనికి తెలియదు. వ్యాపార సంబంధంగా ఆ రోజుల్లో నేను బొంబాయిలో ఉండటం అవసరమని, కొన్ని కారణాలవల్ల నేను అక్కడకు వెళ్ళలేకుండా ఉన్నాననీ అతన్ని నమ్మించాను."

"ఆ రోజుల్లో మీరెక్కడ ఉన్నారు?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

"నేను ఇన్ని రోజులూ కలకత్తాలోనే హోటల్ గ్రేట్ ఈస్టర్న్‌లో ఉన్నాను. 7 ఫిబ్రవరి నేను అకస్మాత్తుగా రావడం చూసిన నా భార్య అన్నం తింటూ చెయ్యి కడుక్కొని వచ్చింది. ఆమె సామానేదని అడిగింది. క్లర్క్ వెనకి టాక్సీలో తెస్తున్నాడని చెప్పి ఆమెను బెడ్‌రూంలోకి తీసుకెళ్ళాను. ఇన్ని రోజుల ఎడబాటును సహించలేనట్లు నటించి ఆమెను నమ్మించాను. ఆ తర్వాత గొంతుపిసికి చంపాను. అప్పుడే ఆమె తన గోళ్ళతో నా ముఖం పీకింది. నా బ్లడ్ గ్రూప్ ఏ. అది నేను గమనించలేదు. గమనిస్తే ఆమె గోళ్ళు శుభ్రం చేసి ఉండేవాడ్ని"

రెండో ముద్దాయి అరవింద్ తను తన యజమాని ఆజ్ఞను పాటించాననీ, హత్యలో ఎలాంటి ప్రమేయం తనకు లేదనీ అన్నాడు. సురేష్ తనకు ఇదంతా తెలియదనీ వ్యాపార సంబంధమైన కారణాలవల్ల తనను బొంబాయి హోటల్లో ఉండమంటే నమ్మాననీ చెప్పాడు.

తల్లిదండ్రుల తప్పులను అర్థం చేసుకొనే వయసులేని ఆ పసివాడు వికాస్ ఇప్పుడు తాత, నాయనమ్మల దగ్గర ఉన్నాడు.

❀ ❀ ❀



# 29. అసూయ

## 1981 నవంబరు 1వ తేదీ

ఆరోజు రవీంద్ర అర్ధరాత్రి దాటినా ఇంటికి రాలేదు. అతని తల్లి దండ్రులు ఆదుర్దాగా ఎదురుచూస్తూ కూర్చున్నారు. తల్లి పేరు ఆరతి. తండ్రి పేరు నిరోధ్‌సేన్ వారి ఏకైక సంతానం రవీంద్ర. సేన్ నవీదేవ్‌బోసుకు ఫోన్‌చేసి రవీంద్ర గురించి అడిగాడు. బోసుకు కూడ రవీంద్ర అంతవరకు ఇల్లు చేరకపోవడం ఆశ్చర్యాన్నే కలిగించింది. బోసు కూతురు చంపా, రవీంద్ర మ్యాటినీ సినీమాకు వెళ్ళి ఆరున్నరకల్లా తిరిగి వచ్చారు. చంపాతోపాటు ఇంట్లోకి వెళ్ళి ఒక కప్పు టీ తాగి, ఇద్దరూ వచ్చిన రిక్షాలోనే ఎక్కి ఇంటికి వెళ్ళిపోయాడు రవీంద్ర. ఆ విషయమే సేన్‌తో బోసు చెప్పాడు.

బోసు కూతురు చంపాను రవీంద్రకు ఇవ్వడానికి నిశ్చయం అయింది. అందువల్లనే రవీంద్రతో చంప తరచు సినీమాలకు వెళ్తూ ఉంటుంది. ఆమె తల్లిదండ్రులు కూడా అభ్యంతరపెట్టరు. రవీంద్ర 6-45 కే బోసు ఇంటినుంచి రిక్షాలో బయలుదేరాడని తెలిసి, అతని తల్లిదండ్రులు మరీ బెంబేలుపడిపోయారు. రవీంద్ర స్నేహితుల ఇళ్ళకు ఫోన్ చేశాడు సేన్. అందరూ ఆరోజు రవీంద్రను చూడలేదనే చెప్పారు. రాత్రి దాదాపు 2-30 దాటింది. బోసుకూడా సేన్ ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలసి దగ్గరి పోలీసుస్టేషన్‌కు వెళ్ళారు.

ఇన్స్పెక్టర్‌కు రవీంద్ర తండ్రి విషయం వివరించి చెప్పాడు. పెళ్ళికిముందే ఒక అమ్మాయితో సినిమాకు వెళ్ళడం, అందుకు ఆమె తల్లిదండ్రులు అంగీకరించడం, వాస్తవాలుగా అన్పించలేదు పోలీసు ఆఫీసరుకు - తన అనుమానాన్ని బయటపెట్టాడు. వెంటనే బోసు అందుకొని "సర్! నేను ఆ అమ్మాయి తండ్రిని. మా రెండు కుటుంబాలూ ఎన్నో సంవత్సరాలుగా సన్నిహితంగా ఉంటున్నాయి. వాళ్ళిద్దరికీ నిశ్చితార్థం అయిపోయింది. రెండు నెలల్లో ముహూర్తం కూడా పెట్టించాలనుకున్నాం. మాకు రవీంద్ర మీద పూర్తి నమ్మకం ఉంది. అందుకే వాళ్ళు కలసి సినిమాకు వెళ్ళడాన్ని మేము వ్యతిరేకించలేదు" అని చెప్పాడు.

"మా అమ్మాయి, రవీంద్రకూడా ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఆ తర్వాతే మాకు చెప్పారు. అందుకు మేము అభ్యంతరం చెప్పలేదు" మళ్ళీ అన్నాడు బోసు. ఇన్స్పెక్టర్ రిపోర్టు రాసుకొన్నాడు. "భయపడకండి. మీ అబ్బాయి ఈపాటికి ఇంటికి వచ్చే ఉండవచ్చును. రేపు ఉదయం నేను మీ ఇంటికి వస్తాను. రవీంద్ర అప్పటికి తిరిగి రాకపోతే చెంప నుంచి స్టేట్‌మెంటు తీసుకుంటాను." అన్నాడు ఇన్స్పెక్టర్.

తెల్లవారి ఇన్‌స్పెక్టర్ సాహా సేన్ ఇంటికి వెళ్ళాడు. రవీంద్ర ఇంటికి రాలేదని తెలిసింది. అనేక ప్రశ్నలు వేశాడు. కాని ముందుకు సాగడానికి క్లూ దొరకలేదు. ఇన్‌స్పెక్టరు అన్ని పోలీసు స్టేషన్లకు రిపోర్టు పంపించాడు. రిపోర్టుతోపాటు రవీంద్ర ఫోటోలు కూడా పంపించాడు "అన్నద" సినిమా హాలునుంచి ఆ సాయంత్రం వాళ్ళిద్దర్ని తీసుకువెళ్ళిన రిక్షా వాడికోసం గాలింపు ప్రారంభం అయింది.

నాలుగురోజుల తర్వాత ఇన్‌స్పెక్టర్ సాహాకు ఒక ఫోన్ వచ్చింది. బి.టి. రోడ్డుకు ప్రక్కన ప్రవహించే మురుగు కాలవలో ఒక శవం ఉన్నదని ఎవరో చెప్పారు. పేరు చెప్పకుండానే ఫోన్ పెట్టేశారు. సాహా తన సిబ్బందితో బయలుదేరాడు. నిజంగానే శవం మురుగు కాలవలో పూర్తిగా బురద కొట్టుకొని ఉన్నది. పూర్తిగా ఉబ్బి ఉన్నది. శవాన్ని బయటికి తీయించాడు. ముఖం నిండా ఉన్న మట్టిని కడిగించాడు. ముఖం చూసి సాహా తృళ్ళిపడ్డాడు. రవీంద్ర పోలికలున్నట్టుగా తోచింది. ముఖంకూడా బాగా ఉబ్బిపోయి ఉన్నది. శవం కడుపులో కత్తిపోట్లు కన్పించాయి. ఎవరో హత్యచేసి మురుక్కాలవలో పారేశారు.

శవాన్ని చూడగానే సేన్ విరుచుకు పడిపోయాడు. అతన్ని స్పృహలోకి తేవటానికి కొందరు అతనికి ఉపచారాలు చేశారు. స్పృహకి రాగానే పిచ్చివాడిలా అరుస్తూ "ఇన్‌స్పెక్టర్! నా బాబును ఎవరు చంపారు? వాడికి శత్రువులు లేరు. వాడు ఎంతో మంచివాడు. ఎందుకు చంపారు? ఎవరు చంపారు?" అన్న మాటలే అనసాగాడు. పిచ్చివాడిలా ఆ కన్నతండ్రి కడుపుకోత పెడుతూ ఉంటే అక్కడ ఉన్నవాళ్ళు సేన్‌ను బలవంతంగా టాక్సీలో ఇంటికి తీసుకెళ్ళారు. శవాన్ని పోస్టుమార్టంకు ఆసుపత్రికి పంపించారు. ఇన్‌స్పెక్టర్ స్టేషన్‌కు వచ్చి కూర్చున్నాడు. దాదావు నాలుగు గంటలైంది. నవీదేవ్‌బోస్ గాభరాగా వచ్చాడు. "ఇన్‌స్పెక్టర్ మా అమ్మాయి కనిపించడం లేదు." అన్నాడు.

"మీ అమ్మాయి కన్పిచండం లేదా? ఎప్పటినుంచి?"

"ఉదయం పదకొండు గంటలనుంచి."

"మిస్టర్ బోస్! మీ కాబోయే అల్లుడ్ని ఎవరో హత్య చేశారని మీకింకా తెలియలేదా? ఇప్పుడే మురుగు కాలవలో నుంచి శవాన్ని బయటికి తీసి శవ పరీక్షకు పంపించివచ్చాను."

ఇన్‌స్పెక్టర్ మాటలు విని స్థాణువులా నిలబడిపోయాడు బోస్.

"మిస్టర్ బోస్! ధైర్యం తెచ్చుకోండి. మీ అమ్మాయి ఎప్పటినుంచి కన్పించడం లేదన్నారూ? బయటికి వెళ్ళి తిరిగి రాలేదా? వెళ్ళేటప్పుడు మీకు చెప్పలేదా?"

బోస్‌కు గొంతు ఎండిపోతున్నది. మాటలు పెగలడంలేదు. ఎలాగో విచ్చిపోతున్న నరాల్ని కూడదీసుకుంటూ అన్నడు. "రవీంద్రను హత్య చేశారా? అయ్యో.. నా చంపను కూడా..." భోరుమన్నాడు బోసు.

"మరీ అంత బెంబేలు పడకండి. చంప బయటికి ఎప్పుడు వెళ్ళింది? వంటరిగా వెళ్ళిందా?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"మీరు ఆమెతో మాట్లాడి స్టేట్‌మెంటు రికార్డు చేసుకుని పదకొండు



గంటలకు వెళ్ళారు. మీరు వెళ్ళగానే చంప లాన్‌లో మొక్కల దగ్గరకు వెళ్ళింది. నేనూ, నా భార్య లోపలకు వచ్చాం. ఆ తర్వాత కొద్ది సేపటికే చంప ఎవరితోనో మాట్లాడడం విన్పించింది. కాని మేము పెద్దగా పట్టించుకోలేదు. రవీంద్ర కన్పించకపోవడాన్ని గురించి మాట్లాడుకొంటున్నాం. పన్నెండు అయినా చంప లోపలకు రాలేదు. మాటలూ విన్పించడంలేదు. నేను బయటికి వచ్చాను. చంప కన్పించలేదు. ఇల్లంతా గాలించాం ఎక్కడా లేదు. ఇంతవరకూ రాలేదు. అలా మాకు చెప్పకుండా చంప బయటకు వెళ్ళదు. అందుకే భయంగా ఉంది ఇన్‌స్పెక్టర్!" దాదావు ఏడుస్తూనే అన్నాడు బోసు.

రవీంద్ర హత్యకూ, చంప కనిపించకపోవటానికీ ఏదో సంబంధం ఉన్నట్టుగా అన్పించింది ఇన్‌స్పెక్టర్‌కు. "బోసుబాబూ! రవీంద్ర హత్యకు సంబంధించి మీకేమైనా తెలిస్తే చెప్పండి. దాన్నిబట్టి చంపను వెదకడం తేలికవుతుంది" అన్నాడు బోస్ ముఖంలోకి లోతుగా చూస్తూ.

బోస్ పిచ్చివాడిలా చూశాడు. భాష మర్చిపోయినవాడిలా మూగగా చూశాడు.

"చెప్పండి!"

"ఏం చెప్పమంటారు? నాకు రవీంద్ర హత్య గురించి ఇప్పుడు మీరు చెబితేనే తెలిసింది. నేను ఒకవైపు నా బిడ్డ కనిపించలేదనే గాభరాలో ఉండి సేన్‌కు కూడా ఇవ్వాళ ఫోన్ చెయ్యలేదు."

ఇన్‌స్పెక్టర్ కేసు రాసుకున్నాడు. బోసుకు ధైర్యం చెప్పి పంపించాడు. పెద్ద ఆఫీసర్లతో ఈ విషయం గురించి మాట్లాడాడు. చివరకు ఈ కేసును సి. ఐ. డి ఇన్‌స్పెక్టర్ విమల్ ఘోష్‌కు అప్పగించారు.

విమల్ ఘోష్ రిక్షావాడు దొరికితేగాని ఈ కేసులో ముందుకు వెళ్ళే అవకాశం లేదనుకొన్నాడు. తెల్లవారే ఇన్‌స్పెక్టర్ సాహా రిక్షావాడిని తీసుకొని విమల్‌ఘోష్ దగ్గరకు వచ్చాడు.

రిక్షావాడు చెప్పాడు- "19 నవంబరు 82 సాయంత్రం సినిమా హాలు దగ్గర ఒక అబ్బాయి, అమ్మాయి నా రిక్షాలో ఎక్కారు. ముందు రిక్షా అమ్మాయి ఇంటి దగ్గర ఆగింది. నన్ను ఓ పది నిముషాలు ఉండమని చెప్పి అబ్బాయి కూడా లోపలకు వెళ్ళాడు. పది నిముషాలకి ఆ అబ్బాయి వచ్చి రిక్షా ఎక్కాడు. రవిపాడా (రవిపాడా లొకాలిటీలో రవీంద్ర ఇల్లు ఉంది) వెళ్ళమన్నాడు. రిక్షా కొద్ది దూరం వెళ్ళింది. అంతలో ఒక యువకుడు రిక్షా ఆపమని చెయ్యి వూపాడు. అతన్నిచూసి రిక్షాలో ఉన్న యువకుడుకూడా రిక్షా అపమని, రిక్షా దిగి అతని దగ్గరకు వెళ్ళాడు. ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్నారు. నారిక్షాలో ఎక్కిన యువకుడు వెనక్కు తిరిగి వచ్చాడు. రిక్షా కిరాయి ఇచ్చి నన్ను వెళ్ళిపొమన్నాడు. అంతే నాకు తెలుసు" రిక్షావాని స్టేట్‌మెంట్ సారాంశం ఇది.

"నువ్వు అతన్ని గుర్తించగలవా?"

"ఏమో బాబూ? సూత్తేగాని సెప్పలేను." రిక్షావాడి సమాధానం.

రిక్షావాని కథనాన్ని నోట్ చేసుకున్నాడు ఇన్‌స్పెక్టర్. ఆరోజంతా చంపను గురించిన సమాచారం దొరకలేదు. తెల్లవారి కొందరు పోలీసుస్టేషన్‌కు వచ్చారు.

బి టి రోడ్డు ప్రక్కన ప్రవహించే మురుగుకాలవలో ఒక యువతి శవం పడి ఉన్నదని వారు పోలీసు అధికారి సాహుకు చెప్పారు.

పోలీసు అధికారి తన సిబ్బందితో హుటాహుటిన ఘటనాస్థలం చేరాడు. కుమారి చంప శవాన్ని చూశారు. ఆమె తల్లి దండ్రులకు కబురు పంపించారు. శవాన్ని ఆసుపత్రికి పరీక్ష నిమిత్తం పంపించారు. రవీంద్ర హత్యకూ, చంప హత్యకూ ఏదో సంబంధం ఉండాలని సాహు నిర్ధారించుకున్నాడు.

సాహు స్టేషన్‌కు వచ్చి ఈ రెండు గురించి ఆలోచిస్తూ కూర్చుని ఉన్నాడు. అదే సమయంలో ఓ యువకుడు వచ్చి అతని ముందు నిల్చున్నాడు. సాహు అతని కేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"సర్! రవీంద్రనూ, చంపనూ చంపింది నేనే!" తాపీగా చెప్పాడు ఆ యువకుడు.

సాహు కుర్చీలో ఇంతెత్తున ఎగిరిపడ్డాడు. ఓ క్షణం ఆ యువకుడ్ని నిశితంగా చూశాడు.

"అవును సర్! ఆ అపరాధిని నేనే! నేను పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాను."

సాహు ఆ యువకుడ్ని కూర్చోమన్నాడు. అతను ఎదురు కుర్చీలో కూర్చున్నాడు.

సాహు ప్రశ్నించకుండానే ఆ యువకుడు చెప్పసాగాడు - "సర్! నాపేరు వివేకానంద్. నా తల్లి చిన్నతనంలోనే చనిపోయింది. నా తండ్రి బి. సి. దత్తు మళ్ళీ వివాహం చేసుకున్నాడు. సవతి తల్లి నన్ను నానా బాధలు పెట్టింది. ఎలాగో మెట్రిక్ పూర్తిచేశాను. ఆ నరకంలో ఉండలేక ఇల్లు విడిచి వచ్చేశాను. దిన పత్రికలూ, వార్తా పత్రికలూ ఇంటింటికీ పంచేపని సంపాదించాను. చంప ఇంటికి పత్రికలు ఇవ్వడానికి వెళ్ళేవాడిని. చంపకు నా పరిస్థితులు ఒకనాడు చెప్పాను. ఆమె కళ్ళల్లో నీరు తిరిగింది. నన్ను మళ్ళీ చదవమని ప్రోత్సహించింది.

ప్రతి నెలా కొంత ధన సహాయం కూడా చేసేది. ఆమె సహాయ, ప్రోత్సాహాలతో నేను బి. ఏ. పూర్తి చేశాను. ఆ తర్వాత కలకత్తా ట్రాం సర్వీసెస్‌లో ఉద్యోగం దొరికింది." చెప్పి ఆగి వూపిరి పీల్చుకున్నాడు వివేక్.

"చంప నన్ను తన సోదరుడిలా భావించింది. రవీంద్రతో ఆమె వివాహం జరుగబోతుందని తెలిసింది. నా మనసులో అసూయ తలెత్తింది. ఎలాగయిన అతన్ని నా మార్గంనుంచి తొలగించుకోవాలనే నిశ్చయానికి వచ్చాను.

ఒకరోజు వాళ్ళిద్దరూ సినిమాకి వెళ్తున్నట్టు ఆరోజు ఉదయం చంప చెప్పింది. చంప రవీంద్ర పేరు ఉచ్చరిస్తుంటే ఆమె కళ్ళు మిలమిల మెరిసేవి. ఆ మిలమిలకు నా కళ్ళల్లో సర్పాలు బుసకొట్టేవి. నాలో తనయెడల అటువంటి భావం ఏర్పడుతుందని చంప కలలోకూడా వూహించి వుండదు.

చంపను ఇంటి దగ్గర వదిలేసి, రిక్షాలో వస్తున్న రవీంద్రను ఆపాను. "నువ్వు వివాహం చేసుకోబోయే ఆ చంప గురించి నీకు చెప్పాలి. ఆమె నీకంటే ముందే తను



పనిచేసే ఆఫీసుకు సంబంధించిన ఒక జూనియర్ ఆఫీసర్‌తో గ్రంథం నడిపింది." అన్నాను రవీంద్రకు నామీద కోపం వచ్చింది. నేను శాంతపరుస్తూ. ఆ విషయానికి సంబంధించిన రుజువులు చూపిస్తాననీ, నా ఇంటికి రమ్మనీ అన్నాను. రవీంద్ర నాతో బయలుదేరాడు. అప్పటికే బాగా చీకటి పడింది"

ఆగి "మంచినీళ్ళు కావాలి" సాహుతో అన్నాడు వివేకానంద్.

మంచినీళ్ళు తాగి మళ్ళీ ప్రారంభించాడు.

"మా ఇంటికి చేరాం. లోపల అడుగుపెట్టగానే తలుపులు మూశాను. అతన్ని మాటల్లో పెట్టి అదను చూసి కత్తితో మెడమీద పొడిచాను. పొట్టలో పొడిచాను. కసిగా ఎన్నో పోట్లు పొడిచాను. తెల్లవారుజామున మూడు గంటలకు శవాన్ని రోడ్డు పక్కనే వున్న మురుగు కాల్వలో పడేశాను.

రెండో రోజు ఉదయం పదకొండు గంటలకు చంపను కలుసుకున్నాను. "రవీంద్ర నా ఇంట్లో దాక్కుని ఉన్నాడు. నిన్ను తీసుకు రమ్మన్నాడు" అన్నాను.

"రవీంద్ర దాక్కున్నాడా?"

"అవును! అతని ఆచూకీ వెంటనే పోలీసులకు తెలియకూడదు. తను చెయ్యని ఒక అపరాధంలో ఇరుక్కున్నాడు. నీతో రహస్యంగా మాట్లాడాలట. నిన్ను తీసుకురమ్మని చెప్పాడు. ఇప్పడే మీ తల్లిదండ్రులకుగానీ, అతని తల్లిదండ్రులకుగానీ తన ఆచూకీ చెప్పవద్దన్నాడు. అంటూ ఆమెను నమ్మించి మా ఇంటికి తీసుకెళ్ళాను" ఆగాడు.

"ఊ ఆ తర్వాత?" సాహు ఆత్రంగా ప్రశ్నించాడు.

"చంపను కూడా మా ఇంట్లోనే చంపాను. పగలంతా శవం నా ఇంట్లోనే పడి వున్నది. అర్థరాత్రి మళ్ళీ ఆ శవాన్నికూడా మురుగు కాల్వలో పారేశాను." అంటూ రెండు చేతులూ ముఖానికి అడ్డుపెట్టుకొని వెక్కి వెక్కి ఏడవసాగాడు.

సాహూ చూస్తూ కూర్చున్నాడు.

వివేకానంద్ కొంతసేపటికి తేరుకొని మళ్ళీ ప్రారంభించాడు. "రాతంత్రా పిచ్చివాడిలా ఊళ్ళో తిరిగాను. నా వాళ్ళందర్నీ దూరం చేసుకొన్న నన్ను చంప ఆదరించిరది. నా భవిష్యత్తును తీర్చి దిద్దింది. మంచి మనసుగల చంపను చంపాను.

అంటూ ఏడుస్తూ పిచ్చిగా అరవసాగాడు వివేకానంద్.

వివేకానంద్ జైల్లో ఉన్నాడు.

❀ ❀ ❀

# 30. మరో బలిపశువ్వు

పేరు ప్రేమ. తల్లి దండ్రులు ఎంతో ప్రేమగా పెంచారు. చక్కని చుక్క కట్నంకూడా తక్కువేమీ ఇవ్వలేదు. 50 వేల వరకూ ముట్టింది. అయినా ప్రేమ కాలిపోయింది. కట్న పిశాచికి బలి అయింది. ప్రేమ తనకు తనే కాలి చచ్చిపోయిందా? లేక అత్త రుక్మిణి అతి దారుణంగా, క్రూరంగా కాల్చి చంపిందా? రుక్మిణి ఏమంటుందో వినండి-

"ప్రేమ మరణ వాజ్మూలం తప్పు. తల్లి దండ్రుల ప్రేరణతో తనను కాల్చి చంపినట్లుగా చెప్పింది. అది ఆత్మహత్య చేసుకుంది. పెళ్లయి ఐదేళ్లయినా పిల్లలు కలగలేదు. డాక్టర్లు భర్తలో లోపంలేదని చెప్పారు. నేను నా కొడుక్కు మళ్ళీ పెళ్లి చేస్తానన్నాను. అందుకు అది నన్ను బెదిరించింది. రెండో పెళ్లి తలపెట్టిన రోజే తన శవం ఇంట్లో నుంచి బయటకు వస్తుందని బెదిరించింది. మాటకు ముందు ఆత్మహత్య చేసుకుంటానని ఆహత్యానేరం నీ మీదే వేసి మరీ చస్తాననీ అనేది. దాంతో నాకు భయంవేసేది. మొన్న మాటల్లో పిల్లల కోసం శివుడి పెళ్లి చేస్తానన్నాను. నా మాట పూర్తి అయిందోలేదో కిరసనాయిల్ డబ్బా ఎత్తి మీద గుమ్మరించుకొని నిప్పు అంటించుకున్నది. కోడలు ఏకారణంవల్ల చచ్చినా కట్నంకోసం అత్త చంపిందనీ, మొగుడు చంపాడని, మామ చంపాడనీ అనడం వరిపాటి అయిపోయింది. ఈ ప్రచారం వల్లనే కోడళ్లు అత్తల్ని బెదిరించడం ఎక్కువైంది. కసితీర్చుకోవడానికి ఆత్మహత్యలు చేసుకోవడం వరిపాటయింది. అంతే! నేను చంపలేదు. నేను నిర్దోషిని."

ఇదీ అత్తగారి స్టేట్‌మెంటు.

కాలి చావు బతుకుల్లో వున్న కూతుర్ని తల్లీ దండ్రీ, ఆసుపత్రిలో చూశారు.తల్లి గుండెలు అవిసిపోయేలా ఏడ్చింది. తండ్రి పక్కనే వున్న ప్రేమ అత్త రుక్మిణిని చూడగానే పిచ్చికోపంతో వళ్ళు మర్చిపోయాడు. అతడి కోపంచూసి రుక్మిణి అక్కడ్నుంచి పారిపోయింది. ప్రేమ తండ్రి పేరు నిర్మల్‌చంద్ గట్టాని. అతను పోలీసులకు రిపోర్టు ఈ కింది విధంగా ఇచ్చాడు-

"నేను ఇటుకల వ్యాపారం చేస్తాను. ప్రేమ నా పెద్దకూతురు. హైస్కూలు చదువు పూర్తి అయింది. శివచంద్రరాఠీకి ఇచ్చి పెళ్లి చేశాను. పెళ్లిలో ధనరూపంగా, వస్తురూపంగా మొత్తం 50 వేలు ముట్టు జెప్పాను. పెళ్ళయిన ఐదునెలలకే అతడి తల్లి రుక్మిణీదేవి నా కూతుర్ని మరో 30 వేలు తీసుకురమ్మని సతాయించడం ప్రారంభించింది. ఫ్రిజ్, స్కూటర్, ఫర్నీచర్ మొదలైన వస్తువులు కొనాలట. నా వ్యాపారం అతి సాధారణమైంది. ప్రేమ పెళ్లి దెబ్బ నుంచి ఇంకా బయట వడలేదు.



కొడుక్కు రెండో పెళ్లి చేస్తానని బెదిరించసాగింది. డబ్బు కోసం ఆరాక్షసి నాబిడ్డ ప్రాణాలు నిలువునా తీసింది. రుక్మిణీ దేవినీ ఆమెకు సహకరించిన వాళ్లనూ శిక్షించవలసిందిగా వేడుకొంటున్నాను." రిపోర్టు రాసి ఇచ్చి భోరున ఏడ్చాడు తండ్రి.

ప్రేమ భర్త శివచంద్ర పోలీస్ ఎంక్వయిరీలో ఇచ్చిన స్టేట్‌మెంటు చూడండి.

"అత్తాకోడళ్ల మధ్య వడేది కాదు. నాకు ఇంటికి రావాలంటేనే భయంగా వుండేది. అందువల్ల ఉదయం ఎనిమిది గంటలకే దుకాణానికి వెళ్ళిపోయేవాడ్ని. మధ్యాహ్నం భోజనానికి వచ్చేవాడ్ని. మళ్లీ రాత్రి చాలా పొద్దుపోయిగాని ఇంటికి వచ్చేవాడ్ని కాదు. నా భార్యకు పిల్లలు పుట్టరని డాక్టర్ చెప్పలేదు. రెండు సార్లు గర్భస్రావం జరిగింది. ఈసారి గర్భస్రావం అయినప్పుడు ఆమె ఎలాంటి మానసిక ఒత్తిడులకూ గురికాకుండా చూసుకోమని చెప్పాడు. మా అమ్మ నాకు మళ్ళీ పెళ్ళి చేస్తాననేది. అది జరిగేవనికాదు కనక నేను పెద్దగా పట్టించుకోలేదు. ప్రేమ ఆత్మహత్య చేసుకుందో లేక మా అమ్మ కాల్చి చంపిందో నాకు తెలియదు. డబ్బుకోసం నాకు రెండో పెళ్లి చేస్తానని బెదిరించిందని నా అభిప్రాయం."

ప్రేమ రెండు రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందింది. డాక్టర్సు ఆమెను బతికించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మూడోరోజు ఆమె చనిపోయింది.

ప్రేమ మేజిస్ట్రేటు ముందు మరణ వాజ్మూలం ఇచ్చింది.

"నేను తల్లిని కాలేకపోయాననే బాధ నాకూ వుండేది. రెండుసార్లు గర్భస్రావం అయింది. అయినా మా అత్త నన్ను గొడ్రాలు అంటూ ఎత్తి పొడిచేది. మానాన్నను అడిగి 30 వేలు తీసుకురమ్మని బాధించేది. నాకు ఒక ఆడ బిడ్డ వుంది. ఆమె భర్త ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఉద్యోగం ఇంకా దొరకలేదు. ఆ ముప్పయ్ వేలూ కూతురికి ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే నన్ను డబ్బుకు సతాయిస్తుందని నేను భావించాను. కొడుక్కు మళ్ళీ పెళ్లి చేస్తానని బెదిరించసాగింది. నేను నాభర్త కూర్చుని మాట్లాడుకుంటూంటే భరించలేకపోయేది. నాభర్తను ఆడంగివెధవ అని తిట్టేది. నా భర్త మెత్తటి మనిషి. తల్లిని ఏమీ అనలేకపోయేవాడు. ఆరోజు అంటే మొన్న ముప్పయ్‌వేలు ఒకవారంలో తెస్తావా సరే లేదా నా కొడుక్కి రెండో పెళ్లి చేస్తానని అన్నది.

"అందుకు నేను - నేను చచ్చినాక ఆవని చెయ్యగలవు. అంతేగాని నా బొందిలో ప్రాణం వుండగా ఆ వని చెయ్యలేవు" అన్నాను. అందుకు మాఅత్త మాట్లాడకుండా లోవలకు వెళ్ళింది. నేను భయవడి లోవలకు వెళ్ళిందని భావించాను. ఒక్కసారిగా వెనకనుంచి నామీద కిరసనాయిల్ గుమ్మరించింది. నేను తుళ్లివడ్డాను. నిప్పువుల్ల గీస్తుంటే ప్రాధేయవడ్డాను. గీచిన నిప్పువుల్లను 'నువ్వు బతికివుండగా కొడుక్కు రెండో పెళ్లి జరగనివ్వవా? అయితే చావు' అంటూ నా మీదకు విసిరింది. నేను అరుస్తూ దొడ్లోకి వరిగెత్తాను. ఆవిడ వెంటనే తలుపులు వేసుకొని లోవల వుండిపోయింది. నేను అరుస్తూ వరుగులు తీశాను. స్పృహ తప్పిపోయాను. ఆ తర్వాత ఆసువత్రిలోనే స్పృహ వచ్చింది." అని ప్రేమ చనిపోయే ముందు చెప్పింది.

1984 ఫిబ్రవరి 6వతేదీ ఇది జరిగింది. మహారాష్ట్రలోని ఉమర్‌వాడాలో ఈ సంఘటన జరిగింది.

సి.యల్. జోషి ఆరోజు ఉదయం ఎండకోసం ఇంటి ముందు గడప మీద కూర్చుని పత్రిక చదువుకుంటున్నాడు. అతను యన్.సి.సి. ఆఫీసరు. అకస్మాత్తుగా పక్క ఇంట్లోనుంచి అరుపులు విన్పించాయి. ఒక్కసారిగా లేచి వెళ్ళి ఆ ఇంటి తలుపులు బాదసాగాడు. దొడ్లో నుంచి పొగరావడం, స్త్రీ ఆర్తనాదం, ఏం జరిగిందో అతనికి కొంతవరకు అర్థం అయింది. అతని భార్య కూడా వచ్చి అరుస్తూ తలుపులు బాదసాగింది. ఆగొడవకు మరికొందరు చేరారు. ఒక్కసారిగా తలుపులు తెరుచుకున్నాయి. రుక్మిణీ దేవి "అయ్యో! నా తల్లీ ఎంత పనిచేశావే" అంటూ గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ బయటకు వచ్చి పడింది. స్పృహ తప్పి పడిపోయింది. చాలా మందికి అదంతా నాటకం అని తోచింది.

అందరూ దొడ్లోకి పరుగు తీశారు. జోషి భార్యకూ ప్రేమకూ స్నేహం వుంది. ప్రేమను ఆసుపత్రిలో చేర్పించి, జోషి ఆమె తల్లి దండ్రులకు కబురు పంపించారు.

పోలీసులు జోషీనుంచి, అతని భార్యనుంచీ కూడా రిపోర్టు తీసుకొన్నారు. రుక్మిణీ దేవిని అరెస్టు చెయ్యడానికి వెళ్తే ఇంటి దగ్గర లేదు. పారిపోయిందని తెలిసింది. కొడుకు శివచంద్ర ఆమె ఎక్కడి కెళ్ళిందో తనకు తెలియదన్నాడు. రుక్మిణీ దేవి కోసం పోలీసులు వెదికారు. ఆమె దొరకలేదు.

మెజిస్ట్రేట్ ఒక ఎనౌన్స్‌మెంటు ఇచ్చాడు.

1984 మార్చి 15వ తేదీలోపల రుక్మిణీ దేవి, తనకు తానుగా వచ్చిలొంగిపోకపోయినట్టయితే ఆమెకు భర్త ద్వారా లభించిన ఆస్తి యావత్తూ వేలం వెయ్యబడుతుంది అని అన్ని పేపర్లలో వేయించారు.

మొత్తం మీద ఆమెకు ఆ విషయం తెలిసింది. కోర్టులో లొంగిపోయింది.

కోర్టులో తనే కోడల్ని చంపినట్టు అంగీకరించింది.

"నా కొడుక్కు నిజంగా రెండోపెళ్ళి చెయ్యాలనే ఉద్దేశ్యం నాకు లేదు. కేవలం డబ్బుకోసం అలా బెదిరించేదాన్ని. ఆ డబ్బు నా కూతురికి ఇవ్వాలని నాకోరిక. అందుకు కూతురి కోసం కోడల్ని బలితీసుకున్నాను." అని తల వంచుకుంది రుక్మిణీ దేవి.

భారతీయ శిక్షాస్మృతి లోని 302 సెక్షన్ కింద ఆమెకు కోర్టు యావజ్జీవ ఖైదు శిక్షను విధించింది.

రుక్మిణీ దేవి, నాగపూర్ సెంట్రల్ జైల్లో శిక్షను అనుభవిస్తోంది.

❀ ❀ ❀



# 31. ఒక ప్రాణం ఖరీదు ఏభై రూపాయలా?!

నాగపూర్‌లో మాతృసేనా సంఘం అనే పేరుగల స్త్రీల ఆసుపత్రి చాలా పురాతనం అయింది. ఆ ఆసుపత్రిలో నర్సింగ్ ట్రైనింగ్ కూడా వున్నది.

తెలతెలవారుతుండగా ఆ ఆసుపత్రి సూపర్నెంటు పోలీసుస్టేషన్‌కు వచ్చి - ఆసుపత్రి మొదటి అంతస్తు ఐదో నంబరు గది కిటికీలో నుంచి ఇద్దరు శిశువులు కింద పారేయబడ్డారు అని రిపోర్టు రాయించాడు.

వెంటనే డ్యూటీ ఇన్‌స్పెక్టరు కాన్‌స్టేబుల్‌తో ఘటనా స్థలానికి వెళ్ళాడు.

ఒక శిశువు చనిపోయింది. మరో శిశువుకు పెద్దగా దెబ్బలు తగలలేదు. బ్రతికే వుంది. ఆ బిడ్డకు చికిత్స కోసం వేరే ఆసుపత్రికి పంపించారు.

బ్రతికి వున్న శిశువు తండ్రిపేరు రాజేశ్‌గవాయి. తల్లి పేరు శీలా గవాయి. చనిపోయిన బిడ్డ తండ్రి పేరు అశోక్‌శ్యామరావ్ ధకాతే. తల్లి పేరు ప్రమీలా ధకాతే. ఇద్దరూ ఒకేమారు ప్రసవించారు. ఈ సంఘటన జరిగే రోజుకు ఆ బిడ్డల వయసు ఆరు రోజులు. పసివాళ్ళను ఎవరు, ఎందుకు ఇంత దారుణంగా కిటికీలో నుంచి పారేశారు? ఆ పసిబిడ్డలు ఊయ్యాలలో నుంచి స్వయంగా బయటకు వెళ్ళలేరు. మరెవరు చేశారీ పని? బిడ్డలతల్లులా? ఇద్దరు తల్లులూ కూడబలుక్కుని చేశారా? అబ్‌సర్డ్! ఒక తల్లి చేసిందా? చేస్తే తన బిడ్డను ఎందుకు పారేస్తుంది? తండ్రులలో ఎవరైనా? అలా జరగడానికి వీల్లేదు. రాత్రి పూట ఆసుపత్రిలోకి మగవాళ్ళు ఎంటర్ అయ్యే అవకాశం లేదు. ఇవన్నీ ఇన్‌స్పెక్టర్‌కు ఎదురైన ప్రశ్నలు. పరిశీలనలో ఆ శిశువుల దగ్గరగా స్త్రీ చేతి గాజుల ముక్కలు పడి వున్నాయి. కాబట్టి ఈ పని చేసింది ఒక ఆడదే.

ఆసుపత్రి అధారిటీస్, మాయ అనే నర్స్‌ను వారి వారి కుటుంబాల వారికి ఈ దారుణ సంఘటన గురించిన సమాచారం ఇవ్వడానికి వ్యాన్‌లో పంపించారు.

అశోక్‌ధకాతే కుటుంబ సభ్యులు సమాచారం అందగానే లబలబలాడుతూ ఆసుపత్రికి బయలుదేరారు. రాజేశ్ ఇంటికి వెళ్ళింది మాయ. అక్కడ ఇంటికి తాళం వేసి వుంది. రాజేశ్‌కు వేరే ఇల్లు వుందనీ, అతడు అక్కడే వుంటాడనీ ఇరుగు పొరుగు ద్వారా తెలిసింది. ఆ రెండో ఇల్లు లష్కర్‌బాగ్‌లో వుందనీ తెలుసుకొని మాయ అక్కడికి వెళ్ళింది. రాజేశ్ గవాయి ఇంట్లోనే వున్నాడు. విషయం విని ఏ మాత్రం చలించలేదు. సరికదా, ఆ వార్త తెచ్చినందుకు ఆ నర్స్ మీద విసుక్కున్నాడు. ఆవిడ ఆశ్చర్యపోయింది. ఆ విషయమే తిరిగొచ్చి పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు చెప్పింది.

ప్రమీల వున్న 5వ నెంబరు గదిలోనే శీలా గవాయి కూడ అడ్మిట్ అయింది. ఇద్దరికీ మొదటి కాన్పే. ఇద్దరూ ఒక రోజే ప్రసవించారు. ప్రమీలా ధకాతే కోసం రోజూ భర్తా కుటుంబ సభ్యులూ వచ్చేవారు. ఆమె అత్తగారు రాత్రుళ్ళు కోడలికి తోడు ఆసుపత్రిలో ఆ గదిలోనే పడుకొనేది. కాని శీలాగవాయిని చూడటానికి ఎవరూ వచ్చేవారుకాదు.

ఆ సంఘటన జరిగిన రాత్రి, నైట్ డ్యూటీ చేసిన నర్స్ పేరు కూడా శీలాయే. శీలా బరూక్‌కర్. ఆమె అవివాహిత. నర్సింగ్ ట్రైనింగ్ అవుతోంది. నర్సెస్ హాస్టల్లో వుంటున్నది.

తెల్లవారు ఝామున మూడుగంటల వరకు శీలబరూక్‌కర్ డ్యూటీ చేసింది. దాదాపు మూడు దాటీ దాటక ముందే ప్రమీలకు మెళకువ వచ్చింది. బిడ్డకు పాలు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఆమె ఉయ్యాల దగ్గరకు వెళ్ళింది. ఉయ్యాలలో బిడ్డ లేదు. పక్క ఉయ్యాలకేసి చూసింది. అందులో వుండాల్సిన బిడ్డ కూడా లేదు. ప్రమీల అత్తగార్ని లేపి విషయం చెప్పింది. ఆమె గుండెలు బాదుకుంటూ అరవసాగింది. క్షణాల్లో విషయం ఆసుపత్రి అంతా గుప్పుమన్నది.

శీల భర్త రాజేష్ గవాయి ప్రవర్తన అనుమానస్పదంగా ఉన్నందువల్ల పోలీసులు అతడ్ని కస్టడీలోకి తీసుకున్నారు. అతను డ్రగ్ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్నాడు. వారంరోజులు తిరిగి చూడని రాజేశ్ గవాయి ఆ ముందు సాయంకాలమే భార్యను చూడటానికి వచ్చాడని తెలిసింది.

శీల గవాయి పోలీసులకు ఇచ్చిన రిపోర్టు ప్రకారం అతడు క్రితంరోజు సాయంత్రం వచ్చాడు. శీలా తెల్లవారి డిశ్చార్జి అవుతున్నానని చెప్పింది. అతడు విసుక్కున్నాడు. అదే సమయంలో బిడ్డ ఏడ్చింది. అది విని ఆప్లిలను చాలా చెడ్డగా తిట్టాడు. శీలా మనసు బాధపడింది. అయినా ఏమీ అనలేకపోయింది. అతడు వెళుతూ వరండాలో నిల్చుని ఆ రాత్రి డ్యూటీలో వున్న నర్స్ శీలాతో చాలాసేపు మాట్లాడాడు. తర్వాత నర్స్ ఆ గదిలోకి వచ్చింది. పిల్లను పరిశీలనగా చూసినట్టుగా తల్లి శీలాకు తోచింది. పదిగంటల కొకసారి, పదకొండు గంటల కొకసారీ నర్స్ గదిలోకి వచ్చి శీలాగవాయితో 'ఇంకా నిద్రపోలేదా?' అని ప్రశ్నించింది.

పోలీసు నర్స్‌ను ప్రశ్నించారు. ఆమె ఏడవసాగింది. అప్పటికి ఆవిడను వదిలి వేరే ఇన్‌వెస్టిగేషన్ ప్రారంభించారు.

రాజేశ్ గవాయి గురించి కొన్ని సందేహాస్పదమైన విషయాలు తెలిశాయి. అతడికి శీలా రెండో భార్య. మొదటి భార్యకు ముగ్గురు పిల్లలున్నారు. అతడు కొంతకాలం మహారాష్ట్రంలోని ఛండారాలో పనిచేశాడు. అప్పుడే శీలా అన్నగారు వినోద్‌తో పరిచయం అయింది. అతడికి జబ్బుచేసింది. ఆసుపత్రిలో చాలాకాలం వున్నాడు. ఆ సమయంలో రాజేశ్ శీలా కుటుంబానికి చాలా సహాయం చేశాడు. ఆ కుటుంబానికి దగ్గరయ్యాడు. ముఖ్యంగా శీలా మనసుకు మరీ దగ్గరైనాడు. అతడి భార్యా బిడ్డలు నాగపూర్‌లోనే వుండేవారు. శీలాతల్లితో శీలాను నాగపూర్ తీసుకెళ్తానని చెప్పాడు. ఎవరూ అడ్డు చెప్పలేదు. ఆమెను తీసుకొని నెలరోజులపాటు



శెలవు పెట్టి అనేక ప్రదేశాలు తిరిగాడు. ఒక చోట గుడిలో ఆమెను వివాహం చేసుకున్నాడు. అప్పుడు నాగపూర్ తీసుకొచ్చి తన ఇంట్లోనే పెట్టాడు. అతను కూడా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. భార్యలిద్దరికీ బొత్తిగా పడకపోవడంతో రాజేశ్ వేరే ఇల్లు అద్దెకు తీసుకొని శీలాను వుంచాడు.

సంవత్సరం దాటిపోయింది. రెండో సంవత్సరం సగం గడిచింది. శీలా గర్భవతి అని తెలిసింది. అతడికి ఆమె అంటే చిరాకు ఏర్పడింది. విసుక్కుంటూనే ప్రసవం కోసం ఆసుపత్రిలో చేర్పించాడు. అతడికి ఎలాగైనా ఆ శిశువు బాధ్యత వదిలించుకోవాలనిపించింది. మెల్లగా శీలాను కూడా వదిలించుకోవాలనే ఆలోచనలో వున్నాడు.

శీలా బరూర్‌కర్ (నర్స్)ను పోలీసులు అనుమానం మీద కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించసాగారు.

ఇక్కడ తమాషా ఏమిటంటే బిడ్డ తల్లి పేరు శీలా, నర్స్ పేరు కూడా శీలా కావడం.

నర్స్ చెప్పింది. ఆమె బీదకుటుంబంలో జన్మించింది. తండ్రి లేడు. అన్న వుద్యోగం చేస్తున్నాడు. కాని ఆమెను కాని ఆమె తల్లిని గానీ పట్టించుకోడు. వేరుగా వుంటున్నాడు. శీలా నర్స్ ట్రైనింగ్‌లో చేరి నాలుగు నెలలు అయింది.

ఆ సాయంత్రం రాజేశ్ ఆమెతో మాట్లాడాడు. ఆ పిల్లను వదిలించుకో దల్చుకున్నానని చెప్పాడు. తన ప్లాన్ చెప్పాడు. ముందు శీలా భయపడింది. రెండు పందలు ఆశచూపించాడు. ఆమె అందుకు అంగీకరించింది. ఆ సాయంత్రం ఏభై రూపాయలు మాత్రమే ఇచ్చాడు.

అవసరం - డబ్బు అవసరం - మనిషి చేత ఎంతటి నికృష్టమైన పనైనా చేయిస్తుంది.

రాజేశ్ విసిరిన ఉచ్చులో ఆ అమాయకురాలు చిక్కుకుంది. బీదతనం తప్ప తెలియని ఆమెకు రెండు పందలు అనగానే ఆశకలిగింది. ఆమె రాక్షసిగా మారింది.

బహుశా ఆ గాభరాలో ముందు ప్రమీల ధకాతే బిడ్డను కింద పడేసి వుండ వచ్చును. (ఎవరుపడేసినా) తప్పు గ్రహించి రెండో బిడ్డను కూడా పడేసి వుండాలి.

విధి వైచిత్రం అనాలో మరి ఏమనాలో కాని ఏ బిడ్డను చంపడానికి ఇంత ఘోరం జరిగిందో ఆ బిడ్డ చావలేదు. ప్రాణంతో వున్నది. దెబ్బలు కూడా పెద్దగా తగలలేదు. పాపం ప్రమీల బిడ్డ చచ్చిపోయింది. ఆ తల్లి బాధ చెప్పలేనిది.

శీలాను పోలీసులు కస్టడీలోకి తీసుకోవడాన్ని ఆ ఆసుపత్రి నర్సులు నిరసించారు. "ఆమె నిర్దోషి. ఆమెను వదలాలి" అంటూ నినాదులు చేశారు. రెండు రోజులు స్ట్రైక్ కూడా చేశారు.

శీలాను జామీన్ మీద విడిచిపెట్టారు.

ఆమె డైరీ పోలీసులకు దొరికింది.

12-9-83 తారీఖు కింద ఆ డైరీలో ఇలా వ్రాసింది.

"ఒక రోగిదగ్గర డబ్బు తీసుకోవడం జరిగింది. ఆ సంగతి తోటి నర్సులకు తెలిసింది. వాళ్ళను క్షమించమని కోరి ఆ డబ్బు తిరిగిచ్చేస్తానని వారికి మాట ఇవ్వడం జరిగింది."

కేసు ఇంకా కోర్టులో నడుస్తూ వున్నది.

కేసు పూర్తి అయితే గాని అసలు అపరాధి ఎవరో పూర్తిగా తేలదు.

ఒక స్త్రీ ఇంత దారుణానికి ఒడికట్టగలదా? అదీ ఎభై రూపాయల కోసం? ఏమో? ఆలోచించండి.

❀ ❀ ❀



# 32. ఇలాంటి ఆడవాళ్ళూ వున్నారా?

కమల నవ వధువుగా అత్తవారింట్లో అడుగుపెట్టింది. అయితే నవ వధువులో వుండాల్సిన ఆనందం ఆమెలో లేదు. నిర్లిప్తంగా వుంది. ఆమెకు ఆ భర్త అంటే ఇష్టం ఏర్పడలేదు. కారణం అతను అందగాడు కాకపోవడం. అక్కడక్కడ అతని ఒంటి మీద బొల్లి మచ్చలు వుండటం.

"కమలా నీ చేతులు ఇలా చాచు" అని ఆమె చేతులకు బంగారు గాజులు తొడిగాడు. కమల ముఖం వికసించింది.

"ఇది మా వంశంలో ఎప్పటి నుంచి తరాలు మారుతూ వస్తున్నయో నాకు తెలియదు. మా నాయనమ్మ మా అమ్మకు ఇచ్చింది. మా అమ్మ చనిపోతూ తన కోడలికి ఇవ్వమన్నది." అన్నాడు కమల భర్త రాజారాం.

"వీటిని అమూల్యంగా భావిస్తాను. తరాలుగా మీ వంశంలో-"

"కాదు మన వంశం" అను అన్నాడు మధ్యలోనే అందుకుని రాజారాం.

కొంతకాలం భార్యాభర్తలు అనుకూలంగానే వున్నారు. క్రమంగా కమల మనసులో అసంతృప్తి పెరిగిపోసాగింది. ఆమెది చిన్నతనం నుంచి చంచల స్వభావమే. ఒక క్షణం ఇష్టపడిన వస్తువును మరుక్షణం అసహ్యించుకొనేది. ప్రతి చిన్న విషయంలోనూ ఆమె మనసు మార్చుకుంటూనే వుండేది. తల్లి కూతుర్ని మందలించేది. "ఇలా అయితే జీవితంలో సుఖపడవు" అని హితబోధ చేసేది.

రాజారాం ఒక బట్టల దుకాణంలో పని చేసేవాడు. అతని నిజాయితీకి ముగ్ధుడై యజమాని అతనికి చిన్న వాటా కూడా ఇచ్చాడు. వ్యాపారం బాగా వృద్ధి చెందింది. పనిభారం ఎక్కువైందని యజమాని గ్రహించాడు. రాజారాంకు ఒక అసిస్టెంటును ఇచ్చాడు. అతడి పేరు రామావతారం. నవయువకుడు. బలిష్టమైన శరీరం. రాజారాంకు దుకాణంలో కాక ఇంటి పనుల్లో కూడా సహకరించేవాడు.

కమలకు ఇద్దరు పిల్లలు కలిగారు. ఆడపిల్ల పేరు కుసుమ. కొడుకు పేరు అశోక్.

కమలకు కుష్వంతి అనే స్త్రీతో స్నేహం కలిసింది. ఆమెకు ఆ వూళ్ళో మంచి పేరు లేదు. కుష్వంతి కమలకు ఎప్పుడూ సెక్సుకు సంబంధించిన విషయాలే చెప్పేది. ఆమెకు భర్తంటే మరీ నిర్లక్ష్యం ఏర్పడింది. కుష్వంతి ఇంటికి రావడం, గంటలకొద్దీ భార్యతో కబుర్లు చెప్పడం రాజారాంకు ఇష్టం లేదు. ఆ మాటే భార్యతో అన్నాడు.

అయినా ఆమె లక్ష్యపెట్టలేదు.

రామావతారం కమలను 'వదిన' అని పిల్చేవాడు. రాజారాంకు భోజనం పట్టికెళ్ళడానికి వచ్చేవాడు. కుష్వంతి ప్రోత్సాహంతో కమలకూ రామావతారానికే సాన్నిహిత్యం ఏర్పడింది. అది చాలా దూరం పోయింది. ఇద్దరూ రహస్యంగా కలుసుకోసాగారు. రాజారాంకు రామావతారం మీద అనుమానం రాలేదు. కొన్ని సంవత్సరాలు గడిచాయి.

రాజారాం కూతురు కుసుమ పన్నెండేళ్ళది అయింది. కుష్వంతి చిన్న పిల్లలకు నేర్పకూడని చెప్పకూడనివి ఎన్నో నేర్పింది. చెప్పింది. కుసుమ ఆ వయసుకే చెడు అలవాట్లకు బానిస అయింది. మంచికీ చెడుకూ అర్థం తెలియని వయసు. కుష్వంతి పిల్లల్ని కూడా చెడగొడ్తున్నదని అర్థం చేసుకొన్న రాజారాం ఆమెను తన ఇంటికి రావద్దని మందలించాడు. ఆమె రావడం మానేసింది. కాని కమలా పిల్లలూ ఆమె ఇంటికి వెళ్ళసాగారు.

రామావతారంమీద రాజారాంకు అనుమానం రాలేదు. ఊళ్ళో చాలామందికి తెలిసిన వ్యవహారమే అయినా రాజారాంకు తెలియలేదు.

"నీ చేతగానితనం చూస్తుంటే వళ్ళు మండిపోతున్నది." కమల ఒకరోజు రామావతారంతో అన్నది.

"ఏం చెయ్యమంటావే రాణీ?" గోముగా అడిగాడు రామావతారం.

"చెప్పింది చేస్తావా?"

"చెప్పిచూడు కమ్మీ..."

"వాడ్ని, ఆ ఆడంగిగాడ్ని - మన మార్గంలో నుంచి తొలగించు."

రామావతారం ఆలోచనలో పడ్డాడు.

"అప్పుడే నీకోరికా తీరుతుంది!"

"నా కోరికా? ఏమిటది?" తృళ్ళిపడ్డాడు రామావతారం.

"నాకు తెలియదనుకున్నావా రాజా! పన్నెండు ఏళ్ళు నిండి దానికి పదమూడు నడుస్తోంది. దాని మీద అదే కుసుమమీద నీకు మనసుందని నాకు తెలుసు."

"నేనలా...?"

"భయపడకు. కుసుమను నీకిచ్చి చేస్తాను. నాకూ మంచిదే."

"కమ్మూ! ఇంతఘోరం చెయ్యలేను."

"అయితే వెళ్ళిపో. ఇక నీ ముఖం నాకు చూపించకు." కోపంగా అన్నది.

"సరే ప్రయత్నిస్తాను." అంటూ రామావతారం ఆలోచిస్తూ బయటికి వెళ్ళాడు.

కబీర్ అనే ఒక పాత కేడీని కలుసుకున్నాడు. కబీర్ అంగీకరించాడు. తనకు మరో తోడు వుండాలనీ ఆ సమయంలో రామావతారం కూడా వుండాలని షర్తు పెట్టాడు. అందుకు రామావతారం అంగీకరించాడు. పని పూర్తి చెయ్యడానికి రెండు వేల రూపాయలు ముందు ఇవ్వాలన్నాడు. రామావతారం ఆ మాటే కమలతో చెప్పి "అంత డబ్బు ఎక్కడ్నుంచి తేవాలి?" అన్నాడు. కమల వెంటనే తన చేతులకున్న



బంగారు కంకణాలు తీసి ఇచ్చింది. ఆమె భర్త, ఆమెకు కాపరానికి వచ్చినరోజు ఆ కంకణాలను బహూకరించాడు.

1980వ సంవత్సరం. ఫిబ్రవరి 24వ తేదీ. రాజారాం పొలానికి నీళ్ళు పెడ్తున్నాడు. రామావతారాన్ని ఇంటికి వెళ్ళి అశోక్‌ను తీసుకుని పెళ్ళికి వెళ్ళమన్నాడు. తను రాలేకపోయాని పెళ్ళికొడుకు తండ్రికి చెప్పమన్నాడు. తనతో పనిచేస్తున్న మహేంద్రను అన్నం తీసుకుని రావడానికి ఇంటికి పంపించాడు. రాజారాం తన నౌకరుతోపాటు ఆ రాత్రంతా పొలంలోనే వుండటానికి నిశ్చయించుకున్నాడు. నౌకరు మహేంద్ర వెళ్ళిపోయాడు. రాజారాం ఆ పొలంలోనే వున్న తండ్రి సమాధి దగ్గర కూర్చుని భార్య గురించీ, కూతురు గురించీ ఆలోచించసాగాడు.

తిరిగొచ్చిన రామావతారాన్ని "పెళ్ళికి వెళ్ళలేదూ?" అని అడిగాడు.

"నువ్వు కూడా వస్తే బాగుంటుంది. అందరం కలిసే వెళ్దాం." అన్నాడు.

"నేను రాలేను. నువ్వెళ్ళు రామూ!" అంటూ వుండగానే మెడమీద వెనకనుంచి గొడ్డలి వేటుపడింది.

ఒకే అరుపు అరిచి కిందపడ్డ రాజారాం గుండెల్లో కబీర్ చేతిలో కత్తి దిగబడిపోయింది.

రామావతారం ఇంటికి తిరిగొచ్చి అశోక్‌ను తీసుకొని పెళ్ళికి వెళ్ళాడు. ఇంటికి రాగానే ఎదురు చూస్తున్న కమలతో "పని పూర్తి అయింది." అన్నాడు.

అన్నం తీసుకొని వెళ్ళిన మహేంద్ర యజమానిని రక్తపు మడుగులో చూసి అరుస్తూ ఊళ్ళోకి వచ్చాడు. ధాన్‌ధా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సురేష్ లాంబా కేసు దర్యాప్తు చేశాడు. కమలా రామావతారంల గురించి ఊళ్ళో వాళ్ళు చెప్పారు. ఇద్దర్ని అరెస్టు చేశాడు. కమల కూతురు కూడా "పని పూర్త అయింది" అని రామావతారం ఆరోజున తన తల్లితో చెప్పినట్టు సాక్ష్యం చెప్పింది. కబీరునూ అతడి సహచరుడ్నీ కూడా అరెస్టు చేశారు. బంగారు కంకణాలను కొన్న వాడి దగ్గర్నుంచి వాటిని తీసుకున్నారు పోలీసువారు.

1980 మే 29 వ తేదీన కోర్టులో ఆ ముగ్గురిపైనా రాజారాంను హత్యచేసినట్టు కేసు పెట్టడం జరిగింది.

❀ ❀ ❀

# 33. ఆడపిల్లలూ - తోడేళ్లున్నాయ్ జాగ్రత్త!

ఆడపిల్లల అవహరణ మన దేశంలో సర్వసాధారణం అయిపోయింది. అలా అవహరింవబడిన వాళ్ళు ఎక్కడికి చేర్చబడుతున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వేశ్యా గృహాలకు అమ్మబడుతున్నారు. అక్కడే నానాహింసకు, రోగాలకూ గురి అయి హీనంగా బ్రతికి నికృష్ట జీవితాలను ముగిస్తున్నారు. అప్పుడప్పుడు, అక్కడ కూడా, అలా అవహరించబడిన ఆడపిల్ల, వేశ్యాగృహాల నికృష్ట జీవితం నుంచి విముక్తిని పొందుతూ ఉంటుంది.

అలాంటి ఒక అమాయక బాలిక కథే ఇది. ఆ పిల్ల పేరు గీత. తండ్రి బీహార్‌లో ఒకచిన్న నగరంలో వడ్డీ వ్యాపారం చేసేవాడు. చిన్న పెట్టుబడే అయినా ఇంటి ఖర్చుకూ, సుఖంగా జీవించడానికీ ఎలాంటి తరుగులేదు. బీహార్‌లో నిరుద్యోగం ఎక్కువ అని మనకు తెలుసు. గీత తండ్రి రఘురాజ్, తల్లి గోదావరి. గీత వారి ఏకైక వుత్రిక. తండ్రి, గీత పెళ్లి ఆమెకు 14 ఏళ్లు నిండకుండానే చేశాడు. ఆ కుర్రవాడి పేరు విజయ్ మండల్. చదువుకొన్నవాడు.

గీతను స్కూల్లో చేర్పించారు. కాని ఆమెకు చదువు మీద శ్రద్ధ లేదని తండ్రి గ్రహించాడు. అందుకే చిన్న వయసులోనే పెళ్లి చేశాడు. విజయ్ మండల్ బీదవాడు. గీత తండ్రి అల్లుడ్ని ఇంట్లోనే పెట్టుకొని వ్యాపారం అప్పగించాడు. విజయ్‌కు వ్యాపార మెళుకువలు తెలిశాయని నమ్మకం దొరికాక మామ ఢిల్లీ వెళ్లి మరో వ్యాపారం ప్రారంభించాలనే ప్రయత్నంలో వడ్డాడు. అల్లుడ్నీ కూతుర్నీ వదిలి భార్యతో ఢిల్లీ వెళ్లిపోయాడు రఘురాజ్.

ఢిల్లీలో వ్యాపారం బాగానే వుంది. హౌజ్‌ఖాజ్‌లో దుకాణం తెరిచాడు. ఢిల్లీ వచ్చిన సంవత్సరం నిండకుండానే, చాలా కాలం తర్వాత, గీత వుట్టిన 15 సంవత్సరాల తర్వాత కొడుకు వుట్టాడు. ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. తండ్రికి ఆకొడుకే సర్వస్వం, కూతురి మీద ఒక రకంగా శ్రద్ధ తగ్గిందనే చెప్పాలి.

విజయ్ వ్యాపారం చేస్తున్నాడు. బీదవాళ్లకు అప్పులు ఇవ్వడం తీసుకోవడంలో చాలా మందితో వరిచయాలు ఏర్పాడ్డాయి. ముఖ్యంగా అనేక మంది స్త్రీలు అతడి దగ్గరకు వచ్చేవారు. కొందర్ని తన కోరికలకు ఎరగా వేసేవాడు. గీతను పెద్దగా లక్ష్య పెట్టేవాడు కాదు. గీత అల్లరి చేస్తే కొట్టేవాడు. గీత భర్త ప్రవర్తన గురించి తండ్రికి ఉత్తరాలు వ్రాసింది. తండ్రి నుంచి పెద్దగా రెస్పాన్సు రాలేదు. ఒకటి రెండు గీతనే మందలిస్తూ వ్రాశాడు. పెళ్లయ్యాక ఆడదాని బతుకు భర్తతోనే - స్వర్గం



అయినా - నరకం అయినా అంటూ వ్రాశాడు. విజయ్‌కు తాగుడు అలవాటు అయింది. అతడి బలహీనతను కొందరు ఉవయోగించుకొన్నారు. వ్యాపారం దెబ్బతిన్నది. చిరాకుతో తాగొచ్చి పెళ్లాన్ని కొట్టేవాడు.

ఒకరోజు గీత భర్తకు ఎదురు తిరిగింది. సీత ఎదురు తిరిగింది. సావిత్రి ఎదురు తిరిగింది. సుమతి ఎదురు తిరిగింది. అది చూసిన వురుషుడు సహించలేకపోయాడు. గీతభర్త గీతను జుట్టు పట్టుకొని బయటికి తోసేశాడు. గీత ఏడుస్తూ వుట్టింటికి చేరింది. తల్లి కూతుర్ని గుండెల్లో దాచుకుంది. కాని తండ్రికి కూతురు చేసిన వని గిట్టలేదు. అతడికి కూతురిమీద సానుభూతిలేదు. తిప్పి వంపిం చెయ్యాలని ప్రయత్నించాడు. కాని అల్లుడు ఆ ఊరినుంచే దుకాణం ఎత్తేశాడని తెలిసి, చేసేదేంలేక ఊరుకుండిపోయాడు.

తండ్రి తనను నిర్లక్ష్యంగా చూడటం గీతకు బాధగానే వుంది. కాని ఆ బాధను తల్లి వాత్సల్యంలో మర్చిపోవడానికి ప్రయత్నించసాగింది. గీత వివాహం 1979లో జరిగింది. గీతకు రోజులు భర్త దగ్గిర ఉన్నప్పటి కంటె సుఖంగానే గడిచిపోతున్నాయి. అప్పుడప్పుడు తల్లి వెంట సినీమాలు చూడటానికి కూడా వెళుతుండేది.

గీత వయసు వదహారేళ్లు. యవ్వనం శరీరాన్ని గ్రీష్మతావంలా కాల్చి వేస్తుంటే, మధుకలశంలా వున్న మనసు బరువుగా వుంటోంది. ఏదో తోచనితనం. ఏదో పొందాలనే తవన. అదేమిటో ఆమెకు తెలియడంలేదు.

హౌజ్‌ఖాజ్‌లో బీహారు నుంచి వచ్చిన కొన్ని కుటుంబాలు వున్నాయి. రఘురాజ్ వుంటున్న ఇల్లు కూడా బీహార్ కుటుంబాలతోనే వుంది. అందువల్ల ఇరుగు పొరుగు కలిసి మెలిసి వుండేవారు.

శీలా అనే ఒక యువతి తరచుగా హౌజ్‌ఖాజ్‌కు వస్తూవుండేది. గీత తల్లితో కూడా ఆమెకు బాగా వరిచయం వుంది. పాతికేళ్ళు దాటిన శీల బాగా చక్కగా ముస్తాబైవచ్చేది. వచ్చిన ప్పుడల్లా గీతకు ఎన్నెన్నో కబుర్లు చెప్పేది. గీతకు ఆమె కబుర్లంటే చాలా ఇష్టం. తనలోని తవన ఆమె కబుర్లు వింటుంటే ఉపశమించి నట్లుగానూ, ఆమె వెళ్ళాక రెండింతలు ఇనుమడించినట్టుగానూ అన్పించేది గీతకు. గీత శీల కోసం ఎదురు చూస్తుండేది. ఇద్దరి మధ్యా ఘనిష్టత ఏర్పడింది.

శీలరాగానే గీత ఆమెతో కలిసి ఆ దగ్గిర్లో వున్న పార్కుకు వెళ్ళి కూర్చునేది. గంటలు కొద్దీ కబుర్లు చెప్పుకొనేవారు.

"మా అమ్మ మంచి కుర్రవాడు దొరికితే విజయ్‌కు విడాకులు ఇప్పించి మళ్ళీ పెళ్ళి చేస్తానంటున్నది." అన్నది ఒక రోజు గీత శీలతో.

"నీకేం? బంగారు బొమ్మలా వుంటావ్. ఎవరైనా చేసుకుంటారు. నేనే నీకోసం మంచి కుర్రవాడ్ని వెదకుతాను." అన్నది శీల. శీల మాటలు వినగానే గీత కళ్ళు మిన మిన లాడాయి. ఆరోజునుంచి గీత రాబోయేవరుడ్ని ఊహించుకుంటూ రకరకాల కలలు కనేది.

ఆ వయసు అలాంటిది. ఆ వయసులోని బలహీనతను బాగా అర్థం చేసుకోగల శీల, గీతలో రకరకాల ఉద్రేకాలను రెచ్చగొట్టింది.

ఒకరోజు శీల గీతను పార్కుకు తీసుకెళ్ళింది. "గీతా నీ కోసం ఒకమంచి కుర్రాణ్ణి చూశాను. చాలా అందంగా వుంటాడు. సినీమా హీరోలా వుంటాడు." అన్నది శీల.

గీత చెంపలు సిగ్గుతో కందాయి. అంతలోనే ఆ అరుణిమ స్థానంలో విచార రేఖలు గోచరించాయి. "నా గురించి అంతా చెప్పావా! నన్ను చేసుకుంటాడా?" సందేహంగా అడిగింది.

"అంతా చెప్పాను. మంచి ఉద్యోగం కూడా వుంది. ఇవ్వాళ సాయంకాలం నిన్ను చూస్తానన్నాడు. మరి వస్తావా?"

"ఎక్కడికి?" కళ్లల్లో భయం తొంగి చూసింది.

"మా ఇంటికి."

గీత ఆలోచనలో పడింది. అమ్మకు శీల అంటే ఈ మధ్య అయిష్టం ఏర్పడింది. నన్ను కూడా ఎక్కువగా మాట్లాడవద్దంటూంది. వాళ్ళింటి కెళ్ళానని తెలిస్తే? అమ్మో! ఇంకేమైనా వుందా? నాన్నకు తెలిస్తే చంపేస్తాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు గీతా? ముందు మీ ఇద్దరూ ఒకరి నొకరు చూసుకోవాలా? ఒకర్కొకరు నచ్చాక మీ అమ్మతో మాట్లాడతాను. వదవెళ్దాం."

"ఇప్పుడు రాను రేపు అమ్మతో చెప్పాక..."

"ముందే చెప్పొద్దు. ఆ అబ్బాయి నీకు నచ్చాక చెబ్దాం. ఎంత, రెండు గంటల్లో మళ్లీ నిన్ను ఇంటి దగ్గర దింపేస్తాగా?"

గీత మెత్తబడింది. శీల ఆటోలో తీసుకెళ్ళింది వాళ్ళింటికి. శీల వాళ్ల ఇల్లు జగత్‌పూరాలో వుంది. రెండు గదులు వాటా. గీత గాబరాగా ముళ్ల మీద కూర్చున్నట్టుగా కూర్చుంది. ఆలస్యం అయిపోతుందని తొందరపెట్టసాగింది. శీల తన భర్త రాగానే అతడి కోసం వంపిస్తానని బలవంతంగా కూర్చోబెట్టింది. సాయంత్రం 6 గంటలకు ఆమె భర్త వచ్చాడు. ఆ కుర్రాడు దొరకలేదనీ, మళ్ళీ వెళ్లి తీసుకొస్తాననీ చెప్పాడు. "నన్ను వంపిం చెయ్యండి. నేను వెళ్ళిపోతాను నేను ఎవర్నీ చూడను. ఎవరూ అక్కర్లేదు." ఏడుస్తూ అన్నది గీత.

"నీ స్నేహితురాలికి చెప్పు అలా భయవడవద్దని. వాడు కాకపోతే వాడి తాత లాంటి వాడ్ని తెచ్చి పెళ్ళి చేస్తానని. ఇక్కడే వుండమను." అన్నాడు బాబుసింగ్ భార్య శీలతో.

గీత అతడి మాటలకు నిలువెల్లా వణికిపోయింది. "వద్దు.. వద్దు నాకీ పెళ్లొద్దు. నన్నింటికి వంపించెయ్యండి."

బాబూసింగ్ విరగబడి నవ్వాడు. అతడి నవ్వుకు గీత భయంతో బిగుసుకు పోయింది.

"నువ్వు ఇప్పుడు ఎక్కడకూ వెళ్ళవు. ఇక్కడే వుంటావు. తెలిసిందా" క్రూరంగా చూస్తూ అన్నాడు.



గీతకు ఏదో మోసం జరిగిందని అర్థం అయింది.

"భయవడకు. రేపు నేను స్వయంగా వచ్చి నిన్ను మీ ఇంటి దగ్గర దిగబెడ్తాను." అంది శీల.

గీత అప్పటికి మౌనంగా వుండి పోవడమే క్షేమకరమని భావించింది.

తెల్లవారి ఉదయం బాబూసింగ్ బయటికి వెళ్ళిపోయాడు. శీలను గీత తనను ఇంటికి వంపించమని బతిమాలింది. శీల కసురుకుని గీతను బలవంతంగా గదిలోకి నెట్టి బయటి నుంచి తాళంవేసి ఎక్కడికో వెళ్ళిపోయింది. గీత ఏడుస్తూ గదిలో కూర్చుంది. ఓ గంట తర్వాత శీలా సాయరా అనే యువతితో తిరిగొచ్చింది.

గీతకు సాయరా కూడా ఆశలు చూవడానికి ప్రయత్నించింది. అక్కడే వుంటే మంచి మొగుడ్ని తెచ్చి పెళ్లి చేస్తానన్నది. గీత వీల్లేదు వెంటనే వంపించెయ్యమని ఏడవసాగింది. దాంతో ఇద్దరూ కలిసి గీతను చావకొట్టారు. నాలుగైదు రోజులు గీత శీల ఇంట్లోనే బందీగా వున్నది. ఐదో రోజు గీతను సాయరా ఇంటికి వంపించారు. అక్కడ ఆ పిల్లకు అసలు సంగతి తెలిసింది. కొట్టీ, హింసించీ, గీత శరీరాన్ని ఎందరో వశువుల్లాంటి వాళ్లు అనుభవించారు. బాబూసింగ్, శీలభర్త కాదు. వగలంతా ఆటో నడిపిస్తాడు. రాత్రిళ్లు శీలకోసం, సాయరాకోసం మగవాళ్లను తీసుకొస్తాడు. గీతను కూడా వృత్తిలో దింపారు. అయినా గీత ఏరోజు కారోజు ఎదురు తిరుగుతోనే వుంది. దెబ్బలు తింటూనే వుంది.

'82 జనవరి మొదటి వారం ఒకరోజు వాళ్లిద్దరూ గీతను సినీమాకని ఆటో ఎక్కించి మరో ఇంటికి తీసుకెళ్ళారు. జి.బి. రోడ్డులో వున్న ఫ్లాట్ నంబరు 70లో లక్ష్మి అనే ఒక ఘర్‌వాలీ (వేశ్యాగృహం నడిపే స్త్రీ) కి గీతను అప్పగించారు. 2500/- రూపాయలకు తనను లక్ష్మికి అమ్మేశారని ఆతర్వాత గీతకు తెలిసింది. గీత వెళ్ళిపోతానని, తనను వదిలెయ్యమని ఏడిస్తే "రెండు వేల ఐదు వందలకు కొన్నాను. ఎలా వదిలేస్తాను? ఆ డబ్బు రాబట్టుకొన్ని తర్వాత ఆలోచిస్తాలే." అన్నది లక్ష్మి.

లక్ష్మి ఫ్లాట్‌లో మరో పదిహేనుమంది యువతులు వున్నట్టు గీత గమనించింది. లక్ష్మి రెండు రోజులు గీతను ఏమీ అనలేదు. మూడో రోజు స్వయంగా అలంకరించింది. ఆ రోజునుంచి లక్ష్మి గీత శరీరాన్ని మార్కెట్‌లో పెట్టింది. కొద్ది రోజుల్లోనే గీత ఆరోగ్యం దెబ్బ తిన్నది. ఒక పోలీసు ఇన్‌స్పెక్టర్ అప్పుడప్పుడు అకస్మాత్తుగా వచ్చేవాడు. ఆ సమయంలో మరో అమ్మాయి గీతను బలవంతంగా టెర్రెస్ మీదకు లాక్కెళ్లేది. పోలీసులు వెళ్ళిపోయేదాకా గీతను వాళ్ళ కళ్ల వడనిచ్చేవాళ్ళుకారు.

ఒక రోజు మధ్యాహ్నం లక్ష్మి మ్యాట్నీ సినీమాకు వెళ్ళింది. అకస్మాత్తుగా పోలీసులు వచ్చారు. ఒక యువతి గాభరాగా గీతను పైకిలాక్కెళ్లడానికి ప్రయత్నించసాగింది.

"నన్ను రక్షించండి. ఇన్‌స్పెక్టర్‌సాబ్ నన్ను ఈ నరకం నుంచి తీసుకెళ్ళండి." ఏడుస్తూ అరవసాగింది గీత.

ఇన్‌స్పెక్టర్ ఒక్క ఉదుటున గీత దగ్గరకు వొచ్చాడు.

గీతను ఆ యువతి నుంచి లాగి కూర్చోబెట్టి వివరాలు అడిగాడు.

గీత అన్ని విషయాలూ చెప్పి తనను రక్షించమని అతని కాళ్ళమీద పడింది. ఇన్‌స్పెక్టర్ పేరు రామేశ్‌రాజా. అతను ఆమెను తీసుకొని పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. ఆ తర్వాత శీలాను, సాయరాను, లక్ష్మిని కూడా అరెస్టుచేశారు.

ఈ కథంత గీత ఎడిషనల్ సెషన్స్‌జడ్జి కోర్టులో, బాక్స్‌లో నిలబడి జడ్జిముందు చెప్పింది. కోర్టులో జనం చాలా మంది వున్నారు.

లేడీ డాక్టర్ మెడికల్ చెకప్‌లో ఆమెను వ్యభిచారంలో దింపినట్టూ, ఇంకా ఇక్కడ చెప్పలేని ఎన్నో విషయాలను కోర్టులో చెప్పింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీవాస్తవ్, ముద్దాయిల తరపున వాదించిన లాయర్ల వాదాన్ని పూర్తిగా ఖండించారు. రెండో వైపు ఆర్గ్యుమెంట్సు విన్న తర్వాత జడ్జి తన జడ్జిమెంట్‌లో – "స్త్రీద్వారా స్త్రీని దారుణంగా ఎక్స్‌ప్లాయిట్ చేసిన విషయాలుకూడా విన్నాను. గీత తల్లి, ఆమె భర్త కూడా కోర్టుకు వచ్చి చెప్పిన విషయాలు కూడా విన్నాను. ఆమెభర్త తన ప్రవర్తన మంచిదికాదనీ, తన భార్య శీలవతి అని చెప్పాడు. గీత తన ఇష్టంతోనే లక్ష్మి ఫ్లాట్‌కు వచ్చిందని చెప్పటాన్ని నేను నమ్మడంలేదు. సాయరాను దండించడానికి సరైన కారణాలు లభించడంలేదు. అందువల్ల ఆమెను వదిలేస్తున్నాను. శీలాను, మైనర్ బాలికను, అబద్ధాలు చెప్పి, ప్రలోభాలు చూపించి అపహరించి వ్యభిచారంలో దించి, ఆ తర్వత వ్యభిచార గృహానికి అమ్మినందుకు కఠిన శిక్షని విధిస్తున్నాను. స్త్రీలు స్త్రీలను మోసం చేసి, వ్యభిచారంలో దింపే వాళ్లకు గుణపాఠం నేర్పించడం నావిధిగా భావించి నాలుగేళ్లు కఠిన కారాగారా శిక్ష విధిస్తున్నాను. రెండు వేలు జర్మానా కూడా విధిస్తున్నాను. జర్మానా కట్టకపోతే మరో సంవత్సరం కారాగారా శిక్షను అనుభవించ వలసి వుంటుంది.

లక్ష్మికూడ దోషిగా రుజువైంది. ఆమెకు నాలుగు సంవత్సరాల కఠోరకారాగార శిక్ష విధిస్తున్నాను. రెండు వందలు జర్మానా, అది కట్టకపోతే మరో సంవత్సరం శిక్ష అనుభవించాలి." అని విన్పించాడు.

చివర్లో గీత భర్తను ఉద్దేశించి "నేను విజయ్‌ను ప్రశంసిస్తున్నాను. అతను తన భార్యను స్వీకరించడానికి అంగీకరించాడు" అన్నాడు.

విజయ్ లాంటి భర్తలు ఎందరుంటారు? ఆలోచించండి.

❀ ❀ ❀



# 34. నేను హంతకినే!

(ఇది ఒక తల్లి కథ. తల్లి తన బిడ్డకోసం ఎలాంటి త్యాగం అయినా చెయ్యగలదని నిరూపించింది యశోధర)

చంద్రాజీ అనే ఒక జర్నలిస్టు లక్నోలో వున్న ఒక ఆదర్శఖైదు (సంస్కరణ సదనం) వార్షికోత్సవంలో పాల్గొనడానికి వెళ్ళింది. అక్కడ ఆడఖైదీలందర్నీ చూసింది. వాళ్ళతో మాట్లాడింది. వాళ్ళుచేసిన అపరాధాలను తెలుసుకున్నది. సదనం అధికారిణి, యశోధర కథ చాలా చిత్రమైందని చెప్పింది. ఆమె యశోధరను 'నువ్వేం అపరాధం చేశావ'ని అడిగింది.

"అమ్మా. పదమూడేళ్ళనుంచి జైల్లో వున్నాను. ఇప్పుడు నా వయసు ఏభయ్ ఏళ్ళు, ఇక నన్ను వదిలెయ్యమని గవర్నమెంటుతో చెప్పండి." అన్నది యశోధర ప్రాధేయ పూర్వకంగా.

జైలు అధికారులు ఆమె ప్రవర్తన చాలా బాగుందనీ, ఒక్కసారి కూడా వాళ్ళకు ఎలాంటి కష్టం ఇవ్వలేదనీ, ఆమె ఆ సదనంలో వంట సామాగ్రి విషయంలో వంట విషయంలో మిగతా విషయాల్లోనూ ఎంతో మెళకువగా ఉండి, అజమాయిషీ చేస్తూ, నమ్మకంగా అధికారులకు సహకరిస్తుందని కూడా చెప్పారు చంద్రాజీతో.

ఆమెను చూస్తుంటే, ఆమె అపరాధం చెయ్యగలదని అన్పించలేదు. కాని ఆమె పక్కింటి పిల్లవాడిని చంపిందనీ, కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించిందనీ తెలుసుకుని ఆశ్చర్యపోయింది ఆ జర్నలిస్టు.

పిల్లవాడిని చంపిందని వినగానే ఆ జర్నలిస్టుకు ఆమె అంటే ఒక రకంగా అసహ్యం కూడా కలిగింది.

"నువ్వు పిల్లవాడ్ని ఎందుకు చంపావ్?" అని ఆమెనడిగింది.

"అంతా అబద్ధం. నేను చంపలేదు. నేను ఇంతవరకు ఒక్క చీమను కూడా కావాలని చంపలేదు." అన్నది యశోధర.

"మరి నీకు ఈ జైలుశిక్ష ఎందుకు పడింది?"

"మా గ్రామంలో భూమి తగాదా వచ్చింది. వాళ్ళలో ఎవరో ఆ పిల్లవాడ్ని చంపి నామీద కేసు బనాయించారు." అని చివ్వున లేచి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది యశోధర.

జర్నలిస్టు సూపర్నెంటు ముఖంలోకి ప్రశార్థకంగా చూసింది.

"మీకు టోకరా ఇచ్చింది. మిమ్మల్ని ఫూల్ని చేసింది." అన్నది సూపర్నెంటు.

"నన్ను ఫూల్‌ను చేసిందా? అంటే ఆమె నిజంగా హత్యచేసిందా?" తెల్లబోతూ అడిగింది చంద్రాజీ.

"ఆమె కథ చాలా చిత్రమైంది. నీకు అబద్ధం చెప్పింది ఆ పిల్లవాడ్ని ఎవరో చంపారని."

"అదేదో పూర్తిగా చెప్తారా?"

"మేం చెప్పకూడదు. మా నియమాలు అలా వున్నాయి. ఆమెనే అడిగి తెలుసుకోండి." అన్నది సూపర్నెంటు.

ఆమె రెండు రోజులు అక్కడే వుండి యశోధరను ఎలాగో ఒప్పించి నిజం తెలుసుకున్నది.

ఆ కథ -

ఆ ఏభయ్ఏళ్ళ యశోధర, జేన్పుర జిల్లాలోని శంకరపురం అనే గ్రామం నుంచి వచ్చింది. 1970-71 నాటి విషయం. ఆమె భర్త బలరాజ్ ఆ రోజుల్లో బొంబాయిలో ఉండేవాడు. గ్రామంలో భూమి తగాదాలు జరుగుతున్న మాట నిజమే. యశోధర తన ఇద్దరు పిల్లలతో శంకరపురంలోనే ఉండేది. పెద్దవాడు రామమూరత్ వయసు 10 సంవత్సరాలు. రెండో సంతానం ఆడపిల్ల, పిల్ల వయసు 8 ఏళ్ళు.

బలరాజ్కూ అతని పినతండ్రికీ మధ్య భూమి తగాదా ఉంది. కాని అది గ్రామ పంచాయితీ తీర్పులోనే వుంది. ఎవరూ కోర్టుకు వెళ్ళలేదు.

ఒకరోజు రామమూరత్ ఇంటి వసారాలో కూర్చుని చదువుకుంటున్నాడు. అప్పుడు అతడు ఐదో క్లాసులో వున్నాడు. బలరాజ్ పినతండ్రి కొడుకు కూడా రామమూరత్ వయసువాడే. అదే స్కూల్లో అదే క్లాసులో చదువుతుండేవాడు. అతడి పేరు నీలాంబర్. నీలాంబర్, రామమూరత్ను ఆడుకోవడానికి పిల్చాడు. రామమూరత్ రానన్నాడు. చదువుకోవాలన్నాడు. నీలాంబర్ అతడి చేతిలోని పుస్తకం లాగేసి ఏడిపించసాగాడు. రామమూరత్ మరో పుస్తకం తీసుకున్నాడు చేతిలోకి. నీలాంబర్ అది కూడా లాగేశాడు. రామమూరత్కు కోపం వచ్చింది.

"నా పుస్తకం ఇవ్వు, లేకపోతే చంపేస్తాను." అన్నాడు.

"నువ్వా? నన్ను చంపుతావా? నేను ఒక్కతోపు తోస్తే కిందపడి మళ్ళీ లేవవు." అన్నాడు నీలాంబర్.

"అమ్మా చూడవే నీలాంబర్ నన్ను చదువుకోనివ్వడం లేదూ." అంటూ కేకపెట్టాడు.

లోపల పనిచేస్తున్న యశోధర "పోట్లాడుకోకండి. నీలా నువ్వు కూడా చదువుకోరా!" అని పెద్దగా లోపలనుంచే సమాధానం చెప్పి తన పనిలో ఉండిపోయింది.

అయినా నీలాంబర్ కొంటెతనం మానలేదు. రామమూరత్ను చూస్తూ "చంపుతానన్నావుగా? చంపు చూద్దాం." అని రెచ్చగొట్టాడు. రామమూరత్ ఒక మూలగా వున్న గొడ్డలి అందుకున్నాడు. నీలాంబర్ అతడు నిజంగా చంపుతాడని ఊహించలేదు.

"నీ మొహం! నీకు తోడు గొడ్డలొకటి." అంటూ ఎగతాళి చేశాడు.



ఆ వెంటనే నీలాంబర్ తలమీద గొడ్డలి దెబ్బపడ్డది. కెవ్వున అరుస్తూ కిందపడిపోయాడు నీలాంబర్. లోపల నుంచి యశోధర పరుగెత్తుకొచ్చింది. నీలాంబర్ రక్తపు మడుగులో తన్నుకొంటున్నాడు. రామమూరత్ శిలా ప్రతిమలా గొడ్డలిపట్టుకొని నిల్చుని వున్నాడు.

వెంటనే యశోధర కొడుకు చేతిలోని గొడ్డలి లాక్కుంది. ఇరుగుపొరుగు జనం నీలాంబర్ కేకవిని వస్తున్నట్టు తోచింది. "నువ్వు లోపలకు పారిపో రామూ." అన్నది యశోధర కొడుకుతో. భయపడిపోయిన రాము లోపలకు పరుగుతీశాడు.

జనం కూడిపోయారు. యశోధర చేతిలోని గొడ్డలి చూశారు. "పిల్లవాడ్ని చంపింది రాక్షసి. పట్టుకోండి" అంటూ అరిచారు.

నీలాంబర్ తండ్రి తులసీదాస్, ఇతరులూ, ముందు పిల్లవాడ్ని ఆసుపత్రిలో చేర్పించడం తమ కర్తవ్యంగా భావించారు. పిల్లవాడ్ని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. ఆరోజు బలరాజ్ బొంబాయినుంచి వచ్చి వున్నాడు. ఆ సమయంలో అతడు పంచాయితి ప్రెసిడెంటును చూడటానికి వెళ్ళాడు. పక్కటౌన్లో పోలీసు రిపోర్టు ఇచ్చారు నీలాంబర్ బంధువులు. పిల్లవాడు చనిపోయాడని డాక్టర్ చెప్పాడు. శవాన్ని పోస్టుమార్టం కోసం పంపించారు.

యశోధరను పోలీసులు 307, 302, సెక్షన్ కింద అరెస్టు చేశారు.

బలరాజ్ భార్యను ఎంతగానో నిజం చెప్పమని కోరాడు. బ్రతిమాలాడు. 'రాము చిన్నవాడు, వాడికి పెద్దగా శిక్ష పడదు. వాడికోసం నువ్వు జీవితమంతా నాశనం చేసుకోకు' అన్నాడు.

అయినా అందుకు ఆమె అంగీకరించలేదు. పోలీసులతో తనే హత్య చేశానని చెప్పింది.

ఆమె భర్త బోరుమని ఏడ్చాడు. అయినా ఆమె తన పట్టు విడవలేదు. ఊళ్ళోవాళ్ళు కూడా ఆమే పిల్లవాడ్ని చంపిందని నమ్మారు. పినమామగారంటే కోపం అనీ, అందుకే వాళ్ళ పిల్లవాడ్ని చంపిందనీ అందరూ అన్నారు. కొందరు కోర్టులో సాక్ష్యం కూడా ఇచ్చారు. భార్యను హంతకి అని అందరూ అంటుంటే బలరాజ్ కుమిలిపోయేవాడు.

బలరాజ్ తమ్ముడు తన వదిన పిల్లవాడ్ని చంపడం కళ్ళారా చూశానన్నాడు. మరోసాక్షి రాజనారాయణ తను కూడా చూశానన్నాడు. ఇరుగు పొరుగు వాళ్ళు, పిల్లవాడి కేకవిని పరిగెత్తుకు వచ్చామనీ, యశోధర చేతిలో గొడ్డలి వుందనీ పిల్లవాడు రక్తపు మడుగులో గిలగిల్లాడుతూ కన్పించాడనీ చెప్పారు.

ఆమె భర్త పోలీసులకు నిజం చెప్పాడు. పోలీసు ఇన్స్పెక్టర్కు కూడా అనుమానంగానే వుంది. అయినా ఆమె తనే చంపానని చెబుతోంది. అందరూ అదే అంటున్నారు. అందువల్ల పోలీసులు కూడా ఆమె హత్య చేసిందని కేసు నమోదు చేశారు.

"పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోండి. వాళ్ళ భవిష్యత్తు బాగుండాలి. రామును ఏమీ అనొద్దు." భర్త చేతిని తన చేతిలోకి తీసుకుంటూ కన్నీళ్లతో అన్నది యశోధర పోలీసులు కస్టడీలో వుండి. కేసు కోర్టుకు వచ్చింది.

"యశోధరా. నువ్వేమైనా చెప్పుకోవాలంటే చెప్పుకోవచ్చు." అన్నాడు సెషన్స్ జడ్జి.

యశోధర కోర్టులో వున్న భర్త ముఖంలోకి చూసింది. అతను నిజం చెప్పమన్నట్టు ఆమెకేసి దీనంగా చూశాడు.

"సార్, నేనే నీలాంబర్‌ను చంపాను. ఆ మాటే మొదటి నుంచీ చెప్తున్నాను." అన్నది యశోధర జడ్జితో నిర్భయంగా.

"ఎందుకు చంపావ్?" జడ్జి అడిగాడు.

"నేనెందుకు అలా చేశానో నాకే తెలియదు."

"నువ్వు కావాలనే చంపావా?"

"అవును."

రక్తం ఎండిపోయి వున్న గొడ్డలి తెచ్చి కోర్టులో వుంచారు పోలీసులు.

"దాంతోనేనా నువ్వు చంపింది."

కోర్టులో వున్న జనం నిరసనగా యశోధరను తిట్టసాగారు. జనంలో కలకలం ఎక్కువైంది. యశోధర ఎటూ తల తిప్పి చూడలేదు.

యశోధరకు యావజ్జీవ కారాగార శిక్ష విధించబడింది.

పోలీసులతో వెళ్తూ భర్తతో అన్నది "పిల్లలిద్దరూ జాగ్రత్త. రాత్రుళ్ళు వాళ్ళని నీ పక్కనే పడుకోబెట్టుకో."

రాము తల్లిని చుట్టుకొని ఏడవసాగాడు.

కొడుకు తలనిమిరింది. "పిల్లవాడ్ని తీసుకెళ్ళు. బాగా చదివించు." అన్నది భర్తతో.

బలరాజ్ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

"ఎందుకు ఏడవడం? నేను పద్నాలుగేళ్ళ తర్వాత తిరిగొస్తాగా?" ధైర్యం చెప్పింది.

ఆ విధంగా శిక్ష పడిన యశోధర లక్నో సంస్కార సదనం ఖైదులో 13 ఏళ్ళు గడిపింది.

కొడుకు పెద్దవాడయ్యాడు. కూతురికి పెళ్ళి జరిగింది. ఆ తర్వాత కొడుకు పెళ్ళి జరిగింది. రెండు పెళ్ళిళ్ళకూ భార్యను జామీను మీద ఇంటికి తీసుకురావాలని ప్రయత్నించాడు భర్త.

కాని ఆమె అందుకు అంగీకరించలేదు.

కోడలూ, అల్లుడూ ఆమెను వచ్చి చూస్తామంటున్నారని ఒక రోజు బలరాజ్ చెప్పాడు. అందుకు కూడా ఆమె అంగీకరించలేదు. కూతుర్ని కూడా రానివ్వలేదు.



అప్పుడప్పుడు కొడుకూ, భర్తా వచ్చి చూసిపోయేవారు. వాళ్ళు వచ్చినప్పుడల్లా "ఇంకెంతకాలం వచ్చేస్తాగా? ఎందుకు బాధపడ్తారు?" అంటూ ఓదారుస్తుంది వాళ్ళను.

తన కొడుకు హంతకుడుగా జైలుకు వెళ్ళకూడదు. వాడి జీవితానికి కళంకం అంటకూడదు. వాడు బాగుండాలి. పిల్లా పాపలతో సంతోషంగా వుండాలి. ఇదే ఆమె నిత్యం కోరుకొనేది. పదమూడేళ్ళు గడిచిపోయాయి.

మరో సంవత్సరం ఆమె జైల్లో వుండాలి.

"అమ్మా! ఎలాగైనా నన్ను విడుదల చేయించండి. ఇంతకాలం ఎలా గడిపానో తెలియదు. కాని మరో సంవత్సరం వుండాలంటే భరించలేని బాధగా వుంది. నాకు సహాయం చేస్తారు కదూ?" చంద్రాజీ లేచి వస్తుంటే దీనంగా చెప్పింది యశోధర.

చంద్రాజీకి కళ్ళలో నీరు తిరిగింది. "అలాగే! అలాగే!" అంటూ బయటికి నడిచింది.

❀ ❀ ❀

# 35. ప్రేమిస్తే భయం ఎందుకు?

డార్జిలింగ్‌లో వున్న బ్రాడ్వే హోటల్ నూటవదకొండో నంబరు గదితలుపులు ఎండెక్కినా తెరుచుకోకపోవడంతో బేరర్‌కు గాభారా వేసింది. బెల్ కొట్టాడు. రెస్పాన్సు లేదు. తలుపు తట్టాడు. లాభంలేదు. ఒక్క ఉదుటన వెళ్ళి హోటల్ మేనేజర్‌తో చెప్పాడు. హోటల్ మేనేజర్ మెట్లెక్కి పరుగులు తీశాడు. తలుపులు బాదాడు. అతడితో పాటు హోటల్లో పనిచేసేవాళ్లు కూడా తలుపులు బాదారు. పక్కరూముల్లోవున్న వాళ్లు బయటికి వచ్చి నూటపదకొండో గది ముందు నిల్చున్నారు.

మేనేజర్ డూప్లికేట్ కీ తెప్పించి అందరిముందూ తలుపు తెరిపించాడు. ముందుగా లోపలకు అడుగు పెట్టిన మేనేజర్ 'కెవ్వు' మని అరిచాడు.

కొందరు లోపలకు వెళ్ళారు.

బెడ్‌మీద పెళ్లి కూతురిలా అలంకరించుకొన్న ఒక యువతీ, పెళ్లికొడుకులా అలంకరించుకొన్న ఒక యువకుడూ రక్తపు మడుగులో వున్నారు.

వెంటనే ఫోన్ అందుకొని, పోలీసులకి ఫోనుచేశారు. పోలీసులు వచ్చారు. వాళ్లిద్దరూ ఇంకా చనిపోలేదని తెలుసుకున్న పోలీసులు ఇద్దర్నీ అసుపత్రికి పంపించడానికి ప్రయత్నించారు. ఇద్దరి చేతుల్నూ తొలగిస్తుంటే "వద్దు. వద్దు. మమ్మల్ని దూరం చెయ్యకండి. ఇలాగే చనిపోనివ్వండి." క్షీణంగా అరిచాడు యువకుడు.

పోలీసుల మనసులు కూడా కరిగాయి. ఇద్దర్నీ బలవంతంగా అసుపత్రికి తీసుకెళ్లారు. కాని ఇద్దర్నీ వేరు వేరు వార్డుల్లో వుంచడానికి ఇద్దరూ అంగీకరించలేదు. మగవాళ్ళ వార్డులోనే ఇద్దర్నీ పక్క పక్క బెడ్స్‌మీద పడుకోబెట్టారు. వేరు వేరు వార్డుల్లో వుండడానికి ససేమిరా అంగీకరించలేదు.

అది 1982 జూన్ 28వ తేదీ.

వాళ్ళకు అతిజాగ్రత్తగా చికిత్స జరుగుతోంది. యువతి పరిస్థితి మరీ సీరియస్‌గా వుంది. యువకుడికి మాత్రం మధ్య మధ్య స్పృహ వచ్చినప్పుడల్లా కొన్ని విషయాలు చెప్తున్నాడు. హోటల్ గదిలో రక్తసిక్తమైన కూరగాయలు కోసే ఒక కత్తీ, కుంకంభరిణ, కొన్ని ప్రేమ ఉత్తరాలూ, రెండు పూల దండలూ దొరికాయి.

మధ్యమధ్య తెలివి వచ్చినప్పుడల్లా వారి ద్వారా కొన్ని వివరాలను సేకరించారు పోలీసువారు.

అ అమ్మాయి పేరు రేష్మా. ఆ అబ్బాయి పేరు అభిజిత్. ఇద్దరూ కలకత్తావాసులు. కలకత్తాలోనే చదువుతున్నారు. ఇళ్లుకూడా ఒకే వీధిలో వుండేవి. చిన్నతనం నుంచీ ఇద్దరూ కలిసి మెలిసి పెరిగారు. కలిసి చదువుకుంటూ పెరిగారు.



వారి వయస్సుతోపాటు వారికి ఒకరిమీద ఒకరికున్న ఇష్టం కూడా పెరిగింది. ఆ ఇష్టం ప్రేమగా మారింది. అతను మజ్నూ-ఆమె లైలా. అతడు ఫరిహద్-ఆమె శిరీన్.

రేష్మా అపూర్వ సౌందర్యవతి. ఒక్కసారి చూసినవాళ్లు ఆమె మీదనుంచి వెంటనే చూపుల్ని మరల్చుకోలేరు.

అభిజిత్ వ్రాసిన ప్రేమ లేఖల్లో-ఆమె కవికల్పన కంటే అందమైంది. సృష్టికర్త ఆమెను చూస్తే మోహంతో పిచ్చెక్కి పోతాడు. విశ్వసౌందర్యాన్నంతా ముద్దగా పిసికి ఆమెను తయారుచేశాడా భగవంతుడు. ఇలా సాగిపోయాయి ఆమె సౌందర్యవర్ణనలు అతడి ప్రేమ లేఖల్లో.

ఇంకా వారి మధ్య ఎలాంటి సంభాషణ జరిగేదో చూడండి. ఉదాహరణకు-

"ప్రియా! నువ్వు లేని ఈ జీవితం నాకు అక్కర్లేదు."

"అలా అనకు అభిజిత్. నువ్వు లేకుండా నేను మాత్రం జీవించగలనా?"

"నువ్వు పరాయివాడి సొత్తు కావడాన్ని నేను భరించలేను."

"అభిజిత్. అలా అనకు. నేను నీదాన్ని. నీదాన్ని మాత్రమే. అంతే. నువ్వుంటే నేను వుంటాను. నాలోని ఒక్కొక్క రక్తం బొట్టు ఒడుతున్నా, మరొకడికి ఇల్లాలుగా వెళ్ళను. వెళ్ళలేను." ఆమె.

ఇలాంటి సంభాషణలు ప్రతి యువకుడూ, యువతీ ఒక వయస్సులో మాట్లాడేవే!

అయితే వారి జీవితం కూడా వారి సంభాషణలు సారాంశంగానే మిగిలిపోయింది.

రేష్మా అంటే ఎందరో కుర్రాళ్లు పడి చచ్చిపోయేవాళ్లు. గిట్టనివాళ్లు అభిజిత్‌తో ఆమెకున్న ప్రేమ వ్యవహారం గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఫలితాంగా ఆమె మీద ఆంక్ష విధించబడింది. నిఘా ఎక్కువైంది. కట్టడిలో పెట్టారు ఆమెను.

అభిజిత్ కవిత్వం వ్రాసేవాడు. పెయింటింగ్ వేసేవాడు. రేష్మాకు కూడా పైంటింగ్ అంటే ఇష్టం. చక్కడా పాడేది. ప్రత్యేకంగా సంగీతం క్లాసులకు వెళ్లేది.

అభిజిత్, రేష్మా పెద్దలకు దొరక్కుండా కలుసుకుంటూనే వున్నారు. అవిషయం తెలిసి రేష్మా తండ్రి సుకేన్‌దాస్‌గుప్తాకు రక్తం ఉడికిపోయింది. రేష్మాను కాలేజీకి వెళ్ళకుండా చేశాడు. రేష్మా కొరకు సంబంధాలు చూడసాగాడు. రేష్మా కాలేజీ మానేసింది. కాని సాయంత్రం సంగీతం క్లాసుకు మాత్రం వెళ్లేది. అలా మళ్ళీ ఇద్దరూ కలుసుకొనే అవకాశం దొరికింది. ఒకరోజు రేష్మా అభిజిత్‌తో తనకు సంబంధాలు చూస్తున్నారనీ, వెంటనే అక్కడున్నంచి పారిపోవడం తప్పించి గత్యంతరం లేదనీ అన్నది.

1982 జూన్ 24వ తేదీ సంగీతం క్లాసుకు వెళ్ళిన రేష్మా తిరిగి రాలేదు. తల్లిదండ్రులు ఆ రాత్రంతా జాగారం చేశారు. తెలిసిన వాళ్ళందర్నీ అడిగారు. ఆమె జాడ తెలియలేదు. తెల్లవారి అభిజిత్ కూడా కన్పించడం లేదని తెలిసి సుకేన్‌దాసు అభిజిత్ ఇంటికి వెళ్ళి అతడి తండ్రి ఆశుతోష్‌దేవనాధ్‌మీద అరుపులు ప్రారంభించాడు. ఆయన సుకేన్‌ను శాంతపర్చడానికి యత్నించాడు. "వాళ్ళిద్దరూ గాఢంగా ప్రేమించుకున్నారు. మనం అడ్డుపడినా లాభంలేదు." అన్నాడు.

"చూస్తాను." అంటూ సుకేన్‌దాస్‌గుప్తా పోలీసు ఆఫీసర్నును కలుసుకున్నాడు. రిపోర్టు ఇచ్చాడు.

అభిజిత్ దగ్గర బంధువు డార్జిలింగ్‌లో వున్నాడు. వాళ్ళిద్దరూ తిన్నగా అతడి దగ్గరకెళ్ళి చెప్పుకొని ఎలాగయినా తమకు మార్గం చూపించమని దీనంగా వేడుకొన్నారు. అతడికి వారి మీద జాలి కలిగింది. రిజిష్టర్ వివాహం చేస్తానని చెప్పి తన స్నేహితుడి ఇంట్లో ఇద్దర్నీ దాచాడు. రిజిష్టర్ మారేజ్‌కి ప్రయత్నాలు చేస్తున్నాడు.

మూడో రోజు అభిజిత్ బంధువు, తన స్నేహితుల ఇంట్లోవున్న వాళ్ళదగ్గర కెళ్ళి, రేష్మా తండ్రి పోలీసురిపోర్టు ఇచ్చాడనీ, పోలీసులు వాళ్ళను వెతుక్కుంటూ డార్జిలింగ్ వచ్చారనీ, తనను ప్రశ్నించారనీ చెప్పాడు. భయపడవద్దని చెప్పి, జాగ్రత్తగా వుండమని హెచ్చరించి వెళ్ళిపోయాడు.

అభిజిత్‌కూ, రేష్మాకూ భయం పట్టుకుంది. ఎలాగయినా పోలీసులు తమను పట్టుకుంటారనీ, రేష్మాను తండ్రికి అప్పగిస్తారనీ నమ్మకం కలిగింది. ఇద్దరూ ఆ సాయంత్రం ఇప్పుడే వస్తామని చెప్పి బైటికి వెళ్ళిపోయారు. రేష్మా చక్కగా అలంకరించుకొన్నది. ఇద్దరూ హోటల్‌కు వచ్చి గది తీసుకున్నారు. బేరర్‌చేత రెండు పెద్ద పెద్ద పూలమాలలు తెప్పించుకొన్నారు.

ఇద్దరూ మాలలు మార్చుకున్నారు. ఆమె నొసటన, పాపట్లోనూ సింధూరం దిద్దాడు అభిజిత్. ఇద్దరూ పొద్దు పోయేంత వరకూ కబుర్లు చెప్పుకున్నారు. ఏడ్చారు, ఒకరి కన్నీరు ఒకరు తుడిచారు. చివరకు పండ్లు కోసే చాకుతో గొంతులు కోసుకున్నారు. ఒకర్నొకరు కౌగలించుకొని పడుకొన్నారు. చావుబతుకుల్లో వున్న వారిని పోలీసులు ఆసుపత్రిలో చేర్చారు.

తల్లిదండ్రులు వచ్చేసరికి ఇద్దరూ ఈ ప్రపంచానికి దూరంగా, ఎవరికీ అందనంత దూరంగా వెళ్ళిపోయారు.

బ్రతికి వుండగా హర్షించని లోకం వారు చనిపోయాక వారి అమర ప్రేమను గురించి వేనోళ్ళ పొగిడింది.

ఇలా చాలా కథలు వింటూంటాం.

ఇదే నెల రెండు రోజుల క్రితం - అంటే 22వ తేదీన ప్రకాశం జిల్లాకు సంబంధించిన ఇద్దరు ప్రేమికులు రైలు కిందపడి చనిపోయినట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చింది.

ప్రేమించడం తప్పుకాదు. ప్రేమించిన వాళ్ళు పిరికివాళ్ళుగా ఇలా ప్రాణాలు తీసుకోవడం తెలివి తక్కువతనం. సాహసంతో అడ్డంకుల్ని ఎదుర్కోవాలి. ఇలాంటి వారికి ఆదరణ చూపే వాళ్లు సమాజంలో లేకపోలేదు. చచ్చి సాధించేది ఏమీ వుండదు.

ప్రేమికులారా, సమాజానికీ, కుటుంబంలోని వారికీ భయపడి చావకండి. ధైర్యంగా అడ్డంకులను ఎదుర్కొని జీవితంలో ముందుకు పయనించినవాళ్ళే ధన్యులు. ఆదర్శజీవులు. యువతీయువకులారా ఆలోచించండి.

❀ ❀ ❀



# 36. మీనా కథ

(మీనా ఎందుకిలా చేసింది? ఈ ప్రశ్నకు సమాధానం కావాలంటే మరో ప్రశ్న- 'ఈ సమాజంలో స్త్రీకి రక్షణ ఉందా?' అని వేసుకోవాల్సి ఉంటుంది. సాంప్రదాయపు అట్టడుగు పొరల్లోకి వెళ్ళి వెదికితేగాని పై ప్రశ్నకు సమాధానం దొరకదు.

ఎందరో అభాగినులు. అందులో మీనా ఒకర్తి. ఆమె కథ చదవండి. చదివి అలోచించండి.)

ఉత్తర ప్రదేశ్‌లోని ఇటావా నగరంలో ఉన్న కొద్ది మంది ధనికుల్లో ఛోటేలాల్ జైన్ ఒకడు. అతనికి ఏడుగురు కొడుకులు. ఇద్దరు కూతుళ్ళు. కూతుళ్ళకు పెళ్ళిళ్ళు అయ్యాయి. అత్తవారిండ్లలో ఉన్నారు. సతీష్, సరేశ్, ప్రభాత్, రాకేశ్, రాజేశ్, రాజీవ్, ఛోటేలాల్ కొడుకుల పేర్లు. ఈ ఏడుగురిలో సురేశ్, ప్రభాత్ మూగవాళ్ళు. అయినా సురేశ్ ఎం. ఏ. పాసయ్యాడు. ప్రభాత్‌కు మూగతనంతోపాటు కళ్ళ జబ్బు కూడా ఉన్నందువల్ల ఇంటిదగ్గరే చదువు సంధ్యలు లేకుండా ఉండిపోయాడు.

పెద్ద అన్నగారైన సతీష్ చంద్రజైన్ వ్యాపారం సురేశ్ చంద్ర చూస్తుండేవాడు. మూగవాడైనా తెలివైనవాడూ, చదువుకొన్నవాడూ అవడంవల్ల వ్యాపార సంబంధమైన విషయాలను సమర్థవంతంగానే చూసుకోగలుగుతున్నాడు. 70ఏళ్ళ వృద్ధుడైన తండ్రి అందరికీ తలొక వ్యాపారం అప్పగించాడు.

అందరికంటే సతీష్ చంద్ర బట్టలవ్యాపారంలో బాగా సంపాదించసాగాడు. అతనికి ఇద్దరు కొడుకులు. ముగ్గురు కూతుళ్ళు. మూగవాడైనా సురేశ్‌కు బీదపిల్ల మీనాను ఇచ్చి వైభవంగా పెళ్ళి చేశారు.

మీనా తండ్రి పేరు పూల్‌చంద్. అతనికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురికి తన తాహతుకు మించిన కట్నం ఇచ్చి పెళ్ళిచేసి అప్పుల పాలయ్యాడు. అయినా అతని పెద్దకూతురు అత్తవారింట్లో సుఖపడలేదు. ఒకరోజు పూల్‌చంద్‌కు తన కూతురు కాలి చనిపోయినట్టు వార్త అందింది. స్టౌవ్ వెలిగిస్తూ ప్రమాదవశాత్తు కాలిపోయినట్టు అత్తవారి కుటుంబం రిపోర్టు. కాని ఇరుగుపొరుగు వాళ్ళ ద్వారా తన కూతురు చావలేదనీ, చంపబడిందనీ తెలుసుకున్న అ తండ్రి శరీరంలో రక్తం కుతకుతలాడింది. అల్లుడిని హత్యచేసిగాని అ తండ్రి మనసు ఊరట చెందలేదు.

పూల్‌చంద్‌కు జన్మఖైదు విధించబడింది. మీనా వివాహం మూగవాడైనా పెద్దింటి కుర్రవాడితో, కట్నం లేకుండా జరుగుతున్నందుకు అతను సంతోషించాడు. పెరోల్ మీద వచ్చి, పూల్‌చంద్ కన్యాదానం కూడా చేశాడు. సంపన్న కుటుంబంలో తన రెండో బిడ్డ సుఖంగా బతకాలని మనసారా కోరుకున్నాడు. తను నమ్మిన దేవుళ్ళకు మొక్కు కొన్నాడు.

మీనాకు అత్తవారింట్లో పెద్దగా కష్టాలు లేవు. భర్త మూగవాడైనా అమృత హృదయుడు. చదువుకొన్నవాడు. కాని మీనాకు మాత్రం తన భర్త మూగవాడన్న హీనభావం నిరంతరం బాధించేది. పుట్టింటికి వెళ్ళడం కూడా మానేసింది. పెళ్ళయిన కొత్తలో "బంగారు బొమ్మలా ఉంది. పాపం: బీదతనం వల్ల మూగవాడికిచ్చి చేశారు." ఇరుగు పొరుగు వాళ్ళు అంటూ ఉండేవారు. మీనా ఎదురుగానే అనేవారు. మీనాకు ఆ మాటలు వింటుంటే చచ్చిపోవాలనిపించేది. ఒకసారి ఇంటి వెనక ఉన్న బావిలో దూకింది. సమయానికి వెతికి తియ్యడంవల్ల ఆమె ప్రాణంతో బయటపడింది.

క్రమంగా మీనా జీవితంతో రాజీ పడటం నేర్చుకున్నది. వివాహం అయి పన్నెండేళ్ళు పూర్తి అయింది. ముగ్గురు ఆడపిల్లలకు తల్లి అయింది. ఇంటి చాకిరి ఎక్కువగా మీనా చేస్తుంది. ఆమె భర్తకు అన్న లాభాలలో భాగం ఇచ్చేవాడుకాదని అందరూ అంటారు. భర్త మూగతనాన్ని అసరా చేసుకొని తమకు రావాల్సిన వ్యాపారంలోని లాభాలను బావగారు ఇవ్వడం లేదని మీనాకు తెలుసు. కొంతకాలం మౌనం వహించింది. ముగురు ఆడపిల్లలు, పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్ళ పెళ్ళిళ్ళ గురించిన దిగులు మీనాకు ఇప్పటినుంచే పట్టుకుంది. ఆమె బావగారిని నిలదీసి తమ వాటా గురించి అడగడం ప్రారంభించింది. 18 గదులున్న అంతపెద్ద భవంతిలో సురేష్, మీనా, ఉండటానికి పై అంతస్థులో ఒక గది మాత్రం కేటాయించడం జరిగింది. పన్నెండేళ్ళూ ఆ గదిలోనే వాళ్ళ కాపురం.

అది 1982 నవంబరు 5వ తేదీ. ఇన్‌స్పెక్టర్ శర్మ ఉదయం టీ తాగుతున్నాడు. జవాను వచ్చి సతీష్ చంద్రజైన్ వచ్చాడనీ, ఆఫీసు రూంలో కూర్చుని ఉన్నాడనీ చెప్పాడు. ఆ పట్టణంలో సతీష్ చంద్రజైన్‌ను తెలియనివాళ్ళు చాలా తక్కువ. ఇన్‌స్పెక్టర్ శర్మ లేచి ఆఫీసు గదిలోకి వచ్చాడు.

"చెప్పండి జైన్‌సాబ్! ఏమిటి విశేషం ఇంత పొద్దుటే వచ్చారు?" శర్మ ప్రశ్నించాడు.

"ఏం చెప్పమంటారు? జరగరానిదే జరిగింది." అంటూ ప్రారంభించాడు సతీష్‌జైన్.

"రాసివ్వండి." అన్నాడు శర్మ.

"రాసి పట్టుకొచ్చాను." వ్రాసి తెచ్చిన రిపోర్టును ఇన్‌స్పెక్టర్‌కు అందించాడు జైన్.

ఇన్‌స్పెక్టర్ శర్మ తన సిబ్బందితో బైలుదేరి లాల్‌పురాలో ఉన్న జైన్ ఇంటికి వెళ్ళాడు. అది రెండంతస్థుల విశాలమైన బంగళ. ఛోటేలాల్ పెద్దకొడుకుతో ఇదే ఇంట్లో నివసిస్తున్నాడు.

"ఏ గది?" శర్మ అడిగాడు సతీష్‌ను.

"డ్రాయింగ్ రూం."

డ్రాయింగ్ రూం తలుపులు లోపలనుంచి వేసి ఉన్నాయి. ఇన్‌స్పెక్టర్



తలుపులు తట్టాడు. తెరుచుకోలేదు. పోలీసు జవాన్లు తలుపుల్ని బలవంతంగా కొట్టగా గడియ ఊడింది. తలుపులు తెరుచుకొన్నాయి. ఎదురుగా సీలింగ్ ఫాన్‌కు వేలాడుతున్న స్త్రీ శవం కన్పించింది. ఆమె రెండు కాళ్ళూ మగవాడి షర్టుతో కట్టివేయబడి ఉన్నయి. దూరంగా ఒక స్టూల్ పడి ఉంది. కొద్దిదూరంలో ఉన్న సోఫాలో ముగ్గురు ఆడపిల్లల మృత దేహాలు పడిఉన్నాయి. ఆ పక్కనే ఒక కర్ర ఉంది. ఆ కర్రతోనే ఆ ముగ్గురి కంఠాలను నొక్కి చంపినట్టు తెలుస్తున్నది.

ఆ పసివాళ్ళ మృత దేహాలను చూస్తూ ఉండిపోయాడు శర్మ. "ఇది ఎలా జరిగింది?" కళ్ళెత్తి సతీష్‌జైన్ ముఖంలోకి లోతుగా చూస్తూ అడిగాడు. ఎన్నో శవాలను చూసిన శర్మ మనసు కూడా ఆ పసిపాపల శవాలను చూస్తుంటే ద్రవించి పోయింది.

"అదే నాకూ అర్థం కావడంలేదు ఇన్‌స్పెక్టర్. మీనా తన పిల్లల్ని చంపి ఆత్మహత్య చేసుకున్నట్టు స్పష్టంగానే తెలుస్తుందిగా?"

ఇన్‌స్పెక్టర్ డ్రాయింగ్ రూం పరిశీలించ సాగాడు. మంచం మీద ఒక నవల ఉన్నది. అ నవలలో ఒక మడత పెట్టిన కాగితం ఉంది. కాగితం విప్పి చూశాడు.

అందులో--

"నాకు ముగ్గురు ఆడపిల్లలు, ఎంత కట్నం ఇస్తే వీళ్ళ పెళ్ళిళ్ళు అవుతాయి? మూగవాళ్ళనూ, కుంటివాళ్ళనూ చుట్టూ వాళ్ళు కాకుల్లా ఎందుకు పొడుస్తారు? వాళ్ళను చూస్తే అందరికీ చిన్న చూపే. ఎగతాళే. స్వంత అన్నదమ్ములు కూడా సోదరుడి అసహాయతను తమ స్వార్థానికి వినియోగించుకోవడానికి వెనకాడరు. చాలామంది సమాజం మారాలని అరుస్తున్నారు. ఎక్కడ మారిందీ సమాజం?

కట్నం అనే పిశాచి కఠోరహస్తాలలో నాలాంటి అబలల జీవితాలు రోజుకెన్ని నలిగిపోతున్నాయి? చట్టం చేశారు. ప్రయోజనం? కట్నం పేరుతో కోడళ్ళను చంపే అత్తమామల్ని శిక్షించండి. కొడుకుల్ని అమ్ముకొనే తల్లిదండ్రులను దండించండి. ఈ సమస్యల్ని సాహిత్యంలోనూ సినీమాలలోనూ చూపిస్తున్నారు. కాని అసలు మూలకారణం చూపించలేకపోతున్నారు. సరైన అవగాహనను కలుగజెయ్యడం లేదు. విద్యా విధానంలో మార్పు రావాలి. నేనూ నా బిడ్డలూ ఈ కుళ్ళి కంపు కొడ్తున్న సమాజం నుండి దూరంగా చాలా చాలా దూరంగా వెళ్తున్నాను-మీనా కుమారిజైన్."

"ఈ రైటింగ్ ఎవర్ది?" శర్మ సతీష్ జైన్‌ను అడిగాడు.

"ఆమెదే?"

మీనా శవాన్ని దించారు. ఉరివేసుకున్న ఆమె నాలుక బయటికిరాలేదు. కళ్ళు తెరవబడి లేవు. తల్లి శవంతోపాటు అంజు (9 సంవత్సరాలు) సవిత (6 సంవత్సరాలు) నీతూల (2 సంవత్సరాలు) శవాలను కూడా పోస్టు మార్టమ్‌కు పంపించారు. ఇంత జరుగుతున్నా సురేశ్‌జైన్ ఒక మూల విచారంగా నిల్చుని ఉన్నాడు. అతను మూగవాడు, చెవిటివాడు అందువల్లనే కావచ్చు పోలీసులు అతని నుంచి ఎలాంటి సమాచారం రాబట్టడానికి ప్రయత్నం చెయ్యలేదు.

ఈ కేసు విషయంలో పోలీసు డిపార్ట్‌మెంటు ఉదాసీనత వహించిందని అక్కడి

వారి అభిప్రాయం. దానికి కారణం జైన్ కుటుంబానికి ఇలావాలో గల వరవతి అని కూడా చాలామంది అభిప్రాయం.

స్థానిక వార్తా పత్రికలు, ఇది ఆత్మహత్య కాదనీ, హత్య అనీ, పోలీసు డిపార్టమెంటు ఈ విషయంలో నిర్లక్ష్య వైఖరిని చూపిస్తుందనీ వ్రాశాయి. కొన్ని సాంఘిక సంస్థలు మీటింగులు పెట్టి కేసును పరిశీలించి దుర్మార్గుల్ని దండించాలని డిమాండ్ చేశాయి.

మీనా ముగ్గురు పిల్లల తల్లి అయి ఇలాంటి పని ఎందుకు చేసింది. అదీకాక మీనా తాతగారు ఛోటేలాల్ ఆ ముగ్గురు అడపిల్లల పేర్లమీద బ్యాంకుల్లో పెద్ద మొత్తాలు వేశాడు. ఆ పరిస్థితుల్లో ఆమె పిల్లల్ని చంపాల్సిన అవసరం ఏమిటి?

సతీష్‌జైన్ ఇచ్చిన రిపోర్టు కూడా సందేహానికి అస్కారం కలుగజేస్తున్నది.

"నా సోదరుడు సురేశ్ మూగవాడు. అతనికి ముగ్గురు అడపిల్లలు. అతని భార్య మీనా రాత్రి డ్రాయింగ్‌రూంలో తన పిల్లలతో పడుకున్నది. తెల్లవారి తలుపులు కొట్టినా సమాధానంలేదు. ఆమె తన పిల్లల్ని చంపి, తను అత్మహత్య చేసుకున్నట్టు అనుమానంగా ఉంది. " అని రిపోర్టు.

అతనికి ముందుగానే అమె తన పిల్లల్ని చంపి, అత్మహత్య చేసుకొన్నట్టుగా ఎలా తెలిసింది. అ రోజు చోటేలాల్ ఊళ్ళో లేడు. అమె గదిలో దొరికిన ఉత్తరం తాలూకు చేతివ్రాత, చేతివ్రాత నిపుణులచేత పరీక్షించబడలేదు. ఆ గదిలో పెన్ లేదు. మీనా కంఠానికి ఉన్న తాడు కొత్తది. ఇంత కొత్తతాడు అమెకు ఎక్కడ్నుంచి వచ్చింది? కాళ్ళకు మగవాళ్ళ షర్టు ఎందుకు కట్టి ఉంది?

ఇన్ని ప్రశ్నలూ ప్రశ్నలుగానే మిగిలి పోయాయి.

మీనా పిల్లల్ని చంపి తను ఆత్మహత్య చేసుకున్నట్టుగా కేసు క్లోస్ చెయ్యడం జరిగింది.

❀ ❀ ❀



# 37. మానవత్వం మేలుకొంది

ఇద్దరు అభాగినుల కొరకు పంజాబ్ నేషనల్ బ్యాంకు (లేడీ శ్రీరామ్ కాలేజీ, ఢిల్లీ శాఖ) లో శ్రీ దలాల్ కుటుంబం వారు రెండువేల రూపాయలు డిపాజిట్ చేశారు.

ఒక పెద్ద మనిషి మరో అయిదు వందలు వేశాడు. శ్రీ దలాల్ కోడలు శ్రీమతి అచల్‌సింగు అదే కాలేజీలో పని చేస్తున్నది. ఆమె తన జీతంలో కొంత భాగం ప్రతి నెలా ఆ అనాధ బాలికల పేరు మీద ఉన్న డిపాజిట్‌లో వేస్తూ ఉన్నది. ఒక ట్రస్టును ఏర్పాటు చేశారు. శ్రీమతి అచల కూడా ఒక ట్రస్టీగా ఉన్నది.

ఎవరా బాలికలు? ఏమా కథ?

చేతన్ దాను రోగగ్రస్తుడు. అతని భార్య తారావతి బీడీలు అమ్మి కుటుంబాన్ని పోషిస్తున్నది. 1979 జులై నెలలో వారి పెద్ద కూతురు నీలమ్ పెళ్ళి చేశారు. ఆ అమ్మాయికి పదిహేను సంవత్సరాలు నిండాయి. భర్తపేరు సుఖదేవ్‌సింగు. కాపరానికి వచ్చి ఆ అమాయకురాలు అక్కడి పరిస్థితులకు విలవిలలాడిపోయింది. ఆమె అంటే భర్తకంటే మామగారే ఎక్కువ శ్రద్ధ చూపించాడు. అతని పేరు బలవిందర్‌సింగు.

పెళ్ళయి నీలమ్ అత్తవారింటికి వచ్చిన రెండోరోజే కొడుకును బలవిందర్ సింగ్ ఏదో పని పురమాయించి ఢిల్లీ నుంచి హరిద్వార్ పంపించాడు. అదను చూసి కోడలి మీద దౌర్జన్యం చేశాడు. ఆమె శీలాన్ని హరించాడు. బలవంతంగా మత్తు మందు ఇవ్వడంతో నీలమ్‌కు ఎదురుతిరిగే శక్తి కూడా వుండేది కాదు.

అత్తగారు మాత్రం ఈ దారుణాన్ని చూడలేక భర్తను నిందించి దెబ్బలుతిన్నది. భర్త వూరినుంచి తిరిగివచ్చాక నీలమ్ తన పరిస్థితి చెప్పుకొని ఏడ్చింది.

"ఏడుపెందుకు. మా నాన్న చెప్పినట్టు చెయ్. నేనైతేనేం - మా నాన్న యితేనేం? నోరుమూసుకు పడివుండు" అని బెదిరించాడు సుఖదేవ్‌సింగు. ఆ పసిది గోలచేసి ఏడవ సాగింది.

బలవిందర్ సింగు డాక్టర్. నీలమ్ ఏడ్పులు రోజూ వినే ఇరుగు పొరుగు వారికి అనుమానం వచ్చింది. ఢిల్లీలో కిషన్‌నగర్ ప్రాంతంలో వాళ్ళు ఉండేవారు. ఆ కాలనీ అంతా పుకారు బయలుదేరింది. డాక్టర్ బలవిందర్‌సింగు భయపడిపోయాడు. కొడుకును పిల్చి నీలమ్‌ను అతడి మేనమామ ఇంటికి తీసుకెళ్ళమని చెప్పాడు. తండ్రి మాట జవదాటని కొడుకు భార్యను రిక్షాలో ఎక్కించుకొని మేనమామ ఇంటికి బయలు దేరాడు.

అతని మేనమామ ఇంటికి వెళ్ళాలంటే నీలం తండ్రి ఇంటిమీదుగా వెళ్ళాలి. ఇల్లు దగ్గరకు రాగానే ఆ పిల్ల రిక్షాలో నుంచి దూకింది. ఒక్క పరుగున ఇంట్లోకి

దూరింది. అగస్టు 12 వ తేదీన ఈ సంఘటన జరిగింది. అంటే పెళ్ళి అయిన నెల తర్వాత అన్నమాట!

రెండు రోజుల తర్వాత నీలం భర్త వెళ్ళి ఆమెను తనతో రమ్మని పిల్చాడు. ఆమె అందుకు అంగీకరించలేదు. కోపంతో సుఖదేవ్ ఆమెను చెంపదెబ్బ కొట్టాడు. జుట్టుపట్టుకొని బయటికి లాగసాగాడు - ఆ దృశ్యం చూడలేని నీలమ్ తల్లి మూల నున్న కర్ర తీసుకొని అతని చేతులమీద బాదింది. అతను ఆమె ఉగ్రరూపం చూసి బయటికి పారిపోయాడు. ఏడుస్తున్న బిడ్డకేసి ఓ క్షణం జాలిగా చూసింది తల్లి. కర్రను ఓ పక్కకు విసిరి బిడ్డను ఒళ్ళోకి తీసుకొని బావురుమని ఏడ్చింది. తల్లీ బిడ్డలు ఏడుస్తుంటే రోగంతో బాధపడుతున్న తండ్రి బేలగా చూస్తూ ఉండిపోయాడు.

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు లీగల్ అడ్వైజర్గా ఉన్న శ్రీ దల్ జీత్ దలాల్ దగ్గిర కెళ్ళి నీలమ్ తల్లి తన గోడును చెప్పుకుంది. అతని మనసు కరిగింది. ఆ బీద కుటుంబానికి సహాయం చెయ్యాలనే నిర్ణయానికి వచ్చాడు. పదహారేళ్ళు నిండని ఆ పసిదాన్ని ఆ రాక్షసుల బారినుంచి తప్పించడానికి కృతనిశ్చయుడై రేప్ కేసును రిజిస్టర్ చేశాడు. నీలమ్ భర్త తన భార్యను పంపించవలసిందిగా కాంజు గల్ రైట్స్ (వైవాహిక హక్కులు) కింద కోర్టుకు వెళ్ళాడు. నీలమ్ తరఫున దలాల్ వాదించాడు. కేసు కొట్టివేయబడింది.

డాక్టర్ బలవిందర్సింగు రేప్కేసును ఉపసంహరించుకోవలసిందిగా నీలమ్ తలిదండ్రులపై ఒత్తిడి చేయసాగాడు. బెదిరించాడు.

1980 ఆగస్టు నెలలో నీలమ్ మామ పది వేల రూపాయల ఆశ చూపించి కేసును ఉపసంహరించుకోమని కోరాడు. కాని అందుకు నీలమ్ తల్లిదండ్రులు అంగీకరించలేదు. "ఈ డబ్బు పోలీసు వాళ్ళకు పారేసి కేసు కొట్టేయిస్తాను" అంటూ బలవిందర్సింగ్ వెళ్ళిపోయాడు.

1981 ఏప్రిల్ పదిహేడున నీలమ్ తల్లిదండ్రులను ఆమె మామ మరో ఇద్దరి సహాయంతో పొడిచి చంపేశాడు. నీలమ్ చెల్లెలు అచల కళ్ళముందే ఈ దారుణం జరిగింది.

పోలీసులు హుటాహుటిగా హత్యలు జరిగిన ప్రదేశానికి వెళ్ళారు. హడావుడి చేశారు. కేసు రిజిస్టర్ చేశారు. కాని నెల గడిచినా డాక్టర్ బలవిందర్సింగ్ను అరెస్టు చెయ్యలేదు. ఢిల్లీ పేపర్లన్నీ ఈ కేసు గురించి రాశాయి. పోలీసుశాఖ నిర్లక్ష్యాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నాయి. దాంతో బలవిందర్సింగ్ ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు లొంగిపోయాడు. ఇది మే 21 న జరిగింది. మేజిస్ట్రేట్ అతడిని జ్యుడిషియల్ కస్టడీలో ఉంచాడు. సాధారణంగా ఇలాంటి కేసులో నిందితుడిని పోలీసు కస్టడీకి అప్పగించడం జరుగుతుంది. మళ్ళీ పత్రికలు ఊరుకోలేదు.

ఈ విషయాన్ని హోం మినిస్టర్ జైల్ సింగ్ సీరియస్గా తీసుకున్నారు. బలవిందర్సింగ్నూ, సుఖదేవ్నూ, నరేందర్ కుమార్నూ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

నీలమ్, ఆమె చెల్లెలు అచల దిక్కులేని వాళ్ళయ్యారు. సమయానికి అడ్వకేట్ శ్రీ దలాల్ అదుకోకపోతే బజారుపాలయ్యేవారు. ఇద్దరు పిల్లలకూ దలాల్



కుటుంబం రక్షణ ఇచ్చింది. నీలమ్ తన కాళ్ళమీద తాను నిలబడగలిగే స్తోమతును సంపాదించుకునేవరకూ తమ దగ్గరే ఆ ఇద్దరూ ఉంటారని ఆ కుటుంబ సభ్యులు చెప్పారు.

ఎంతమంది దలాల్లాగ చెయ్యగలిగీ చేస్తున్నారు? ఎంతమంది ఏ కొంచమైనా చేయూతను ఇలా ఇస్తున్నారు?

నీలమ్ ప్రెస్వాళ్ళను చూసి ముందు భయపడింది. తర్వాత ఏడుస్తూ చెప్పింది....

నీలమ్ తల్లిదండ్రులు ఒకప్పుడు బాగా ఉన్నవారే. నీలం తండ్రి బంగారు నగలు చేసేవాడు.

ఒక రోజు అతనికి ఎవరో ఏదో మందు ఆహారంలో కలిపి పెట్టారు. ఆ తర్వాత అతను జబ్బుపడ్డాడు. మళ్ళీ కొలుకోలేదు. ఇంట్లో ఉన్న నగలన్నీ ఒక్కొక్కటీ అమ్మాల్సివచ్చింది. ఎన్ని మందులు తిన్నా ఆమె తండ్రి ఆరోగ్యం కుదుటపడలేదు. క్రమంగా ఉన్న కాస్త ఆస్తీ కరిగిపోయింది. నీలమ్ తల్లి రెక్కల కష్టం మీద కుటుంబాన్ని నడిపిస్తున్నది.

నీలమ్ అక్క పదకొండేళ్ళ వయసులోనే ఇల్లు వదిలి పారిపోయింది. ఒక అన్న ఉన్నాడు. ఢిల్లీ ట్రాన్స్పోర్ట్లో పని చేస్తున్నాడు. కాని ఇంటికి సహాయం చేసేవాడు కాదు. తల్లి, తండ్రి హత్య చెయ్యబడిన రోజు మాత్రం అతను నీలమ్కు కన్పించాడు. అంతే! తాను చెల్లెళ్ళ బాధ్యత తీసుకోలేనని స్పష్టంగా చెప్పేశాడు...

ఇదీ నీలమ్ చెప్పిన కథ.

నీలమ్ను కొందరు పెళ్ళి చేసుకుంటామని వచ్చారు. ఆమె ఒప్పుకోలేదు. శ్రీ దలాల్ కూడా ఆమె మనసు కుదుటపడి తన కాళ్ళమీద తాను నిల్చోగలిగినప్పుడే పెళ్ళి చేసుకుంటుందని చెప్పాడు.

శ్రీ దలాల్ ఆమెనూ ఆమె చెల్లెల్నీ స్కూలుకు పంపించి చదివించే ఏర్పాటు కూడా చేశాడు. "నీలమ్ పది పాస్ అయాక టీచర్ ట్రైనింగుకు పంపిస్తాను. ఉద్యోగం ఇప్పిస్తాను. ఆ తర్వాత ఆమె తన భవిష్యత్తును గురించి ఎలాంటి నిర్ణయం తీసుకున్నా సంతోషమే" అన్నాడు పాత్రికేయులతో.

మొట్ట మొదట చెప్పిన బ్యాంక్ అకౌంట్ను శ్రీ దలాల్ ఏర్పాటు చేశారు ఆ అకౌంటు నంబరు 11143(పంజాబ్ నేషనల్ బ్యాంకు, లేడీ శ్రీరామ్ కాలేజీ, ఢిల్లీ శాఖ) "ఆ అభాగినులకు సహాయపడదల్చుకున్న వారెవరైనా ఆ అకౌంటు నంబరుకు తోచినంత డబ్బు పంపించ వచ్చును." అని ప్రకటన ఇచ్చారు.

"ఎవరూ పంపించకపోయినాఫర్వాలేదు. వాళ్ళను నేను చదివిస్తాను" అన్నాడు శ్రీదలాల్. అతని కోడలుకూడా మామగారు తలపెట్టిన ఈ సత్కార్యానికి తోడ్పడుతున్నది.

మధ్య మధ్య నీలమ్కు ఆమెను చంపుతామని బెదిరింపు ఉత్తరాలు వస్తుంటాయి.

"ఏం చేస్తాం? నాకు ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది" అంటుంది ఆ పదహారేళ్ళ విరాగిని.

ఇలాంటి అభాగినులు ఎందరో?

నూటికి పదిమంది శ్రీ దలాల్ లాంటి మహా మానవులు ఉంటే కొందరికైనా ఊరట, ఉపాధి లభిస్తాయి.

❀ ❀ ❀



# 38. భారతంలో ఓ సావిత్రి

ఈ రోజుల్లో ఏ పేపరు చూసినా యువతి మానభంగం, వృద్ధురాలి మానభంగం, పసిపాప మానభంగం అనే వార్తలు కనిపిస్తున్నాయి. ఇలాంటి దారుణాలు జరుగుతున్న మన దేశంలో మానవత్వమే సిగ్గుతో తలవంచుకోవలసి వస్తోంది.

అయినా మానవరూపంలో ఉన్న జంతువులు ఇలాంటి నికృష్టపు పన్లు రోజూ చేస్తూనే ఉన్నాయి. ఇలాంటి అపరాధులను కఠినంగా దండించకపోవడమే వారి విజృంభణకు కారణం కావచ్చు. ఉద్యోగం చేస్తున్న సావిత్రి అనే యువతి బలాత్కారం గురించి ఈ కథలో చెప్పడం జరిగింది. ఈ కథ విని మనసున్న ఎవరైనా "ఇదా నా దేశం!" అని సిగ్గుతో తలవంచుకోవాలి.

కోర్టులో జనం కిటకిట లాడుతున్నారు. ఒకసాక్షి బోనులో నిలబడి ఉన్నాడు. వకీలు అతన్ని ప్రశ్నిస్తున్నాడు.

"అప్పుడు సరిగ్గా ఏడున్నరయిందని ఎలా చెప్పగలుగుతున్నావ్?"

"నా చేతికి గడియారం ఉంది. ఇప్పుడు కూడా ఉంది చూడండి!"

"అంటే నువ్వు కేకలు వినగానే ముందు చేసిన పని గడియారం చూడటం అన్నమాట!"

కోర్టులో ఉన్న ప్రేక్షకుల్లో కుతూహలం ఎక్కువైంది.

అంతకు ముందే ఒక డాక్టరు, మరో సాక్షి చెప్పిన సాక్ష్యాలు విన్నారు. దాదాపు రెండు గంటల నుంచీ ఈ కేసు నడుస్తోంది. మేజిస్ట్రేటు గంభీరంగా, శ్రద్ధగా వింటున్నారు.

ఒక నడి వయస్సులో వున్న వ్యక్తీ, మరో వృద్ధుడూ కలసి ఒక యువతి మీద చేసిన అత్యాచారం గురించి కేసు. ఆ రోజు ఆ యువతి కోర్టుకు హాజరు కాలేదు. ఆమె వాఙ్మూలం ముందే తీసుకున్నారు.

వకీలు ప్రశ్నకు పైన చెప్పిన సాక్షి. "అయ్యా! అంతకు పదినిముషాలు ముందే నా కొడుకు టైము అడిగాడు. అప్పటికి సరిగ్గా ఏడుంబావయింది" అని అన్నాడు. ఆ సాక్షి పేరు బంగాలీమల్.

"అప్పటికి బాగా చీకటి పడిందా?" వకీలు ప్రశ్న.

"ఆc! అవునండి!"

"అప్పుడు నువ్వెక్కడున్నావు?" మళ్ళీ అడిగాడు వకీలు.

"వరండాలో నిల్చున్నాను. అక్కడ దీపపు వెలుగు ఉంది."

"ఊc! ఆ తరవాత?"

"సావిత్రి కేకలు వినిపించాయి. నేను పరుగెత్తుకుని వెళ్ళాను. తలుపులు తెరిచే ఉన్నాయి. ఎదురుగా ఉన్న మంచంమీద సావిత్రి స్పృహ తప్పి పడి ఉంది. హోతీలాల్ ఆమెమీద ఉన్నాడు."

"అయితే జ్వాలా ఎక్కడున్నాడు."

"అతను వాకిలి ముందు నిల్చుని ఉన్నాడు. నన్ను లోపలికి పోనివ్వకుండా అడ్డుకున్నాడు."

"తర్వాత....?"

"హోతీలాల్ లేచి, నన్నొక తోపు తోసి ముందుకు పరుగు తీశాడు. అతని వెనకే జ్వాలా కూడా పరిగెత్తాడు. నా కేకలు విని జనం గుమిగూడారు. సావిత్రి ముఖాన్ని చేతుల్తో కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది."

"ఆ సమయంలో ఆమె బట్టలు ఎలా ఉన్నాయి?"

"అస్తవ్యంగా ఉన్నాయి!"

"నువ్వు హోతీలాల్ ఏం చేస్తుండగా చూశావ్?" "..............."

"సావిత్రి అప్పుడు ఎలాంటి స్థితిలో ఉంది?"

"అంత ఘోరమైన విషయాన్ని నా నోటితో ఎలా చెప్పమంటారు? సిగ్గుతో తల వాల్చుకోవలసిన విషయం అది...."

"తరవాత ఏమయింది?"

"చాలామంది గుమిగూడారు. సావిత్రి ఏడుస్తూ ఉంది. అల్లంత దూరంలో నిల్చుని ఆమె కొడుకు-ఎనిమిదేళ్ళవాడు- వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఆ దృశ్యం చూస్తుంటే కడుపు తరుక్కుపోయింది. కొందరు వాళ్ళకి ధైర్యంచెబుతుంటే, మరి కొందరు దుండగులను పట్టుకోడానికి పరిగెత్తారు.

హోతీలాల్, జ్వాలా దొరకలేదు! కొందరు సావిత్రిని తీసుకుని ఇరాదత్ నగర్ పోలీసు స్టేషనుకి వెళ్ళారు. అక్కడ రిపోర్టు రాయించారు."

ఆసుపత్రికి పెద్ద డాక్టరయిన డాక్టరు దినేష్ కుమార్ కోర్టులో సాక్ష్యం ఇస్తూ ఇలా చెప్పాడు-"సావిత్రిని ఒక లేడీ డాక్టరు ఆసుపత్రిలో పరీక్షించింది. ఆమె పెటీకోట్ కూడా పరీక్షించడం జరిగింది. ఆమె మీద బలాత్కారం జరిగినట్లే లేడీ డాక్టరు రిపోర్టిచ్చింది."

సావిత్రి, తదితరుల ద్వారా పోలీసు స్టేషన్‌లో నమోదైన రిపోర్టు సారాంశం ఇలావుంది: "ఆగ్రాజిల్లా! ఆజిల్లాలో చిత్రపూర్ అనే కుగ్రామంలో ఫామిలీ ప్లానింగ్ డిపార్టుమెంటులో శ్రీమతి సావిత్రి నర్సుగా పని చేస్తోంది. ఆమె వయస్సు 27 సంవత్సరాలు, వివాహిత. ఎనిమిదేళ్ళ కొడుకుకూడా ఉన్నాడు. అందగత్తె కాదు. సాధారణంగా ఉంటుంది. ఆమె చిత్తర్‌పూర్‌లో ఒక చిన్న ఇల్లు తీసుకుని పిల్లవాడితో ఉంటోంది. సెలవుల్లో పిల్లవాడిని తీసుకుని భర్త దగ్గరికి వెడుతూ ఉంటుంది. భర్తకూడా వస్తుంటాడు.



అది 1977 ఆగస్టు నెల 9వ తేదీ. సాయంత్రం దాదాపు ఏడున్నర గంటలవుతూంది. హోతీలాల్, జ్వాలా సావిత్రి ఇంటికి వచ్చారు. సావిత్రికి వాళ్ళతో పరిచయం ఉంది. అది చిన్న గ్రామం. సావిత్రి ఫామిలీ ప్లానింగ్ విషయాలు బోధించడానికి వెళ్తూ ఉంటుంది.

హోతీలాల్ సావిత్రికి నమస్కరించి, సిగ్గును అభినయిస్తూ. "ఒక "నిరోధ్" ప్యాకెట్టు కావాలి!"అన్నాడు.

"ఇప్పుడే ఇస్తాను!" అంటూ సావిత్రి పక్కగదిలోకి వెళ్ళింది. హోతీలాల్ ఆమె వెనకే వెళ్ళాడు. ఒక్కసారి ఆమెను రెండు చేతుల్తో బంధిస్తూ మంచం మీదికి తోశాడు. సావిత్రి అరుస్తూ ప్రతిఘటించసాగింది. లోపలికి వచ్చిన జ్వాలతో "నువ్వు బయట వాకిట్లో నిల్చో. ఎవరూ రాకుండా చూస్తూండు" అన్నాడు. అదే గదిలో వున్న సావిత్రి కొడుకు, ఏం జరుగుతున్నదో తెలిసే వయసులో లేకపోయినప్పటికీ, తల్లిని వాళ్ళేదో చేస్తున్నారనే భయంతో ఏడవడం మొదలు పెట్టాడు. సావిత్రి ఎంతకూ లొంగకపోవడంతో హోతీలాల్ సావిత్రిని పొత్తి కడుపుమీద ఒక్క తన్ను తన్నాడు. ఆమె అరుపులు ఆగిపోయినాయి. పిల్లవాడు ఏడుస్తూనే ఉన్నాడు.

ఆ తరువాత బంగాలీమల్ పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఎన్నో రోజులు వెతికిన తరువాత, జ్వాలా, హోతీలాల్ పోలీసులకు దొరికారు. జామీనుమీద కోర్టు వాళ్ళని విడుదల చేసింది.

న్యాయశాస్త్రంలో 452. 354 సెక్షన్ల క్రింద కేసు మునిసిఫ్ మేజిస్ట్రేట్ రమేష్ సిన్హా దగ్గర నడిచింది. ఆ కేసు నడుస్తున్నప్పుడు. ఆ గ్రామంలో ఎవరినోట విన్నా ఈ సంఘటన గురించే.

సావిత్రి మానసిక క్షోభతో, సిగ్గుతో సెలవుపెట్టి భర్త దగ్గరకు వెళ్ళిపోయింది. సావిత్రికి తనను భర్త ఆదరిస్తాడన్న నమ్మకం లేదు. ఇంటిలోకి రానివ్వడు అనుకుంది. కాని ఆమె భర్త సహృదయంతో ఆమెను ఆదరించాడు. అంతే కాకుండా కేసులో వాఙ్మూలం ఇవ్వటానికి భార్యను వెంటపెట్టుకుని చిత్తర్‌పూర్ వెళ్ళాడు.

కోర్టు జనంతో కిటకిట లాడుతోంది. హోతీలాల్, జ్వాలా పెట్టుకొన్న వకీలు సావిత్రిని కోర్టులో అవమానకరమూ, జుగుప్సాకరనూ అయిన ప్రశ్నలు అనేకం వేశాడు. ప్రేక్షకుల తలలు సైతం సిగ్గుతో కిందకు వాలిపోయాయి. సావిత్రి తల దించుకొని ఆ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇచ్చింది. ఉదాహరణకు కొన్ని ప్రశ్నలు ఇక్కడ ఇస్తున్నాను.

ప్రశ్న : హోతీలాల్ తరుచు నీ దగ్గరకు వస్తూ ఉంటాడని విన్నాను?
న : అబద్ధం.
ప్ర : నువ్వు అతన్ని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోమన్నావా?
న : అన్నాను.
ప్ర : నీ భర్త ఆపరేషన్ చేయించుకున్నాడా?
న : చేయించుకున్నారు.
ప్ర : నువ్వు హోతీలాల్‌తో ఆపరేషన్ చేయించుకోమని చెప్పడానికి కారణం?

న : అది నా డ్యూటీ: నేను అందరితోనూ ఆమాట చెప్పాలి. నేను చేసే ఉద్యోగం కుటుంబ నియంత్రణ విభాగంలో. ఇద్దరూ లేక ముగ్గురు పిల్లలు కలిగిన వాళ్ళందరితోనూ నేను ఆ మాట చెప్పాను. చెబుతూనే ఉన్నాను.

ప్ర : ఆపరేషన్ చేయించుకున్న పురుషుడితో సంబంధాన్ని ధైర్యంగా పెంచుకోవచ్చు కదూ?

న : అవును!

ప్ర : నీకు కూడా అలాంటి ధైర్యం ఉన్నది కదూ?

న : నేను ఇలాంటివి ఆలోచించనక్కర్లేదు. నాకు భర్త ఉన్నాడు. మేమిద్దరం చాలా అన్యోన్యంగా ఉంటాం.

ప్ర : ఆ రోజు హోతీలాల్ నిరోధ్‌ను ఉపయోగించాడు కదూ?

న : లేదు, అతను నిరోధ్ కొరకు మా ఇంటికి వచ్చాడు.

ప్ర : అయితే ఆ రోజు అతను నిరోధ్‌ను ఉపయోగించలేదంటావ్?

న : అవును!

ప్ర : అందుకే భయంతో కేకలు వేశావు. అవునా?

న : కాదు. అతను నామీద అత్యాచారం చేయడానికి పూనుకున్నాడు. అందుకే కేకలు పెట్టాను.

ప్ర : కాని బంగాలీమల్ వచ్చేసరికి నువ్వు కేకలు పెట్టలేదు. అవునా?

న : హోతీలాల్ నా పొత్తికడుపు మీద గట్టిగా తన్నాడు. నాకు స్పృహ తప్పింది.

ఇంతకంటే జుగుప్సాకరమైన ప్రశ్నలు వేశాడు వకీలు.

కోర్టునుంచి ఇంటికి వచ్చినా సావిత్రి అవమానంతో దహించుకుపోసాగింది. తిండి సహించడంలేదు. భర్త ఎంత ఉదారంగా ప్రవర్తించినా, అతనిముందు తలెత్తుకోలేక పోతున్నది! 'ఒక వేళ కేసు వాళ్ళు గెలిస్తే తను మళ్ళీ ఈ ప్రపంచంలో తలెత్తుకు తిరగలేదు. తనకు మృత్యువే శరణ్యం. కేసు పెట్టకపోయినా బాగుండేది. ఇంత అల్లరి అయ్యేది కాదు. అంతమంది ముందు నిలబడి ఎలాంటి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సివచ్చింది....' పరిపరి విధాల ఆలోచిస్తూ కృంగిపోసాగింది సావిత్రి.

ఒకడు జ్వాలాకు సావిత్రి అప్పు ఉందనీ. ఆ అప్పు తీర్చమని అడగడానికి వెళ్ళిన అతనితో ఘర్షణ పడిందనీ, పైగా కేకలు పెట్టిందనీ చెప్పాడు.

మరొకడు హోతీలాల్‌కూ సావిత్రికీ సంబంధం ఉన్నదనీ, ఎప్పుడూ అతను సావిత్రి ఇంట్లో కూడా ఉండేవాడనీ సాక్ష్యం ఇచ్చాడు.

ఇంకొకడు-జ్వాలా వృద్ధుడనీ, అతని మీద ఇలాంటి ఆరోపణలు చెయ్యడం అన్యాయం అనీ అన్నాడు. జ్వాలా అక్కడికి వెళ్ళేసరికే హోతీలాల్ సావిత్రి గదిలో ఉన్నాడనీ, జ్వాలా తలుపులు కొట్టడంవల్ల హోతీలాల్ తలుపులు తెరచుకొని బైటకు



వెళ్ళాడని సాక్ష్యం ఇచ్చాడు. అతనే జ్వాలాలాంటి వృద్ధుడు బంగాలీమల్‌ను లోపలకు వెళ్ళకుండా అడ్డుకోవడం అసాధ్యం అన్నాడు.

డాక్టర్ రిపోర్టు ప్రకారం ఆమె మీద బలాత్కారం జరిగిందనే విషయం రూఢి అయింది. కాని ఆ బలాత్కారం ఎవరు చేశారనేది వివాదాస్పదం.

సావిత్రి ఆఫీసు రిజిస్టరు కోర్టు ముందు ఉంచబడింది. హోతీలాల్ ఎన్నో పర్యాయాలు "నిరోధ్" ప్యాకెట్లు తీసుకెళ్ళినట్టు రాయబడి ఉన్నది. హోతీలాల్ సంతకాలు కూడా ఉన్నాయి.

1980, మార్చి 11వ తేదీన న్యాయమూర్తి తన తీర్పును విన్పించారు. కోర్టుకు సావిత్రి రాలేదు. హోతీలాల్, జ్వాలా, అతనికి కావాల్సినవాళ్ళు కోర్టుకు వచ్చారు. తాము గెలుస్తామనే నమ్మకం వాళ్ళకు బాగా ఉన్నది.

న్యాయమూర్తి రమేష్ చంద్ర సిన్హా తన తీర్పును విన్పించారు.

"ఇది మామూలు విషయంకాదు. ముందు వేసుకున్న పథకం ప్రకారం ఇద్దరూ నిరోధ్ కావాలనే మిషమీద సావిత్రి ఇంటికి వెళ్ళారు. ఆమె మీద బలాత్కారం చేశారు. ఆమె శీలాన్ని దోచుకున్నారు. ఇది నైతికంగానూ, చట్టరీత్యానూ ఘోరమైన అపరాధం. గ్రామాలలో చిన్న చిన్న ఉద్యోగాలుచేసే స్త్రీలమీద ఇలాంటి అఘాయిత్యాలు జరగడం పరిపాటే. ఇలాంటి వారిమీద దయ చూపించడం అంటే. చిన్న చిన్న ఉద్యోగాలు చేసే స్త్రీలకు అన్యాయం చెయ్యడం అన్నమాట. జ్వాలా, హోతీలాల్ ఇద్దరూ అపరాధం చేశారు. ఈ అపరాధులకు రెండేళ్ళ కఠిన కారాగారశిక్ష విధిస్తున్నాను. ఇద్దరికీ చెరొక పదిహేను వందలు జరిమానా కూడా విధిస్తున్నాను."

అపరాధులు ప్రస్తుతం జైలులో ఉన్నారు.

కాని వారు పై కోర్టుకు అపీల్ చేసుకున్నారు. హైకోర్టులో కేసు నడుస్తున్నది.

❀ ❀ ❀

# 39. ఉద్యోగం పేరిట మోసం

అది కలకత్తా నగరం.

"పోస్టు" అనే కేక వినిపించి ఫాతిమా ఒక్క దూకులో బయటికి వచ్చింది. పోస్టుమేన్ అందించిన రెండు కవర్లూ అందుకొని లోపలకు వెళ్ళింది. ఒకటి తన పేరుమీద వచ్చింది. కవరు విప్పి చదివింది. సంతోషంతో దాదాపు గెంతుతున్నట్టే తల్లి దగ్గరకు వెళ్లి "మమ్మీ! నాకు ఇంటర్వ్యూ కార్డు వచ్చింది" అన్నది.

"అయితే నీ కోరిక తీరిందన్నమాట ! ఇంటర్వ్యూ ఎప్పుడూ?" పెద్దగా ఉత్సాహం చూపించలేదు తల్లి, "ఎల్లుండి ఇక్కడే ఎక్స్‌ప్లెనేడ్ బిల్డింగ్స్‌లో" అన్నది ఫాతిమా.

"బి.డి. ఎంటర్‌ప్రైజెస్" అనే కంపెనీ చేసిన ప్రకటనను చూసి ఫాతిమా అప్లికేషన్ పెట్టింది. ఇంటర్వ్యూ వచ్చింది. ఫాతిమా బి.ఏ. చదివింది. తల్లిదండ్రులకు ఆమె ఒకర్తే కూతురు. ఆమె ఉద్యోగం చెయ్యడం వారికి ఇష్టం లేదు. పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు. పెళ్ళి అయేంతవరకైనా ఉద్యోగం చేయాలని ఫాతిమా సరదాపడుతున్నది. తల్లి, తండ్రి కాదనలేక వూరుకున్నారు. బి.ఏ. పూర్తి అయాక ఎం.ఏ చదవాలనుకుంది. అందుకు తండ్రి ఒప్పుకోలేదు. ఒక్కగాను ఒక్కబిడ్డ. అతి గారాబంగా పెరిగింది.

రాత్రి తండ్రి ఇంటికి వచ్చాక ఆ శుభవార్త తండ్రికి చెప్పింది. "జాగ్రత్తగా వెళ్ళు! అసలే రోజులు బాగాలేవు" అన్నాడు తండ్రి.

"కలకత్తాలో పెరిగాను. ఇక్కడ నాకేం భయం నాన్నా ! అయినా ఎక్స్‌ప్లెనేడ్ మనకు ఎంతో దూరం కాదు" అన్నది.

అది 1976 జూన్ రెండవ తేదీ! ఉదయం తొమ్మిది గంటలకు ఫాతిమా బయలుదేరింది. బస్‌లో వెళ్ళింది. అర్ధగంటలోపునే ఎక్స్‌ప్లెనేడ్ చేరుకుంది. అక్కడ 32వ నంబరు భవనం దగ్గరకు వెళ్ళింది. ఆ బిల్డింగులోని మూడో అంతస్తులో "బి. డి. ఎంటర్‌ప్రైజెస్" ఆఫీసు ఉన్నది. ఫాతిమా వెళ్ళేసరికి మరో నలుగురైదుగురు ఆడ పిల్లలు అక్కడ కూర్చొని ఉన్నారు. బంట్రోతు ఒక కాగితాం మీద ఫాతిమా పేరు రాయించుకున్నాడు.

❀ ❀ ❀

ఫాతిమా తండ్రి రంజాన్ మియా సాయంత్రం ఏడు గంటలకు ఇంటికి వచ్చాడు. భార్య ఫాతిమా ఇంటికి తిరిగి రాలేదని చెప్పింది.

ఏ స్నేహితురాలింటికో వెళ్ళి ఉంటుంది అనుకున్నాడు రంజాన్ బట్టలు మార్చుకుంటూ.



రాత్రి తొమ్మిది అయింది. ఫాతిమా ఇల్లు చేరలేదు. "పిల్ల ఇంకా రాలేదు. ఏమైందో ఏమో! కాస్త అలా వెళ్ళి చూడండి!" తల్లి ఆదుర్దాగా అన్నది.

"వస్తుందిలే!" అన్నాడేకాని రంజాన్‌కూ లోలోపల అనుమానంగానే ఉన్నది. పది అయింది. ఫాతిమా జాడలేదు. రంజాన్ అత్యుతగా రోడ్డు మీదకు వచ్చాడు. కానీ ఎక్కడ వెతకాలో అర్థం కాలేదు. తెలిసినవాళ్ళ ఇంటికివెళ్ళి "బి. డి. ఎంటర్‌ప్రైజెస్"కు ఫోన్ చేశాడు. రెస్పాన్సు లేదు. ఆ ఇంటిగలాయన సలహా మీద రంజాన్ మియా పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు. అతని గోడంతా విని ఇన్‌స్పెక్టర్ "ఇంతకీ మీ అమ్మాయి వయసెంత?" అన్నాడు.

"ఇరవై నిండాయి. బి.ఏ. చదివింది" అన్నాడు రంజాన్.

ఇన్‌స్పెక్టర్ ముసిముసిగా నవ్వుతూ "అయితే రిపోర్టు అక్కర్లేదు. ఈ పాటికి ఇంటికి వచ్చి ఉంటుంది. మీరు వెళ్ళండి" అన్నాడు. రంజాన్ మనసు అనేక కుశంకలతో నిండిపోయింది. రోడ్డుమీద నడుస్తున్నాడు. ఇంత ప్రొద్దుపోయి తెలిసిన వాళ్ళ ఇంటికి వెళ్ళి వయసులో ఉన్న ఆడపిల్ల గురించి వాకబు చెయ్యడం అనేక వుకార్లకు దారితీస్తుందని భయపడ్డాడు. తిన్నగా ఇంటికి వచ్చాడు.

భర్త వంటరిగా రావడం చూసి "యా అల్లా!" అంటూ ఏడవసాగింది. రాత్రి పన్నెండు దాటింది. ఇద్దరూ రాత్రంతా ఫాతిమా కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు. తెల్లవారింది. అయినా ఫాతిమా జాడ లేదు. రంజాన్ మియా "బి.డి.ఎంటర్‌ప్రైజెస్" ఆఫీసుకి వెళ్ళాడు. మేనేజర్‌ను కలిసి "మా అమ్మాయి నిన్న మీ కంపెనీ ఇంటర్వ్యూకు వచ్చింది. కాని ఇంతవరకూ ఇల్లు చేరలేదు" అన్నాడు.

మేనేజర్ ఆశ్చర్యంగా రంజాన్ ముఖంలోకి చూశాడు. "అదేమిటి? నిన్న ఇంటర్వ్యూ పన్నెండు గంటలకే పూర్తి అయిపోయిందే. పోలీసు రిపోర్టు ఇవ్వకపోయారా"అన్నాడు.

రంజాన్ పోలీసు స్టేషన్‌కు వెళ్ళలేదు. ఫాతిమా స్నేహితుల ఇళ్ళకూ, తమ బంధువుల దగ్గరకూ వెళ్ళి వాకబు చేశాడు. ఫాతిమా జాడ తెలియలేదు.

చూస్తుండగానే వారం రోజులు గడిచిపోయాయి. ఫాతిమా తల్లి మంచం పట్టింది. రంజాన్ ఊరంతా పిచ్చివాడిలా తిరగసాగాడు.

జూన్ 10వ తేదీన పోస్టుమేన్ తలుపు కొట్టి రంజాన్‌కు ఒక కవరు యిచ్చాడు. స్టాంపులు అంటించలేదు. డబ్బు కట్టాలన్నాడు. కవరు మీద దస్తూరీ చూడగానే రంజాన్ కళ్ళు వెలిగిపోయాయి. అది ఫాతిమా దస్తూరీ. డబ్బు చెల్లించి వణుకుతున్న చేతులతో కవరు విప్పాడు. అందులో ఒక చిత్తు కాగితం ఉన్నది దానిమీదా పెన్సిలుతో ఇలా రాసి ఉంది.

"అబ్బా జాన్! వెంటనే వచ్చేయండి. నేను హైదరాబాదు "పత్తర్ ఘట్టి"లో ఉన్నాను. మక్‌బూల్ మియా ఇంటిలో బంధించబడి ఉన్నాను.

-ఫాతిమా

రంజాన్ మియా లోపలకు పరుగెత్తి భార్యకు వార్త చెప్పాడు. "అయ్యో! ఏ సైతాన్ చేతుల్లో నా బిడ్డ చిక్కిందో! మీరు వెంటనే వెళ్ళండి" అంటూ ఏడవసాగింది ఫాతిమా తల్లి.

ఆరోజే కలకత్తా పోలీసు కమీషనర్‌కు రిపోర్టు ఇచ్చి, హైదరాబాదుకు బయలుదేరాడు ఫాతిమా తండ్రి. రంజాన్ హైదరాబాదు చేరుకునేసరికి కలకత్తా పోలీసుల నుంచి వచ్చిన మెసేజ్ ప్రకారం హైదరాబాదు పోలీసువారు (ఆ రాత్రికి రాత్రే) పత్తర్ ఘట్టిలో ఉన్న మకబూల్‌మియా ఇంటిమీద దాడిచేసి ముగ్గురు ఆడ పిల్లల్ని కస్టడీలోకి తీసుకున్నారు. అందులో ఒకామె ఫాతిమా. వాళ్ళతో పాటు వున్న ఒక వయసు మళ్ళిన స్త్రీని కూడా కస్టడీలోకి తీసుకున్నారు.

ఆ ముదుసలి "మక్‌బూల్ మియా ఆడపిల్లల్ని ఎత్తుకొచ్చి అరబ్బులకు అమ్ముతాడు" అని చెప్పింది పోలీసులకు.

రంజాన్ మియా హైదరాబాద్ పోలీసుస్టేషన్‌కు వచ్చాడు. ఫాతిమా తండ్రిని చూస్తూనే అమాంతం గుండెలమీద వాలిపోయి భోరు భోరున ఏడ్చింది. ఫాతిమాను తీసుకొని రంజాన్ మియా కలకత్తాకు బయలుదేరాడు.

హైదరాబాద్ పోలీసు డిపార్ట్‌మెంటు ఇచ్చిన మెసేజ్ ప్రకారం కలకత్తా పోలీసులు "బి.డి. ఎంటర్‌ప్రైజెస్" కంపెనీ మీద దాడికి వెళ్ళారు. కాని అప్పటికే ఆ ఆఫీసుకు సంబంధించిన గదులన్నీ ఖాళీగా ఉన్నాయ్. ఇంటి యజమాని తనకు చెప్పకుండానే రాత్రికి రాత్రి ఖాళీ చేసి వెళ్ళిపోయారు అని చెప్పాడు.

## ఫాతిమా చెప్పిన కథ

జూన్ 2వ తేదీన ఇంటర్వ్యూకు వెళ్ళాను. పన్నెండు గంటలకు ఇంటర్వ్యూ పూర్తి అయింది. మేనేజర్ రెండు గంటలకు ఒకసారి వచ్చి కన్పించమన్నాడు. రెండుగంటల వరకూ ఆ దరిదాపులో ఉన్న రెస్టారెంటులోనూ, షాపుల్లోనూ గడిపి తిరిగి ఆఫీసుకు వెళ్ళాను. నేను వెళ్ళేసరికి మేనేజరు గదిలో మరొక వ్యక్తి కూర్చొని ఉన్నాడు. మేనేజరు ఆ వ్యక్తిని నాకు పరిచయం చేస్తూ అతనితో హెడ్డాఫీసుకు వెళ్ళి అపాయింట్‌మెంటు ఆర్డర్ తీసుకోమనీ, మర్నాడు వచ్చి డ్యూటీలో చేరమనీ చెప్పాడు. నా సంతోషానికి అంతే లేదు. ఆ వ్యక్తి పేరు గుర్తులేదు. అతని వెంటే కిందకు వచ్చాను. అక్కడ నిలబడి ఉన్న టాక్సీలో ఎక్కమని తానూ నావక్కన కూర్చున్నాడు. నేను చెయ్యవలసిన పని గురించి చెప్పసాగాడు. నేను శ్రద్ధగా వింటున్నాను. అంతలో టాక్సీ ఒక ఇంటి ముందు ఆగింది.

"ఇదే మా ఇల్లు. ఒక్కసారి దిగండి. చాయ్ తీసుకొని వెళ్దాం!" అంటూ నా సమాధానం వినకుండానే దిగాడు. నేను కూడా దిగి అతని వెనకే వెళ్ళాను. నన్ను కూర్చోమని అతను బయటికి వెళ్ళి టాక్సీ పంపించివేసి లోపలకు వచ్చాడు. "టాక్సీ పంపించేశారేం?" అని అడిగాను. "పంపించలేదు. పెట్రోలు పోసుకొని వస్తానని వెళ్ళాడు. పది నిమిషాల్లో వచ్చేస్తాడు" అన్నాడు. ఒక ఏభైఏళ్ళ వయసులోఉన్న స్త్రీ బయటికి వచ్చింది. ముస్తాబు మాత్రం పాతికేళ్ళ దానిలా చేసుకుంది. ఆమెతో అతను "రెండు చాయ్" అన్నాడు. ఆమె ఐదునిముషాల్లో రెండు కప్పుల్లో టీ తీసుకొని వచ్చింది. ఒక కప్పు నాకు అందించింది. రెండోది ఆ వ్యక్తికి ఇచ్చింది. టీ



తాగిన రెండు మూడు నిమషాల్లోనే నాకు తలతిరగసాగింది. ఏదో చెప్పాలనుకున్నాను. చేతకాలేదు. స్పృహ తప్పి పడిపోయాను. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. స్పృహ వచ్చేసరికి మరో ఇంట్లో ఉన్నాను.

అక్కడ దాదాపు నా ఈడువాళ్ళే మరో ఐదుగురు ఉన్నారు. ఒక ముసలమ్మ కూడా ఉన్నది. ఆ ముసలమ్మ ద్వారా నేను హైదరాబాదులో ఉన్నట్టు తెలుసుకున్నాను. నేను ఏడుస్తుంటే ఆ ముసలమ్మ ఓదార్చడానికి ప్రయత్నించింది. ఆ ముసలమ్మ నన్ను ఎందుచేతనో మిగతావాళ్ళలా చూడలేదు. చాలా అప్యాయంగా ఉండేది. నాలుగు రోజుల తర్వాత ఆ ముసలమ్మనే అడిగి ఒక పెన్సిల్ తీసుకున్నాను. చిత్తు కాగితం మీద "అబ్బా జాన్" కు ఉత్తరం రాశాను. మరో చిత్తు కాగితంతో కవరు చేశాను. పోస్టు చెయ్యమని ఆ ముసలమ్మనే అడిగాను. ఆమె ఆ ఉత్తరం అతి రహస్యంగా పోస్టు బాక్స్‌లో వేసింది. ఆమె రుణం ఈ జీవితంలో తీర్చుకోలేనిది" అంటూ రెండు చేతులు ఎత్తి ఎదురుగా లేని ఆ ముసలమ్మకు నమస్కరించింది ఫాతిమా.

❀ ❀ ❀

# 40. ప్రేమపరీక్ష

"ఏరా నేను విన్నది నిజమేనా?

"నిజమే!" తండ్రి ప్రశ్నకు కొడుకు రాణా తల వంచుకుని సమాధానం ఇచ్చాడు.

"నీ వివాహం నిశ్చయం అయింది. ఆ పిల్ల తండ్రికి నేనేం సమాధానం ఇవ్వను? అతను మనకు ఎంతో సహాయం చేశాడు. శ్యామకు ఏం తక్కువైంది. అందమైన పిల్ల. బుద్ధిమంతురాలు. పైగా నిశ్చితార్థం కూడా జరిగింది." తండ్రి దీపక్ చక్రవర్తి కోపంతో వూగిపోయాడు.

"అమ్మ మాటకు ఎదురు చెప్పలేకపోయాను. వదినలు వూపిరాడనివ్వలేదు. అందుకే ముందు అంగీకరించాను. కాని నా మనసు ఎదురు తిరుగుతోంది. ప్రేమించిన యువతిని మోసం చెయ్యలేను."

"ఎవరా పిల్ల?"

"స్వప్న . మన ఇంట్లో అద్దెకున్న భాటారియా కూతురు."

ఆ మాటతో చక్రవర్తికి మతిపోయినట్టే అయింది.

"పిచ్చిగా వాగకు. మన అంతస్తేమిటి వాళ్ళ అంతస్తేమిటి? ఈ పెళ్ళి జరగదు."

"ప్రేమకు అంతస్తులు అడ్డురావు. నేను స్వప్ననే పెళ్ళి చేసుకుంటాను." అన్నాడు మొండిగా రాణా చక్రవర్తి.

"అయితే వెళ్ళరా! నా ఇంట్లో వుండటానికి వీల్లేదు. నా సంపాదనలో నుంచి ఒక్కపైసా నీకు రాదు. ఫో!"

"నాకు నీడబ్బు అక్కర్లేదు." అంటూ బయటకు వెళ్ళిపోతున్న తమ్ముడికి అన్న అనీల్ చక్రవర్తి అడ్డు వచ్చాడు. తమ్ముడ్ని చెయ్యి పట్టుకుని ఆపాడు.

"నాన్నా! నువ్వు ఇలా బెదిరించడం బాగా లేదు. నీకు ఆ పిల్ల మనింట్లో కోడలిగా వుండటం ఇష్టం లేకపోతే పోనియ్. తమ్ముడికి అతని వాటా ఇచ్చి పంపించండి. వాడు సుఖంగా వుండటమే మనకు కావాల్సింది" అంటూ తండ్రికి నచ్చజెప్పాడు పెద్దకొడుకు.

రాణా చక్రవర్తి స్వప్నతో రిజిస్టర్ వివాహం చేసుకున్నాడు. తండ్రి ఇచ్చిన నగదుతో నదియా జిల్లా కృష్ణనగరం వెళ్ళిపోయాడు. అక్కడ రెడీమేడ్ షాపు పెట్టుకొన్నాడు. అద్దెకు ఇల్లు తీసుకున్నాడు. వ్యాపారం బాగానే ఉంది. రాణా తండ్రి



ఇంట్లో మళ్ళీ కాలుపెట్టలేదు. స్వప్న మాత్రం పుట్టింటికి వచ్చినప్పుడల్లా అత్తవారింటికి వెళ్లేది. అత్తవారింట్లో ఆమెను ప్రేమగానే చూసేవారు.

ఆరు ఏళ్లు గడిచాయి. పెళ్లయిన రెండేళ్ళకు స్వప్నకు ఒక ఆడపిల్ల పుట్టి పురిట్లోనే చనిపోయింది. అ తర్వాత పిల్లలు కలుగలేదు. రాణా కృష్ణనగర్‌లో స్వంత ఇల్లు కట్టించుకున్నాడు. మరో బట్టల దుకాణం కూడా తెరిచాడు. అన్న అనిల్ కారు కొని తమ్ముడికి ఇచ్చాడు.

తండ్రి చనిపోయినప్పుడు మాత్రం మొదటిసారిగా రాణా ఇంటికి వచ్చాడు. రాణాకు పిల్లలు లేని కొరత ఒకవైపు బాధించసాగింది. ఇరుగు పొరుగుల మాటల ద్వారా స్వప్న తను లేనప్పుడు రమేశ్‌తో తిరుగుతుందని విన్నాడు. మొదట అతను నమ్మలేదు.

రాణాకు పెద్దగా స్నేహితులు లేరు. అతనికి ఉన్న ఏకైక స్నేహితుడు రమేశ్ గుహా మాత్రమే. అందువల్లనే అతను వాళ్ళిద్దర్నీ సందేహించలేకపోయాడు. కాని ఇరుగు పొరుగు గుసగుసలు ఎక్కువయ్యాయి. కొందరు అతనికి ఆకాశరామన్న ఉత్తరాలు కూడా రాయసాగారు.

స్వప్న మీద ఎంత నమ్మకం పెంచుకోవాలనుకున్నా క్రమంగా అనుమానం మనసులో చోటుచేసుకోసాగింది.

"స్వప్నా! ఒకసారి బరహామ్‌పూర్ వెళ్ళి వస్తాను. అమ్మను చూడాలని ఉంది. అన్నయ్య కూడా ఒకసారి వచ్చి వెళ్ళమని ఉత్తరం రాశాడు." అన్నాడు భార్యతో.

"ఎన్ని రోజులు?"

"వారం రోజులు వుంటాను."

"మరి ఇక్కడ వ్యాపారం?" భర్తముఖంలోకి పరిశీలనగా చూస్తూ అడిగింది స్వప్న.

"మున్షీ చూసుకుంటాడు. నీకు భయం అయితే రాత్రుళ్ళు వంటావిడను పడుకోబెట్టుకో. రేపే వెళ్తున్నాను" అన్నాడు రాణా.

అ సాయంత్రం స్వప్న కూడా భర్తతో స్టేషన్‌కు వెళ్ళింది. బరహామ్‌పూర్ వెళ్ళే ప్యాసెంజరు కదిలింది. భర్తకు సెండ్ఆఫ్ ఇచ్చి స్వప్న ఇంటికి వచ్చింది.

ఆ రాత్రి 11.45 గంటలకు ఎవరో తలుపు తట్టారు. వంటమనిషి తలుపు తెరిచింది. ఎదురుగా యజమాని రాణాను చూసి గాభారా పడింది.

"సాబ్! మీ.... మీరు వూరికెళ్ళలేదా?"

"అమ్మగారెక్కడ?"

"బయటికెళ్ళారు?"

"ఎక్కడకెళ్ళింది?"

"రమేశ్ గుహాతో వెళ్ళారు." వణికిపోతూ అన్నది.

"ఈ నాటకం ఎప్పట్నించి జరుగుతుంది?"

"చాలా కాలం....." నీళ్ళు నమిలింది వంట మనిషి.

"మేము ఈ వూరు వచ్చినప్పట్నుంచి ఈ యింట్లో పని చేస్తున్నావు. నిన్ను నేను ఎంతో ఆదరించాను. ఆ విషయం నాకు చెప్పాలని నీకు ఎందుకనిపించలేదు." రాణా కళ్ళు నిప్పు కణాల్లా మారాయి.

"బుద్ధి గడ్డి తిన్నది. వాళ్ళు నాకు బాగా డబ్బు ఇచ్చారు. క్షమించండి సాబ్. దేవుడిలాంటి మిమ్మల్ని మోసం చేశాను."

"ఆపు నీ నక్క వినయాలు. నేను వెళ్తున్నాను. నేను వచ్చి వెళ్ళినట్టు మీ అమ్మగారికి చెప్పకు. చెప్పావా ముందు నిన్ను చంపేస్తాను."

వంటమనిషి నిలువెల్లా కంపించిపోతూ "చెప్పను సాబ్" గవదలు వణుకుతుండగా అన్నది. రాణా గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు. అ- రాత్రి ఒక సిటీ హోటల్లో వుండి తెల్లవారి పదింటికి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భర్తను చూసి స్వప్న బిగుసుకుపోయింది. త్వరగా రావడానికి ఏదో కారణం కల్పించి భార్య అడగక ముందే రాణా చెప్పేశాడు. కొంతసేపటికి రమేష్ వచ్చాడు, రాణా అతనితో మామూలుగానే మాట్లాడాడు. రమేశ్ కూడా ఎప్పటిలాగే వున్నాడు.

❀ ❀ ❀

అది 1983 ఏప్రిల్ 17వ తేదీ. ఇద్దరు యువకులు దగ్గరలో వున్న పోలీసుస్టేషన్‌కు వెళ్ళి, వాళ్ళ సుఖాంతపల్లి వూరిబయట ఒక కారు వుందనీ, ఆ కారుకు కొద్ది దూరంలో ఒక యువకుడి శవం వుందనీ, ఆ శవం కణతలో రివాల్వర్ దెబ్బవుందనీ, శవం పక్కనే రెండు రివాల్వర్లు వున్నాయనీ, అందులో ఒకటి ఖాళీ అని చెప్పారు. ఇన్‌స్పెక్టరు వాళ్ళచేత రిపోర్టు రాయించి సిబ్బందితో బయలుదేరాడు. ఆ రివాల్వర్స్ మీద వున్న వేలిముద్రలు తీసుకొని, శవాన్ని పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. కారు నెంబరు ద్వారా, ఆ కారు ఎవరికి సంబంధించిందో తేలిగ్గానే తెలుసుకున్నారు.

ఇన్‌స్పెక్టర్ రాణా ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. ఒక స్త్రీ తలుపు తెరిచింది. "మీరు మిసెస్ చక్రవర్తి అనుకుంటాను." అన్నాడు.

"అవును." పోలీసు ఇన్‌స్పెక్టర్‌ను చూసి గాభారాగా అన్నది.

"మీ భర్తను ఎవరో హత్యచేశారు. శవం స్టేషన్‌లో వుంది రండి." అన్నాడు.

ఆమె గొల్లు గొల్లున ఏడవసాగింది. ఆమెను వూరడించి స్టేషన్‌కు తీసుకెళ్ళారు. భర్త శవాన్ని చూడగానే ఒక్కసారిగా బావురుమని ఏడవ సాగింది.

ముందు ఆత్మహత్యగా భావించిన కేసు వేలిముద్రల నిపుణుల రిపోర్టు చూశాక చిక్కు ప్రశ్నగా తయారైంది. గుళ్ళు వున్న రివాల్వర్ మీద రాణా వేలిముద్రలతోపాటు మరో పురుషుడి వేలిముద్రలు కూడా వున్నాయి.

కేసు పెద్ద కుటుంబానికి సంబంధించింది- మిసెస్ చక్రవర్తి, రాణా అన్న అనిల్ చక్రవర్తి కేసును సి.ఐ.డి. డిపార్టుమెంటుకు అప్పగించారు.



మే 10వ తేదిన మిసెస్ చక్రవర్తి సి.ఐ.డి. ఇన్‌స్పెక్టర్ అహిన్‌డేకి ఫోన్ చేసింది. "ఇన్‌స్పెక్టర్ వెంటనే మా ఇంటికి రండి. హంతకుడి ఆచూకీ మీకు తెలుస్తుంది. హంతకుడి పేరు రమేశ్ గుహ్. అతను మాపొరుగునే వుంటున్నాడు. అంతేకాదు.. రెండో హంతకుడు ఎవరో కూడా మీకు తెలుస్తుంది." అని చెప్పి ఇన్‌స్పెక్టర్‌కు మరో ప్రశ్న వేసే అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసింది. ఇన్‌స్పెక్టర్ వెంటనే బయలుదేరి రాణా ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. తలుపులు తెరుచుకున్నాయి. ఆసిస్టెంటుతో లోపలికి ప్రవేశించిన ఇన్‌స్పెక్టర్‌కు మిసెస్ చక్రవర్తి శవం కన్పించింది. దిమ్మెరపోయాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ డాక్టర్‌ను పిలిపించాడు. విషం తీసుకుని అత్మహత్య చేసుకొన్నదని డాక్టర్ రిపోర్టు ఇచ్చాడు.

రమేశ్ గుహ్ పరారిలో వున్నాడు. వారం రోజుల్లోనే అతన్ని అతని ఇంట్లోనే అరెస్టు చేశారు. ముందు రమేశ్ ఈ విషయంలో తనకు ఏమీ తెలియదన్నాడు. పోలీసులు కొంత కఠినంగా ప్రవర్తించక తప్పలేదు. రమేశ్ అసలు విషయం బయట పెట్టాడు. ఆ అసలు విషయం

ఆ రోజు దుకాణాలకు సెలవు రోజు. రాణా ఇంట్లోనే వున్నాడు. సాయంత్రం కారులో బయటికి వెళ్ళి గంట తర్వాత తిరిగి వచ్చాడు. రమేశ్ తన భార్యతో మాట్లాడుతూ వుండటాన్ని చూశాడు.

"రమేశ్ నేను నా భార్యతో అలా తిరిగి రావాలనుకొంటున్నాను. కావాలంటే నువ్వూ రా. అలా సర్దాగా వెళ్ళొద్దాం" అన్నాడు రాణా. రమేశ్ కూడా బయలుదేరాడు. ముగ్గురూ కార్లో బయటికి వెళ్ళారు. రాణా కారు వూరు దాటింది. వెనక సీట్లో వున్న స్వప్న, రమేశ్ కబుర్లలో మునిగిపోయి వున్నారు. రాణా రియర్‌వ్యూ మిర్రర్‌లో నుంచి చూస్తున్నాడు. అతని నరాలలో రక్తం మరుగుతోంది. అయినా పైకి వీలయినంత ప్రశాంతంగా వుండటానికి ప్రయత్నిస్తూనే వున్నాడు. సుఖాంత పల్లి వూరు బయట కారు ఆపాడు. దిగి వెనక తలుపు తెరిచాడు. స్వప్న రమేశ్‌తో ఏదో అని పకపకా నవ్వుతూ కారుదిగింది.

రాణా స్వప్న చెంప మిద లాగి కొట్టాడు స్వప్న నిర్ఘాంతపోయి నిల్చుంది. రమేశ్ కూడా తెల్లబోయాడు. రాణా రెండు చేతులతో రెండు రివాల్వర్లు చూపిస్తూ "దిగరా!" అన్నాడు రమేశ్‌ను ఉద్దేశించి

రమేశ్ వణికిపోతూ కారు దిగాడు.

"స్వప్నా! నిన్ను ఇంత నీచురాలుగా భావించలేకపోయాను. కేవలం ఒక కులటకోసం నేను తల్లిదండ్రుల్నీ, నా కులపు వాళ్ళనూ ఎదిరించాను. నా వాళ్ళందరికీ దూరం అయ్యాను. నేను నీకేం తక్కువ చేశాను? నిన్ను నా జీవిత సర్వస్వంగా భావించానే! ఇదా నాకు నువ్వు ఇచ్చిన ప్రతిఫలం? నీ సంగతి విన్నాను. ముందు నమ్మలేదు. ఆ తర్వాత ఊరికి వెళ్తున్నట్టు నాటకం ఆడి అసలు విషయం తెలుసుకున్నాను. అయినా నువ్వు పశ్చాత్తాపపడి, మారిపోతావనే ఆశతో కొన్ని రోజులు ఎదురుచూశాను. కాని మీరు రోజురోజుకూ బరితెగించి ప్రవర్తించసాగారు"

అని రమేశ్‌వైపు తిరిగి ఇలా అన్నాడు రాణా "ఒరేయ్ కుక్కా నువ్వు ప్రాణస్నేహితుడినే మోసం చేశావు. నీలాంటి చీడపురుగు ప్రాణంతో ఉండకూడదు."

"నన్ను క్షమించు రాణా! నేను స్వప్నను నిజంగానే ప్రేమిస్తున్నాను. నువ్వు అనుమతిస్తే ఆమెను నేను వివాహం చేసుకుంటాను" అన్నాడు రమేశ్ నీళ్ళు నములుతూ.

రాణా గొల్లున నవ్వాడు.

"ఆల్‌రైట్! నువ్వు స్వప్నను ఎంతగా ప్రేమిస్తున్నావో నేను తెలుసుకోవాలి. ఈ రివాల్వర్ తీసుకో."

రాణా అందించిన రివాల్వర్‌ను వణుకుతున్న చేత్తో అందుకున్నాడు రమేశ్.

"ఆఁ పేల్చు స్వప్న మీద. గురిచూసి కాల్చు."

"రాణా! నువ్వు ఏం చెబుతున్నావో ఒకసారి ఆలోచించు" వణికిపోతూ అన్నాడు రమేష్.

"బాగా ఆలోచించే చెప్పాను. నువ్వు స్వప్నను కాల్చకపోతే నేను నిన్ను కాల్చేస్తాను" అంటూ తన చేతిలోని రివాల్వర్‌ను రమేశ్ మీదకు గురి పెట్టాడు రాణా.

రమేశ్ ఓ క్షణం నిలువెల్లా వణికాడు. స్వప్న కళ్ళల్లో మృత్యు నీడలు రెపరెపలాడాయి. వళ్ళంతా చమట్లు పోశాయి.

"ఊఁ కానియ్!" రాణా గద్దించాడు.

రమేశ్ వేలుకింద ట్రిగ్గర్ నొక్కబడింది. కటకట శబ్దాలు వస్తున్నాయి. కాని రివాల్వర్‌లో నుండి గుండు రాలేదు.

రాణా పకపక నవ్వాడు. పిచ్చివాడిలా విరగబడి నవ్వాడు. స్వప్న భయంతో అంతవరకూ మూసుకున్న కళ్ళు తెరిచింది. భర్త ముఖంలోకి పిచ్చిచూపులు చూసింది.

"చూశావా స్వప్నా నీ ప్రియుడు నిన్నెంతగా ప్రేమిస్తున్నాడో? తన ప్రాణాలకోసం నిన్ను చంపడానికి సిద్ధమయ్యాడు. వాడు ఎలాంటివాడో నాకు తెలుసు. అందుకే ఖాళీ రివాల్వర్ ఇచ్చాను."

స్వప్న ఒక్కసారిగా రాణా కాళ్ళమీద వాలి పోయింది. రాణా చివాల్న వెనక్కు తగ్గాడు.

"నన్ను క్షమించు" వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నది స్వప్న.

"నేను ఆ పని చెయ్యలేను. కాని నిన్ను చంపలేను. నువ్వంటే నాకింకా ప్రేమ ఉంది. అందుకే నీకు న్యూసెన్స్ కావడం నాకిష్టం లేదు. నీకు స్వతంత్రం ఇచ్చేస్తున్నాను. నీకు ఇష్టమైనట్టుగా నువ్వు బతుకు. శెలవు."

రాణా చేతిలోని రివాల్వర్ పేలింది. అతను తన కణత మీద రివాల్వర్‌ను పేల్చుకొన్నాడు. కింద పడిపోయిన రాణామీద పడి స్వప్న ఏడవసాగింది.



"త్వరగా లే. ఏడుస్తూ కూర్చుంటే మనిద్దరం కటకటాల్లో ఉండాల్సివస్తుంది" అంటూ రమేశ్ తొందరపెట్టి అక్కడ్నుంచి స్వప్నను తీసుకెళ్ళాడు.

క్రమంగా ఆమెకు రమేశ్ ప్రేమమీద నమ్మకం సన్నగిల్లింది. భర్తకు ద్రోహం చేశాననే అపరాధ భావంతో ఆమె మనసు కృంగిపో సాగింది. చివరకు ఆత్మహత్యే శరణ్యంగా భావించింది, చనిపోతూ ఫోన్‌చేసి సి.ఐ.డి.ఇన్‌స్పెక్టర్‌కు రమేశ్ పేరు చెప్పింది.

రమేశ్ జామీను మీద విడుదల అయ్యాడు.

కేసు ఇంకా కోర్టులో నడుస్తూనే ఉంది.

❀ ❀ ❀

# 41. మనసున్న మనిషి

రాత్రి తొమ్మిదిన్నరయింది. గంగాధర్ తన భార్య అనసూయతో పోలీస్ స్టేషన్‌లో నిలబడి వున్నాడు. అతని కొడుకు అయిదేళ్ళవాడు. గంగాధర్ బుజం మీద నిద్ర పోతున్నాడు.

"మళ్ళీ ఏమిటి?" ఇన్‌స్పెక్టర్ ప్రభు అడిగాడు.

"సర్! మీకు రిపోర్టు చేశామని తెలిసి, అతను మా ఇంటికి వచ్చి నన్ను ఆ చంపా ఈ చంపా వాయగొట్టాడు. నువ్వు ఈ కాలనీలో ఎలా వుంటావో చూస్తానని బెదిరించాడు." అని చెప్పాడు గంగాధర్

"ఐసీ!" ఇన్‌స్పెక్టర్ ప్రభు ఆలోచిస్తూ వచార్లు చేస్తున్నాడు.

"సార్! ఒక్క సారి మీరు వాడ్ని స్టేషన్‌కు పిలిపించి బెదిరిస్తే నా జోలికిరాడు"

వచారు చేసున్న ప్రభు ఆగి గంగాధర్ ముఖంలోకి చూశాడు. "నీకు అంత నమ్మకం ఉందా?"

"అవును సర్!"

"నాకు లేదు. అయినా అలాగే చేస్తాను. మీరు కూర్చోండి. శ్రీపాద దాదాగార్ని యిప్పుడే పిలిపిస్తాను" అన్నాడు ప్రభు.

దాదాపు వదిన్నరకు ఇద్దరు కానిస్టేబుల్స్ శ్రీపాద్‌ను తీసుకొని వచ్చారు. శ్రీపాద్ గంగాధర్‌కేసి కొరకొర చూశాడు. అతని చూపులకు అనసూయ భయపడిపోయింది వళ్ళు చమట్లు పట్టింది.

"ఏరా? గంగాధర్‌ను కొట్టావా?" ప్రభు ప్రశ్నించాడు.

శ్రీపాద్ ఆ ప్రాంతంలో పేరు మోసిన రౌడీ. అతన్ని ఎవరూ ఎదిరించరు. అతని మీద ఎవరూ పోలీసులకు ఫిర్యాదు కూడా చెయ్యరు. శ్రీపాద్ సమాధానం ఇవ్వలేదు. కసిగా గంగాధర్ కేసి చూశాడు.

ఎస్.ఐ. శ్రీపాద్ చెంపమీద కొట్టాడు. "జాగ్రత్త మళ్ళీ వాళ్ళ జోలికి వెళ్ళినట్టు తెలిసిందా చంపేస్తాను" ప్రభు బెదిరించాడు.

కాని శ్రీపాద్‌లో ఎలాంటి బెదురూ కనిపించలేదు. గంగాధర్ మీది నుంచి కళ్ళు మరల్చలేదు. గంగాధర్‌కు వెన్నెముకలో ఏదో పాకినట్టుగా అయింది. ఎలా చూస్తున్నాడో? తను రిపోర్టు చేసి పొరపాటు చెయ్యలేదు కదా? తనముందే ఇన్‌స్పెక్టర్ వాడ్ని చెంపదెబ్బ కొట్టాడు. అది అతనికి చిన్నతనంగా తోచి మరీ కక్షకడ్తాడేమో?

గంగాధర్ అరిచేతులకు చెమట పట్టింది.

"ఇక వెళ్లు!" ప్రభు శ్రీపాద్‌ను వదిలేశాడు.



వడగమీద దెబ్బతిన్న కృష్ణసర్పంలా జరజరా పాకిపోతున్నట్టు కన్పించాడు గంగాధర్ కళ్ళకు చరచర స్టేషన్ బయటకి వెళ్ళి పోతున్న శ్రీపాద్.

"ఇక మీరు వెళ్ళండి. మళ్ళీ మీ జోలికివస్తే నాకు చెప్పండి"అన్నాడు ప్రభు.

గంగాధర్ భార్యతో ఇంటికి వచ్చాడు. ఆ రాత్రంతా ఆ భార్యాభర్తలు ఇద్దరూ నిద్రపోలేదు. ఏ కొంచెం శబ్దం అయినా తృళ్ళిపడుతున్నారు. తెల్లవారి గంగాధర్ కంపెనీకి వెళ్లలేదు. అతను ఒక కంపెనీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. అతను ఆశించి నట్టు శ్రీపాద్ రాలేదు. వారం రోజులు శ్రీపాద్ గంగాధర్ జోలికి రాలేదు. గంగాధర్‌కూ అతని భార్యకూ ధైర్యం వచ్చింది. ప్రభు బెదిరింపుకు భయపడ్డారనుకున్నారు.

అంతకు ముందు తాగి వచ్చి రోజూ గంగాధర్ ఇంటిముందు అల్లరి చేసేవాడు. అతని బాధ భరించలేక పోలీసు రిపోర్టు ఇచ్చాడు. ఆ సంగతి తెలిసి గంగాధర్‌ను వంగదీసి కొట్టాడు. గంగాధర్ మళ్ళీ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ప్రభుకు రిపోర్టు చేశాడు. ప్రభు శ్రీపాద్‌ను బెదిరించాడు.

పదిహేను రోజులు గడిచాయి. శ్రీపాద్ ఆ ప్రాంతాలలోనే కన్పించడంలేదు. ఆ బస్తీ వాళ్ళందరి ప్రాణాలకూ హాయిగా ఉన్నది. గంగాధర్ సాహసానికి మెచ్చు కొన్నారు.

ఒకరోజు మధ్యాహ్నం శ్రీపాద్ బాగా తాగి గంగాధర్ ఇంటికి వచ్చాడు. గంగాధర్ ఆ నమయంలో ఇంటి దగ్గర ఉండడని తెలుసు. గంగాధరే కాదు. ఇరుగు పొరుగు మగవాళ్ళెవరూ ఆ నమయంలో ఇళ్ళలో ఉండరని తెలుసు.

శ్రీపాద్‌ను చూసి అనసూయ భయంతో తలుపులు వేసుకొని గడియ పెట్టింది. శ్రీపాద్ బూతులు తిడుతూ తలుపులు తన్న సాగాడు. తలుపులు విరిగి పడ్డాయి. లోపలకు వెళ్ళి అనసూయను పట్టుకున్నాడు. అనసూయ కొడుకు బయటికి వచ్చి వాక్కిట్లో నిల్చొని బిగ్గరగా ఏడవసాగాడు.

అనసూయ శ్రీపాద్‌తో పెనుగులాడుతోంది. అరుస్తోంది. ఇరుగు పొరుగు వాళ్ళకు అనసూయ కేకలు వినిపిస్తున్నాయి. పిల్లవాడి ఏడుపు కూడా వినిపిస్తున్నది. అయినా బయటికి ఒక్కరూ రాలేదు. జరుగుతున్నదేమిటో వాళ్ళకు తెలుసు.

అనసూయ రవిక చిరిగింది.

చీర లాగేశాడు.

అనసూయ అరుస్తున్నది. శ్రీపాద్‌తో పెనుగులాడుతున్నది.

ఆ సమయంలో రోజూ వళ్ళు అమ్మే హసన్ అక్కడకు వచ్చాడు. అనసూయ అతని దగ్గర వళ్ళు తీసుకొంటూ ఉంటుంది.

హసన్ తలమీద తట్ట దించాడు.

"ఏయ్! వదులు ఆయమ్మను!" హసన్ అరిచాడు.

"పోబే! నీకు ప్రాణంమీద తీపి లేదా?" అంటూ హసన్‌ను తిడుతూనే అనసూయను కింద పడేశాడు.

"చూడరా! దీన్ని ఏం చేస్తానో చూడు. నా తర్వాత నువ్వుకూడా...." శ్రీపాద్ మాటలు పూర్తి కాలేదు. వెన్నులోకి సర్రున కత్తి దిగింది.

శ్రీపాద్ కెవ్వున అరిచాడు. కిందకు దొర్లాడు.

అనసూయ లేచి వంటగదిలోకి పరుగుతీసి తలుపు వేసుకొన్నది.

పోలీసులు వచ్చారు. హసన్‌కు కష్టడీలోకి తీసుకొన్నారు.

శ్రీపాద్‌ను ఆసుపత్రికి పంపారు. రెండోరోజు రాత్రి శ్రీపాద్ మరణించాడు.

గంగాధర్ హసన్ కాళ్ళకు నమస్కరించాడు.

ఇన్‌స్పెక్టర్ జయకర్ హసన్‌ను ప్రశ్నలు వేస్తున్నాడు. మధ్య మధ్య అనసూయను కూడా ప్రశ్నిస్తున్నాడు.

"బాబూ! హసన్ సమయానికి రాకపోతే నేను ఏమైపోయేదాన్నో...." అంటూ బావురుమన్నది అనసూయ.

"సాబ్! ఆ అమ్మ నాకు అక్కలాంటిది. ఒక ఆడ మనిషి శీలాన్ని రక్షించడానికి చేసిన అపరాధానికి జీవిత మంతా జైల్లో ఉండటానికి భయపడను" అన్నాడు హసన్.

"నువ్వు అపరాధం చేశావా? లేదు! లేదు! నువ్వు ఏం తప్పు చేశావని జీవిత శిక్ష పడుతుంది? నువ్వు చేసింది అపరాధం కాదు. భారతీయ న్యాయశాస్త్రంలోని 100వ సెక్షన్ ప్రకారం నువ్వు చేసింది అపరాధం కాదు. తన శీలాన్ని హరించినవాడిని లేక హరించడానికి ప్రయత్నించనవాడిని ఆ స్త్రీ ఆ సమయంలో అతన్ని చంపటం అపరాధం కాదు. అంతేకాదు. ఒక స్త్రీ శీలాన్ని హరిస్తున్న సమయంలో చూసిన వ్యక్తికి కూడా, ఆమెను రక్షించే అధికారం ఉన్నది. ఆ ప్రయత్నంలో బలాత్కారం చేస్తున్న వ్యక్తి మరణించినా, అది అపరాధంగా పరిగణించబడదు. హసన్ నువ్వు అపరాధం చెయ్యలేదు. నీ స్థానంలో నేను ఉన్నా ఆ పనే చేసి ఉండేవాణ్ణి. అలాంటి దృశ్యాన్ని చూసి కూడా నా కెందుకులే అని వెళ్ళిపోయేవాడే నిజమైన అపరాధి" ఇన్‌స్పెక్టర్ జయకర్ అన్నాడు.

హసన్‌ను వదిలేశాడు.

శ్రీపాద్ చనిపోయాక ఆ బస్తీలోని ప్రజలు అదమర్చి నిద్రపోగలుగుతున్నారు.

❀ ❀ ❀



# 42. ప్రాణం తీసిన ప్రేమ!

అది 1981వ సంవత్సరం. శనివారం. జనవరి 31వ తేదీ ఘజియాబాద్ స్టేషన్ సమీపంలో ఒక యువ జంట పట్టాలమీద నడుస్తున్నారు. అమ్మాయిపేరు సీమాసింగ్. అబ్బాయి పేరు దేవేంద్రకుమార్. దేవేంద్రకుమార్ స్నేహితుడు యోగంద్ర కుమార్ వాళ్ల వెనగ్గా ఇరవైగజాల దూరంలో నడుస్తున్నాడు. సెక్యూరిటీగార్డ్ వాళ్లను గమనిస్తూ నిల్చుని వున్నాడు. నడుస్తూ నడుస్తూ ఆగడం, మళ్లీ రెండడుగులు వెయ్యడం, సీమ చేతిలోని పుస్తకాలను దూరంగా విసిరికొట్టడం గమనిస్తున్న సెక్యూరిటీగార్డు వాళ్ళిద్దరూ ఘర్షణ పడుతున్నట్టుగా అర్థం చేసుకున్నాడు. కుతూహలంగా వాళ్ళను గమనించసాగాడు.

కొద్దినిముషాల తర్వాత ప్యాసింజరు రైలు రావడం గమనించాడు సెక్యూరిటీ గార్డు. అయితే ఆ యువ జంట పక్కపట్టాల మధ్య నుంచి నడుస్తూ వుండటంవల్ల అతడు వాళ్ళను హెచ్చరించలేదు. ప్యాసింజరు దగ్గరకు రావడం, ఎవరో తోసినట్టుగా సీమ బండివస్తున్న పట్టాల మీద పడటం చూశాడు గార్డు. సీమ గావుకేక పెట్టింది. మరుక్షణంలోనే ఆమె శరీరం బండి చక్రాల కింద నలిగిపోయింది.

దేవేంద్ర పరుగులంకించుకొన్నాడు. అదిచూసిన యోగేంద్రకూడా రెండో వైపుకు పరుగుతీశాడు. సెక్యూరిటీగార్డు దేవేంద్ర వెనక పరిగెత్తి పట్టుకున్నాడు. దేవేంద్ర బెదిరింపుల్ని లెక్కచెయ్యకుండా గార్డు అతడ్ని దగ్గర్లోని పోలీసు స్టేషన్‌లో అప్పగించాడు. కుమార ప్రియ అనే జర్నలిస్టు ఈ కేసు వివరాలను స్వయంగా తెలుసుకొని పత్రికలకు ఇచ్చాడు. ఆయన సేకరించిన వివరాల ప్రకారం అసలు కథ ఏమిటంటే-?

సీమాసింగ్ క్రిస్టియన్. దేవేంద్రకుమార్ బ్రాహ్మణుడు. ఇద్దరూ ఘజియాబాద్ హైస్కూల్లో తొమ్మిదవ క్లాసు చదువుతున్న సమయంలోనే సన్నిహితులయ్యారు. అందుకు అనేక కారణాలు దోహదం చేశాయి. ఆ సంవత్సరం స్కూలు నిర్వహించిన అందాల పోటీలో వాళ్ళిద్దరూ అందాల రాజా, అందాల రాణీగా ఎన్నికయ్యారు. వాళ్లిద్దర్నీ తోటివిద్యార్థులే కాక టీచర్సు కూడా పొగిడేవారు. ఆ పొగడ్తలే వాళ్ళిద్దరూ ఒకరినొకరు దగ్గరకావడానికి దోహదం చేశాయి. ఒకర్నొకరు ప్రేమిస్తున్నామనే గాఢమైన నమ్మకం ఇద్దర్లోనూ ఏర్పడింది అచ్చం సినీమా హీరో హీరోయిన్ మాట్లాడు కున్నట్టే గంటలు గంటలు మాట్లాడుకొనేవారు. యోగేంద్రకుమార్, రామ్‌లాల్ అనే ఇద్దరు కుర్రాళ్లు వారి ప్రేమను ప్రోత్సహించేవారు. తొమ్మిది పాసయి ఇద్దరూ పదవక్లాసుకు వచ్చారు. యోగేంద్ర, రామ్‌లాల్ కూడా అదే క్లాసులో వున్నారు. వీరి ప్రేమగురించి దేవేంద్ర తండ్రికి తెలిసింది. కొడుకును తండ్రి మందలించాడు. "పిచ్చి వేషాలు వేయొద్దు" అన్నాడు. ఆయన సంప్రదాయ సంపన్నుడు. కొడుకు తండ్రి

మందలింపును లక్ష్యపెట్టలేదు. ఆ సంగతి తెలిసి తండ్రి కొడుకు చదువు ఆపించి ఊరికి తీసుకెళ్ళాడు. ఘజియాబాద్‌కు చాలా దగ్గరి గ్రామం అది. వీరి స్నేహితుడు రాంలాల్ ఊరుకూడా అదే. దేవేంద్రకు సీమ రాంలాల్ ద్వారా కబురు పంపేది. ఒకటి రెండుసార్లు తండ్రికి తెలియకుండా వచ్చి సీమను కలుసుకున్నాడు. ఆ తర్వాత తండ్రికి ఆ విషయం కూడా తెలిసింది. వెంటనే ఒక అయినింటి పిల్లతో దేవేంద్ర పెళ్లి జరిపించాడు. దేవేంద్ర పద్దెనిమిది నిండి పందొమ్మిదవ ఏడులో ప్రవేశించాడు. పెళ్ళికాగానే భార్యమోజులో పడిపోయాడు. అతనికి సీమకు దూరం అయిన బాధ ఇప్పుడు బొత్తిగా లేదు. కాని తన పెళ్లి విషయం సీమతో చెప్పవద్దని రామలాల్‌తో అన్నాడు. చాలాకాలంగా దేవేంద్ర కన్పించకపోవడంతో దాదాపు సీమ పిచ్చిదే అయింది. రామ్‌లాల్ ద్వారా ఉత్తరాలు పంపించసాగింది. దేవేంద్ర ఒక్క ఉత్తరానికీ సమాధానం ఇవ్వలేదు. రామ్‌లాల్‌కు సీమ మీద జాలి వేసింది. దేవేంద్రకు పెళ్లి అయిపోయిందనీ, అతన్ని మర్చిపోవడం మంచిదనీ చెప్పాడు.

ఆ వార్త విన్న సీమ శిలాప్రతిమే అయిపోయింది. చివరి ఉత్తరం రాసింది. ఒక్కసారి వచ్చి కన్పించమని వ్రాసింది. రామలాల్ ఉత్తరం ఇచ్చి ఒకసారి కన్పించి ఆపిల్లకు పరిస్థితులు తెలిసేలా చెప్పమని దేవేంద్రతో అన్నాడు. రామ్‌లాల్ బలవంతంమీద దేవేంద్ర ఘజియాబాద్ వచ్చాడు.

31జనవరి 1985న దేవేంద్ర సీమను కలుసుకున్నాడు. సీమ ఏడ్చింది. అతడ్ని మోసగాడన్నది. అతను ఎన్నోవిధాల తన అసహాయతను వ్యక్తం చెయ్యడానికి ప్రయత్నించాడు. ఆమెకు తల్లిదండ్రుల మాట ప్రకారం వివాహం చేసుకోమని సలహా కూడా ఇచ్చాడు. దేవేంద్ర వెళ్ళిపోవాలని తొందరపడ్తున్నాడు. సీమ అతడ్ని వదలడంలేదు. ఊళ్లో తిరిగి తిరిగి స్టేషన్ దగ్గరకు వచ్చారు. అక్కడ యోగేంద్ర కలిశాడు. "యోగీ కొంచెం వుండు సీమను పంపించి వస్తాను వెళ్లిపోకు" అన్నాడు దేవేంద్ర. అందుకే యోగేంద్ర దూరంగా వారి వెనకే నడక సాగించాడు. సీమ రైలుకింద పడటం చూసి పిచ్చిగా పరిగెత్తి పారిపోయాడు.

దేవేంద్ర పోలీసులముందు తానే సీమను రైలు కిందకు తోసినట్టు అంగీకరించాడు.

"సర్ నేను సీమను చంపాలనుకోలేదు. రైలు స్టేషన్‌లో కూత వేసి బయలుదేరినప్పుడు మాత్రమే నా బుర్రలోకి ఆ ఆలోచన వచ్చింది. సీమకు ఎంత నచ్చచెప్పినా ఒప్పుకొనేలా లేదు. ఆవిడ బతికి వుంటే నేను నాభార్య ప్రేమకు దూరంకాక తప్పదనిపించింది. అందుకే రైలు దగ్గరగా రాగానే ఆమెను అవతలి పట్టాల మీదకు బలంగా తోశాను. నేను తప్పుచేశాను. సీమను చంపేశాను. సీమ మంచిపిల్ల" అంటూ బావురుమని ఏడ్చాడు.

❀ ❀ ❀



# 43. సెప్టిక్‌ట్యాంకులో శవం!

విలాస్‌పూర్‌లోని ఒక పోలీసు స్టేషన్‌కు ఓ నడివయసు వ్యక్తి వచ్చాడు. "సాబ్, మా ఇంటిటాంకులో శవం వుంది", నిలువెల్లా వణికిపోతూ చెప్పాడు. ఏదో వ్రాసుకుంటున్న ఇన్‌స్పెక్టర్ చివ్వున తలెత్తి అతడి కళ్ళల్లోకి సూటిగా చూసాడు. "నీ పేరు?" "కురియన్. నేనురైల్వేలో పనిచేస్తున్నాను. రెండు మూడు రోజులుగా మా లెట్రిన్ గ్యాస్ గొట్టంనుంచి భరించలేని దుర్వాసన వస్తోంది. మునిసిపాలిటీ స్వీపర్‌ను పిల్చి చూడమన్నాను. సెప్టిక్ లెట్రిన్ మూతలాగి కెవ్వున అరిచాడు. పోయిచూస్తే మనిషికాళ్లు కన్పించాయి. మీదగ్గరకు పరిగెత్తుకొచ్చాను".

వంటికి చమట్లు పడుతున్నాయి.

ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో బయలు దేరారు. ఆ సెప్టిక్ టాంకు పగలగొట్టి శవాన్ని బయటికి తీశారు. మురికంతా కడిగారు. అది దాదాపు 22 ఏళ్ల యువకుడి శవం. అతని జేబులో దొరికిన ఉత్తరం వల్ల అతడిపేరు వరుణ్‌సేన్ గుప్తగా తెలిసింది. అప్పటికే జనం చుట్టూ చేరారు. అదే కాలనీలో వుంటున్న శీను అనే యువకుడు ఆ శవాన్ని గుర్తించాడు. వరుణ్‌సేన్ తన మిత్రుడనీ 4వ తేదీ రాత్రి రాయపూర్ నుంచి తామిద్దరూ కలిసి విలాస్‌పూర్ వచ్చినట్టు చెప్పాడు. శీను సౌత్ ఈస్ట్ రైల్వేలో పనిచేస్తున్న సుబ్బారావు కుమారుడు. వరుణ్ తండ్రి కూడా కొంత కాలం క్రితం వరకూ రైల్వేలో పనిచేస్తూ ఆ రైల్వేకాలనీలోనే వుండేవాడు. అందువల్ల శీనూ వరుణ్ చాలా కాలంగా మిత్రులు. ఇన్‌స్పెక్టర్ శీనును ఎన్నో ప్రశ్నలు వేశాడు. ఈ హత్య గురించి తనకేమీ తెలియదంటూ రెండు చేతుల్లో ముఖం కప్పుకొని వెక్కి వెక్కి ఏడవసాగాడు.

ఇన్‌స్పెక్టర్ రాజేశ్‌ఖరేకు రెండు నెలల క్రితం ఓ యువతి స్టేషన్‌కు వచ్చి ఇచ్చిన రిపోర్టు గుర్తొచ్చింది. ఆ యువతి తన పేరు రూప అనీ, తన అన్న పేరు వరుణ్ అనీ, తండ్రి పేరు ఎ.కె.సేన్ గుప్త అని చెప్పింది. తండ్రి ఆ మధ్యనే రిటైర్ అయ్యాడని కూడా చెప్పింది. విజయకుమార్ నాయుడూ, శివనాథ్ అనే ఇద్దరు యువకులు తనను టీజ్ జేస్తున్నారనీ, తన అన్నను చంపుతామని బెదరిస్తున్నారనీ చెప్పింది. తను రోజూ సంగీతం నేర్చుకోవడానికి సాయంత్రం బయటకు వెళ్లాల్సివస్తోందనీ. ఆ సమయంలోనే దారిలో కాపుకాచి తనను వేధిస్తున్నారని చెప్పింది.

ఇన్‌స్పెక్టర్ ఆ ఇద్దరు యువకుల్ని పిలిపించి బెదిరించాడు. మళ్ళీ ఆ అమ్మాయి జోలికివెళ్తే తాటవల్చేస్తానన్నాడు. శవాన్ని పోస్టుమార్టం తర్వాత తండ్రికి అప్పగించారు. వరుణ్ రాయపూర్ అగ్రికల్చర్ యూనివర్శిటీలో ఎం.ఎస్.సి

చేస్తున్నాడు. విజయకుమార్ నాయుడ్ని అరెస్టు చేశారు. శివనాథ్‌కు కూడా ఈ హత్యతో సంబంధం వుందని విజయకుమార్ చెప్పాడు. శివనాథ్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకొచ్చారు. చివరకు ఇద్దరూ తామే వరుణ్ సేన్‌ను చంపినట్లు అంగీకరించారు. పోలీసు శాఖ పరిశోధనలో దొరికిన వివరాలు-

1982లో వరుణ్ తండ్రి రిటైర్ అయ్యాడు. విలాస్‌పూర్‌లోని క్రాంతి కాలనీలో వున్న తన స్వంత ఇంటికి వెళ్లిపోయాడు. 82 వరకు వరుణ్, శీనూ, విజయ్‌నాయుడూ అదే రైల్వేకాలనీలో వుండేవారు. అందరూ కలిసి మెలిసి వుండేవారు. అయితే యువరక్తంలోని దుడుకుతనం వల్లనే మనస్పర్థలు బయలుదేరాయి. ప్రేమలో పడితే కన్నూమిన్నూ తెలియని వయసు అది. అదేకాలనీలో వుండే కమలను విజయ్ ప్రేమించాడు. కమల కూడా విజయ్‌ను ప్రేమించింది. కమల అన్న వరుణ్ స్నేహితుడు. వరుణ్ కమల అన్నకు ఆ విషయం చెప్పాడు. కమల అన్న ఆమెను మందలించాడు. విజయ్‌ను బెదిరించాడు. వరుణ్ ఇల్లు కమల ఇంటి పక్కనే వుండేది. రెండు కుటుంబాల మధ్య మంచి సఖ్యత వుంది. కమలతో చనువుగా వుండేవాడు. ఒకరోజు ఎవరూ లేని సమయంలో కమల వరుణ్‌ని ప్రేమిస్తున్నట్టూ అతనితో అన్నది. అతని బిగి కౌగిలికోసం ఎంతో కాలంగా చెప్పి ఎదురు చూస్తున్నట్టు చెప్పి అతని దగ్గరకు వచ్చింది. వరుణ్ మాడు మీద ఎవరో లాగికొట్టినట్టుగా అయిపోయాడు. కమల అతనిచెయ్యి పట్టుకొన్నది. అతను తుళ్ళిపడి చెయ్యిలాక్కున్నాడు. "కమలా నిన్ను నేను ఆ దృష్టితో ఎప్పుడూ చూడలేదు. రూప నాకు చెల్లెలు, నిన్ను మరో చెల్లెలుగా భావించాను. మనం అన్నచెల్లెళ్లగానే వుండాలి." అని నచ్చచెప్పాడు. కమల మనసులో వరుణ్ మీద కసి పెంచుకున్నది. పైకిమాత్రం మామూలుగానే వుండేది. కమల విజయ్ వెంటపడింది. విజయ్ నాయుడి బుద్ధి వరుణ్‌కు తెలుసు. అన్ని దురలవాట్లూ వున్నాయ్ అని కూడా తెలుసు. అందుకే వరుణ్ నలుగురు స్నేహితులతో కలిసి వెళ్ళి ఒకరోజు రూపను అల్లరి పెడ్తున్న సమయంలో ఇద్దర్నీ తుక్కుగా కొట్టాడు. తన అన్నను ఆ దుర్మార్గులు ఏమైనా చేస్తారనే భయంతోనే రూప పోలీసు స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చింది. తండ్రికి తెలిస్తే తనను సంగీతం క్లాసుకు వెళ్లనివ్వడని ఆమె భయం. ఆ రిపోర్టే చివరకు ఉపయోగపడింది.

వరుణ్ చేత దెబ్బలు తిన్న విజయ్‌ను కమల బాగా కవ్వించింది. విజయ్, శివనాథ్ సహాయంతో వరుణ్‌ను చంపడానికే నిశ్చయించుకున్నాడు. అవకాశం కోసం పొంచి కూర్చున్నాడు. 4-3-83 న వరుణ్, శీనూ రాయచూర్ వెళ్ళారు. శెలవలు కాబట్టి వెంటనే తిరిగి వస్తారని కూడా విజయ్‌కు తెలుసు. ఆ రాత్రి స్టేషన్ దగ్గర ఇద్దరూ కాపలా వేశారు. బొంబాయి-హౌరా ఎక్స్‌ప్రెస్‌లో అదే రోజు రాత్రి 12 గంటలకు వరుణ్ శీనూ తిరిగి విలాస్‌పూర్ వచ్చారు. ఇద్దరూ రిక్షా ఎక్కారు. వరుణ్ శీనుని వాళ్లింటి దగ్గర దింపి, తను అదే రిక్షాలో ఇంటికి బయలు దేరాడు. అర్ధరాత్రి. ఆ ప్రాంతం అంతా నిర్మానుష్యంగా వుంది. రిక్షా చిన్నగా రైల్వే ఆసుపత్రి దాటింది. విజయ్‌నాయుడు ఎదురు వచ్చి రిక్షా పట్టుకొన్నాడు. శివనాథ్ వరుణ్‌ను



రిక్షానుంచి కిందకు ఈడ్చాడు. అనుకోని సంఘటన కావడంతో కిందపడ్డ వరుణ్ వెంటనే అరవలేదు. రిక్షావాడు పారిపోయాడు. విజయ్ కత్తితో కసిగా అనేక సార్లు పొడిచాడు. శవాన్ని ఇద్దరూ కలిసి పక్కనే వున్న కురియన్ ఇంటి సెప్టిక్ టాంకులో కుక్కి వెళ్లిపోయారు. పోలీసువాళ్లు రిక్షా వానికోసం ప్రకటన ఇచ్చారు. పదివేల రూపాయలు కూడా ఎనౌన్స్ చేశారు. అయినా రిక్షా వాడు రాలేదు.

ఇన్‌వెస్టిగేషన్ పూర్తి చేసి 6-6-83 న కేసును కోర్టుకు అప్పగించారు.

❀ ❀ ❀

# 44. ప్రేమకు అంతస్తులు అడ్డురావా?

"నామీద నమ్మకంలేదా? నాప్రేమ పవిత్రమైంది. నువ్వులేని ఈ జీవితం నాకు అక్కరలేదు. ప్రేమకు అంతస్తులు అడ్డురావు. నీకోసం నేను మేడ దిగుతాను. నీగుడిసెలో వుంటాను. నీతోపాటు కాయకష్టం అయినా సరే చేస్తాను. రాళ్లు కొడ్తాను, కూలి చేస్తాను."

ఈ మాటలు ఒక ప్రియురాలు ప్రియుడితో అన్నది. ప్రియురాలి పేరు కుసుమ. ప్రియుడి పేరు ఘనశ్యాం. శ్యాం ఆలోచనలో పడ్డాడు. "నామీద నీకు నమ్మకం లేదా?"

"కాని?" శ్యాం ఆగిపోయాడు. "ఏమిటి అనుమానం?" "ఆవేశంతో ఏదో అంటున్నావ్. వాస్తవం చాలా చేదుగా వుంటుంది. శ్రీమంతుల బిడ్డవు..." శ్యాం మాటలకు మధ్యనే అడ్డొచ్చి, "నా మీద నమ్మకం లేదా?"అన్నది. "నమ్మకం లేక కాదు మీ వాళ్లు లక్షాధికారులు. మనల్ని పిచ్చి కుక్కల్లా తరిమి ఎక్కడున్నా పట్టు కుంటారు."

"భయపడుతున్నావా?"

"భయంకాదు" అన్నాడు సాలోచనగా శ్యాం. "దూరంగా వెళ్లిపోదాం. పెళ్లిచేసుకుందాం. అవసరం అయితే కూలిచేసి బతుకుదాం" అన్నది కుసుమ.

"సరే సాయంత్రం 6 గంటలకు గాంధీ చౌకుకురా. అక్కడ టాక్సీతో రెడీగా వుంటాను" అని చెప్పి ఘనశ్యాం వెళ్లిపోయాడు. ప్లాను ప్రకారం అంతా సక్రమంగానే జరిగింది. సామానుతో బయటికొస్తే అనుమానానికి దారితీస్తుందనే భయంతో కుసుమ కట్టుబట్టలతో వచ్చేసింది. శ్యాంకు జయంత్ అనే స్నేహితుడు వున్నాడు. అతడు ధనవంతుడు. ఈ విషయంలో తనసహాయం వుంటుందని జయంత్ ప్రామిస్ చేశాడు. ముగ్గురూ కలసి నాగపూర్ నుంచి బొంబాయి వెళ్లారు. అక్కడ కొద్ది రోజులుండి మద్రాసు వచ్చారు. జార్జిటౌన్‌లో ఒక చిన్న హోటల్లో వున్నారు. జయంత్ కుసుమను 'వదినా' అని పిల్చేవాడు. కుసుమకూ, శ్యాంకూ రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి. జయంత్‌కు మహా బోర్‌గా వుంది. పైగా అతడు తెచ్చిన డబ్బు చాలా వరకు ఖర్చు అయింది. ఇద్దరూ రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లి చేసుకున్నారు. సాక్షులుగా జయంత్, ఆ హోటల్ సర్వర్ ఒకడు సంతకాలు చేశారు.

జార్జిటౌన్‌లోనే ఒక చిన్నగది అద్దెకు తీసుకున్నారు. శ్యాం ఉద్యోగ ప్రయత్నాల్లో పడ్డాడు.



జయంత్‌మాత్రం అదే హోటల్‌లో వున్నాడు. ఒకరోజు కుసుమా, శ్యాం, మూర్ మార్కెట్‌కువెళ్లి, ఆ తర్వాత ఆ దగ్గర్లో వున్న 'మైలేడీస్ గార్డెన్' కు వెళ్లారు. సిమెంటు బెంచీమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుండగా శ్యాం దృష్టి పార్క్‌లోకి వస్తున్న ఒక వ్యక్తిమీద పడింది. అరే బాప్‌రే? దాదాపు అరిచినట్టే అన్నాడు శ్యాం.

"ఏమిటి ఏమైంది?"

"అటుచూడు, మన ఊరివాడు. పైగా మీ అన్న స్నేహితుడు" అన్నాడు. కుసుమ తృళ్ళిపడింది. "వెళ్దాం!" అంటూ లేచి నిల్చుంది. ఇద్దరూ ఇంటిదారి పట్టారు. అతడు తమను చూడలేదనే భావించారు ఇద్దరూ. కాని అతడు వాళ్ళను వెంబడించి వాళ్లు వుంటున్న ఇల్లుకూడా చూశాడు.

కుసుమ తన చేతి బంగారు గాజులు అమ్మి ఇంటికి కావాల్సిన సామాను కొన్నది. వారి బలవంతంమీద రోజుకు ఏదో ఒకపూట జయంత్ భోజనానికి వచ్చేవాడు. పార్క్ సంఘటన జరిగిన ఐదోనాడు ఎవరో తలుపు కొట్టారు. ఇంత పొద్దుటే ఎవరొచ్చారా అనుకొంటూ కుసుమ తలుపు తెరిచి కొయ్యబారిపోయింది. ఎదురుగా కుసుమ అన్న గోపాల్ నిల్చుని వున్నాడు.

"ఏమిటమ్మా అలా చూస్తావ్? బాగున్నావా? ఇంట్లోకి రానివ్వవా?" మృదువుగా నవ్వుతూ అడిగాడు.

కుసుమ పక్కకు తప్పకొంది. కాని నోట్లోనుంచి మాట రావడంలేదు. అప్పుడే బాత్‌రూంలో నుంచి వచ్చిన శ్యాం గోపాల్నిచూసి గాభరాపడ్డాడు.

"ఏంటోయ్ అలాచూస్తావ్? మీ ప్రేమ గురించి నాకు చెప్తే నేను పెళ్లిచేసేవాడ్ని కాదా? నన్నంత రాక్షసుడనుకొన్నారా? గోపాల్ నిష్ఠూరంగా అన్నాడు.

అందరూ కలిసి భోజనం చేశారు. ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు.

గోపాల్ చెల్లెలికి వెయ్యిరూపాయలు ఇచ్చాడు. బాకీలేమైనా వుంటే తీర్చమని టికెట్లు బుక్‌చేసి మళ్లీ తెల్లవారి ఉదయం వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి శ్యాంకూ కుసుమకూ నిద్రపట్టలేదు. చాలా ఆనందంగా వుంది. కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నారు. తెల్లవారాక జయంత్‌కు ఆ విషయం చెప్పొచ్చునని భావించారు. తెల్లవారుఝామున మూడు గంటలకు తలుపు తట్టడం విన్పించి ఇద్దరూ తృళ్లిపడి లేచికూర్చున్నారు.

"ఎవరూ?"

"పోలీసులం. తలుపు తెరవండి."

గోపాల్‌కు ఏదైనా యాక్సిడెంట్ జరిగిందేమోననే అనుమానం వచ్చింది శ్యాంకు. కుసుమ వారిస్తున్నా వినకుండా తలుపు తెరిచాడు. వెంటనే శ్యాంను పట్టుకొని స్టేషన్‌కు నడవమన్నారు. శ్యాంకు విషయం అర్థం అయింది. రిజిస్టర్ మ్యారేజికి సంబంధించిన కాగితాలను జేబులో పెట్టుకొని, కుసుమకు ధైర్యం చెప్పి, శ్యాం పోలీసులతో వెళ్ళాడు.

అతడు ఒక ఆడపిల్లను కిడ్నాప్ చేసినట్టుగా రిపోర్టు నమోదు కావడంవల్ల ఇలా జరిగింది. అయితే పది తర్వాత పెద్ద ఆఫీసరుకు తన పెళ్లి రికార్డు చూపించి

విడుదల అయ్యాడు. ఇంటికి వచ్చేసరికి 12 దాటింది. ఇంటికి తాళం వేసి వుంది. జయంత్ దగ్గరకెళ్లి జరిగిన విషయం చెప్పాడు. జయంత్ సలహామీద నాగపూర్ బయలుదేరారు. అప్పటికే ఇద్దరూ కలిసి బలవంతంగా కుసుమను కిడ్నాప్ చేసినట్టుగా కేసు నమోదు అయింది నాగపూర్ పోలీసు స్టేషన్‌లో ఇద్దర్నీ అరెస్టు చేసి జామీనుమీద వదిలేశారు. కోర్టులో కుసుమ వాంగ్మూలం విన్న జడ్జి కేసు కొట్టేస్తాడనే నమ్మకం ఉంది శ్యాంకు.

జయంత్‌కు మాత్రం కోర్టులో కుసుమ నిజం చెబుతుందనే నమ్మకం లేదు. శ్యాంతో అమాటే అన్నాడు. కాని అలా అన్నందుకు శ్యాంకు కోపం కూడా వచ్చింది.

ఆరోజు కోర్టులో కుసుమ బోనులో వుంది. అనేక నేత్రాలు ఆమెనే చూస్తున్నాయి.

"ఆ రోజు నేను ఒక స్నేహితురాలింటికి బయలుదేరాను. దారిలో జయంత్ కన్పించాడు. మా అమ్మకు యాక్సిడెంటు అయిందని చెప్పాడు. టాక్సీ పిల్చి టాక్సీ ఎక్కించాడు. కొద్ది దూరం పోగానే శ్యాం టాక్సీలో ఎక్కాడు. టాక్సీ కదిలింది. నేను దిగిపోతానన్నాను. టాక్సీ అపమని అరిచాను. శ్యాం నానోరు మూశాడు. జయంత్ మత్తుమందు వాసన చూపించాడు. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. స్పృహ వచ్చేసరికి రైల్లో వున్నాను. నన్ను నానా చిత్రహింసలకు గురిచేసి పెళ్లికి ఒప్పించారు. అప్పటికే ఇద్దరూ కలిసి నా శీలాన్ని దోచుకున్నారు."

కుసుమ మాటల్ని వింటూ వెర్రి చూపులు చూశాడు శ్యాం.

"విన్నావా? నేను ముందే చెప్పలేదూ. ఈ ఆడవాళ్లను నమ్మొద్దని?" జయంత్ కోపంగా అన్నాడు.

"కుసుమ అలాంటిది కాదు. వాళ్లవాళ్లు బెదిరించి అలా చెప్పించి వుంటారు." అన్నాడు శ్యాం. "నీ కర్మ" అన్నాడు జయంత్.

కోర్టులో కేసు నడుస్తూనేవుంది. శ్యాం ఎలాగయినా ఒకసారి కుసుమను కలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఇంటి ఎదురుగా అల్లంత దూరంలో నిలబడివున్న శ్యాంను ఆ ఇంటి లోవారు చూశారు అతడ్ని తీసుకురావడానికి నౌకర్ను పంపించాడు. "రండి బాబూ. కుసుమమ్మ పిలుస్తోంది."

"ఎవరూ లేరా!" "పెద్దమ్మ వున్నారు. ఆమెకు మీరంటే ఇష్టమే. ఆమే పిల్చుకు రమ్మన్నారు" అన్నాడు నౌకరు. గోపాల్ నౌకర్‌తో ఇంట్లోకి వెళ్లాడు. అతడి వెనకే తలుపులు మూసుకున్నాయి. గోపాల్, గోపాల్ స్నేహితుడూ, ఇంటి నౌకరూ కలిసి శ్యాంను చితక బాదారు.

"వద్దు. వద్దు. అతడి తప్పేంలేదు. అతడ్ని వదలండి" అంటూ అరుస్తూ ఏడుస్తున్న కుసుమను ఆమె తల్లీ, అక్కా కలిసి లాక్కెళ్లి గదిలోపెట్టి గది తలుపు మూశారు.

శ్యాం పరిస్థితి విషమించిందని తెలుసుకొనేసరికి అందరికీ గాభరా వేసింది. పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేశాడు గోపాల్. పోలీసులు వచ్చేలోగా తల్లి కుడిచేతిమీద బ్లేడుతో గాయంచేశాడు.



ఎవరో దొంగ ప్రవేశించి మా అమ్మకు కత్తి చూపించి బెదిరించాడు. చాకుతో గాయపర్చాడు. అప్పుడే బెడ్‌రూంలోనుంచి నేనూ, వంటింట్లో నుంచి మా నౌకరూ వచ్చాం. అతని చేతిలో చాకుంది. ఆత్మరక్షణకొరకు కర్రతో కొట్టాల్సి వచ్చింది అన్నాడు గోపాల్.

పోలీసులు శ్యాంను అసుపత్రిలో చేర్పించారు. మరణవాంగ్మూలంలో అన్ని సంగతులూ చెప్పాడు శ్యాం.

గోపాల్‌నూ, నౌకర్నూ, అతడి తమ్ముడ్నీ భారతీయ శిక్షాస్మృతిలో సెక్షన్స్ 302,324,342,149,126 కింద అరెస్టు చేశారు. వారికి జామీను ఇవ్వలేదు.

కుసుమ మాత్రం తన భర్త చనిపోయాడని బొట్టు పెట్టుకోవడం, రంగుబట్టలు కట్టుకోవడం మానేసింది.

❀ ❀ ❀

# 45. అర్ధరాత్రి హత్య

ఆమె అందంగా వుంటుంది. ఆమెమాట మధురంగా వుంటుంది. ఆమె నవ్వు వెన్నెలవలె చల్లగా వుంటుంది. ఆమె ప్రీతి. ఆమె తండ్రి ప్రభుదయాళ్. అతనికొడుకు సురేష్.

ప్రీతి వివాహం గిరిరాజ్ సింగ్‌తో జరిగింది. గిరిరాజ్ సింగ్ జయపూర్‌వాడు. కట్న కానుకలు అల్లుడికి బాగానే ముట్టజెప్పాడు. కూతురి సొంతానికి లక్ష రూపాయల క్యాష్ ఇచ్చాడు. ఆమె పేరుమీద ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేశాడు. వివాహం అయిన కొత్తలో భార్యాభర్తలు చాలా అన్యోన్యంగా వుండేవారు. కాని రానురాను వారిరువురి మధ్య గొడవలు బయల్దేరాయి. ప్రీతి పుట్టింటికి వచ్చేసింది. భర్తను వదిలేసి వచ్చినందుకు తండ్రి కూతుర్ని మందలించలేదు. పైగా ఒక దుకాణం ఆమె పేరు మీద రాసి ఇచ్చేశాడు. మిగతా రెండూ కొడుకు సురేష్‌కు ఇచ్చాడు. సురేష్‌కు పెళ్లయి అప్పటికి రెండేళ్లయింది.

ప్రీతి పుట్టింటికి వచ్చి మూడేళ్ళయింది. ఈమధ్యలో ఆమె భర్త ఆమెకోసం చాలాసార్లు వచ్చాడు. ఆమెను ఎలాగైనా ఒప్పించి తనతో తీసుకెళ్లాలని ప్రయత్నించాడు. అతని ప్రయత్నం ఫలించలేదు.

ఆరోజు అంటే 1982 మార్చి12 రాత్రి. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి ఒక ఆటోవచ్చి ఆగింది. డ్రైవరూ, అతనిపక్కనే కూర్చున్న మరొకరు దిగారు. వెంటనే డ్రైవరు క్యాజువాలిటీ వార్డుకు వెళ్ళాడు. అతనితో కలిసి ఒక డాక్టరూ, ఇద్దరు నర్సులూ ఆటో దగ్గరకు వచ్చి, ఆటో వెనక సీట్లో పడివున్న యువతిని చూశారు. ఆమెకు 27,28 ఏళ్లుంటాయి. ఆమె బట్టలన్నీ రక్త సిక్తమై వున్నాయి. డాక్టరు ఆమెను వెంటనే ఎమర్జెన్సీ వార్డుకు తీసుకువెళ్ళమన్నాడు. అక్కడేవున్న ఒక పోలీసు కానిస్టేబుల్ అదిచూసి వెంటనే పోలీసు స్టేషనుకు ఫోన్ చేశాడు. సబ్ ఇన్‌స్పెక్టరు ఇద్దరు కానిస్టేబుల్స్‌తో బయలుదేరాడు. బయలుదేరేముందు ఇన్‌స్పెక్టరు కూడా ఫోన్ చేశాడు. ఆమె చనిపోయిందని పోలీసులకు డాక్టరు చెప్పాడు. ఆటో డ్రైవరు ఇచ్చిన సమాచారం:

అతని పేరు ముఖేష్, ఆటో ప్రీతిది. అద్దెకు ఆమె ఆటోను అతడు నడుపుతున్నాడు. ఆ రాత్రి పొద్దుపోయి ఆమెకు బాడుగ ఇవ్వాలని వెళ్లాడు. ఆమెను పిలిస్తే పలకలేదు. ఆమె ఇల్లు యూసఫ్ సరాయిలో వుంది. తిలక్‌రాజ్ (సురేష్ నౌకరు) బయట, వాకిలిముందు నిద్రపోతున్నాడు. అతడ్నిలేపి అడిగితే తనకు తెలియదని నిద్రమత్తులో సమాధానం ఇచ్చి మళ్ళీ నిద్రపోయాడు. తలుపులు బయటనుంచి గొళ్లెం పెట్టి వుండటాన్ని చూశాడు ముఖేష్-పొరపాటుగా తిలక్ గొళ్లెం



పెట్టాడనుకుని తలుపు తీసుకొని లోపలకు వెళ్ళాడు. వరండాలో బెడ్‌లైట్ వెలుగుతోంది. ప్రీతి పడకగది తలుపులు తెరిచివున్నాయి. ముఖేష్ ఎంత పిలిచినా ఆమె పలకలేదు. వెంటనే లోపలకు వెళ్ళి ఆమెను తట్టిలేపాడు. ఆమె లేవలేదు. గాభరాగా మెట్లెక్కి పైన నిద్రపోతున్న సురేష్‌ను కేకలు పెట్టి పిలిచాడు. సురేష్ నిద్రలో విసుక్కుంటూ "ఏమిటి" అన్నాడు బయటకు రాకుండానే.

"సాబ్, ప్రీతిగారు పలకడం లేదు" అన్నాడు. "ఆసుపత్రికి తీసుకెళ్ళు" అన్నాడు. ముఖేష్ కిందకు వచ్చి తిలక్‌రాజ్‌ను తట్టిలేపి ప్రీతిని మంచం మీదనుంచి లేవదీశాడు. చేతులకు జిడ్డు జిడ్డుగా తగిలింది. లైటువేశాడు. రక్తం మడుగులో ఆమె కనిపించింది. ఇద్దరూ కలిసి ఆటోలో వేసుకొని ఆసుపత్రికి తీసుకొచ్చారు.

ముఖేష్ విషయం చెప్తున్నంతసేపూ ఏడుస్తూనే వున్నాడు. అతడి కళ్ళు ఎర్రబారాయి. ఇన్‌స్పెక్టర్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ముఖంలోకి అర్థయుక్తంగా చూశాడు. శవాన్ని పోస్టుమార్టంకు పంపించి ఇద్దర్నీ తీసుకొని యూసఫ్ సరాయ్‌కి వచ్చారు పోలీసులు. ఆటోను పోలీసుల కస్టడీలోకి తీసుకొన్నారు.

ప్రీతి సోదరుడు సురేష్‌ను లేపారు. అతడూ అతని భార్యా కళ్లు నులుపుకుంటూ క్రిందకు వచ్చారు. ఇన్‌స్పెక్టర్ ప్రీతిని ఎవరో హత్య చేశారని చెప్పాడు. ఆ మాటవిని సురేష్ నిర్విణ్ణుడై నిలబడిపోయాడు. సురేష్ భార్య పెద్ద పెట్టున ఏడవసాగింది.

అతడ్ని కొన్ని ప్రశ్నలు వేసి, పోలీసులు ముఖేష్‌నూ, తిలక్‌రాజ్‌నూ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళి లాకప్‌లో పెట్టారు.

"ఆ డ్రైవర్‌గాడి దొంగ ఏడ్పులు చూశావా?" ఇన్‌స్పెక్టర్ అన్నాడు. సబ్ ఇన్‌స్పెక్టరుతో.

"దొంగ వెధవ! వాడే మర్డర్ చేసి వుంటాడు" అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్.

ఎన్ని రకాలుగా ప్రశ్నించినా ముఖేష్ తను అపరాధినని అంగీకరించలేదు. తిలక్ తనకేమీ తెలియదన్నాడు. ఇన్‌స్పెక్టర్ దృష్టి ఆటో వెనక రాసి వున్న "ముఖేష్ ప్రీతి" అన్న అక్షరాల మీద పడింది.

"సందేహం లేదు. వెధవ అందరి కంటే ఎక్కువ బాధపడుతున్నట్లు నటిస్తున్నాడు. వాడే - ఆ ముఖేష్‌గాడే హంతకుడు" అనుకున్నాడు.

ముఖేష్‌ను ఎంత బెదిరించినా తను హత్య చేసినట్టుగా అంగీకరించలేదు. ఇన్‌స్పెక్టర్ నాలుగు తగిలించాడు.

"సాబ్! కొట్టకండి. నిజం చెప్తాను" ఏడుస్తూ అన్నాడు.

"అలా రా దారికి! ఎందుకు చంపావు? డబ్బు కోసమేనా?" ముఖేష్ మౌనంగా కళ్ళు తుడుచుకున్నాడు.

"ఊఁ! చెప్పు!"

"సాబ్ నేను ప్రీతిని చంపలేదు. ఆమె నా భార్య."

ఇన్‌స్పెక్టర్ తుళ్ళిపడ్డాడు. "షటప్! పిచ్చి వాగుడు వాగకు" అని గర్జించాడు.

"నిజం సాబ్!"

"ఏమిటి నిజం?"

"ప్రీతి నా భార్య నాలుగు రోజుల నాడు నేనూ, ప్రీతీ రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాం. కావాలంటే రిజిస్ట్రార్ ఆఫీసులో చూడండి."

"అదెలా సంభవం? ఆమె పెద్దింటి యువతి. చదువుకున్నది. ఒక ఆటోడ్రైవర్ని పెళ్ళిచేసుకోవడం ఏమిటి? సరిగ్గా చెప్పు" ఆశ్చర్యంతో తలమునకలైపోతూ అన్నాడు.

ఎంక్వయిరీలో పోలీసులకు ముఖేష్ గురించి కొన్ని విషయాలు తెలిశాయి.

ముఖేష్ వయస్సు 21 సంవత్సరాలు. అతడు ప్రీతి కట్టెల అడితీలో పని చేసేవాడు. కష్టపడి పనిచేసే ముఖేష్ అంటే ప్రీతికి ఇష్టం. అతడు అమాయకంగా వుండేవాడు. ప్రీతి స్వంత పనులన్నీ అతడే చేసి పెట్టేవాడు. ఒక రోజు ప్రీతి భర్త వచ్చినప్పుడు ముఖేష్ ఏదో పని మీద ఇంటికి వచ్చాడు. ప్రీతి భర్త ఆమెను చాలా అసభ్యంగా తిట్టసాగాడు. అది చూస్తూ మౌనంగా వుండలేకపోయాడు ముఖేష్. అతడు కలుగజేసుకుని ఆమె భర్తను బెదిరించి పంపించివేశాడు. ముఖేష్ ఆ పని సహజంగా చేసినా ప్రీతికి మాత్రం అతనంటే ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. క్రమంగా ప్రీతి ముఖేష్‌కు దగ్గరైంది. ముఖేష్ బెదిరిపోయినా ప్రీతి ధైర్యం చెప్పింది. అతని కోసం ఆటో కొని ఇచ్చింది. క్రమంగా ఇద్దరి మధ్యా సంబంధం ఏర్పడింది. అందరూ నిద్రపోయాక ముఖేష్ ప్రీతి గదికి వచ్చేవాడు. సురేష్ భార్య సురేష్‌కు వాళ్ళిద్దరి ప్రవర్తన గురించి చెప్పింది. ముందు సురేష్ నమ్మలేదు. ఇరుగు పొరుగు వాళ్ళకు కూడా తెలిసిపోయింది. ఒకరోజు సురేష్ స్వయంగా ఇద్దర్నీ సినిమా హాల్లో చూశాడు. ఆ రోజు రాత్రి ప్రీతితో తగాదా పడ్డాడు, సురేష్. తిట్టాడు. కులట అన్నాడు. వంశం గౌరవాన్ని మట్టిలో కలిపింది అన్నాడు ప్రీతి ఎదురు తిరిగింది. "నా ఇష్టం నువ్వెవరు నన్ను దండించడానికి?" అన్నది.

వారి తండ్రి సంవత్సరం క్రితం తీర్థ యాత్రలకని వెళ్ళి తిరిగి రాలేదు.

ప్రీతి ముఖేష్‌తో ఇలా వుండడం మంచిది కాదని, పెళ్ళి చేసుకుందామనీ అన్నది. ముఖేష్ అంగీకరించాడు. వారం క్రితం రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నారు. వేరే ఉండడానికి ఇల్లు వెదికారు. ఇంటికి అడ్వాన్సు ఇచ్చారు. రెండు రోజుల్లో వెళ్ళిపోవడానికి సన్నాహాలు చేసుకుంటూ వుండగా ఈ అనర్థం జరిగింది.

ఇన్‌స్పెక్టర్ ఆలోచనలో పడ్డాడు. ఈ పరిస్థితుల్లో ముఖేష్‌కు ఆమెను హత్య చెయ్యాల్సిన అవసరం లేదు. అతడు నిజంగానే బాధపడుతున్నాడు. మరి ఎవరు ఈ హత్య చేసి వుంటారు?

ఇన్‌స్పెక్టర్ మెదడులో ఆమె సోదరుడు సురేష్ మెదిలాడు. అవును. అతడే చేసి వుంటాడు. ఇంట్లో హత్య జరిగింది. అదీ రాత్రిపూట. ఆమె తప్పకుండా అరిచి వుంటుంది. పైగా ముఖేష్ ఆమె పలకడం లేదంటే కిందకు కూడా రాలేదు.



ఎందుకైనా మంచిదని తిలక్‌రాజ్‌ను బెదిరించాడు. నాలుగు తగలనిచ్చాడు. తిలక్‌రాజ్ తానే ఆమెను హత్య చేసినట్లుగా అంగీకరించాడు. సురేష్ అందుకు అయిదు వేలు ఇచ్చాడని చెప్పాడు.

సురేష్‌ను అరెస్టు చేశారు. చివరకు సురేష్‌కు తన అపరాధం అంగీకరించక తప్పలేదు.

"అవును ఆ కులటను చంపించాను. అది నాకు అక్కకాదు. నా కుటుంబానికి పట్టిన చీడ పురుగు. మావంశ గౌరవం మీద బురద చల్లింది" అంటూ ఆవేశంగా అరిచాడు.

సురేష్, తిలక్‌రాజ్ జైలులో వున్నారు.

ముఖేష్ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఇప్పటికీ ప్రీతిని తలుచుకుని కన్నీరు కారుస్తూ వుంటాడు.

❀ ❀ ❀

# 46. హత్యకు అసలు కారణం!

అదీ హైదరాబాద్:-

తెల్లవారుఝాము నాలుగున్నర అయింది. అప్పుడే అరుణ కిరణాలు చీకటిని పారద్రోలడానికి ప్రయత్నిస్తున్నాయి.

ఇందిరాపార్కు మీదగా పోలీసు స్టేషన్‌కు వెళ్తున్న కానిస్టేబుల్ పోచయ్య రోడ్డు ప్రక్కగా ఎవరో వ్యక్తి పడిఉండగా గమనించాడు. టార్చిలైట్ వేసి చూసాడు. ఎవడో తాగినవాడో, బిచ్చగాడో అయి ఉంటాడని తలిచాడు. దగ్గిరగా వెళ్ళి 'ఏయ్! ఎవరునువ్వు?' అంటూ పిలిచాడు. అతడు పలకలేదు. ఒకటికి నాలుగుసార్లు పిల్చినా పలకలేదు. వంగి అతడి వీపు తట్టాడు. చేతులకు ఏదో జిగటగా తగిలింది. టార్చిలైటులో పరీక్షగా చూశాడు. 'రక్తం'.

పోచయ్య గాభారాగా పక్కనే ఉన్న ఆఫీసుకు వెళ్ళాడు. వాచ్‌మాన్‌ను అడిగి ఫోన్ చేశాడు సంబంధిత పోలీసు స్టేషన్‌కు. అప్పుడే నిద్రకుపక్రమిస్తున్న యస్సై రజాక్ ఫోన్‌మ్రోగటంతో విసుగ్గా లేచి రిసీవర్ అందుకున్నాడు.

"సాబ్ నేను పోచయ్యను" కంగారుగా అన్నాడు పోచయ్య.

"ఏమిటి?" విసుగ్గా అడిగాడు రజాక్.

"ఇందిరాపార్క్ దగ్గర శవం పడి ఉంది సార్. కత్తిపోట్లున్నాయి. ఇది మర్డరేసాబ్. మీరు వెంటనే రావాలి."

రజాక్ నిద్రమత్తు వదిలిపోయింది.

వెంటనే ఇద్దరు కానిస్టేబుల్స్‌ను తీసుకుని బయలుదేరాడు.

శవం దగ్గర అతడి గుర్తు తెలియజేసే సమాచరం ఏమీ దొరకలేదు. డబ్బు కూడా లేదు. అప్పటికి బాగా తెల్లవారిపోయింది. రజాక్ సర్కిల్‌కు ఫోన్ చేశాడు. అతను కూడా వెంటనే ఆ ప్రదేశానికి వచ్చాడు.

జనం గుమిగూడారు. బోర్లాపడి ఉన్న శవాన్ని వెల్లకిలా పడుకోబెట్టారు. ఇన్‌స్పెక్టర్ అక్కడ చేరినవాళ్లను చనిపోయిన వ్యక్తిని ఎవరైనా గుర్తు పట్టగలరా అని ప్రశ్నించాడు.

ఒకతను శవం ముఖంలోకి పరీక్షగా చూసి ఇతడ్ని అహల్యాబాయి కల్లు దుకాణంలో చూశానన్నాడు.

క్లూ దొరికినందుకు రజాక్ ముఖం వికసించింది.



రజాక్‌కు అహల్యాబాయి తెలుసు. రజాక్ ఆమె ఇంటికి బయలుదేరాడు. కల్లు దుకాణానికి ఆనుకునే ఆవిడ ఉండే చిన్న ఇల్లు ఉంది.

అహల్యాబాయికి నలభై సంవత్సరాలుంటాయి. కాని ముప్పై ఏళ్ల యువతిలా కనిపిస్తుంది. పెద్ద అందెగత్తె కాకపోయినా ఆకర్షణీయంగా ఉంటుంది. ఆమెకు చిన్నప్పుడే వివాహం అయింది. అయితే భర్త ఆమెను వదిలేశాడు. రెండో పెళ్ళి చేసుకుంది. ఒక కొడుకూ, ఒక కూతురూ పుట్టాక వాళ్ళిద్దరికి పడలేదు. రెండో భర్త కూడా ఆమెను వదిలేసి పటాన్‌చెరు (అతడివూరు) వెళ్ళిపోయాడు. ఆమె కొడుకు పేరు అర్జున్! వాడికి ఇరవైనాలుగేళ్ళు. అర్జున్ అహల్యాబాయి కొడుకు అంటే నమ్మరు. ఆడపిల్లకు పద్దెనిమిదేళ్ళు. అహల్యాబాయి కూతురికి పెళ్ళి చేసే ప్రయత్నంలో ఉంది.

కొడుకు మాత్రం కొంతకాలంగా తండ్రి దగ్గర ఉంటున్నాడు. అతడికి తల్లి అంటే కోపం. కారణం ఆమె ప్రభాకర్ అనే యువకుడితో ప్రేమకలాపాలు సాగించడమే.

రజాక్ అహల్యాబాయిని పిలిపించాడు. అహల్యాబాయి శవాన్ని కొద్ది క్షణాలు చూసి ఒక్కసారిగా భోరున ఏడుస్తూ శవం పక్కన కూలబడింది.

రజాక్ అహల్యాబాయిని ఎన్నో ప్రశ్నలు వేశాడు. అన్నింటికి సమాధానం చెప్పింది. అతడు తన దుకాణంలో పనిచేస్తుంటాడనీ, పేరు ప్రభాకర్ అనీ చెప్పింది. అతడికి ఎవరూ లేరనీ, తన ఇంట్లో ఉండేవాడనీ చెప్పింది.

హత్య జరిగింది 23వ తారీఖున. 22వ తేదీ రాత్రి శంకర్రావు అనే వ్యక్తి ప్రభాకర్‌ను బయటికి తీసుకువెళ్ళాడనీ, వాళ్ళిద్దరూ మంచి మిత్రులనీ, తెల్లవారేసరికి ప్రభాకర్ శవాన్ని చూడాల్సి వచ్చిందనీ, చెప్తూ బావురుమని ఏడ్చింది అహల్యాబాయి.

శంకర్రావు ఎక్కడ ఉంటాడో చెప్పింది.

పోలీసులు శవాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి పంపించి శంకర్రావు ఇంటికి వెళ్ళి అతడ్ని ఆరెస్టు చేశారు.

శంకర్రావు "నిన్న రాత్రి నేను అహల్యాబాయి ఇంటికి వెళ్ళిన మాట నిజమే. కాని అతను నాతో బయటికి రాలేదు. మేమిద్దరం స్నేహితులమే. ప్రభాకర్ నన్నొకపని చెయ్యమని అడిగాడు." అని పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు చెప్పాడు.

"ఏం పని చెయ్యమన్నాడు?" అడిగాడు రజాక్.

"తన మిత్రుడ్ని పోలీసులు అరెస్టు చేశారనీ, నేను జామీన్ ఇవ్వాలని అడిగాడు."

"ఊఁ తర్వాత?"

"ఆ పని నేను చెయ్యలేనన్నాను. కొద్దిసేపు ఉండి నేను ఇంటికి వచ్చేశాను. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు"

"అంటే ప్రభాకర్ ఆ రాత్రి నీతో రాలేదంటావ్?"

"రాలేదు"

శంకర్రావును రిమాండులో ఉంచాడు రజాక్. ప్రభాకర్ హత్య రాత్రి పదకొండు తర్వాతే జరిగి ఉంటుందని భావించాడు. ఎన్క్వయిరీ ప్రారంభం అయింది. ఆ సందర్భంగా రజాక్ పార్క్ దరిదాపుల్లో నివసించేవారిని కొందరిని హత్య గురించి వాకబు చెయ్యడం ప్రారంభించాడు. అప్పుడు యాదగిరి అనే అతడు కొన్ని విషయాలు చెప్పాడు. యాదగిరి ఒక ప్రైవేట్ కంపెనీలో కార్మికుడు. అతడు చెప్పిన వివరాలు:-

"వేసవి కాలం ! ఇల్లు చిన్నది. లోపల పడుకోలేక బయట చాప వేసుకుని పడుకున్నాను. మంచినిద్రలో ఉన్నాను. ఆ సమయంలో ఎవరో కాలు తొక్కినట్టయి తృళ్ళిపడి లేచాను. ఒక వ్యక్తి పరుగెడుతూ కనిపించాడు. అదే సమయంలో ఒక కుక్క అరవసాగింది. కుక్క అరుపువిని పరుగెత్తే వ్యక్తి ఆగి వెనక్కు చూశాడు. అతడి ముఖం క్షణకాలం చూడగలిగాను. అది తెల్లవారుజాము నాలుగు గంటల సమయం."

"అప్పుడు నాలుగుగంటలయిందని ఎలా తెలుసుకున్నావ్? గడియారం చూశావా?" అతడి చేతికేసి చూస్తూ అడిగాడు. అతడి చేతికి గడియారం లేదు.

'నాకు గడియారం లేదు. నక్షత్రాలను చూసి టైం తెలుసుకోగలను. నాకు చిన్నప్పట్నుంచీ అది అలవాటు. మానాన్న కూడా నక్షత్రాలను చూసే పనిలోకి వెళ్ళడానికి తయారయేవాడు" అన్నాడు యాదగిరి.

రజాక్కు యాదగిరి మీద అనుమానం కలిగింది.

"ఆ వ్యక్తి ఎలా ఉన్నాడు"

యాదగిరి అతడి ఎత్తూ, లావు గురించి చెప్పాడు. అతడు చెప్పిన పోలికలు శంకర్రావుకు సరిపోవడం లేదు.

"అతడ్ని గుర్తు పట్టగలవా?"

"పట్టగలననే అనుకొంటున్నాను."

శంకర్రావు హంతకుడు కాదా? మరి అహల్యాబాయి ప్రభాకర్ శంకర్రావుతో బయటికి వెళ్ళాడని చెప్పిందే? రజాక్ అయోమయంలో పడ్డాడు.

"అవసరం అయినప్పుడు స్టేషన్కు పిలిపిస్తాను" అన్నాడు రజాక్ యాదగిరిని పరిశీలనగా చూస్తూ.

"అలాగే సాబ్!" నిబ్బరంగా అన్నాడు యాదగిరి.

యాదగిరి చెప్పిన ఒడ్డూ పొడవూ ఉన్న వ్యక్తి కోసం గాలింపు ప్రారంభం అయింది. ఒకరిద్దరిని పట్టుకొని యాదగిరిని పిలిపిస్తే వాళ్ళు కాదని చెప్పాడు.

ఇక్బాల్ అనే అతడి మీద రజాక్కు అనుమానం వచ్చింది. ఇక్బాల్ అహల్యాబాయి కల్లు దుకాణంలో పని చేస్తూ ఉంటాడు. అతడికి అహల్యాబాయి అంటే ఇష్టం అనీ, ప్రభాకర్ అంటే గిట్టేది కాదనీ రజాక్కు తెలిసింది. ఆ విషయం అహల్యాబాయిని అడిగాడు.



"కావచ్చు. శంకర్రావూ, వీడూ ఇద్దరూ కలిసే ప్రభాకర్ను హత్య చేసి ఉండొచ్చు. అతడికి ప్రభాకర్ అంటే అనుమానంగా ఉండేది" అని చెప్పింది అహల్యాబాయి.

అప్పటికి హత్య జరిగి రెండు రోజులైంది. రజాక్ దృష్టి ఇక్బాల్ వేసుకున్న ప్యాంటు మీద పడింది. చిన్న చిన్న రక్తపు మరకలు కన్పించాయి. వెంటనే అతడిని అరెస్టు చేసి ప్యాంటు మీద ఉన్న రక్తపు మరకల్ని పరీక్షించేందుకు ప్యాంటును ఫోరెన్సిక్ ల్యాబ్కు పంపించాడు. యాదగిరి తను చూసింది ఇక్బాల్ని కాదని చెప్పాడు. ఫోరెన్సిక్ రిపోర్టులో ఆ రక్తం మరకలు మానవ రక్తానికి సంబంధించినవి కావనీ, కోడి రక్తానికి సంబంధించినవనీ ఉంది. రజాక్ ఇక్బాల్ను వదిలివేశాడు. శంకర్రావును మాత్రం వదల్లేదు.

ఆ రోజు సాయంత్రం రజాక్ అహల్యాబాయి కల్లు దుకాణానికి వెళ్ళాడు. ఒక యువకుడు అతడికి బయటికి వెళ్తూ ఎదురయ్యాడు. రజాక్ అతడిని తిరిగి తిరిగి చూశాడు. యాదగిరి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. వెంటనే పక్కనే ఉన్న కానిస్టేబుల్తో అతడిని ఆపమని చెప్పాడు. కానిస్టేబుల్ పరుగెత్తుకెళ్ళి అతడిని పట్టుకున్నాడు. ఆ యువకుడు పెనుగులాడసాగాడు. అప్పటికి రజాక్ కూడా అతడిని చేరుకొన్నాడు. అతడిని పోలీసు స్టేషన్కు తీసుకెళ్ళారు. యాదగిరిని పిలిపించారు.

యాదగిరి ఆ యువకుడిని చూడగానే "ఇతడినే! నేను 23 తెల్లవారుజామున చూసింది" అన్నాడు. రజాక్ ముఖం వికసించింది. ఆ యువకుడిని కస్టడీలోకి తీసుకున్నారు.

అతడిని పోలీసులు పట్టుకోవడం చూసినవాళ్ళు అహల్యాబాయితో "నీ కొడుకును పోలీసులు పట్టుకెళ్ళారని చెప్పారు." ఆవిడ లబలబలాడుతూ పోలీసు స్టేషన్కు పరుగెత్తుకొచ్చింది.

"సాబ్. ఇదేమన్యాయం, నా కొడుకు అర్జున్ను అరెస్టు చేశారేమిటి?" అన్నది ఏడుస్తూ.

అహల్యాబాయిని చూస్తూనే జుగుప్సతో ముఖం తిప్పుకున్నాడు అర్జున్.

"ఇన్స్పెక్టర్ సాబ్! ఆ రాక్షసిని ఇక్కడినుంచి పంపించివెయ్యండి. దాని ముఖం చూడటం నాకిష్టం లేదు" అన్నాడు అర్జున్.

రజాక్కు ఆశ్చర్యం వేసింది.

"నువ్వు ప్రభాకర్ను హత్య చేశావా?"

"లేదు. లేదు. వాడు హత్య చేయలేదు" పిచ్చిగా అరవసాగింది అహల్యాబాయి.

"అవును నేనే హత్య చేశాను" అన్నాడు అర్జున్.

"బాబూ!" పెద్దగా గావు కేక పెట్టింది.

"ఎందుకు చేశావ్?"

"చెప్తాను. హత్యకు అసలు కారణం చెప్తాను. కానీ ముందు దాన్ని నా కళ్ళ ముందు నుంచి తీసుకెళ్ళండి."

ఇద్దరు కానిస్టేబుల్స్ అహల్యాబాయిని అక్కడినుంచి లాక్కెళ్ళారు.

ఆ యువకుడు చెప్పిన విషయం-

అతడి తల్లికీ హతుడు ప్రభాకర్‌కీ మధ్య ఉన్న అక్రమ సంబంధం గురించి తెలిసిన తరువాత పటన్‌చెరువులో ఉంటున్న తండ్రి దగ్గరకు వెళ్ళిపోయాడు. అయినా అప్పుడప్పుడు వచ్చి విషయాలు తెలుసుకొని వెళ్తూవుండేవాడు. అతడికి చెల్లెలి మీద తగని ప్రేమ. ప్రభాకర్ తన చెల్లెలిని కూడా వశం చేసుకొని పెళ్ళి చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని తెలిసింది. అప్పుడే ప్రభాకార్‌ను హత్య చేయాలనే తలంపు కలిగింది.

22వ తారీఖు రాత్రి అర్జున్ తల్లి దగ్గరకు వచ్చాడు. తల్లీ ప్రభాకర్ దగ్గరగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆమె చేతి గాజులు సర్దుతూ ప్రభాకర్ మాట్లాడుతున్నాడు. ఆమె నవ్వుతూ ఉంది. అది చూసిన అర్జున్ రక్తం కుత కుతలాడింది. అతడిని అకస్మాత్తుగా చూసి ఇద్దరూ తృళ్ళిపడి దూరంగా జరిగి కూర్చున్నారు.

అయినా తమాయించుకొని వారి దగ్గర కూర్చొని కొంతసేపు కబుర్లు చెప్పాడు. ప్రభాకర్‌ని బ్రాందీ తాగుదాం బయటికి రమ్మని అడిగాడు. ప్రభాకర్ బయలుదేరాడు. అహల్యాబాయి ఆపటానికి వ్యర్థ ప్రయత్నం చేసింది. గంటలో వస్తామని కొడుకు తల్లితో అతి సాత్వీకంగా చెప్పాడు.

ఒక బ్రాందీ బాటిల్ కొని ప్రభాకర్‌తో ఇందిరా పార్కు దగ్గరకు వచ్చాడు. పార్క్ బయట రోడ్డు వారగా కూర్చుని తాగుతూ కబుర్లు చెప్పుకున్నారు. అర్ధరాత్రి దాటిపోయింది. మూడు గంటల ప్రాంతంలో ఇక వెళ్దామన్నాడు ప్రభాకర్. మరో పెగ్గు తీసుకో అంటూ బాటిలందించాడు అర్జున్. దాదాపు నాలుగు అవుతుండగా ప్రభాకర్ పూర్తిగా మత్తులోకి జారిపోయాడు. జేబులో ఉన్న స్ప్రింగ్‌నైఫ్ తీసి కసిగా పొడిచాడు అర్జున్. తీరా రక్తం మడుగు చూశాక భయంతో పరుగు తీశాడు. పరుగెత్తుతూ నిద్రపోతున్న ఒక వ్యక్తి కాలు తొక్కాడు. వెనక నుంచి కుక్క మొరిగింది. ఓ క్షణం ఆగి మళ్ళీ పరుగు లంకించుకుని పటన్‌చెరువు వెళ్ళిపోయాడు. ఆ కేసు విషయం తెలుసుకోవడానికి హైదరాబాదు తల్లి దగ్గరకు వచ్చాడు. తన మీద పోలీసులకు అనుమానం లేదని తెలుసుకొని తేలిగ్గా బయటకు వెళ్తున్న అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదీ అతడు చెప్పిన వివరణ సారాంశం.

శంకర్రావు విడుదల అయ్యాడు.

సెషన్స్ కోర్టులో అర్జున్‌కు యావజ్జీవ కారాగార శిక్ష పడింది.

అహల్యాబాయి కొడుకుమీదకు అనుమానం రాకుండా చెయ్యడానికే శంకర్రావునూ, ఇక్బాల్‌నూ హత్య కేసులో ఇరికించడానికి చూసింది.

❀ ❀ ❀



# 47. ఇది కూడా ప్రేమ కథే

"నమస్కారం అమ్మా!" పళ్ళెంలో బియ్యం పోసుకుని రాళ్ళు ఏరుతున్న రుక్మిణి తలెత్తి చూసింది. ఎదురుగా ఒక అందమైన యువకుడు నిల్చుని ఉన్నాడు. "ఎవరు బాబు! అచ్యుతన్ కోసం వచ్చారా?" అని అడిగింది.

"నేను కొత్తగా ఈ ఊరు వచ్చాను. మీ పక్క ఇంట్లో అద్దెకు దిగాను. మీరు కూడా కేరళ వాళ్ళని తెలిసి పరిచయం చేసుకుందామని 'వచ్చాను" అన్నాడు సైమన్ బానో.

"సంతోషం బాబు కూర్చో! అమ్మాయి ఓ కప్పు కాఫీ తీసుకురా!" అంటూ కేక పెట్టింది రుక్మిణి.

పది నిముషాల తర్వాత ఓ పదహారేళ్ళ యువతి కాఫీతో వచ్చింది. ఆమె అపురూప సౌందర్యవతి. సైమన్ కళ్ళప్పగించి ఆ పిల్లను చూడసాగాడు. ఆ పిల్ల కాఫీ అందించి లోపలికి వెళ్ళిపోయింది. ఆ పిల్ల పేరు ప్రసన్న. సైమన్ ఉద్యోగ రీత్యా భోపాల్ వచ్చాడు. అచ్యుతన్ కూడా భోపాల్ లోని "భారత్ హెవీ ఎలక్ట్రికల్స్"లో పనిచేస్తున్నాడు. అచ్యుతన్ తల్లి రుక్మిణి. ప్రసన్న అతడి చెల్లెలు. ప్రసన్న కాక మరో చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్ళు కూడా వున్నారు. తండ్రి మాధవనాయర్ జబల్‌పూర్‌లో మిలటరీలో స్టోర్ క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు భోపాల్ వచ్చిపోతూ వుంటాడు. సైమన్ అచ్యుతన్ మధ్య స్నేహం ఏర్పడింది. సైమన్ తీరిక సమయాల్లో ఎక్కువగా అచ్యుతన్ ఇంట్లోనే ఉంటూ వుంటాడు. అవకాశం దొరికినప్పుడల్లా ప్రసన్నతో మాట్లాడటానికి ప్రయత్నిస్తాడు. ప్రసన్నకి కూడా సైమన్ అంటే ఇష్టం ఏర్పడింది. ప్రసన్న కూరగాయలు కొనడానికి రోజూ మార్కెట్‌కు వెళుతుంది. సైమన్ ఆ అవకాశాన్ని జారవిడవకుండా మార్కెట్‌కువెళ్లి ఆమెను కలుసుకుంటాడు. ఇద్దరూ ఏవేవో కబుర్లు చెప్పుకుంటారు.

వారి పరిచయం క్రమ క్రమంగా చాలా దూరం పోయింది. ప్రేమ ఎల్లలు దాటింది. ఇద్దరు అర్ధరాత్రి రహస్యంగా కలుసుకోసాగారు.

సైమన్ ఒక రోజు చంద్రన్ నాయర్ అనే యువకుణ్ణి తీసుకొచ్చి మాధవన్‌కు పరిచయం చేశాడు. మాధవన్ లాంగ్ లీవులో భోపాల్ వచ్చాడు. చంద్రన్ తన కులంవాడేనని తెలిసి మాధవన్‌కు సంతోషం కలిగింది. 'కుటుంబ వివరాలు' అడిగాడు. "నాకా పెళ్ళి కాలేదు. మా అన్న దగ్గర ఉంటున్నాను. ఇంకా మా అన్నకు కూడా పెళ్ళి కాలేదు. నాకు మిలట్రీలో పని చెయ్యాలని వుంది. ఆ మాటే సైమన్‌తో అన్నాను. మీరు మిలట్రీలో పనిచేస్తున్నారటగా?" అనేక విషయాలు చెప్పాడు. అతని అన్న పేరు హరిదాసు. మాధవన్ కుటుంబానికి అనతి కాలంలోనే ఆ అన్నదమ్ము లిద్దరూ ఆత్మీయులైపోయారు.

ప్రసన్న సైమన్‌లమధ్య ప్రేమకలాపాలు యథావిధిగా జరిగిపోతున్నాయి. ఒకరోజు పక్కింటి ముసలాయనవచ్చి "ప్రసన్న సైమన్‌తో కలిసి తిరుగుతోందని అందరూ చెప్పుకుంటున్నారు. పెద్ద ముండాకొడుకుని. విని ఊరుకోలేక పోయాను." అంటూ లేచి వెళ్ళిపోయాడు.

ఆరోజు నుంచి ప్రసన్నను బయటకు వెళ్ళకుండా కట్టుదిట్టం చేశాడు.

ప్రసన్న కనిపించకపోవడంతో సైమన్ పిచ్చివాడిలా తిరగసాగాడు. ఒకరోజు మాధవనాయర్ ఇంటిముందు లారీలకు సామాను ఎక్కించడం చూశాడు సైమన్. అతని మనసు విలవిలలాడిపోయింది. వాళ్ళు ఇల్లు ఖాళీ చేస్తున్నట్లు అర్థమయిపోయింది. రెండో రోజుకు ఇల్లు ఖాళీచేసి మాధవన్ కుటుంబం వెళ్ళిపోయింది. ఒకరోజు ప్రసన్ననుంచి ఉత్తరం అందుకున్నాడు. సైమన్ "నా హృదయేశ్వరా! నీకు దూరంగా వుంటున్నా నా మనసు సదా.... ప్రసన్నకు దూరం అయి నేను బతకలేను. మేమిద్దరం ప్రేమించుకున్నాం. మా మధ్య నీవు విలన్‌లా రాకు" అంటూ హరిదాస్ చేతులు పట్టుకుని ప్రాధేయపడ్డాడు.

"ఛీ! నేను ప్రసన్నని పెళ్ళిచేసుకోవడం ఏమిటీ?" అన్నాడు. హరిదాసు.

"సైమన్ నువ్వు విన్నది అబద్ధం. మనిద్దర్నీ ఈ ప్రపంచంలోని ఏశక్తీ విడదియ్య లేదు" అన్నది ప్రసన్న సైమన్ చెయ్యి పట్టుకుని. సైమన్ సంతృప్తిగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

కొన్ని నెలలు గడిచాయి. ప్రసన్నను కలిసే అవకాశం లభించలేదు. మళ్ళీ హరిదాసుతో ఆమె వివాహం నిశ్చయమైనట్టు విన్నాడు. నిలుచున్న చోట నిలువలేకపోయాడు. మాధవనాయర్ దగ్గరకు వెళ్లాడు "ప్రసన్నను నేను పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు. "అది ఎలా సంభవం? మేము నాయరు కులస్తులం. నువ్వు క్రిస్టియన్‌వి" అన్నాడు మాధవన్. "ప్రేమకు కులం లేదు. మనసుకు కులం లేదు. ప్రసన్న కూడా నన్నే ప్రేమిస్తుంది" అంటూ వరసగా ప్రేమ డైలాగ్స్ కొట్టాడు. మాధవనాయర్ "పిచ్చివాగుడు కట్టి వెళ్ళిపో?" అరిచాడు. సైమన్ బయటికి వచ్చాడు.

ఆమెను రక్షించాలి. పదేపదే అనుకోసాగాడు.

రెండో రోజు ఉదయం మాధవనాయర్ ఇంటిముందు కాపలాకాశాడు. ప్రసన్న బయటకు వచ్చింది. ఇంటికి ఫర్లాంగు దూరంలో ఉన్న బస్‌స్టాపులో నిల్చుంది. సైమన్ ఆమె దగ్గరకు వెళ్ళాడు. "డియర్, కొంచెం అలా వస్తావా? నీతో అర్జెంటుగా మాట్లాడాలి" అన్నాడు. ఆమె చుట్టూ కలియజూసి బస్‌స్టాండుకు దూరంగా వెళ్ళి నిల్చుంది. "సైమన్ ఎవరైనా చూస్తారు. దయచేసి వెళ్ళిపో" "చూడనియ్. ఏం చూస్తే? నాతో వచ్చేయ్ పెళ్ళిచేసుకుని అందరి నోళ్ళా మూయిద్దాం!" అంటూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"ప్లీజ్ సైమన్. నన్ను అర్థం చేసుకో. మనం ప్రేమించుకున్నాం. కాని మన కులం ఒకటి కాదు. పెళ్ళి జరగదు" అంటూ చెయ్యి లాక్కుంది ప్రసన్న .



"ప్రియా? ప్రేమకు కులం ఏమిటీ? నువ్వు లేకుండా నేను బతకలేనని నీకు తెలియదా? నువ్వు మాత్రం బతగ్గలవా?"

"నువ్వులేని జీవితం నాకూ నరకమే. కాని మనం చెయ్యగలిగింది ఏమీ లేదు. పరిస్థితుల్ని అర్థం చేసుకో"

"అంటే నువ్వు నాతో రావన్నమాట?"

"రాలేను. నన్ను క్షమించు"

"క్షమించాలా? ఎంత తాపీగా అడుగుతున్నావ్? ఇప్పటికి వందసార్లయినా అనివుంటావ్-నువ్వులేని జీవితం నాకు అక్కర్లేదని. గుర్తుందా?"

"ప్లీజ్. అవన్నీ మర్చిపో...."

ఆమె మాటలు పూర్తి కాకుండానే జేబులో నుంచి కత్తి తీసి గొంతుమీద, పొట్టలో పొడిచాడు. ప్రసన్న గావుకేక పెట్టి కింద పడిపోయింది. రక్తం ఫౌంటెన్‌లా చిమ్ముతోంది. బస్‌స్టాపులోని జనం అటు కేసి పరుగులు తీశారు. పారిపోతున్న సైమన్‌ని కొందరు వెంబడించారు. సైమన్ ఆగిపోయాడు. ఒక్కసారిగా చేతిలో వున్న కత్తితో పొట్టలో పొడుచుకున్నాడు. అతణ్ణి పట్టుకోవడానికొచ్చిన వాళ్ళు అవాక్కయి నిలబడిపోయారు. సైమన్ పొట్టలో దిగిన కత్తిపిడి పట్టుకుని ప్రసన్న దగ్గరకు వచ్చాడు. ప్రసన్న పక్కన కూర్చుని ఆమెను తన ఒడిలోకి తీసుకుని కొద్ది నిముషాల పాటు పిచ్చిగా ముద్దులు పెట్టుకున్నాడు. జనం ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు.

అవును మరి ఇలాంటి దృశ్యాలు సినిమాల్లో చూస్తాం . నిజజీవితంలో చూడటం అరుదుగా జరుగుతుంది. సైమన్ కూడా స్పృహతప్పి పడిపోయాడు.

పోలీసులు వచ్చారు. సైమన్‌ను ఆసుపత్రికి పంపించారు. పోస్టుమార్టం తర్వాత ప్రసన్న శవాన్ని తండ్రికి అప్పగించారు.

❀ ❀ ❀

# 48. పసిపాపను హతమార్చిన ద్వేషం

ఇటీవల ఢిల్లీలో ఒక రెండున్నర సంవత్సరాల పసిపాప హత్య జరిగింది. పాప తండ్రి పేరు గురజారీలాల్. ఆయన వయసు దాదాపు 35 సంవత్సరాలు. పదిహేడు నెలల క్రితం ఆయన భార్య చనిపోయింది. నలుగురు బిడ్డల్ని వదిలి భార్య పోయింది. ఆ బిడ్డల్ని పెంచటం ఆయనకు ఒక పెద్ద సమస్యగా మారింది. పెద్ద పిల్లవాడికి పదకొండు ఏళ్ళు. రెండోవాడికి తొమ్మిది. మూడో వాడికి ఏడు సంవత్సరాలు. ముగ్గురు పిల్లలు పుట్టాకే ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్ల తల్లిదండ్రుల జీవితాల్లోకి వెలుగు తెచ్చినంత ఆనందించారు. పిల్లకు సంవత్సరం తిరక్కుండానే తల్లి చనిపోయింది.

ఇరుగు పొరుగువాళ్ళ ఆదరాన్ని సంపాదించిన సౌజన్యవతి గురజారీలాల్ భార్య. ఆమె దేవీ ఉపాసకురాలు. దేవీ పూజకు ఇరుగు పొరుగువారిని పిల్చేది. ఆమె చనిపోయాక దాదాపు ఇరుగు పొరుగు స్త్రీల చేతుల్లోనే జ్యోతి కొంతకాలం పెరిగింది. ముద్దులు మూటలు గట్టే ఆ పసిదానిమీద అందరికీ మమకారమే.

పిల్లల్నీ, సంసారాన్నీ, తన వ్యాపారాన్నీ చూసుకోలేక సతమతమైపోయేవాడు తండ్రి. సంవత్సరం తిరక్కుండానే పిల్లల కోసం అతను మరోవివాహం చేసుకున్నాడు. ఆమె పేరు చంచల్‌రాణి. ఆమెది లూధియానా. ఆమె వయసు ఇరవై ఐదు సంవత్సరాలు - భర్త చనిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమారులు. అందులో చిన్నవాడు భర్త చనిపోయాక కొద్దిరోజులకే పోయాడు. పెద్దవాడిని అత్తగారు తీసుకెళ్ళారు. పెద్దవాడితోపాటు తనూ అత్తగారి దగ్గరే ఉండాలని వెళ్ళింది. కానీ వాళ్ళిద్దరికీ క్షణం పడేది కాదు. పుట్టింటికి చేరింది. ఆ సమయంలోనే గురజారీలాల్‌ను చూడడం జరిగింది. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం అయింది. పెళ్ళి చేసుకున్నారు.

గురజారీలాల్‌కు పాత ఢిల్లీలో కిరాణా దుకాణం ఉన్నది. చంచల్‌ను పెళ్ళి చేసుకున్నాక నిశ్చింతగా వ్యాపారం చూసుకోసాగాడు.

వారి పెళ్ళి అయిన కొద్ది నెలలకే జ్యోతి చాందినీ చౌక్ దగ్గిర ఉన్న గుద్వార ప్రాంతంలో తప్పిపోయింది. పాపను సవితి తల్లి అక్కడికి తీసుకెళ్ళింది. ఇంటికి ఆదరాబాదరా పరిగెత్తుకుంటూ వచ్చి జ్యోతి తప్పిపోయిందని భర్తకు చెప్పింది. తండ్రి దాదాపు పిచ్చివాడే అయిపోయాడు. చాందినీ చౌకుకు పరుగులు తీశాడు. ఎంత వెదికినా బిడ్డ దొరకలేదు. చివరకు పోలీసు రిపోర్టు ఇచ్చాడు. కాని లాభం



లేకపోయింది. తండ్రి దుకాణం మూసేసి పిల్లను వెదసాగాడు. పిచ్చివాడిలా రాత్రింబవళ్ళు ఢిల్లీ సందులూ గొందులూ తిరిగాడు. పదిరోజుల తర్వాత జ్యోతి మోతీనగరంలో ఉన్న "చిల్డ్రన్స్ అబ్జర్వేషన్ హోమ్"లో ఉన్నట్టు తెలిసింది. వెంటనే అక్కడికి వెళ్ళాడు. జ్యోతి కనిపించింది. ఆ తండ్రి ఆనందం వర్ణనాతీతం. బిడ్డను గుండెలకు హత్తుకొని ఇంటికి తీసుకొచ్చాడు. బిడ్డ దొరికిన సంతోషంలో ఇరుగు పొరుగు వాళ్ళకు మిఠాయి పంచి పెట్టాడు.

1979 మార్చి 13న హోలీ పండగ. హోలీ పండగ సందర్భంగా పంజాబులో జరిగే ఒక ఉత్సవంలో సామానులు అమ్మడానికి గురజారీలాల్ ఆనందపురం వెళ్ళాడు. పండుగ అప్పటికి మరో నాలుగు రోజులు మాత్రమే ఉన్నది. అతను వెళ్తూ వెళ్తూ జ్యోతిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి వెళ్ళాడు. "హోళీ" రేపు అనగా, అంటే 12 మార్చి 1979న, చంచల్ ఇరుగు పొరుగు వాళ్ళకు జ్యోతి కన్పించడం లేదని ఏడుస్తూ చెప్పింది. రెండోసారి జ్యోతి అదృశ్యం కావడం ఆ పేటలో ఉండే వాళ్ళందర్నీ చకితుల్ని చేసింది. చాలామంది జ్యోతికోసం వెదికారు. కాని పోలీసు రిపోర్టు ఇవ్వలేదు. 16వ తేదిన తండ్రి తిరిగి వచ్చాడు. జ్యోతి విషయం విని కొయ్యబారిపోయాడు. మాటా పలుకూ లేకుండా ఎంతోసేపు కూలబడిపోయాడు. ఇరుగు పొరుగు వాళ్ళు రెండు రోజుల క్రితం పేపర్లో వచ్చిన వార్త వినిపించారు. అంతర్రాష్ట్రీయ బస్ డిపో దగ్గిర ఉన్న పబ్లిక్ లెట్రిన్‌లో ఒక పసిబిడ్డ శవం దొరికిందని పేపరు వార్త.

వెంటనే లాల్ ఆ బస్ డిపో దగ్గిరకు వెళ్ళాడు. దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు. ఇన్‌స్పెక్టర్ డి. ఎస్. సంధూను కలుసుకున్నాడు. పోలీసులు హోళీ రోజున బస్ దగ్గిర ఉన్న మరుగు దొడ్డిలో రెండున్నర సంవత్సరాల బిడ్డ శవం దొరికిందని చెప్పారు. పిల్ల శవం మీద బట్టలు లేవు. పోలీసులు వాకబు చేశారు. కాని ఆ పిల్ల తల్లిదండ్రులు ఎవరో తెలియలేదు. పోస్టుమార్టం చేసిన డాక్టరు బిడ్డను ఎవరో గొంతు నులిమి చంపేశారని చెప్పాడు. పోలీసులు ఆ శవాన్ని గురించి అనేక పత్రికల్లో ప్రకటించారు. అయినా ఎవరూ రాలేదు తమ పిల్ల కన్పించటం లేదని. శవాన్ని గుర్తిస్తేగాని కేసుముందుకు నడవదు.

పిల్ల శవాన్ని మార్చురీలో భద్రపరిచారు. గురజారీలాల్ తన బిడ్డ గురించి ఇన్‌స్పెక్టర్‌కు చెప్పాడు. పిల్ల ఫోటో కూడా చూపించాడు. ఇన్‌స్పెక్టర్ ఫోటోను నిశితంగా చూశాడు. మృతదేహాన్ని చూపించాడు. తండ్రి బిడ్డను గుర్తించాడు. ఘొల్లున ఏడ్చాడు.

ఇన్‌స్పెక్టరు గురజారీలాల్‌ను ఆఫీసుకు తీసుకొచ్చి కొన్ని ప్రశ్నలు వేశాడు. శవాన్ని తండ్రికి అప్పగించారు. అంతకుముందు ఒకసారి పిల్ల తప్పిపోయిన విషయం ఇన్‌స్పెక్టరుకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎంక్వయిరీ ప్రారంభించాడు. పోలీసులు ఇరుగు పొరుగువాళ్ళని ప్రశ్నించారు. వారికి చంచల్ మీద అనుమానం కలిగింది. ఆమెను ఎన్నో ప్రశ్నలు వేశారు.

"జ్యోతి బయట ఆడుకుంటూ ఉన్నది. నేను ఇంట్లో వంట చేస్తున్నాను. వంట పూర్తి అయాక బయటికి వచ్చి చూస్తే పిల్ల కన్పించలేదు" అంటూ భోరున ఏడ్చింది.

కాని పొరుగువాళ్ళు కొందరు ఇందుకు భిన్నంగా జ్యోతిని ఎత్తుకొని చంచల్ బయటికి వెళ్ళడం చూశామని చెప్పారు.

చంచల్‌నూ, ఆమె భర్తనూ రెండో రోజు పోలీసుస్టేషన్‌కు పిలిపించాడు ఇన్‌స్పెక్టరు. చంచల్ ముందు తనకు ఏమీ తెలియదని దబాయించింది. పోలీసులు లాకప్‌లో పెట్టారు. ఆమెను కొంత శారీరక యాతనకు గురిచేశాక నిజం చెప్పింది.

ఆమె చెప్పిన కథ

వివాహం అయింది. ఆమెకు భర్త అంటే ఇష్టమే. కాని పిల్లల యెడల ప్రేమ కలగలేదు. పెద్దపిల్లలు ఎవరి పనులు వాళ్ళే చేసుకుంటారు కనుక ఆమెకు వాళ్ళంటే ద్వేషం కలగలేదు. చిన్న పిల్లను తనే పెంచాలి. భర్త జ్యోతిని అంతగా ప్రేమించడం ఆమెకు రుచించలేదు. ఇరుగు పొరుగు వాళ్ళు జ్యోతిని ప్రేమగా చూడటం ఆమెలో ద్వేషాన్నే రగిలించింది. పైగా జ్యోతిని రాత్రిళ్ళు తన పక్కలోనే పడుకోబెట్టుకోవడం అసలు ఇష్టం ఉండేది కాదు.

పిల్లను చాందినీచౌక్ దగ్గిర వదిలేసి వచ్చింది. కాని మళ్ళీ దొరికింది. పైకి సంతోషాన్ని ప్రకటించినా లోలోపల మండిపడింది. ఎలాగయినా ఆ పీడను వదిలించుకోవాలనుకుంది. భర్త జ్యోతిని అంతగా ప్రేమించడం ఆమెలో ఈర్ష్యను రేకెత్తించింది.

భర్త ఊరికి వెళ్ళాడు. వారం రోజులదాకా రాడు. మంచి అవకాశం జారవిడుచుకోదల్చులేదు. పిల్లను తీసుకొని బస్‌స్టాండుకు వెళ్ళింది. ఏదైనా బస్‌లో ఎక్కించాలనుకుంది. వీలు పడలేదు. నిల్చుని ఆలోచిస్తున్నది. ఎదురుగా మరుగుదొడ్డి కన్పించింది. వెంటనే అక్కడికి వెళ్ళింది. లోపలకు వెళ్ళి తలుపు మూసింది. పిల్ల నోట్లో గుడ్డలు కుక్కింది. గొంతు పిసికింది. వంటి మీద బట్టలు ఉంటే శవం గుర్తు తెలుస్తుందేమోననే భయంతో ఆ బట్టల్ని మరో చోట పారేసింది. ఇంటికి తిరిగివచ్చింది. కొంతసేపు అయాక ఇరుగు పొరుగుల ఇళ్ళకు వెళ్ళి "జ్యోతి వచ్చిందా" అంటూ వాకబు చెయ్యసాగింది. అందరి ముందూ "ఆయనకు ఏం సమాధానం చెప్పను!" అంటూ భోరు భోరున ఏడ్చింది.

చంచల్‌ను జైల్లో పెట్టి పోలీసు ఇన్‌స్పెక్టర్ లూధియానా వెళ్ళాడు. అక్కడ ఆమె చరిత్రను గురించి ఎంక్వయిరీ చేశాడు. ఆమె తల్లి కూడా మూడు పెళ్ళిళ్ళు చేసుకుందట. ఆ కుటుంబం మీద ఎవరికీ గౌరవం లేదు. చంచల్ చరిత్ర అంత మంచిది కాదట. ఆమె మొదటి భర్త కూడా అకస్మాత్తుగా చనిపోయాడు. అతని మరణం పట్ల ఎందరికో ఎన్నో సందేహాలు ఉన్నాయ్. చిన్నపిల్లవాడు ఆమెకు గుదిబండగా అనిపించాడు. కన్నబిడ్డనే కాల్చుకు తినేది. ఒకరోజు ఆమె దెబ్బల్ని తట్టుకోలేని బిడ్డ చచ్చిపోయాడు. కాని ఆ విషయం పైకి పొక్కలేదు. ఎవరికి వారే తమకెందుకని రిపోర్టు చెయ్యలేదు.

మాతృత్వానికి ప్రతిరూపమైన స్త్రీయే పసిబిడ్డ గొంతు నులమడం ఎవర్నియినా చకితుల్ని చేస్తుంది. ఆ స్త్రీని రాక్షసిగా ఊహించుకోవడం సహజమే!

❀ ❀ ❀




# డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి సాహిత్యం
## మీరు చదివారా?

| | రూ. |
|---|---|
| 1. సమత (నవల) | 40 |
| 2. మళ్ళీ తెల్లవారింది (నవల) | 65 |
| 3. భయం (కథలు) | 35 |
| 4. ఆమె నవ్వింది (నవల) | 55 |
| 5. ఊర్మిళ (నవల) | 90 |
| 6. The Burning Moon Light (Novel) | 40 |
| 7. యదార్థ గాథలు | 90 |
| 8. మొదటి సంపుటం: మట్టి మనిషి (నవల) | 135 |
| 9. రెండవ సంపుటం: సమత + వైతరణి + అర్చన + తిరస్కృతి (నవలలు) | 190 |
| 10. మూడవ సంపుటం : కథలు | 140 |
| 11. నాల్గవ సంపుటం: అడవిమల్లె + ఉరిత్రాడు + వెన్నెల మండుతోంది + మరో దయ్యం కథ + కోతి - కొబ్బరికాయ (నవలలు) | 200 |
| 12. ఐదవ సంపుటం: రాబందులూ - రామచిలకలూ + మృగతృష్ణ + సావేరి (నవలలు) | 200 |
| 13. ఆరవ సంపుటం: తొణికిన స్వప్నం + మళ్ళీ తెల్లవారింది + బొమ్మరిల్లు (నవలలు) | 150 |

ప్రతులకు: **విశాలాంధ్ర బుక్ హౌస్‌లు**

మరియు పుస్తక విక్రేతలు